ఇరివెంటి వ్యాసాలు

డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు - హైదరాబాదు

ఇరివెంటి వ్యాసాలు

డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు - హైదరాబాదు

సంపాదకీయం

సౌజన్యం సౌహార్దం సాహిత్యం - ఈ మూడింటి సరస సంగమం ఇరివెంటి కృష్ణమూర్తి వ్యక్తిత్వం. అతనిది నిర్మలమైన మనస్సు; ధారాళమైన వచస్సు; కళ్యాణాత్మకమైన తపస్సు. సంస్కృతం తెలుగు ఉర్దూ భాషా సాహిత్యాల గాంభీర్యం మాధుర్యం సౌందర్యం అతని హృదయ పేటికలో నిండుగా పరిమళిస్తుండేవి. అతనితో సంభాషించే సహృదయ మిత్రులకు చతురోక్తుల విందులలో ఆ పరిమళాలను అందిస్తూ ఆనందింపజేసేవాడు. తరతరాల భారతీయార్షసంస్కారం, విశ్వజనీన సంభావనం అతని జీవన విధానంలో ప్రతిఫలిస్తుండేవి. విశ్వసాహిత్యాల విశాల భావస్ఫూర్తితో పాటు ప్రపంచ చరిత్ర, భూగోళశాస్త్రం, సాంఘిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, మనస్తత్త్వ శాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం, వైద్యశాస్త్రం వంటి అనేక శాస్త్రాల సారం అతని జిహ్వాగ్రంపై కదలాడుతుండేది. చరిత్రలు నిర్మించిన, ధరిత్రిని వెలిగించిన మహాపురుషుల పూర్ణపురుషుల జీవిత గాథలతో అతనికి విశేష పరిచయం ఉండేది. చదువుల మర్మం, మానవ జీవన ధర్మం చక్కగా అవగాహన చేసుకుని అనుష్ఠించిన ఉత్తమ సంస్కారాకృతి కృష్ణమూర్తి.

తెలుగు భాషా సాహిత్యాలపై కత్తి గట్టిన నిజాం నిరంకుశపాలనను ఎదిరిస్తూ సాగిన తెలంగాణా విముక్తి మహోద్యమంలో పాల్గొని, కారాగార క్లేశాన్ని అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఇరివెంటి. అతడు నిస్వార్థ చింతనుడు, నిరహంకార నిరాడంబర జీవనుడు. విశ్వవిద్యాలయాదర్శాధ్యాపకుడుగా, యువభారతి అధ్యక్షుడుగా, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యదర్శిగా మొన్న కన్నుమూసే దాకా తన విధ్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించిన ఆంధ్రభాషా సాహిత్యసేవా నిరతుడు ఇరివెంటి.

ఇరివెంటి కృష్ణమూర్తి ప్రజ్ఞామూర్తి. ఆతడు కథలను అల్లినాడు. విమర్శలు వెలయించినాడు. పరిశోధనలు పండించినాడు. అనువాదాలు అందించి నాడు. బాల సాహిత్యాన్ని సంతరించినాడు. పఠనీయ గ్రంథాలను పరిచయం చేసినాడు. పెక్కు కావ్యాలకు పీఠికలు వేసినాడు. వ్యాఖ్యానాలు వ్రాసినాడు. రేడియో ప్రసంగాలు చేసినాడు.

అనేక సందర్భాలలో విద్వత్సభలలో పండిత గోష్ఠులలో రసజ్ఞుల చర్చా వేదికలలో పాల్గొని తన వాగ్ధోరితో సద్యఃస్ఫూర్తితో సహృదయ శ్రోతలను రంజింపజేసిన ఉత్తమ వక్త ఇరివెంటి. ఉర్దూలోనూ ఇంగ్లీషులోనూ ప్రభావో పేతంగా ప్రసంగించగల్గిన బహుభాషావేత్త ఆతడు.

1960 నుండి 1989 వరకు - దాదాపు మూడు దశాబ్దాల కాలం - పరి శోధనలూ ప్రత్యేక గ్రంథాలూ కాక, ఆయా సందర్భాలలో అనేక వ్యాసాలు రచించినాడు ఇరివెంటి. అవన్నీ విభిన్న సాహిత్య - సంచికలలో పత్రికలలో విమర్శ గ్రంథాలలో పాఠ్యపుస్తకాలలో ఆకాశవాణీ ప్రసంగాలలో ప్రచురితమై యావదాంధ్ర దేశంలో ప్రసారితమైనాయి. వాటిని యథాశక్తి సేకరించగా ఇప్పటి వరకు నాకు దొరికిన వ్యాసాలివి. ఈ ముప్పైయెదింటిలో ఒకటి ఇంగ్లీషు భాషలో రచింపబడిన వ్యాసం కూడా ఉంది. వ్యాస సంపుటి సమగ్రత కోసం దాన్ని కూడా ఇందులో చేర్చినాను. వ్యాసాలలోని ముద్రణ స్ఖాలిత్యాలను యథా మతి సవరించినాను. సహృదయ పాఠకుల పరిశీలన సౌలభ్యం కోసం వాటిని కాలక్రమ పద్ధతిలో అమర్చినాను. ప్రతి వ్యాసం చివరకు 'సూచన'లో వ్యాస ప్రచురణ వివరాలను, అందినంత మేరకు, ప్రత్యేకించి తెలిపినాను.

ఇరివెంటి వ్యాసాలు సాహిత్య ప్రక్రియా వైవిధ్యానికీ వివిధ విషయ వైపుల్యానికీ ప్రతి రూపాలుగా నిలుస్తాయి. చరిత్ర పరిజ్ఞానం, సంస్కృతి సౌరభం, భాషా సౌష్ఠవం ఈ వ్యాసాలలో దర్శనమిస్తాయి. భారతీయమైన ఆర్ష ధర్మాన్నీ ఆంధ్ర మహాకవుల సాహిత్య శారదా సందర్శనాన్నీ మహాపురుషుల

మనీషుల విశ్వజనీన సందేశాన్ని ఈ వ్యాసాలు అందిస్తాయి. తెలుగు సాహిత్యం లోని విభిన్న ప్రక్రియలతో ధోరణులతో చక్కని పరిచయాన్ని కలిగిస్తాయి ఈ వ్యాసాలు. అనేక విషయాలకు ఆధునిక యుగోచితమైన నిర్వచనాలూ, సాహిత్యాంశాలకు మౌలిక లక్షణ వివరణలూ ఈ వ్యాసాల్లో చోటు చేసుకున్నాయి. మేధనూ హృదయాన్నీ వెలిగించే సార్వకాలికమైన సార్వదేశికమైన సార్వజనీనక మైన అనేక సత్యాలను వేద ఋక్కులలాగా, మనీషుల వాక్కులలాగా సూక్తి మహితంగా సహృదయ లోకానికి అందించినాడు ఇరివెంటి ఈ వ్యాసాలలో.

ఈ సంకలనంలోని వ్యాసాలు గ్రాంథికంలోనూ వ్యావహారికంలోనూ సాగినాయి. ఈ రెండింటి నిర్వహణలో ఇరివెంటి సామర్థ్యం భాసిస్తున్నది.

ఇరివెంటి లోకజ్ఞతకూ ఆతని ఆదర్శోన్నత్యానికీ ఆతని సముజ్జ్వల భావౌదాత్త్యానికీ ఆతని స్ఫటిక స్వచ్ఛమైన సభ్యతకూ ఆతని నిశిత విమర్శన ప్రౌఢికీ, ఆతని కవితోక్తికీ చమత్కారస్ఫూర్తికీ అక్షరదర్పణం ఈ వ్యాస సంచయం.

ఇరివెంటి విరివంటివాడు. ఇరుల నంటనివాడు. ఇరుకుదరుల నెరిగినవాడు. పొరలు తెలియని వాడు. ఆతని సుధాస్నేహఫలాన్ని అనుభవించిన మిత్రులలో నేనూ ఒకణ్ని. ఆ భాగ్యాన్ని ఈ జన్మలో మరువలేదు.

ఈ వ్యాస సంపుటికి సంపాదకత్వ బాధ్యతనూ భాగ్యాన్నీ నాకు దయతో సహృదయతతో అప్పగించిన స్వాతంత్ర్య సమరయోధులూ భాషా సాహిత్య సంస్థా నిర్వహణ దక్షులూ ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులూ మనీషులూ మాన్యులూ శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి నా హార్దిక కృతజ్ఞతాభివందనాలు.

ఈ వ్యాస సంకలనాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ప్రకటింప జేయడం శ్రీ రామానుజరావుగారి ఔదార్యానికీ, పరిషత్తు భాషా సాహిత్య సంసేవకూ నిదర్శనం. సహృదయ పాఠక లోకానికి సంతోషదాయకం.

ఈ వ్యాస సంపుటిని ఇలా సంసిద్ధం చేయడంలో నాకు సముచితంగా సలహాలందించిన సహృదయ శేఖరులు ఆచార్య ఎం. కులశేఖరరావుగారికీ, మిత్రులు డా॥ ఎల్లూరి శివారెడ్డిగారికీ నా ధన్యవాదాలు.

సహృదయలోకం ఈ సంపుటిని సందర్శించి సంతోషిస్తుందని ఆశిస్తున్నాను.

ఇట్లు
విధేయుడు

హైదరాబాదు
1-8-1990

డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

విషయ సూచిక

1. ఓరుగల్లు

దక్షిణా పథమునందు ఐతిహాసిక, సాంస్కృతిక ప్రాముఖ్యముతో అలరారిన మహానగరములలో ఓరుగల్లు నగరమొకటి. ప్రస్తుతము దీనికి వరంగల్లు అని పేరు. ఇది వరంగల్లు జిల్లాకు కేంద్రము. వాణిజ్యమునకు, పరిశ్రమలకు ముఖ్య స్థలము. ఓరుంగల్లు, ఓరుగల్లు, ఓరుకల్లు అనునవి దీని ప్రాచీన నామములు. ఓరుగల్లు ఏకశిలా నగరముగ సంస్కృతీకరింపబడినది. ఈ నగరము రాజధానిగా పరిపాలించిన కాకతీయుల కాలములో కూడ ఈ సంస్కృతనామము బహుళ ప్రచారము నొందియుండెను. పెక్కు శాసనము లందును, సమకాలిక సారస్వతమునందును ఏకశిలానగరము అను పేరే కాననగుచున్నది. ఏకశిలా పట్టణమనియు, 'ఏకోపల' అనియు, ఏకశిలాపురి యనియు నామాంతరములు వ్యవహారము నందుండెను. ఓరుగల్లు అనినను, ఏకశిల అనినను ఒక రాయి అని అర్థము. ఓరుగల్లు కోట నడుమ ఒక పెద్ద కొండ యుండుటచేత ఈ పేరు ఈ పట్టణమునకు కలిగినట్లు తెలియవచ్చుచున్నది. సుమారు మూడు శతాబ్దముల వరకు ఆంధ్రదేశమునకు రాజధానిగా విలసిల్లి యున్నందున ఇది "ఆంధ్ర నగర"మనికూడ ప్రసిద్ధి నొందియున్నది.

ఓరుగల్లు నగరము హైదరాబాదునకు ఈశాన్య దిక్కునందు 86 మైళ్ళ దూరమున బెజవాడకు పోవు రైలు మార్గమునందు ఉన్నది. ఈ రైలు మార్గమునందు ప్రధానమైన జంక్షను కాజీపేట. కాజీపేటనుండి తూర్పువైపు ఇంచుమించు పది మైళ్ళవరకు ఈ నగరము వ్యాపించియున్నది. కాజీపేట, హనుమకొండ, మటెవాడ, వరంగల్లుకోట, ఉరుసు, కరీమాబాదు అనునవి కలిసి వరంగల్లు పట్టణముగా రూపొందియున్నవి. ఈ పట్టణము సముద్ర మట్టమునకు 2000 అడుగుల యెత్తున ఉన్నది. ఇచటి జనాభా 1,65.000 (1951). దక్కను పీఠ భూమిలో ఏటవాలుగనున్న మాగాణములలో ఇది యున్నది. అందుచేత ఇక్కటి ఉష్ణోగ్రత కొంచె మధికముగ నుండును. ఇప్పటి వరంగల్లు పట్టణము కాకతీయ ప్రభువుల కాలమున ప్రభవిల్లిన అనుమకొండ, ఓరుగల్లు అను రెండు రాజధానీ నగరముల ఐక్యరూపము. అనుమకొండ అనునది హనుమకొండ, హనుమద్గిరి

యను పేర్లతో కూడ వ్యవహృత మైనది. శాసనములందు అన్మకొండ అనియే యున్నది. ఈ హనుమకొండ నేడు ఓరుగల్లు నగరములోని ఒక భాగమే యైయున్నను ప్రాచీనకాలమున ఇది రాజధానీ గౌరవమును పొందియుండినది.

క్రీస్తు శకారంభము నుండియే అనుమకొండ యొక్క నిర్మాణమును గురించి ఐతిహ్యములు లభించుచున్నవి. శ్రీశైల పర్వత ప్రాంతమునకు చెందిన ఎరుక దేవరాజను వీరుడొకడు హనుమద్గిరిని జయించి వశపరచుకొని తన ఏలుబడి క్రిందికి దెచ్చెను. 'అనుమడు', 'కొండడు' అను వారు అతని కొడుకులు వారి పేరిట అనుమకొండ నిర్మింపబడినది

నందగిరి (నాందేడు)కి రాజైన ఒక చాళుక్యరాజు చనిపోగా అతని రాజ్యమును అతని కొడుకులు పంచుకొనిరట. ఒకనికి అనుమకొండ సంక్రమించినదట. మరొకనికి కందారము లభించెనట. కటకపురపు బల్లహుడు కందారమునకు ఏలికయైన సోమదేవుని నిహతుని జేయగా అతని భార్యయు, నిండు చూలాలు నగు సిరియాలదేవి హనుమకొండకు వచ్చి మాధవశర్మ అను ఒక బ్రాహ్మణుని శరణు పొందెను. సిరియాలదేవి కొడుకు మాధవవర్మ. అతని కాలము క్రీ. శ. 314. ఈ మాధవవర్మయే కాకతీయ వంశమునకు మూల పురుషుడని పద్మాక్షి దేవాలయములోని శాసనము తెలుపుచున్నది.

క్రీస్తుశకము 1115-1158 సంవత్సరముల మధ్య అనుమకొండలో రెండవ ప్రోలరాజు రాజ్యము సేయుచుండగా ఒకనాడు ఇపుడున్న ఓరుగంటి ప్రాంతమునుండి హనుమకొండకు ధాన్యపుబండ్లు వచ్చుచుండెను. ఆకస్మికముగా నొక చోట ఒక బండి భూమిలో దిగబడెను. ఎంత పెనుగులాడినను ఆ బండి కదలదయ్యెను. ఏమిచిత్రమోయని కాపులచటనే ఆ బండిని వదలి వెళ్ళిపోయిరి. మరునాడు బలిష్ఠమైన ఎద్దులను తెచ్చి కట్టి లాగించినను బండి కదలదయ్యెను. చక్రములు క్రిందికి దిగియుండవచ్చునని చూడగ వాటి ఇనుపకమ్ములు బంగారు కమ్ములుగ మారియుండెను. వారీయుదంతమును ప్రోలరాజున కెరింగించిరి. ప్రోలరాజు పరివారముతో వచ్చి అచట త్రవ్వింపగా స్పర్శవేది లింగమొకటి కనిపించెను. దాని ప్రభావముననే ఇనుప కమ్ములు బంగారు కమ్ము లయ్యెనని తలంచిరి. ఆ లింగమును అనుమకొండలో ప్రతిష్ఠించి, దేవళము కట్టించు తలం

పుతో త్రవ్వించి దానిని బండిపై చేర్చుటకై ప్రోలరాజు పరివారమున కాజ్ఞ యిచ్చెను. ఎంతమంది ప్రయత్నించినను అది కదలలేదు. జరిగినవార్త తెలిసి కాళేశ్వరవాసులగు శ్రీ శ్రీరామారణ్య త్రిపాదులను, మహేంద్ర శ్రీపాదులను, హిడింబాశ్రమ (మెట్టిగుట్ట) వాసులగు త్రిదండ ఋషిసత్తములను బిలువనంపి ప్రోల్లరాజు ఆ స్పర్శవేది లింగమును చూపెను. వారు అచటనే దేవళమును నిర్మింప వలయుననియు, ఆ లింగమును కదిలింప శక్యము కాదనియు చెప్పిరి. రామారణ్య త్రిపాదుల యాజ్ఞ చొప్పున శా.శ. 909 (క్రీ.శ. 987) శుభకృద్వర్ష కార్తీక శుద్ధ పంచమినాడు శ్రీవిద్యాయంత్ర క్రమమున లింగమును మధ్యనుంచి ప్రోలరాజు నగరము నిర్మింపజేసి లింగస్పర్శచే లభించిన సువర్ణరాశిని నగర నిర్మాణమునకై వ్యయపరచెనట. ఈ నగర మధ్యమున ఒక శిలాఖండముగ నున్న కొండనుబట్టి యీ నగరమునకు ఓరుగల్లు (ఏకశిలా నగరము) అని నామకరణము చేసినట్లు తెలియుచున్నది.

ఓరుగల్లు నగరమునందు కోటలు, బురుజులు, దేవాలయములు నిర్మాణములై నగరము దినదినాభివృద్ధి చెందుచుండగా అనుమకొండ ప్రశస్తి తగ్గుచు ఓరుగల్లు నగరమునకు ప్రాముఖ్యము హెచ్చుచు వచ్చెను.

వరంగల్లు ప్రాంతమంతయు కొండల ప్రదేశమగుటచే శత్రుదుర్భేద్యముగను యుద్ధమునకు మిక్కిలి అనువైన ప్రదేశముగను తోచెను. అందుచేత మొదటి ప్రతాపరుద్రుడు (రుద్రదేవుడు 1158-1195) ఓరుగల్లుచుట్టు శిలాప్రాకారము కట్టింప మొదలిడెను. రాజధానికూడ ఓరుగల్లునకు మార్చెను. తరువాత గణపతిదేవుడు (1198-1261), రుద్రమదేవి (1261-1295) ఆ కోటను పటిష్ఠముగను, శత్రు దుర్భేద్యమైన దానిగను చేసిరి. అప్పటినుండియే ఓరుగంటి శోభ చరిత్రాత్మకమైన ప్రాధాన్యముతో అతిశయించినది. ఓరుగల్లు కోట పటిష్ఠమగు కొలది హనుమకొండపై రాజులకు శ్రద్ధ తగ్గెను. ఓరుగల్లుపై దాడిచేయుటకు వచ్చిన శత్రు సైన్యములన్నియు అనుమకొండ వరకు వచ్చి ఆగిపోయెడివి. అందుచేత హనుమకొండ శత్రువుల దౌర్జన్యమునకు గురియగుచు వచ్చెను. నాటి హనుమకొండ కోట యొక్క చిహ్నములు ఇప్పుడు పూర్తిగా జీర్ణములైనవి. ఒక మట్టిగోడయు, ఒక అసంపూర్ణ ద్వారమును మాత్రము ఇప్పుడు కనిపించుచున్నవి.

కాకతీయ ప్రభువులు జైనులుగ నున్నప్పుడు జైన దేవాలయములను గూడ కట్టించిరి. హనుమద్గిరి శిలలపై జైనతీర్థంకరుల విగ్రహములను చెక్కించిరి. అదే గుట్టపై పద్మాక్షీ దేవాలయము గూడ కలదు. ఈ దేవాలయములోని శాసనము కాకతీయుల వంశమును గూర్చి తెల్పుచున్నది. గుట్టవద్దనున్న చెరువులో జైన విగ్రహ శకలములు అనేకము లిప్పటికిని కానవచ్చుచున్నవి. కాకతీయులు శైవులుగా మార్హిన తరువాత జైనమత ప్రాముఖ్యము తగ్గుచు వచ్చినది. కాకతీయులు మహేశ్వర పాద పద్మారాధకులుగా తమ్ము గూర్చి శాసనములలో వ్రాయించుకొనిరి. హనుమకొండలోని సహస్ర స్తంభ దేవాలయమును రుద్రదేవుడు క్రీ.శ. 1164 లో కట్టించెను. చాళుక్య దేవాలయములవలెనే ఇదియు నక్షత్రాకారముగా నున్నది. ఇందు సూర్య, విష్ణు, మహేశులకు గర్భాలయము లున్నవి. వాటిమధ్య నొక మండపము గలదు. అందు పైకప్పుమీద లోపలి భాగమున నవగ్రహముల ప్రతిమలు చెక్కబడినవి. ద్వారబంధములపై, స్తంభములపై వివిధాకారములు గల లతలు, పుష్పములు చెక్కబడినవి. ఈ దేవాలయము నందలి స్తంభములపై గల శిల్ప కౌశలము నిరుపమానమై ఒప్పారుచున్నది. నల్లరాతిని మణి దర్పణములుగా మార్చిన తెలుగుశిల్పి కళానైపుణ్యము అందు కాననగును. అసంపూర్ణమును, శిథిలమును అయిన మంటప మొకటి దేవాలయమున కెదురుగ నున్నది. ప్రధాన దేవాలయమునకును, ఈ మంటపమునకును నడుమ జీవకళతో నొప్పారు ఒక నంది విగ్రహ మున్నది. ఈ విగ్రహమును రాతితో తట్టిన అది కంచువలె మ్రోగును. ఈ నందీశ్వరుని మెడయందు చెక్కబడిన మువ్వల పట్టెడ ముద్దుల మూట గట్టుచు శిల్పి నైపుణ్యమును చాటుచున్నది. మంటపమునందుగాని, ప్రధాన దేవాలయమునందుగాని విగ్రహములు లేవు. కొంతవరకు శిథిలమైన శివలింగము మాత్రము నేటికిని ఓరుగల్లు ప్రజల పూజాపురస్కారములను పొందుచున్నది. దేవాలయావరణమునందు ఒక కోనేరున్నది. అందు భక్తుల స్నానపానములకై కల్పింపబడిన సౌకర్యములు నాటి నాగరకతా విభవమును ప్రదర్శించుచున్నవి. రుద్రదేవుడు వేయించిన ఒక పెద్ద శాసనము ముఖద్వారమున నున్నది. తెలుగునందును, సంస్కృతము నందును రచింపబడిన ఈ శాసనమునందు ఈ సహస్రస్తంభ దేవాలయము నందలి ప్రధాన దైవతము రుద్రేశ్వరుడని పేర్కొనబడియున్నది. అనారతాధ్యయనాది తత్పరులైన శ్రోత్రియ బ్రాహ్మణులకు అవాసముగను, చతుష్షష్టి

కళాపరిపూర్ణ వేశ్యాజనమున కాలవాలముగను, సర్వసంపద్యశోవిరాజితము గను హనుమకొండ ప్రసిద్ధి నొందియుండెనని ఈ శాసనము తెల్పుచున్నది.

వరంగల్లునకును, హనుమకొండకును నడుమ కాకతీయుల కాలమున నిర్మింపబడిన భద్రి యను చెరువొకటి కలదు. ఇది నేటికిని ప్రజాబాహుళ్యము నకు, స్నానపానాదులకు నుపయోగపడుచున్నది. ఈ చెరువుగట్టునగల కొండపై భద్రకాళి దేవాలయమున్నది. ప్రాచీనకాలము నుండియు ఇది ప్రసిద్ధ దేవాలయ ముగా నుండినట్లు ఐతిహ్యమున్నది. భద్రి యని చెరువునకీ పేరు భద్రకాళి సంబంధముచేతనే కలిగిన దని ప్రతీతి కలదు.

ఓరుగల్లు నగరము కాకతీయ రాజధానియై, ఢిల్లీ సుల్తానులకు సహింప రాని సంపద్వైభవములతో విరాజిల్లెను. ఈ నగరమునకు కంచుకోట, ఇటుకకోట, పుట్టకోట, రాతికోట, భూమికోట, కంపకోట, గవినికోట అను ఏడు కోట లుండెనట. కాని ప్రస్తుతము రెండు కోటలు మాత్రమే కనిపించుచున్నవి. ఒకటి వెలుపలిది. ఇది మట్టిది. దీని చుట్టుకొలత 25 మైళ్ళు. అక్కడక్కడ ఈ కోట యొక్క శిథిలములు కనిపింపగలవు. లోపలి రాతికోట బలిష్ఠమైనది. దాని చుట్టు కొలత 8 మైళ్ళు. దీనికి నాలుగు మహాద్వారములు కలవు. ప్రాక్పశ్చిమ ద్వార ములు మాత్రము తెరచియున్నవి. ప్రతిద్వారమునకును మూడు త్రోవలున్నవి. ప్రధాన ద్వారమును సూచించుటకు ఒక రాతి సింహ మమర్చబడినది. ద్వార మున కిరు ప్రక్కలయందును శిలానిర్మితములైన మెట్లున్నవి. శిలాప్రాకారము మీద అక్కడక్కడ కట్టబడిన బురుజులు డెబ్బది రెండు గలవు. వీటి పైభాగము విశాలముగ నున్నది. రాతి కోటను నిర్మించుటకు ఉపయోగింపబడిన రాళ్ళు నునుపుగ చేయబడి సున్నముతోగాని మట్టితోగాని సంబంధము లేకయే ఒండొం టిపై పేర్చబడియున్నవి. కోట చుట్టును లోతైన కందకము కలదు. ఈ మహా దుర్గము 1199లో ప్రారంభింపబడి 1261 ప్రాంతమున పూర్తియైనది. కొందరీ కోట నిర్మాణము 1199 వ సంవత్సరమునకు పూర్వమే ప్రారంభమైనదని తలచిరి. కోట నడుమ ఒక పెద్ద దేవాలయము అసంపూర్తిగా విడువబడినట్లు ఇటీవలి త్రవ్వకములు తెలుపుచున్నవి. ఈ దేవాలయ ప్రాకారమునకు నలు వైపుల మహాద్వారములు హంసశిఖరోపేతములై యున్నవి. అందొకటి, రెండు మాత్రమే ఇప్పుడు పూర్తిగా నిలిచియున్నవి. సాంచీస్తూపద్వారములకును ఈ

ద్వారములకును కొంత పోలిక యున్నది. ఈ ద్వారములపై చెక్కడములు మిక్కిలి హృదయాకర్షకములై ఒప్పుచున్నవి. మట్టితో నిర్మించబడిన ఈ కోట ప్రహరియొక్క చుట్టుకొలత, పొడవు నందు భారతదేశమునగల అన్ని కోటల ప్రహరీల చుట్టుకొలతను మించిన దని తెలియుచున్నది. కోట లోపల ఇంకను చిన్నవియు, పెద్దవియు నగు దేవాలయములు పెక్కులు గలవు. వీటిలోని ప్రతి శిలయు శిల్పాలంకృతమై శిథిలము అయ్యు జీవకళతో ఉట్టిపడుచున్నది. కోటకు తూరుపుదిశయందు షితాబుఖాన్ కట్టించిన మిక్కిలి ఎత్తైన దర్బారుహాలు, అతడు వేయించిన శిలాశాసనము కలవు. బొడ్డురాయిగనున్న శిలాఖండముమీద ఎనిమిది కోణములచే అలంకృతమయిన ఒక బురుజు ఉన్నది. తలవరులీ బురుజుపై నియమింపబడి యుండిరి. దీని నానుకొని ఒక చెరువు కూడ కలదు.

ఏకశిలానగరమునందు భైరవాలయము, చాముండేశ్వరీ ఆలయము, వీరభద్రేశ్వరాలయము, బౌద్ధదేవుని విహారము, కుమారస్వామిగుడి, ముసానమ్మ గుడి, పాండవుల గుడి, కేశవ స్వామ్యాలయము, స్వయంభూ దేవాలయము, నరసింహాలయము మున్నగు ఆలయము లుండెను. ఏకవీరా, మైలారు దేవులకు ఉత్సవములు జరుగుచుండెడివి. జనులు వీరపురుషుల నారాధించు చుండెడివారు. పల్నాటివీరుల కొక గుడికూడ నుండెనట!

జనసమ్మర్దముగల రాజవీధులతోను, తోటలతోను ఈ నగరము శోభాయ మానముగ నుండెను. క్రీ. శ. 1321 లో తురకసేనాని యగు ఉలఘ్ఖాన్ ఒక మెట్టపై నెక్కి ఓరుగంటిని చూచెనట! ఏ దిక్కు చూచినను ఆతనికి రెండు మైళ్ల పొడవున ఉద్యానవనములు, ధారాజల యంత్రములు; మామిడి, అరటి, పనస చెట్లుగల తోటలు; మొగలి పొదలు, సంపెంగచెట్లు, మల్లెపూవుల తీవెలు కని పించెనట! నగరము పేటలుగా విభజింపబడినట్లు కనిపించెనట.

ఓరుగల్లు నగరమున నాగరకులకు అవసరములైన ప్రసాధములన్నియు లభించుచుండెను. కోటకు వెలుపలి భాగమున మైలసంత సాగుచుండెను. వివిధ వస్తువులపై చెల్లించవలసిన సుంకములను నిర్ణయించు శాసనము కూడ అక్కడ చెక్కబడినది. ఇప్పటికిని ఆ శాసనమున్నది. ఆ చోటు నిపుడు ఖాన్సాహెబ్ తోట అందురు. ఆ శాసనమును బట్టి ఇక్కడ నవధాన్యములు, కూరగాయలు

వివిధ ఫలములు, పుష్పములు, కస్తూరి చందనాది సుగంధ ద్రవ్యములు, ఉప్పు, వివిధ ధాతువులు విక్రయింపబడుచుండెడివని తెలియుచున్నది. ఇందు అప్పటి ద్రవ్యమానము, కొలతలు పేర్కొనబడియున్నవి. మట్టెవాడయని ఇప్పటికిని పిలువబడు వీధి యొక్కటి కలదు. ఒక్క వీథియే కాదు. ఇప్పటి వరంగల్లులో చాల భాగమునకీ పేరే వ్యవహారమున గలదు. మట్టెలుచేయు వారందుండిరట. కనుకనే దానికి ఆ పేరు వచ్చినదని అందురు.

నేడేకాక నాడుకూడ ఈ పట్టణము పారిశ్రామికముగ గొప్ప కీర్తిని సంపాదించియుండెను. మార్కోపోలో యను ఇటలీ యాత్రికుడు, ఓరుగల్లులో సాలెపురుగు తంతువులకంటె సన్ననైన నూలు తయారు చేయబడుచుండెననియు, అట్టి నూలుతో నేయబడి, పలుచనై, విలువ, చెలువము కలిగిన ఆ వలువలను ధరింపకోరని రాజులుగాని, రాణులుగాని ప్రపంచమున నుండబోరనియు వ్రాసియుండెను. రసికులు, పరమధార్మికులు, పండితులు, పరిపాలనాదక్షులైన కాకతీయ ప్రభువులు ఓరుగల్లును దివ్య సుందర నగరముగా తీర్చిదిద్దిరి. రథ గజ శకట హయ ఘటాళితో, ప్రజాబాహుళ్యముతో కిటకిటలాడు ఘంటాపథములతోను, సర్వవస్తు విలసితములగు అంగళ్ళతోను పురమలరారుచుండెను. మేదరివారు, కుట్టుపనివారు, స్వర్ణకారులు, కుంభకారులు, ఇతర శిల్పులు అనవరతము తమ తమ పనులలో నిమగ్నులై యుండెడివారు. సుఖ ప్రసాధనాది సమంచితములైన వేశ్యా గృహములే పంద్రెండు వేలుండెనట. రాజనర్తకి మాచల్దేవి మేడ ఒక యాత్రా స్థలముగ భాసిల్లెను. వేశ్యాగృహములు చిత్రశాలలై కూడ వరలెను. చిత్రలేఖనమే వృత్తిగా గలిగినవారు ఇందు దాదాపు పదునైదు వందల మంది ఉండిరని ఏకామ్రనాథుడు వ్రాసెను. ఆంధ్రోర్వీశు మోసాలపైనున్న ఘటికా యంత్రము సమయమును సూచించుచు గడియల ననుసరించి గంటలు గొట్టుచుండెడిదనియు, రేయి 30 గడియలు, పగలు 30 గడియలు వెరసి 60 గడియలు ఒక దినముగా క్రీడాభిరామమునుబట్టి తెలియుచున్నది. పూటకూళ్ళవారి ఇండ్లు కూడ లెక్కలేనన్నియుండెను. అందు బలవర్ధకమును, రుచికరమునైన ఆహారము లభించుచుండెడిది. లక్ష్మణ వజ్ఝల యొక్క ఇల్లు ఇట్టివానిలో ప్రసిద్ధమైనదిగా తెలియుచున్నది. అతనియింట ఒక రూక నిచ్చినచో "కప్పురభోగి వంటకము, కమ్మని గోధుమపిండి వంటయున్, గుప్పెడు పంచదారయును, క్రొత్తగ కాచినయాలనే, పెసర్ పప్పును గొమ్ముననల్లనటి

పండ్లును, నాలుగున్నైదు నంజులున్, లప్పలతోడ క్రొంబెరుగులు" లభించెడివట. వీథులలో ప్రజలు వివిధములైన జూదము లాడుచుండెడివారు. పొట్టేళ్ళ పోట్లాట, కోళ్ళపోరు, మల్లయుద్ధము - ఇత్యాది ప్రజా వినోదములు నగరమున ప్రబలి యుండెను. వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామమునందు ఆనాటి ఓరుగంటి ప్రజా జీవితము చక్కగా వర్ణింపబడినది. బమ్మెర పోతన, విద్యానాథుడు, తిక్కన సోమయాజి, పాల్కురికి సోమనాథుడు, జాయపసేనాని, పరశురామ పంతుల లింగమూర్తి ప్రభృతులు ఆంధ్ర ప్రజలకు సంస్కృతిభిక్ష పెట్టినవారు. వీరందరు ఓరుగంటిని తమ ఉనికిచే పునీతము చేసినారు. రాజులు, మంత్రులు విద్వత్సభలు చేయుచుండెడివారు. నగరమునందు సాహితీ వాతావరణము ప్రబలియుండెడిది.

కాజీపేట గ్రామమునందుకూడ శైవ, వైష్ణవాలయములున్నవి. ఇవి ప్రాచీనములు. 19 వ శతాబ్ద్యారంభమున ఒక తురుష్క మహానుభావుని సమాధి కట్టబడినది. ఇప్పటికిని ఆ సమాధి వద్ద ఉత్సవములు జరుగుచుండును.

క్రీ. శ. 1303 నుండియే ఢిల్లీ సుల్తానులు కాకతీయ రాజవంశమును ధ్వంసము చేయుటకు ప్రయత్నము లారంభించిరి. కాని రెండవ ప్రతాపరుద్రుడు ఆరుమార్లు వారి నెదుర్కొనెను. ఓరుగల్లు శత్రు దుర్నిరీక్ష్యమయ్యెను. కాని ఉలఘ్‌ఖాన్ క్రీ. శ. 1321 లో దాడిచేసెను. ఆ దాడిలో ప్రతాపరుద్రుడు పూర్తిగ ఓడిపోయెను. ఆ మహారాజును పీరుని బందీగా తురకలు ఢిల్లీకి గొంపోయిరి. కాకతీయ రాజ్య మస్తమించెను. ఏకశిలానగరమునకు సుల్తాన్‌పూర్ అను నామకరణము చేయబడెను. క్రీ. శ. 1422 లో బహమనీరాజులు ఓరుగల్లును వశపరచుకొని ధ్వంసము చేసిరి.

కాకతీయుల పతనానంతరము స్వేచ్ఛాప్రియులైన తెలుగు నాయకు లందరును ఏకమై, ప్రోలనాయకుని ఆధ్వర్యమున ఓరుగంటినుండి తురుష్కులను పారద్రోలి ఇంచుమించు 50 ఏండ్లవరకు రాజ్యము చేసిరి. కాపయ నాయకుడు ప్రోలయనాయకుని తరువాత తెనుగునేల నేలినట్లు శాసనాధార మున్నది. షితాబ్‌ఖాన్ అను బిరుదుగల సీతాపతి యను ఆంధ్రవీరుడు అసహాయశూరుడు. ఇతడు క్రీ. శ. 1504లో ఓరుగల్లు స్వాతంత్ర్యమును ప్రక

టించెను. కుతుబ్‌షాహీ రాజైన కులీ కుతుబ్‌షాను ఓడించెను. ఓరుగంటిని రాజధానిగా వరించి రాజ్య పునర్ నిర్మాణమునకు పూనుకొనెను. ఓరుగల్లు యథాపూర్వ శోభను సంపాదించుకొనుచుండెను. కాని 1512 లో కులీ కుతుబ్‌షా కుట్రలు పన్ని యుద్ధమును ప్రకటించెను. ఆ యుద్ధములో సీతాపతి నిహతుడయ్యెను. విజేతలు నగరమునందలి దేవాలయములను, భవనములను నేల గలిపిరి. గోలకొండ కుతుబుషాహీ రాజుల పతనానంతరము ఓరుగల్లు మొగలాయీ రాజ్యములోని భాగమయ్యెను. మొగల్ చక్రవర్తులను ధిక్కరించి దక్కను సుబేదారైన నిజాముల్ ముల్కు క్రీ. శ. 1724 లో స్వాతంత్ర్యము ప్రకటించుకొనెను. నాటినుండి ఇది ఆసఫ్జాహీ రాజుల పరిపాలనక్రింద నుండెను. 1956 లో నవంబరులో ఆంధ్రప్రదేశ్ అవతరించెను.

ఆంధ్రప్రదేశమునందలి నేటి ప్రధాన నగరములలో ఓరుగల్లు ఒకటి. తివాచీలనేతకిది ప్రసిద్ధి వహించుచున్నది. నూనెగింజలు, ధాన్యము, చేనేత వస్త్రములు, తివాచీలు, కలప ఇక్కడినుండి యెగుమతి యగుచుండును.

రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయము, శబ్దానుశాసనాంధ్ర భాషా నిలయము విజ్ఞానప్రసారక కేంద్రములుగా గత నాలుగు దశాబ్దములనుండి పనిచేయుచున్నవి. పాలిటెక్నిక్ కళాశాల, ఆర్ట్సు, సైన్సు కళాశాల ఇచట యున్నవి. పాఠశాలలు పెక్కులున్నవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో జనసంఖ్య యందేమి, చారిత్రక ప్రాముఖ్యము నందేమి ఆంధ్రప్రదేశ్ రాజధానియగు హైదరాబాదు తరువాత వరంగల్లునే పేర్కొనవలసియుండును. వరంగల్లు ఆంధ్రులకు భావావేశమును కలిగించునదియై దినదినాభివృద్ధి పొందుచున్నది.

(ఈ వ్యాసం 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము' (సంపుటము-2)లో ప్రచురితం. ముద్రణ 1960.)

2. ఛత్రపతి శివాజీ మహారాజు

పంద్రెండవ శతాబ్ది తుదిభాగమున భరత ఖండమునందు మహమ్మదీయ ప్రభువుల యధికారము నెలకొనిన నాటినుండియు, హైందవ ధర్మానుయాయులకు చెడ్డరోజులు ప్రారంభించెను. మహమ్మదీయులు పాలకులుగా నుండి హిందూ ధర్మమును, సంస్కృతిని రూపుమాపుటకై సర్వవిధముల యత్నించి కొంత వరకు కృతార్థత చెందిరి. ఈ ఘోర విపత్తునుండి హైందవులను కాపాడుటకై యత్నించినవారిలో ముఖ్యులు రాజపుత్రులు, మహారాష్ట్రులు అని చెప్పవలసి యున్నది. కాని వీరన్యోన్య సహకారముతో మెలగని కారణమున వీరి ఆశయములు సంపూర్ణముగ ఈడేరలేదు. హైందవ ధర్మ పునరుజ్జీవనమునకై మహారాష్ట్రమున గొప్ప కృషిసల్పిన మహాపురుషుడు సమర్థ రామదాసస్వామి. ఈయన యందు ఆధ్యాత్మిక తత్త్వమును, ధర్మోద్ధరణాభిలాషయు మూర్తీభవించెను.

ఈ స్వామి కేవలము ముముక్షువు కాడు. సాంఘికముగ, రాజకీయముగ నానాటికి పతనమగుచున్న హిందూ సమాజమును అభ్యున్నతికి తేవలయునను పవిత్రాశయము కలిగినవాడు. ధీరోదాత్తుడైన శివాజీకి ఆయన కర్తవ్యోపదేశము చేసి కర్మయోగిగ శివాజీని తీర్చిదిద్ద గలిగెను. శివాజీ మహారాజు జీవితము ధర్మప్రపూర్ణము, వీరరస విలసితము. మహారాష్ట్ర జాతిలో జాతీయ భావములను పెంపొందించి, వారిలో నిక్షిప్తములై యున్న మహాశక్తులను విజృంభింపజేసి, రాజ్య నిర్మాణశక్తిని ప్రసాదించి, దేశోద్ధరణము గావించినవాడు ఛత్రపతి శివాజీ మహారాజు.

మహారాష్ట్రుల యుదంతము శివాజీకి పూర్వమంతగా తెలియదు. మహారాష్ట్ర ప్రాంతమును, రాష్ట్రకూటులు, చాళుక్యులు, యాదవులు పరిపాలించిరి. పదునాల్గవ శతాబ్దమున దేవగిరి యాదవరాజులు అల్లావుద్దీన్ చక్రవర్తిచే పరాజితులైరి. పిదప బహమనీ సుల్తానులకు లోబడి వారి రాజ్యము చీలికలైన తర్వాత కొంత భాగము అహమద్ నగర సుల్తానులకును, కొంత ప్రాంతము

బీజపూర సుల్తానులకు దక్కెను. పదునేడవ శతాబ్దారంభమున సమర్థ రామదాసు, తుకారాము మున్నగు మహాభక్తులు ధర్మ ప్రబోధకులుగా నుండిరి. వీరు మహారాష్ట్రులలో స్వమతాభిమానమును, సామాజిక దృక్పథమును పొటమరింపజేసిరి. బీజపూర్, అహమ్మద్ నగర రాజ్య ప్రాంతములలో మహారాష్ట్ర ప్రముఖులు కొందరు సైనికులుగను, ఉద్యోగులుగను ప్రవేశించి, రాజాశ్రయమును సంపాదించికొని జాగీర్దారులుగ ప్రబలు లగుచుండిరి. మొగలాయి చక్రవర్తుల రాజ్య విస్తరణ కాంక్షకు గురియై తమలో తాము కలహించుకొనుచు, దక్కను నందలి మహమ్మదీయ రాజ్యములు బలహీనములగు చుండినవి. ఇట్టి రాజకీయ, సాంఘిక పరిస్థితులు మహారాష్ట్రుల విజృంభణమునకు కారణములైనవి.

మహారాష్ట్రులలో భోంస్లే కుటుంబము ఈ సందర్భమున ప్రాముఖ్యమును గడించినది. ఈ వంశము వాడైన శహాజీ అనునాతడు అహమద్‌నగర నవాబుల కొలువున నుండి ఆ రాజ్యముపై దండెత్తి వచ్చిన మొగలు చక్రవర్తి షాజహాన్‌తో యుద్ధమునకు తలపడి, అహమద్‌నగర స్వాతంత్ర్యమును రక్షించుటకు ప్రయత్నించి విఫలుడయ్యెను. పిమ్మట బీజపూర్ నవాబుల నాశ్రయించి, పూనాను జాగీరుగా సంపాదించెను. మహారాష్ట్రులను సంఘటిత పరచినచో వారు శౌర్యమునందును, క్రమశిక్షణ యందును మొగలులతో పోటీపడగల సామర్థ్యము కలవారగుదురని తొలిసారిగా శహాజీకి తోచినది. మొగలులను ఎదిరించిన మహారాష్ట్రులలో శహాజీయే మొదటివాడు. ఈ శహాజీ కుమారుడే ఛత్రపతి శివాజీ మహారాజు.

బాల్యము నుండియు ధర్మయోధులయిన రామాయణ, భారతవీరుల వీరోచిత కార్యకలాపములు, ధర్మోద్ధరణాభిలాష యొంట బట్టించుకొని పరమతోల్బణమును అరికట్ట సమకట్టిన శివాజీకిని, బీజాపూరు సుల్తానుల ప్రాభవమునకును తన మనుగడ ముడిబెట్టుకొన్న శహాజీకిని మార్గములు వేరయ్యెను.

పూనాకు సమీపమున శివనేరుగిరి దుర్గమున 10, ఏప్రియల్ 1627 లో శివాజీ జన్మించెను. శివనేరున నున్న శివాయిదేవి వరప్రసాదమున జన్మించిన వాడగుటచే తల్లి జిజియాబాయి తన కుమారునకు శివాజీ యని పేరు పెట్టెను. దాదోజీ కొండదేవ్ అనునొక బ్రాహ్మణుని సంరక్షకత్వమున తన భార్యయైన

జిజియాబాయిని, కుమారుడైన శివాజీని నిల్పి శహాజీ బీజాపూరునందు నివసింప సాగెను. కొండదేవ్ శివాజీకి మల్లయుద్ధము నందును, గుర్రపు స్వారియందును, ఖడ్గచాలనము నందును నైపుణ్యము అలవడునట్లు చేసెను.

అక్బరు, హైదరలీ, రణజిత్‌సింగ్ మున్నగు మధ్యయుగ వీరుల వలెనే శివాజీ నిరక్షరాస్యుడని చారిత్రకు లూహించుచున్నారు. శివాజీ స్వహస్త లిఖిత మైన పత్ర మొకటియును లబ్ధము కాలేదు. కాని అతడు రామాయణ, మహా భారత గాథలను విని, ధర్మాభిరతి, త్యాగము, రాజ్యనిర్వహణ విధానము, ఆహవ పాటవము, రాజనీతి మొదలగు విశేషములను క్షుణ్ణముగా నెరిగినవాడై యుండెను. అతడెచ్చటికి బోయినను హిందూ, ముస్లిం భక్తులు పాడిన పాటలు వినియును, పురాణ, కీర్తన, భజన కాలక్షేపములందు పాల్గొనియును, అనేక ధర్మరహస్యము లను, సూక్ష్మములను తెలిసికొనుచుండెను. ఈ కారణముచేతనే, గ్రంథావ లోకనము లేకపోయినను, కర్మవీరుడుగ, రాజ్యపాలనాదక్షుడుగా అతడు కృత కృత్యుడు కాగలిగెను. మధ్యయుగము నందు నేతృత్వమునకు కావలసినది కర్తవ్యానురక్తియే కాని, భావశబలత, పాండిత్యములు కావు.

పూనాకు పశ్చిమదిశయందు పడమటి కనుమలలో 90 మైళ్ళ పొడవును 12 నుండి 24 మైళ్ళ వెడల్పునుగల ఒక లోయప్రాంత మున్నది. ఈ ప్రాంత మునే మావళ్ (సూర్యుడస్తమించు భూమి) అందురు. ఈ ప్రాంతమున ఎన్నియో లోయలు, చిట్టడవులు ఉన్నవి. ఉత్తరదిశ నుండు లోయలలోని జనము కోలీలు. దక్షిణ దిశయందుండు వారు మరాఠాలు. ఈ రెండు జాతులవారు మిక్కిలి ఉత్సాహవంతులు, దృఢకాయులు, వ్యవసాయకులు, నిరాడంబరులు, వ్యసన రహితులు. ఈ గ్రామములలో రాజప్రతినిధులు 'దేశ్‌ముఖ్' లనబడువారు 'పాటిల్' అను గ్రామాధికారుల నుండి రాజస్వము, పన్నులను సేకరించు చుండిరి. ఈ దేశ్‌ముఖ్‌లు మరాఠాలు, శివాజీ జాతివారు. వీరు బ్రాహ్మణులకు పరిపాలనా వ్యవహారముల నప్పగించి, చిన్నచిన్న సైనికదళముల నేర్పరచి, తమ అదుపులో నుంచుకొనుచుండిరి. ఈ దళములు శత్రువుల దాడి నుండి కాపాడుటకును, బందిపోటు దొంగల పీచ మడంచుటకును ఉపయోగపడు చుండును. ఈ మావళేలు శివాజీ విజృంభణముతో పైకి వచ్చిరి. ఈ మావళేలతో శివాజీ స్నేహమును సంపాదించి, వారికి నాయకుడయ్యెను. శివాజీ సైన్యమునకు

మావళేల సంఘమే వెన్నెముకగా నుండెను. మావళేలు శివాజీని తమ నాయకునిగను, సంరక్షకునిగను పరిగణించిరి. పునహాప్రాంతమునందలి చిన్నచిన్న నాయకులు, పాలెగాండ్రు గ్రామములను కొల్లగొట్టుచుండిరి. న్యాయ, ధర్మములు నశించెను. అంతః కలహములు మెండయ్యెను. ఆ ప్రాంతము శక్తిగల వానికే సర్వస్వమయ్యెను. ఇట్టి విపత్కర పరిస్థితులలో తన దూరదృష్టిచేతను, శక్తి సామర్థ్యముల చేతను, నిష్పక్షపాత వైఖరిచేతను శివాజీ ఆ పల్లీయుల హృదయములను వశపరచుకొనెను. అతని రాజ్యమునకు పునాదులు వేసినది ఈ పీడిత ప్రజాహృదయములే. హిందూ మత విధ్వంసకులకు విరుద్ధముగ శివాజీ మావళేలను పురికొల్పి, చైతన్యవంతులుగ చేసి, వారిలో జాతీయ భావమును ప్రజ్వలింప జేసెను.

ఈ ఆశయములకు ఫలమే శివాజీ మహారాజు. కొండదేవు కడ నాతడు చిన్నతనము నుండియే పరిపాలనానుభవమును కొంత గడించుకొని యుండెను. సమవయస్కులైన మావళేలతో స్వేచ్ఛావిహారము చేయుచు అడవులలో, కొండలలో ప్రభుత్వాధికారులు తారసిల్లినప్పుడు వారిని తికమకలు పెట్టి వారియొద్ద నుండు రాజధనమును శివాజీ కాజేయుచుండెడివాడు. అతని దృష్టిలో నిదియొక వీరోచిత చర్య. అహమద్ నగర మంతరించి పోవుట చేతను, ఆ ప్రాంతమున అరాజకము ప్రబలి యుండుటచేతను శివాజీ కిట్టిచర్యలను అవలంబించుటకు ఉత్సాహము కలిగెను.

శివాజీ సహ్యపర్వత ప్రాంతమున అడవులలో, లోయలలో, మావళే యువకులతో పరిభ్రమించుచు, అందు నివసించు జనులతో సంబంధము లేర్పరచుకొనుచు ఉండెను. విశ్వాసపాత్రులైన అధికారులు కొందరు శ్యామ్‌రాజ్ నీలకంఠ్, రంజేకర్ బాలకృష్ణ హనుమంతే, సోనాజీపంత్, రఘునాథ్ కోర్డే- ఈ నల్గురు 1642 లో శహాజీచే పునహాకు పంపబడిరి. వారు అతని జాగీరు నిర్వహణ భారము వహించుటకు నియమితులైయుండిరి. 1646లో బిజాపుర సుల్తాను అగు ఆదిల్‌షా అస్వస్థుడగుటచే కర్ణాట నాయకులు స్వాతంత్ర్యమును ప్రకటించుకొనుచుండిరి. రాజ్యపరిపాలనము పట్టమహిషి బారిసాహెబా హస్తగతమయ్యెను. శివాజీకి ఇదే అదను. 1647 లో కొండదేవుడు దేహయాత్ర చాలించెను.

ఇక శివాజీకి సలహాలిచ్చు వారు కాని, ఈతని స్వేచ్ఛావిహారముపట్ల మనస్తాపము చెందువారు కాని, మందలించువారు కాని లేకుండిరి.

కొండదేవుని మరణమునకు పూర్వమే బిజాపురపు సర్దారును మోసము చేసి యుద్ధము చేయకుండగనే శివాజీ తోరణదుర్గమును స్వాధీనపరచుకొని యుండెను. ఈ దుర్గములో నున్న ధనరాశి అతని వశమయ్యెను. ప్రచండగడ మని ఈ కోట కాతడు కొత్తపేరు పెట్టెను. ఈ కోటకు 5 మైళ్ళ దూరముననే అదే కొండల నడుమ రాజగడము అను కొత్తకోటను నిర్మించెను. ఈ యుదంతము బీజాపూరులో తెలిసెను. అయిన నేమి, కొందరు మంత్రుల నతడు వివిధోపాయములచేత తనకు అనుకూలురుగ మార్చుకొని యుండిన వాడగుటచేత వారు దాని కెట్టిప్రాధాన్యమియ్యక మిన్నకుండిరి. పూనాకు పోవు మార్గము సంరక్షించుచున్న చాకన్ దుర్గముపై కొండదేవుడు ఫిరాంగ్‌జీని దుర్గరక్షకునిగ నియమించి యుండెను. ఇతడు విశ్వాస పాత్రుడగుటచే శివాజీ కూడ అతనినే నియమించెను. బారామతి, ఇందాపూరు దుర్గాధికారులు కిమ్మనకుండ శివాజీకి లొంగిపోయిరి. ఆదిల్‌షా రాజప్రతినిధికి శివాజీ లంచమిచ్చి కోడాంగ్ దుర్గమును వశపరచుకొనెను.

1648 లో ఈ రాజ్య విస్తరణ కార్యక్రమము ఆగి పోవలసివచ్చినది. దక్షిణ ఆర్కాటు జిల్లాలో రాజప్రతినిధిగాను బీజాపూర్ సుల్తానుల సర్దార్‌గా ఉన్న ముస్తఫాఖాన్ శివాజీ తండ్రియైన శహాజీని నిర్బధించి అతని ఆస్తిని, పరివారమును స్వాధీనపరచుకొనెనని కర్ణాటకము నుండి వార్తలు వచ్చెను. శివాజీ రాజనీతిని ప్రదర్శింపనెంచి, అప్పుడు దక్షిణమున బిజాపూరు సుల్తానులకు ప్రబల విరోధులైన మొగలులతో మంతనములు జరిపెను. మొగలు రాజప్రతినిధి మురాద్‌బక్షితో సంబంధ మేర్పరచుకొనెను. అంతకు పూర్వము అహమ్మద్ నగరములో మొగలుల నెదిరించిన శహాజీని క్షమించి, బిజాపూర్ రాజుల చెర నుండి అతనిని విడిపించినచో నతడు మొగలులతో చేరువనియు, తాను కూడ మొగలాయి ప్రభువులకు విధేయుడనై యుండెద ననియు రాయబార మంపెను. కాని ఆ ప్రయత్నము సఫలము కాలేదు. బిజాపూరు సుల్తాను శహాజీని రాజధానికి తెప్పించి మొగలులతో చేరకుండ మర్యాదలుచేసి తన వానినిగ జేసికొని విడుదల చేసెను. 1648 లో బిజాపూర్ సుల్తాను రోగగ్రస్తుడగుటచే పురందర దుర్గాధిపతి స్వాతంత్ర్యమును ప్రకటించెను. శివాజీ సమయస్ఫూర్తికలవాడు. పురందర

దుర్గాధిపతి తన సోదరులకు భాగమియ్యకుండుటను గమనించి, ఆ సోదరుల నడుమ చీలికలు కలిగించి ఆ దుర్గమును స్వాధీన మొనర్చుకొనెను. 1656 లో జావళీ, రాయగడములను తనవిగా జేసికొనెను. జావళీకోటకు సమీపమున ప్రతాప గడమను కోటను నిర్మించెను. అదే కోటయందు మహాశక్తి భవాని దేవాలయమును స్థాపించెను. ఆ దేవియందు శివాజీకి అత్యంత భక్తిప్రపత్తులుండెను. భవానీ దేవి యాదేశము ననుసరించియే శివాజీ తన కార్యకలాపములను జరిపినట్లు అతని అనుచరుల విశ్వాసము. శివాజీ కరవాలమునకు 'భవానీ'యని పేరుండెను. సూపా అనుకోట గూడ ఈ సందర్భముననే వశమయ్యెను. 1656 లో సూపా, బారామతి, ఇందాపూర్, పురందర్, రాజగడ్, కోదాణ, తోరణా, రోహిడా, టికోణా, లోహగడ్, రాజమాచ్ దుర్గములు శివాజీ అధీనములయ్యెను. సింహగడ్ అను కోటను పట్టుకొను సందర్భమున శివాజీ తన ప్రాణమిత్రుడైన తానాజీ మాల్‌సురే అను మహావీరుని కోల్పోయెను. తానాజీ మరణము శివాజీ జీవితమున అత్యంత విషాద ఘట్టము. నవంబరు 4, 1656 న బిజాపూర్ సుల్తాను మహమ్మద్ ఆదిల్‌షా మరణించెను. ఈ సంఘటనము శివాజీ కార్యక్షేత్రమును మరింత శక్తిమంతము గావించినది.

శివాజీ స్వాతంత్ర్యమును వహించి జాగరూకతతో రాజ్యసంరక్షక కార్యమును నిర్వహించుచు మొగలుల జోలికి పోలేదు. బిజాపూర్ సుల్తాను లతనికి మొదటి నుండియే శత్రువులు. ఇక మొగలులను కూడ ఎదిరించినచో తన ప్రయత్నము వమ్ముకావచ్చునని అతడూహించి యుండును. 1653 నుండి మొగలుల అధీనమున నున్న దక్షిణ భారతమునకు రాజప్రతినిధిగా ఔరంగజేబు పరిపాలించుచుండెను. ఆదిల్‌షా మరణము తర్వాత ఔరంగజేబు బీజాపూరును లోగొనుటకు ప్రయత్నము లారంభించెను.

బిజాపూరు సుల్తాను శివాజీని లొంగదీయుటకు అఫ్జల్‌ఖానును పంపించెను. శివాజీని కౌగిలించుకొని, నలిపివేసి చంపుటకు బలాఢ్యుడైన అఫ్జల్‌ఖాను ఎత్తు వేసెను. శివాజీ ఆ మోసమును తెలిసికొని, తానును మోసమునకు పూనెను. ఇద్దరు మోసగాండ్రు పెనగులాడినపుడు తెలివిగలవాడు జయించును. స్నేహితుని వలె ఖాను శివాజీని కౌగలించుకొని, క్రమముగా బిగించుచు, తన దురుద్యోగమునకు కడంగ నుండగా, శివాజీ తాను గుప్తముగా ధరించియున్న "బిఛువా" (పులిగోళ్ళు)తో చీరి, వానిని చంపివేసెను. ఆ తర్వాత మహారాష్ట్ర వీరులు

అఫ్జల్‌ఖాను వెంట వచ్చిన సైన్యమును సర్వనష్టములకు గురిచేసిరి. 1659 నుండి 1662 వరకును శివాజీకిని, బిజాపూరు సుల్తానులకును జరుగుచుండిన యుద్ధము ఏతము త్రొక్కినట్లుగ నుండెను. 1662 లో బిజాపూరు సుల్తానులు శివాజీ ధాటికి ఆగలేక తమ రాజ్యములోని కొంత భాగమును శివాజీ కిచ్చి సంధిచేసికొనిరి. పూనా మొదలుకొని కృష్ణానది వరకున్న విశాల భూభాగము శివాజీ కీ విధముగ దత్తమయ్యెను.

బిజాపూరు సుల్తానుల నీ విధముగ లొంగదీసికొని, శివాజీ శక్తిమంతమైన మొగలాయి సామ్రాజ్యముపైకి కత్తిదూసెను. మొగలులపై అతడు యుద్ధము ప్రకటించు నాటికి మొగలు చక్రవర్తి ఔరంగజేబు దక్షిణమున తన ప్రతినిధియైన షాయిస్తాఖాను అనువానికి శివాజీని అదుపులో నుంచుట కాజ్ఞచేసెను. షాయిస్తాఖాను శివాజీ అధీనమునందున్న పూనా, చాకన్, కల్యాణ దుర్గములను జయించి, పూనాను తన కార్యకలాపములకు కేంద్రముగ చేసికొనియుండెను. మోసముచేనైనను శత్రువులను లొంగదీయవలయునను నీతిని అనుసరించి మొగలు సైనికుల వేషములతో అనుచర యుక్తముగ శివాజీ పూనా నగరమున ప్రవేశించి, పెండ్లి ఊరేగింపు నెపమున కోటలోనికి పోయి, అంతఃపురము నందు షాయిస్తాఖానును చంపుటకు ప్రయత్నించెను. షాయిస్తాఖాను ఈ మోసమును గ్రహించి కిటికీనుండి దూకి పారిపోయెను. శివాజీ అతనిపై కత్తి విసరెను. కాని గురి తప్పి అతని వ్రేళ్లు మాత్రమే తెగెను. తరువాత జరిగిన యుద్ధము ఖాను కొడుకు అసువులు బాసెను.

1664 లో శివాజీ సూరత్ రేవు పట్టణముపై దాడిచేసి వీర విహారము సల్పి కోటి రూపాయల విలువగల ధనమును దోచుకొనెను. సామ్రాజ్యమునకే ఎసరు పెట్టు నటువంటి శివాజీ వీరోచిత సాహస చర్యలు ఔరంగజేబునకు భయాందోళనములు కలిగించెను. షాయిస్తాఖాను గతి అట్లుకాగా, శివాజీని నిర్బంధించుటకు ఔరంగజేబు తన కుమారుడైన మోజంను, రాజా జయసింగును పంపెను. శివాజీ దుర్గములను కొన్నింటిని వశపరచుకొని మహారాష్ట్ర రాజధానియైన రాయగడమును ముట్టడించుటకు వారుద్యమించిరి. ఈ విపత్కర పరిస్థితిలో శివాజీకి సంధిచేసికొనక తప్పినదికాదు. 1665లో 'పురందరు' సంధి చేసికొనెను. దీని ప్రకారముగా బిజాపూరు సుల్తాను నోడించుటలో మొగలులకు

శివాజీ సహాయము చేయునట్లును, కొంకణ దేశములోని కొన్ని ప్రాంతములలో 'చౌథ్' వసూలు చేసికొనుటకు శివాజీకి అధికార ముండునట్లును ఒడంబడిక జరిగెను.

దక్షిణమునందలి బిజాపూర రాజ్యముతో కలిసి శివాజీ దెబ్బతీయకపోడని జయసింగు ఊహించి ఏమేమో ఆశలు కల్పించి మొగలు రాజధానికి అతనిని ఆహ్వానించెను. 1666 లో శివాజీ ఢిల్లి రాజధానికి పోయెను. జయసింగు ప్రోత్సాహమువలన పయన మయ్యెనే కాని నిజముగ నాతనికిట్టి అభిప్రాయము లేకుండెను. హిందూమత ద్వేషియైన ఔరంగజేబు ముందు తలవంచుట మహారాష్ట్ర ప్రజలపట్ల అవజ్ఞ చేయుటయే యని అతడనుకొనెను. మొగలు చక్రవర్తుల పక్షమున దక్షిణమున రాజప్రతినిధిగ ఔరంగజేబు చక్రవర్తి శివాజీని నియమించునను ఆశ జయసింగు కల్పించెను. శివాజీ తన పరోక్షమున పరిపాలనా వ్యవహారము నిర్దుష్టముగ జరుగునట్లు ఏర్పాట్లుచేసి వెడలెను.

ఔరంగజేబు కొలువు కూటమున శివాజీ తన కానుకలతో ప్రవేశించెను. ఔరంగజేబు అతనితో ఒక్కమాటైనను పలుకలేదు. కొలువుకూటమున తన్ను అప్రధాన వ్యక్తిగ పరిగణించి నట్లతనికి తోచెను. పంచహజారీ మన్సబుదారుల (కొలువుకూటమున మూడవ శ్రేణికి చెందినవారు) పంక్తిలో శివాజీ నిలువబెట్ట బడెను. జయసింగు తనతో జరిపిన మంతనముల ఊసైనను కనబడలేదు. తన అనుచరులకు వెన్నుచూపిన రాజా జస్వంతుసింగు కూడ పంచహజారి శ్రేణిలో తనకంటె ముందుండగ జూచి శివాజీ అగ్రహోదగ్రుడయ్యెను. ఈ యవమానము నాతడు సహించలేక పోయెను. జయసింగు కుమారుడైన రాంసింగు శివాజీవెంట నుండవలసిందిగా నాజ్ఞాపింపబడెను. కావలసినచో తాను ప్రాణత్యాగమునే చేసికొనును గాని చక్రవర్తి ముందుకు రాలేనని రాంసింగుతో శివాజీ నుడివెను. చక్రవర్తి కీవిషయము తెలిసి శివాజీనెట్లేని సమాధానపరచ వలసినదని చెప్పెను. మరునాటి నుండి శివాజీ కొడుకు శంభాజీ (సంభాజీ) రాజదర్శనము చేసికొనెనేగాని శివాజీ వెళ్ళలేదు. శివాజీ నిర్బంధింపబడెను. కాని అతడు మాయోపాయము చేత రాంసింగ్ సహాయముతో తప్పించుకొని రాయ గడము చేరెను.

ఔరంగజేబుపై కసి తీర్చుకొనుటకై శివాజీ మరల దాడులు ప్రారంభించెను. తిరిగి మోజం, జయసింగులు అతని నెదిరించుటకు వచ్చిరి కాని ఈసారి శివాజీ పరాక్రమము వారి సాహస ముడుగునట్లు చేసెను. గత్యంతరము లేక మహారాష్ట్రమునకు రాజుగా శివాజీని వారు పరిగణించి సంధిచేసికొనిరి.

ఆనందనామ సంవత్సర జ్యేష్ఠ శు 13 గురువారము నాడు (1674 జూన్ 6) శివాజి రాయగడమునందు "ఛత్రపతి శివాజీ మహారాజు"గా పట్టాభిషిక్తుడయ్యెను. పదునాల్గురు పుణ్యాంగనలు అతనికప్పుడు మంగళహారతులిచ్చిరి. భూసురులు వేదోక్తముగ ఆశీర్వదించిరి. భక్తివినమ్రుడై వారికి శివాజీ నమస్కరించెను. అధికార సూచకముగ తుపాకులు గాలిలో ప్రేల్చబడెను. ముత్యములు వ్రేలాడుచున్న శ్వేతాతపత్రమును గంగభట్టు అతనిపై పెట్టెను. అప్పుడు "ఛత్రపతి శివాజీ మహారాజునకు జై" అను నినాదములు చెలరేగెను. ఆ సందర్భమున శివాజీ షోడశ మహాదానములు చేసెను. పిదప మంత్రులకు అధికార లాంఛనములను, నియామక పత్రములను ప్రసాదించెను. తరువాత ఉత్తమాశ్వము నెక్కి ఊరేగెను. పుణ్యాంగన లారతులిచ్చి, లాజలు చల్లిరి. ఈ శుభ సందర్భమును పురస్కరించుకొని పురవాసులు తమ గృహాంగణములను దివ్యముగ నలంకరించిరి. ముస్లిముల ధాటికి నిలువలేక కొనయూపిరితో నున్న హిందూ ధర్మ సంప్రదాయము లన్నియు సమగ్రరూపమున పట్టాభిషేక మహోత్సవ మప్పుడు పరిఢవిల్లెను. ఇప్పుడు శివాజీ హిందూ ధర్మ రక్షకుడు, హిందూ సమాజమున కాదర్శ పురుషుడు, భారతీయ సంస్కృతికి ఆశాజ్యోతి.

1677 లో శివాజీ కర్ణాటక ప్రాంతముపై దాడివెడలెను. ఇది అతని జీవితములో ప్రధానమైనది పశ్చిమ కర్ణాటక ప్రాంతమును, బళ్ళారిని లోగొని, తంజావూరిని పాలించుచున్న సవతి తమ్ముడు వెంకోజీనుండి కొంత రాజ్యమును స్వాయత్తము చేసికొని, రాయగడమునకు తిరిగివచ్చుచు, అతడు జింజీ, వెల్లూరు లను వశపరచుకొనెను. ఇంచుమించు పశ్చిమ తీర ప్రాంతమంతయు శివాజీ రాజ్యమునకు పడమటి పొలిమేర అయ్యెను. శివాజీకి తండ్రినుండి లభించినవి కొన్ని జిల్లాలు మాత్రమే. కాని శివాజీ వానిని విస్తృత పరచెను.

1658 నుండియే అతడు నౌకా నిర్మాణమున కుద్యమించి పశ్చిమ తీరమును దుర్గముగా చేసికొనెను. ఇది అతని రాజనీతి దక్షతకు నిదర్శనము. రాజ్యాదాయము పెంచుటకై అతడు సముద్ర మార్గమున విదేశముల నుండి వాణిజ్యమును కూడ ప్రోత్సహించెను. నౌకాబలము వలనను, విదేశీయ వ్యాపారము వలనను శివాజీ, బుడుత కీచుల యొక్కయు, ఆంగ్లేయుల యొక్కయు ఆగడముల నుండి భారతీయులు తట్టుకొనగలుగునట్లు ఏర్పాట్లు చేసి యుండెను. శివాజీ కొండ యెలుక యనియు, గెరిల్లా పోరాటమున ఆరితేరిన వాడనియు, క్షత్రియోచితమైన పోరాటమున కతడు అలవాటు పడినవాడు కాడనియు, ద్వేష పూరిత మనస్కులైన చారిత్రకు లతనిని వర్ణించిరి. కాని ఈ విదేశ వాణిజ్యమును, నౌకాబల నిర్మాణమును పరిపాలనా వ్యవస్థను పరిశీలించినచో శివాజీ ఔన్నత్యము మనకు గోచరించును. పశ్చిమ తీర సమీపమున నున్న యొక ద్వీపమును అబిసీనియా దేశస్థులైన సిద్దీలు ఆక్రమించుకొని తీర ప్రాంత నగరములను దోచుకొనుచుండిరి. శివాజీ వారిని కూడ అదుపులో పెట్టుటకు ప్రయత్నించెను.

శివాజీ చరమదశలో అతని కొడుకైన శంభూజీ (సంభాజీ) దక్కనులో మొగలు ప్రతినిధియైన దిలేరు ఖానుతో కలసి మహారాష్ట్ర రాజ్య విచ్ఛేదమునకు దారి తీసెను. కాని 1679 లో శంభూజీ తన తప్పిదమును తెలిసికొని తండ్రితో కలిసెను.

1680 లో శివాజీ మహారాజు రోగగ్రస్తు డయ్యెను. రోగము నివారణ కాజాల దను సంగతి తెలిసిన తరువాత శివాజీ మంత్రులకు, అధికారులకు తగిన ఉపదేశము లిచ్చి సమాధి నిష్ఠుడై 4 ఏప్రియల్ 1680 ఆదివారము మధ్యాహ్నము దివంగతు డయ్యెను. మరణమునాటి కాతని వయస్సు 53 సంవత్సరములు. మరణము సంప్రాప్తమైనందుకు అనేకములైన కారణములను కొంద రూహించిరి. విషప్రయోగముననో, సయ్యదుఖాను మహమ్మదు అను ఫకీరు శాపము వలననో శివాజీ మరణించెనని వేర్వేరు కథనములు గలవు. కాని చారిత్రకముగ నిది నిరూపించుటకు వీలులేదు.

శివాజీ మరణము నాటికి అతడు నిర్మించిన మహారాష్ట్ర రాజ్యము సూరత్ నుండి కార్వార వరకును, పశ్చిమ సముద్ర తీరమునుండి కొల్హాపురము వరకును ఏక ఖండముగా వ్యాపించిన రాష్ట్రము. ఇదిగాక బళ్ళారి, వెల్లూరు, తంజావూరు, జింజీ కూడ శివాజీ పలుకుబడిలో నుండెను. మొగలు రాజ్యము నందలి మొగలాయి అను పేరుగల ప్రాంతముకూడ శివాజీ రాజుదే. 'చౌథ్' అను పన్నును ఈ మొగల్యాయి ప్రాంతమున వసూలు చేసికొను అధికారము మహారాష్ట్రుల కుండెను. శివాజీ రాజ్యమున 230 కోట లుండెను. అందు 111 అతడు స్వయముగ కట్టించినవి. 73 కోటలు మద్రాసు ప్రాంతమున నుండినవి. 40 కోటలు పరరాజుల నుండి వశపరచుకొనబడినవి.

శివాజీ గురువైన సమర్థ రామదాసస్వామి గట్టి ప్రభుత్వ మొక్కటి ఏర్పరచి దుష్టశిక్షణను, శిష్టరక్షణము గావించి తనకు ప్రతినిధిగ ధర్మపాలనము చేయుమని శివాజీని ఆదేశించి యుండుటచే, శివాజీ ముస్లిములను ముప్పతిప్పలు పెట్టుటయే తన ధ్యేయముగ నుంచుకొనక క్రమబద్ధమైన రాజ్యతంత్రమును నడుపుట కుద్యమించెను. మొగలు ప్రభువుల పరిపాలనా పద్ధతిని చాలవరకు స్వీకరించి తన యనుభవమును రామదాసస్వామి ఆదేశమును దృష్టియం దుంచు కొని రాజ్య వ్యవహారములను నిర్వహించెను. ఆంతరంగిక, వైదేశిక వ్యవహార ములను, రాజ్యము యొక్క ఆదాయములను నిర్వహించు ఉన్నతోద్యోగులను నియమించుటలో శివాజీ ప్రభువు చాల మెలకువ చూపెను. రాజ్య తంత్రమున రాజునకే సర్వాధికారము లుండెను.

అతని కెనమండుగురు మంత్రులు, వీరే 'అష్టప్రధానులు' (1) పీష్వా - ప్రధానామాత్యుడు (2) అమాత్యుడు - ఆర్థిక మంత్రి (3) వాకనీస్ - ప్రధాన లేఖకుడు (4) సచివుడు - రాజున కాంతరంగిక కార్యదర్శి (5) సుమంతుడు- విదేశ వ్యవహార మంత్రి (6) సేనాపతి (7) పండితరావు - మత శాఖాధికారి (8) న్యాయాధీశుడు. సేనాధిపతి తప్ప అందరు బ్రాహ్మణులే. ఈ యష్టప్రధానులు రాజునకు ఆయా వ్యవహారములలో సలహా లిచ్చువారే కాని నిర్ణయము రాజుదే. ఈ ప్రధాన పదవులు అనువంశికములుకావు. ప్రతిభనుబట్టియే వీరి నియామకము.

ఉన్నతోద్యోగులు మొగల్ రాజులవలె జాగీరు లిచ్చినచో అదుపులో నుండరనియు, స్వాతంత్ర్యము ప్రకటించు ప్రమాద ముండుననియు తలచి శివాజీ తన అనుచరులకు జాగీరుల నిచ్చుట మానివేసి జీతముల నేర్పాటు చేసెను. మొగలు చక్రవర్తుల వలె రాష్ట్రము నంతయు "సూబాలు"గా విభజించెను. సూబాకు అధికారి సుబేదారు. ప్రభుత్వమునకు ముఖ్యాదాయము పన్నులే. షేర్షా, అక్బరుల వలె శివాజీ వ్యవసాయభూములను సర్వే చేయించి, వివరములు తెలిసికొని, పన్నులు విధించు పద్ధతిని ప్రవేశపెట్టెను. పంటలో 2/5 భాగము ప్రభుత్వముది. పన్ను కోతల కాలముననే తీసికొనవలయును. రైతులకు నేరుగా కేంద్ర ప్రభుత్వము తోడనే సంబంధము. జమీందారులు, దేశాయిల వంటి మధ్యస్థులకు శివాజీ రాజ్యతంత్రమున స్థానము లేదు.

అహమ్మదునగర్, బీజాపూర్ మరియు మొగల్ రాజ్యములలో పాటిల్, కులకర్ణి, దేశముఖ్‌ల వంటి మిరాసీదారు (వంశ పరంపరాధికారము కలవారు) లుండిరి. వీరు అధికారమును హస్తగతము చేసికొని ప్రభువులైనట్లు వర్తించుచుండిరి. ఒక్కొక్కప్పుడు వారు చిన్నచిన్న సైనిక దళముల నేర్పరుచుకొని పరస్పర కలహములు పెంచుకొని ప్రజాపీడనము చేయుచుండిరి. పటిష్ఠమైన ప్రభుత్వ మేర్పరుచుటకు అవరోధము కల్గునను కారణమున ఈ పద్ధతికి స్వస్తి చెప్పి శివాజీ రైతువారీ పద్ధతిని ప్రవేశపెట్టెను. సైనికాధికారులకు కూడా రైతులపై ఎట్టి అధికారమును లేకుండెను.

అనూచానముగ వచ్చుచున్న చతురంగ బలములలో రథ, గజ బలములు సమకాలీన యుద్ధ పద్ధతులకు సరిరాక పోవుటచే అవి శివాజీ నాటికే ప్రాతపడి కొన్ని శతాబ్దములై యుండెను. శివాజీకి 40 వేల అశ్విక బలము, 1200 గజములు, ఒక లక్ష కాల్బల ముండెను. తుపాకులు, శతఘ్నులు (ఫిరంగులు) విశేషముగ నుండెను. 25 గురు సైనికులపై ఒక హవల్దారు అధికారి. 5 గురు హవల్దార్లపై ఒక జుమ్లేదార్, 10 గురు జుమ్లేదార్లపై ఒక హజారి, 5 గురు హజార్లపై ఒక పంచ హజరి అధికారులుగ నుండిరి.

వీరందరిపై సర్ నోబత్ సర్వాధికారిగా, సర్వసేనానిగా నుండెను. ఈతడే అష్టప్రధానులలో 6 వ వాడు. ఈ సైనికులకు శివాజి ఏర్పరచిన కట్టు

బాట్లు మహాభారత యుద్ధనీతిని తలపించుచున్నవి. దేశములను దోచుకొన్నను, స్త్రీలపట్ల గౌరవ మర్యాదలను ప్రదర్శించవలయును. గోవులను కాని, బ్రాహ్మణులను కాని, వృద్ధులను కాని, బాలురను కాని హింస పెట్టకూడదు. వారిని రక్షింప వలయును. సైనికుల కందరకును ధర్మానురక్తి, రాజ్య స్వాతంత్ర్యాభిలాష యుండవలయును.

మత సంబంధములైన వ్యవహారములను శివాజీ న్యాయబుద్ధితో, సహనశీలతతో నిర్వహించెను. ముస్లిముల దర్గాలకును, మసీదులకును, హిందూ దేవాలయములకును అతడు దానములు చేసెను. వేద విదులైన బ్రాహ్మణులకు జ్యోతిష్కులకు, సాధువులకు, ముస్లిం వలీలకు అతడు దానములు చేసి, ఆశ్రమములను నిర్మించి యిచ్చెను. దక్షిణ ప్రాంతముపై దాడి వెడలినప్పుడు ఆంధ్ర దేశమునందు పురాణప్రసిద్ధమైన శ్రీశైల క్షేత్రమును సందర్శించి 24 మార్చి నుండి 1 ఏప్రిల్ 1677 చైత్రనవరాత్రోత్సవములు నక్కడ జరిపించి, నీలగంగ, పాతాళగంగ యనబరగుచున్న కృష్ణానదియొద్ద శ్రీగంగేశ అను ఒక స్నానఘట్టమును, యాత్రికుల సౌకర్యార్థ మొక ధర్మశాలయును నిర్మింపజేసెను లక్షబ్రాహ్మణులకు సమారాధన చేసి, భూరి దక్షిణల నిచ్చెనట! తన రాజ్యము నంతయు తన గురువైన సమర్థ రామదాసస్వామికి అర్పింపగా, స్వామి తన ప్రతినిధిగా రాజ్యమేలుమని శివాజీని ఆదేశించెను. స్వామివారి కాషాయాంబరమునే శివాజీ భక్తి ప్రపత్తులతో రాజ్యమునకు పతాకగా నిర్ణయించెను. ఇక ఇట్టి రాజ్యమున ధర్మపాలనము జరుగకుండుటెట్లు?

ముస్లిమేతరులైన ప్రజలపై 'జిజియా' అను నొక వింత పన్నును ఔరంగజేబు విధించి యుండెను. శివాజీ ఎన్నోమారులు ఔరంగజేబున కీ యన్యాయమును గూర్చి తెల్పి యుండెను. ధర్మబద్ధముగ పరిపాలన జరిపినచో తాను ఔరంగజేబు సార్వభౌమత్వమును అంగీకరించగలనని తెలిపి యుండెను. శివాజీకి ప్రజాక్షేమమేకాని అధికార వ్యామోహము లేదనియే చెప్పవచ్చును.

శివాజీ వ్యక్తిగతమైన జీవితము మహోదాత్తమైనది. విధేయుడైన కుమారుడుగ, వాత్సల్యము గల తండ్రిగ, బాధ్యత లెరిగిన భర్తగా అతడు ప్రవర్తించెను.

అతడు పరస్త్రీలను పవిత్రహృదయముతో గౌరవించువాడు. కళ్యాణ దుర్గమును జయించినప్పుడు ఒక మరాఠా సర్దారు సోన్‌దేవ్ అంతఃపుర స్త్రీలను చెరపట్టి తీసికొనివచ్చి శివాజీ ముందుంచగా శివాజీ అతని చర్యలను తీవ్రముగ నిరసించి, దానికి దిద్దుబాటుగా వారలను సగౌరవముగా వారియిండ్లలో దించి రావలసిన దని సోమదేవుని ఆజ్ఞాపించెను. కళ్యాణ దుర్గాధిపతి యైన మౌలానా మహమ్మద్ కోడలు పట్టుబడగా, ఆమెను కూతురువలె గౌరవించి, ఆమె తన తల్లి యైనచో తాను సుందరుడుగా జన్మించ కుందునే యన్నట్లు ఐతిహ్యము లున్నవి. గురుభక్తి, దైవభక్తి, సంప్రదాయ బద్ధములైన ధర్మములపై ఆసక్తి రూపుగొన్న వ్యక్తి అతడు. మహారాష్ట్ర సామ్రాజ్యము స్థాపింపవలెనను ఆకాంక్ష కతడు రూపకల్పన చేసి మొగలు సామ్రాజ్యమునకు ప్రక్కలో బల్లెమై చరిత్ర హీనులైన మహారాష్ట్రుల నొకజాతిగా నిర్మించి చరితార్థు డయ్యెను.

శివాజీ తన జీవితము నొక మహోద్యమముగా మార్చుకొని, జాతికొక విభూతి యయ్యెను. మొగలు సామ్రాజ్య పతనమునకు అతని ఉద్యమము కారణమైనట్లు దక్షిణాపథము నందు ఏదియు కాలేదనుట నిర్వివాదాంశము. నేటికిని మహారాష్ట్రులకే కాదు, స్వాతంత్ర్యప్రియులైన భారతీయుల కాతడాదర్శ ప్రాయుడు, ప్రాతఃస్మరణీయుడు.

(ఈ వ్యాసము 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము'(సంపుటం-3) లో ప్రచురితము. ముద్రణ 1962.)

3. పద్మాక్షీ దేవ్యాలయము

ఓరుగల్లుకు పూర్వము కాకతీయులకు రాజధానియైన హనుమకొండలో నిప్పుడు దృగ్గోచరముల్గుచున్న విశీర్ణాలయములలో నీ పద్మాక్షీ దేవ్యాలయ మొకటి. హనుమకొండకు పడమటి దిక్కున నున్న కొండల కనుమలో నొక యెత్తైన కొండపైనుండి చూపరుల నాకర్షించుచున్నది. కొండ దిగువన "పద్మాక్షి గుండము"ను పేర నొక్క కొలను గలదు. దాని ప్రక్కనుండియే కొండపైకి మెట్లున్నవి. గుడి పరిమాణమంత పెద్దది కాదు. గర్భాలయమును దానిముందొక మండపమును మాత్రమున్నవి. ఆలయపు గోపురమునకున్న మెట్లు జైనుల కట్టడపు రీతిని దెల్పుచున్నవి. క్రీ.శ. 1115-1158 నడుమ కాకతీయ రాజ్యాధి నేతయైన రెండవ ప్రోలరాజు కాలమునాటి కన్నడ శాసనమొక్కటి గుడికెదురుగా నిలిచి యున్నది. "కడలాలయ బసది" అను నీ యాలయము 42 వ చాళుక్య విక్రమవత్సరమున నిర్మింపబడినట్లా శాసనము చెప్పుచున్నది.

అనన్యకల్పనా సముపేతమైన శిల్పచాతుర్య మెద్దియు నీ గుడిలో కాన రాదు. రుద్రదేవ మహారాజు, గణపతి దేవుడు, రుద్రమ, రెండవ ప్రతాప రుద్రుడు మున్నగు వారి కాలమున వెలసిన కాకతీయ శిల్పమును పరిశీలించినచో నీ గుడిలోని శిల్పము మిక్కిలి నిరాడంబరముగను - ప్రాథమిక దశలో నున్నట్లుగను కన్పట్టుచున్నది. దక్షిణమున కంచి, ఉత్తరమున ఓఢ్రము వరకు నున్న ప్రాంతము తెలుగు ఏలికలకు లోబడిన తరువాతనే, కాకతీయుల శిల్ప గరిమ నిగ్గుదేరినది.

ఈ గుడిలో వెలసిన పద్మాక్షికి పురాణప్రశస్తిని కలుగ చేయుటకు ప్రయత్నములు కొన్ని జరిగినవి. 16 వ శతాబ్దమువాడైన కాసె సర్వప్ప తన "సిద్ధేశ్వర చరిత్ర"ము నందు ఈ గుడిని గూర్చి కొంత నుడివినాడు. ప్రమథ గణముల విన్నపమాలకించి పార్వతీ పరమేశ్వరులు పద్మాక్షీ సిద్ధేశ్వరులుగా హనుమకొండలో నవతరించి భక్తశ్రేణిని పునీతము చేసినట్లు ఆ చరిత్రమున నున్నది. ఈ కథనమును బట్టి ఇప్పుడు హిందువు లామెపట్ల ప్రదర్శించుచున్న

భక్తి ప్రపత్తులు చూచినచో ఈమె శక్తియే యను నమ్మకము కుదురును. శాసనములోని "కడలాలయ" కును నున్న సంబంధము పరిశీలనార్హమై యున్నది. చారిత్రికులు జైన దేవులలోని అంబికయో, పద్మావతియో కావచ్చునని తల పోసిరి. "కడలాలయ" అను కన్నడ శబ్దమునకు సముద్రమునుండి పుట్టినదని అర్థమేకాని పద్మావతి కాదు. పద్మావతి పద్మాక్షిగా, "కడలాలయ"గా మారిన తీరు తెలియరాలేదు. గర్భాలయమున నెడమవైపున నున్న కుడ్యముపై నొక జైనతీర్థంకరుని విగ్రహమును, దానికిరువైపుల యక్షయక్షిణి ప్రతిమలు నున్నవి. యక్షిణికి రెండు భుజములున్నవి, పద్మాసనాసీనురాలై యున్నది. ఈమెయే నేటి పద్మాక్షి. ఇరువది రెండవ తీర్థంకరుని శాసన దేవికయగు అంబికకు సింహము లాంఛనము. రెండు దక్షిణ హస్తములందును చూతఫల గుచ్ఛము లును, పాశమును, వామహస్తాలలో అంకుశ ముండనగును. కనుక ఈమెను అంబికయనుట పొసగదు. ఇరువదిమూడవ తీర్థంకరుడగు పార్శ్వనాథుని యక్షిణి పద్మావతి. ఈమెకు లాంఛనము హంస. చతుర్భుజ తలపై యెదుపడగల పాము గొడుగువలె నుండదగును. పద్మావతికున్న ఈ లక్షణము దిగంబర జైన శిల్పశాస్త్రమున పేర్కొనబడినది. శ్వేతాంబర జైనుల పొత్తములలో నీమెకు వాహనము పాము. నలుచేతులలో కమల ఫల పాశాంకుశములుండునని ఉన్నది. ఈ యాధారములను పరికించినయెడల ఇప్పటి పద్మాక్షి నిజమైనది కాదని తేల్చుటకు వీలున్నది. రెండవ ప్రోలరాజు మంత్రియైన బేతన భార్యయైన మైలమ యీ గుడిని కట్టించినదని గుడిముందరనున్న శాసనము తెలుపుచున్నది. ఆ శాసనము ప్రక్కననే మైలమ, ఆమె భర్త ప్రతిమలున్నవి. ఆమె నిలిపిన కడలాలయ • జాడ తెలియదు. కాని శాసనమును విడమరచిన పండితులు "కడలాలయ"ను అంబికగా నూహించిరి, "కూష్మాండిని" అని అంబికకు మరొక పేరున్నది. కాకతి, కూష్మాండ శబ్దములకు గుమ్మడి తీగయను అర్థమున్నది. కాకతిశక్తి కాకతీయుల కారాధ్యదేవత. వారంచరీ యంబికా భక్తులే.

ఓరుగల్లు ప్రాంతమున జైనమతము పిదప, శైవము ప్రాచుర్యమునకు వచ్చినది. అప్పుడు శిల్పములు, కట్టడములు శైవ రూపమును దాల్చినవి. దీనికి నిదర్శనము లనేకములున్నవి. రెండవ కాకతిప్రోలరాజు ముందు జైనుడే, పిదప శైవమతమును స్వీకరించెను. ఈ ప్రోలుని కొడుకు రుద్రదేవుడు పరమ

శైవుడై, శైవ భైరవ శక్త్యాలయముల ననేకములు వెలయించెను. వీరశైవ మతమునకు రాజావలంబనము లభించినదాది, జైను లనేకవిధములైన హింసలకు గురియైరి. జైనుల విడుదులు, దేవళములు, గుహలు నామరూపములు లేకుండ సమసిపోయినవి. ఇట్టి పరిస్థితులలోనే పద్మాక్షి గుడిలోని అంబికను దీసి ఏకశిలా నగరములో శైవులు స్థాపించి యుందురను ఊహకు తావున్నది. ఆ అంబికయే కాకతిగా మారినదేమో!

గుడికి నుత్తరమున రెండు పెనుబండ లున్నవి. మొదటి దానిపై నొక జైన విగ్రహమును, దాని తలపై పడగలు విప్పిన సర్పమున్నది. ఇది ఇరువది మూడవ తీర్థంకరుడైన పార్శ్వనాథుని విగ్రహము. దాని ప్రక్కనే ధ్యాన ముద్రలోనున్న జైన ప్రతిమలున్నవి. ఆ ప్రక్కనే పత్నీయుతుడైన ఒక భక్తుడు చెక్కబడియున్నాడు. అతడు బేతన, ఆమె మైలమ అని చరిత్రకారు లూహించియున్నారు. రెండవ బండలో క్రింది భాగమున రెండు గుహలు జైన సన్యాసుల వినియోగార్థము కట్టబడియున్నవి.

వరంగల్లు నగరమున ఇప్పటికిని శైవ మతానుయాయుల సంఖ్య 600కు మించియుండుట గమనించదగిన యంశము. ఇటీవల, అనగా, సుమారు 30 ఏండ్ల క్రిందట ఈ దేవ్యాలయముపై హిందువులును, జైనులును తమ తమ హక్కులకై వివాదపడిరి. తమ తమ వాదములను సోపపత్తికముగా నిరూపించుటకు ప్రయత్నించిరి. అప్పుడు వరంగల్లు ప్రాంతమునకు సుబేదారుగా నుండిన కీ. శే. నారాయణరావుగారు ఈ గుడి హిందువులదే యని తీర్పు చెప్పినట్లు తెలియుచున్నది. ఈ గుడికి ఇప్పుడు పూజారిగానున్న బ్రాహ్మణునియొద్ద గుడికి సంబంధించిన ఒక దాన శాసనము కూడ నున్నదని జనశ్రుతి.

ఓరుగల్లు శిథిలములను చూడవచ్చిన వారు పద్మాక్షీ దేవ్యాలయమును వీక్షించి, కాకతీయ శిల్పకళాసౌధము యొక్క పునాదుల నరయగలరు.*

---

* ఈ వ్యాసం 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము' (సంపుటం - 5) లో ప్రచురితం. ప్రచురణ 1966.

4. పాఠకులు – రచయితలు

చూసే వాళ్ళులేని నాటక ప్రదర్శనాన్ని ఊహించుకోలేనట్లే,పాఠకులు లేని రచయితను ఊహించలేము! ఆనంధమో, ఉద్వేగమో కలిగినప్పుడు రచయిత మనస్సు స్పందిస్తుంది. ఆ స్పందనమే అతణ్ణి రచనకు పురికొల్పుతుంది. ఈ స్పందనగుణమే ఆదికాలము నుంచి మానవునికి బ్రతుకు మీద, బ్రతుకులోని కమ్మదనం మీద అసక్తిని, విశ్వాసాన్ని కలిగిస్తూన్నది. ఈ స్పందనానికి దేశంతోకాని, కాలంతోకాని, ఒక ప్రత్యేక సిద్ధాంతంతోకాని సంబంధం అంతగా ఉండదు. అకాశంలో మేఘాలు అనేక రూపాలలో మనకు కన్పిస్తూంటాయి. ఏ పక్షంలో ఏ మేఘం ఏ రూపం దాలుస్తుందో మనం చెప్పలేము. ఆ విధంగానే మనిషి ఊహాస్వరూపాన్ని అది బహిర్గతమయ్యే వరకు కనుగొనలేము. దేశకాల పరిస్థితుల ప్రభావం మనిషిపై ఉంటుందన్నమాట వాస్తవమే అయినా అతని ఊహాలెల్లప్పుడూ వీటికి అతీతంగానే ఉంటాయి. అలా ఉన్నప్పుడే అవి ఇతరులకు ఆనందాన్ని కలిగిస్తాయి.

పాఠకులు అందుకోలేని ఆనందాన్ని రచయిత సృష్టిస్తే అది రచనా పరిధిలోనికిరాదు. పాఠకులందరు ఆ రచనా స్థాయికి సరిపోయిన సంస్కారం కలిగి ఉన్నప్పుడే అది సాధ్యం. మరి ఈ సంస్కారం వివిధంగా ఉంటుంది. కనుక ఒకరకమైన రచయిత పాఠకులందరికి సమానమైన అనుభూతిని కలిగించలేడు. రచయితకుగూడ కొన్ని ఆటంకాలున్నాయి. అతడు జన సామాన్యంలోనికి తన రచనలద్వారా చొచ్చుకొని పోవటానికి వాళ్ళ ఆలోచనా పరిధులను, మనస్తత్వాలను, దైనందిన జీవితవృత్తాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఈ మాత్రపు సంస్కారం కలం పట్టినవానికి ఉండి తీరవలసినదే. ఆపైన తాను చెప్పదలచుకొన్నది చెప్పినపుడు అతణ్ణి అనుసరించటానికి పాఠకులకు క్లేశం ఉండదు.

నాటికీ నేటికీ ప్రాయికంగా అక్షరాస్యులే పాఠకులు. చదువుతుండగా విని, లేక చెప్పుతుండగా విని విషయపరిజ్ఞానాన్ని పెంచుకునే వారిని, రసాస్వాదనం

చేసేవారిని మనము పాఠకుల కోవలోనికి చేర్చుకొనవచ్చును. ప్రాచీనకాలంనుంచి నిన్న మొన్నటిదాకా మనదేశంలో అక్షరాస్యుల సంఖ్య తక్కువ. ఆనాడు హరి కథా పురాణ కాలక్షేపాలమూలంగా, బొమ్మలాటల మూలంగా, పెద్దలవల్ల అనేక విషయాలు తెలుసుకొనేవారు ఆనందం పొందేవారు. మరి పుస్తకాల నుపయో గించుకొనేవారికి పాండిత్యం. సంస్కారం ఉండేవి తమకు కావలసిన పుస్తకాలను తిరిగి వ్రాసుకొని, చదువుకొనేవారు. అంతేకాని జనబాహుళ్యానికి పుస్తకాలు అందుబాటులో ఉండేవికావు. కులవృత్తికి సంబంధించిన అనేక విషయాలు పరంపరాగతంగా పైతృకంగా లభించేవి కనుక ఆయా విషయాలను చదువుకో వలసిన అవసరం ఉండేదికాదు. పుస్తకాల అవసరం లేకుండానే అనేక విషయా లను తెలుసుకునే అవకాశాలు సహజంగా దైనందిన జీవనంలో, సామూహిక జీవనంలో అయాచితంగా లభిస్తూండేవి.

నాటి సమాజంలోని ప్రతి ఆలోచనకు మతం, ధర్మం ప్రాతిపదిక అయ్యేవి. ప్రతి విషయాన్ని ధర్మదృష్టితో పరిశీలించేగుణం రచయితలకు సంప్రదాయబలంవల్ల అబ్బేది. కనుకనే నాటిరచయిత ఏదివ్రాసినా ధర్మ దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాసేవాడు. అందుకే నాటికాలంలో రచన ఒక ఆరాధనా విశేషంగా పరిగణింపబడింది. వారి రచనల్లో కళాదృష్టి గౌణమేగాని ప్రధానంగాదు. తమకు ఒకవేళ నాటి ప్రజల ఆలోచనలకు అతీతమైన భావం కలిగినా దాన్ని కుదించి సంప్రదాయపు మూసలలో పోసి బయలు వరిచేవారు. ఎందుకంటే, రచనకు ఉద్దేశ్యం ఉపదేశమే. విశ్వ శ్రేయస్సే కావ్యానికి లక్ష్యమని వాళ్ళ ఉద్దేశ్యం నాటికీ నేటికీ ఇంచుమించు ఇదే దృష్టి రచయితకు వుండితీరాలని ప్రాచీన లక్షణికులు, నేటి విమర్శకులు పేర్కొం టున్నారు మతం ప్రభావం ఉన్నన్నాళ్ళు శ్రేయస్సు స్వరూపం అదే నిర్ణయించేది. కాని ఇప్పుడు దాని ప్రాబల్యం తగ్గిపోవడంవల్ల శ్రేయస్సుకు రాజకీయ సిద్ధాంతాలే అప్పటికప్పుడు రూపకల్పన చేస్తున్నాయి. ఈ రాజ కీయ సిద్ధాంతాలలో వైవిధ్యమేకాదు, పరస్పర వైరుధ్యం కూడా ఉన్నది. వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాభివృద్ధివలన నేటి ప్రపంచంలోని దేశాలు పొరుగిండ్లు గాను, మహా సాగరాలు చిన్న చిన్న సరస్సుల్లాగా కన్పిస్తున్నాయి. ప్రపంచాన్నంతా తమ గుప్పిట్లో వుంచుకోగలమనే అహంకారంతో ఈనాడు

కొన్ని శక్తులు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నాయి. కాని మరో పక్క ప్రపంచమంతా ఒక్కటేనని, మానవులంతా ఒక్కటేనని. మానవుని కష్ట సుఖాల స్వరూపం ఒక్కటేననే భావాలుకూడా శక్తిని పుంజుకుంటున్నాయి. మానవాత్మ ఎప్పుడూ లేనంత వ్యాప్తంగా ఇప్పుడు మనకు కన్పిస్తున్నది. నేటి రచయితలు ఈ మార్పును గమనించాలి. గడచినకాలం, దాని విలువలు చాలాగొప్పవని, ఇప్పుడవి నశిస్తున్నాయని వాపోవడంకంటే మేధావియైన రచయిత నేటిపరిస్థితులను పరిశీలించాలి. ఇది స్థూలంగా రచయితల బాధ్యత. కాని హృదయమున్న రచయిత, పొట్టకూటి కోసం వ్రాయని రచయిత అన్ని కాలాల్లోనూ ఉన్నాడు. అతనికి అన్యాయమని తోచిన విషయాన్ని గొంతెత్తిచాటాడు. అతన్ని గొంతునొక్కటానికి ప్రయత్నాలు జరిగాయి. కాని వాడు చచ్చిబ్రతుకుతున్నాడు. దీనికి కారణం అతని హృదయం. ఏ రాజకీయ సిద్ధాంతాలకు లొంగని మనస్సు స్పందించి కళాసృష్టికి పూనుకుంటుంది. శత్రువు రక్తాన్ని చూచినా, మిత్రుని రక్తాన్ని చూచినా గాయపడే హృదయం ఉన్నపుడే రచయిత కళాస్రష్టగా మసగలడు. లోకం పోకడనుబట్టి తన రచనలను మలచుకొనేవాడు అతి సామాన్యుడైన రచయిత. పోకడలు మారగానే ఆ రచనకు విలువ నశిస్తుంది.

సూక్ష్మంగా పరిశీలిస్తే రచయిత బాధ్యతలు అనేమాట అచ్చమైన కళాసృష్టికి గొడ్డలిపెట్టు వంటిది. తనకు తోచిన, తన మనస్సును కదిపిన, తన మెదడును ఊహాధీనం చేసిన సంఘటనను నిర్భయంగా చాటగలిగినపుడే రచయిత సత్యాన్ని ప్రకటించ కలుగుతాడు. మరి ఆ సత్యాలు కటువుగాను తోచవచ్చు, తీయగాను తోచవచ్చు, కాలానికి విరుద్ధంగాను తోచవచ్చు, అనుకూలంగా తోచవచ్చు, ఆమాత్రం స్వేచ్ఛ రచయితకు ఉండాలి. అది లేనప్పుడు రచనలు వార్తాపత్రికలుగా, పంచాంగాలుగా, దస్తావేజులుగా మారే ప్రమాదముంది. ప్రజాస్వామ్యం మీద నమ్మకమున్న సమాజంలో రచయితలకున్న యీ స్వేచ్ఛను గుర్తించాలి, రక్షించాలి.

ఇప్పుడు మహారచయితలుగా, క్రాంతదర్శులుగా, వైతాళికులుగా ఆరాధింపబడుతున్న రచయితలందరూ, ఒక కాలంలో, కాలానికి, సంఘానికి కరడుగట్టిన సంప్రదాయాలకు ఎదురుతిరిగినవారే.

ముద్రణా సౌకర్యాలు అధికంగా పెరిగిన యీ రోజుల్లో రచయితలకు స్వేచ్ఛవుంటే వాళ్ళ భావాలు, పుస్తకాల ద్వారా బహుళ వ్యాప్తి కావచ్చు. మరి ఆ స్వేచ్ఛను రచయితలు దుర్వినియోగపర్చుకొనే ప్రమాదం కూడా లేకపోలేదని కొందరి విమర్శకుల అభిప్రాయం. కాని పాఠకులు లేనిదే రచయిత బతకడు. తన రచనలకు చలామణి వున్నందుకే అతడు వ్రాయ కలుగుతున్నాడు. అశ్లీలమైన, జుగుప్సాకరమైన సాహిత్యం సృష్టి అవుతున్నదే అని మనం భయపడనవసరములేదు. మానవాత్మ సహజంగా అభ్యుదయాన్నే ఆకాంక్షిస్తుంది. రచనా స్వేచ్ఛగల దేశాలలో కూడ కొందరు మాత్రమే విశ్వ జనీనమైన సాహిత్యాన్ని సృష్టించ కలుగుతున్నారు. కనుక రచయితలకేదో బాధ్యతలుండటము అవసరమని అనుకోవటం పొరపాటు. ఆలోచనలను అరికట్ట లేము. అరికట్టటము బర్బరత్వం. మానవత్వం మీద నమ్మకము ఉన్నవాడు స్వేచ్ఛకోసం పోరాడుతాడు. స్వేచ్ఛకోసం పోరాడే వాళ్ళలో రచయితలే కాదు రకరకాల మానవులుంటారు. స్వేచ్ఛకోసం పోరాటం సల్పడం రచయిత బాధ్యత కాకపోవచ్చు. కాని అది అతని లక్షణం.

అందుకే మన భారత రాజ్యాంగం ఆలోచనా స్వేచ్ఛను ప్రసాదించింది. రాజ్యాంగం చూపిన వెలుగుబాటలో మనం పయనిస్తున్నాం.

రచయితలకు బాధ్యతవున్నా, లేకపోయినా వాళ్ళు మానవునికి బ్రతుకు మీద ఆశను, మమతను కలిగిస్తారు. ఆదర్శ శిఖరాలకు చేరువగా తీసుకొని పోతారు. చెప్పినట్లు వ్రాస్తే చెప్పినవాని మాటే చెప్పినట్లవుతుంది గాని తన మాటగాదు. రాచరికాలు, మూఢ విశ్వాసాలు నశిస్తున్నాయి. విజ్ఞానం పద్మంలాగా విచ్చుకొంటోంది. పొడుస్తున్న సూర్యునిలాగా అనుక్షణం అధికాధిక ప్రకాశంతో వెల్గును ప్రసరిస్తున్నది. తర్కానికి హృదయానికి అంటే మేధకు హృదయానికి జరుగుతున్న సంఘర్షణలో హృదయమే జయించి తీరుతుందని రచయితకు నమ్మకముంటే చాలు, మరే బాధ్యతా నిర్దేశం అక్కర్లేదనే విశ్వాసం ఉన్న వాళ్ళు మన దేశంలోనే కాదు, ప్రపంచమంతా వ్యాపించి ఉన్నారు. ఇటీవల వెలువడుతున్న విశ్వసాహిత్యం ఈ యధార్థానికి ప్రమాణం. సదసద్వివేక పరిజ్ఞానాన్ని, దారిద్ర్య నిర్మూల మార్గాలను సూచించే రచనలు సాహిత్య పరిధి

లోనికి రావు. ఆయా విషయాల రచయితలు తాత్వికులు, శాస్త్రజ్ఞులు, తార్కికులు. వారికి బాధ్యతలున్నవి. అది వేరేవిషయం. కాని హృదయ సంబంధి అయిన సాహిత్యసృష్టి చేసే రచయితలకు బాధ్యతలుండవు. వారి రచనల్లో సందేశం సూచింపబడవచ్చును. అంతేకాని సందేశమే రచనోద్దేశం అయినప్పుడు, మరి ఆ సందేశం దేశకాల పరిస్థితుల చట్టాల్లో బంధింపబడే ప్రమాదం ఉంటుంది. అప్పుడు స్వేచ్ఛను కోల్పోయిన రచయిత వ్రాసినా వ్రాయకపోయినా ఒరిగేది ఏమీ వుండదు.*

---

* 'యువభారతి' వారి 'రచన'లో ప్రచురితం. ప్రచురణ జూలై 1970.

5. తెలుగు రచయితల తీరని సమస్యలు

స్వాతంత్ర్య సముపలబ్ధితో మన దేశము తన సమస్యలను తానే పరిష్కరించుకొనవలసిన బాధ్యతలను స్వీకరించినది సమాజమునందలి యన్ని తరగతులలోను అక్షరాస్యత నానాటికి పెరిగిపోవుచుండుట వలన కేవలము కవిత్వమే కాక ఇతర రంగములకు సంబంధించిన జ్ఞానమును గ్రంథములద్వారా అందించవలసిన యవసర మేర్పడుటచేత నీ నడుమ రచయితలలో వైవిధ్యము కానవచ్చుచున్నది.

రచయితలు చదువుకొన్నవారు, విచక్షణాజ్ఞానము కలవారు. తమ భావములను నితరులకు దెలుపుటలో సిద్ధహస్తులైనవారు. ప్రజాస్వామ్య సమాజమున రచయితలు-కవులు, పాత్రికేయులు నిర్వహించవలసిన పాత్ర ఇంతంత చెప్పనలవికాదు. కాని భారతదేశమునందు రచయితలకు ననువైన యవకాశములు లేవు. ప్రాచీన కాలమునందువలె కేవలము రచనలుచేసి బ్రతుకు దెరువు చూచుకొనువారిప్పుడు క్వాచిత్కముగ నున్నారు. ఏదో ఒక వృత్తి చేసికొనుచు తోడ్తో రచనావ్యాసంగము చేసికొనవలసినవారే మన దేశమున నున్నారు. రచయితలను వెనుకబడిన వర్గములో చేర్చవలయునో, ముందున్న వర్గములో చేర్చవలయుతో యెవరికిని తెలియదు. రచయితలది దయనీయ జాతి. కడు జాగరూకతతో నేర్పాట్లు చేసికొన్ననేగాని యొక రచయిత యొక గ్రంథమును రచించినట్లు పత్రికలమూలమున తెలివిడికాదు. గ్రంథ రచన ప్రచురణార్హమైన యంశముకాదు. దొంగతనము, వింత పుట్టుకలు, మోసము, హత్యలు, సినిమాది వినోద ప్రదర్శనముల కున్నంత ప్రాముఖ్యము ఈ సాత్త్వీక కృషికి లేదు. ఏ సంస్థనో ఆశ్రయించి, ఆవిష్కరణ సభ పెట్టించుకొని, తన పూలమాల తానేకొని ఏ యమాత్యవృషభునినో యావిష్కర్తగా పిలచి సంరంభము చేసిననేగాని నలుగురికి తెలియదు. కవులు, రచయితలు, పండితులు, అధికారులు, నాయకులు, పుస్తకాలు కొనరు, చదువరు

కూడ. వారు చదువుకున్నను సరియే. కాంప్లిమెంటరీ ప్రతులను వీరికంద జెయ్యవలె. రచయిత అధికారములేనివాడు, పలుకుబడి లేనివాడు. పుస్తకము కొనవలసినవాడు, పుస్తకము కొనకపోవుట ఒక విధమైన ప్రెస్టీజ్. ఈ విధముగా రచయిత కొన్ని వందల ప్రతులను పంచిపెట్టవలయును. ఆ పిదప విక్రేతల కడకు తీసికొనిపోవలె. ఆ విక్రేతలు 40 శాతం అమ్మినందు కియ్యవలయు ననియును అమ్మిన తర్వాతనే ఇత్తుమనియును చెప్పుదురు. ఈ తిరునాళ్ళకు డబ్బుచాలదు, అప్పుచేసి అచ్చువేసికొనుట, అప్పుచేసి విక్రేతలచుట్టు తిరుగుట, చివరకు మిగులునవి యప్పులే. గ్రంథము కొని చదువు నలవాటులేని జాతిలో రచయితకు మోక్షము లేదు. పుస్తక విక్రేతలకు కమీషన్‌మాత్ర మీయవలసి వచ్చునని రచయితలు ధరలను పెంచియే ప్రకటింతురు. ముద్రణవ్యయము, ప్రచారము, విక్రేతల కమీషను పోగా రచయితకు మిగులున దేమి? సాతంత్ర్య మునకు పూర్వ మీపరిస్థితియే యుండెను. ఇప్పుడును అంతియ. పేరుమోసిన రచయితలు కూడ నష్టపడుచునే యున్నారు. నిప్పచ్చరముతో ప్రతిభావంతులు సైత మగచాట్లపాలగుచున్నారు. ప్రచురణకర్తలు, పుస్తకవిక్రేతలు రచయితలను దోచుకొనుచున్నారన్న సంగతి పాఠకులకు దెలియకపోవచ్చును. కాని రచయి తల కందరకును తెలియును.

ముద్రణము తెనుగున ఇబ్బంది కలిగించుచునే యున్నది. విస్తృత ప్రచారమునకు నోచుకొనని పాత రోజులలో మన లిపివలన కలుగు కష్టనష్ట ములు గురుతుకు రాలేదు. ఏబదియారక్కరములు. 36 హల్లులలో నొక్కొక్క హల్లునకు బదునారేసి గుణింతములు, ఇందుమీదుగా ఒత్తక్షరములు. ముద్ర ణమునకు కాలము పట్టును. ముద్రారాక్షసములు కంటిలో వత్తివేసికొని చూచినను పొడకట్టితీరును.

ఇక విమర్శకులు పుస్తకము నామూలాగ్రముగ చదువక పరిచయము నకు బూనుకొనువారు కొందరు. రచయిత కులగోత్రాలను, అంతస్తులను, అధికార ప్రాభవాలనుబట్టి విమర్శచేయువారు మరికొందరు. తప్పులను మాత్రమే యెత్తి చూపువారు కొందరు. పండితాభిప్రాయములను చూచి వాక్యములను

మార్చి వ్రాయువారు కొందరు. మొత్తానికి పుస్తకాన్ని సహృదయతతో చదివి ఇతరులనుకూడ చదివింప జేయవలెనను నుద్దేశముతో విమర్శ చేయువా రెకొందరో.

రచయితలు సంఘములను స్థాపించుకొనుచున్నారు. స్వాతంత్ర్యము నకు బూర్వముకూడ నీ సంఘములు లేకపోలేదు. అప్పుడా సంఘములలో రచయితలు మాత్రమే యుండి కార్యకలాపములను సాగించెడివారు. ఇప్పుడు రచయితల సంఘాలకు ప్రాయికముగా అరచయితలు, అధికారులు, పలుకుబడి గలవారు, కీర్తికాముకులు నేతృత్వమును నెరపుచున్నారు. రచయితల సంఘములు రచయితల కష్టముల నెంతవరకు పరిష్కరించుచున్నవో చెప్పలేము కాని, రచయితలకు క్రొత్త సమస్యలను తెచ్చిపెట్టుచున్న వనుటలో నత్యుక్తి యుండదు. రచయితలు సహకార సంఘములు కూడ నిర్వహించుచున్నారు. కాని తాము స్థాపించుకొన్న సంఘముతో సహకరించుటకు తరచుగా వారి 'ప్రతిభ' పూనుకొననీయదేమో తెలియదు.

ఇటీవల అకాడెమీలు, పరిషత్తు లేర్పడినవి. కాని యవి రచయితల సమస్యలను పరిష్కరించుట కింకను పూనుకొనుట లేదు. ప్రామాణికమైన, ఉత్తమమైన పరామర్శ గ్రంథములను ప్రచురించుచు, పోటీలు నిర్వహించుచు సాహితీ వికాసమునకు దోడ్పడుచున్నవే కాని, రచయితల మనుగడకు దగిన పరిస్థితులు కల్పించుటలేదు. పరిషత్తు లీమాత్రమే చేయగలవు. ప్రజలు ముందుకువచ్చి గ్రంథములు కొని చదువుటకు ప్రయత్నించవలయును. గ్రంథము లమ్ముడుపోయినచో రచయితలకు నష్టముండదు

ఇటీవల కొందరు రచయితలు చింతలు లేక బ్రతుకగలుగు చున్నా రనిపించును. కొందరు పేరుమోసిన పాత్రికేయులును, నితరవృత్తులలో నుండి రచనకు బూనుకొన్నవారును నీ తరగతికి చెందినవారు. అంతియే కాని రచ నలవలననే బాగుపడిన బాబతుకాదు. వ్యక్తిత్వముగల రచయిత నేటికిని భవ భూతియే! అనుభూతి లేక స్పందనగుణము లేక రచనలు సాగించుచున్న వారు క్రొత్తరకపు వ్యాపారులే కాని రచయితలు కారు. వారి రచనలు సమాజమునకు దీప్తిని కలిగించలేవు. వారికి సమస్యలు లేవు. తీరవలసిన యగత్యమంత

కంటెను లేదు. ప్రతిభాశాలురైన రచయితలను వారెదుర్కొనుచున్న కష్టములను దృష్టియందుంచుకొని యీ వ్యాసమును వ్రాసితిని.

కీ॥ శే॥ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు తమ 'సాక్షి'లో పేర్కొన్న పరిస్థితులలో నెట్టిమార్పును రాలేదు. అవి దాస్య తపస్సులలో గొట్టుమిట్టాడిన దినములని సరిపుచ్చుకొనవచ్చును. మరి యీ పాతికేళ్లలో రచయితల తీరుతెన్నులెట్లున్నవో విచారించిన నాథుడు లేడు. రచయితల బాధలను వర్ణించు వ్యాసములు, కవితలు వెలువడినమాట నిజమే! కాని అవి యన్నియు రచయితను దయనీయవ్యక్తిగా చిత్రించు ప్రయత్నమే చేసినవి. హాస్యరచనల కోవలో చోటు చేసుకొన్నవి.

ఇప్పటి రచయితకు సమాజముననున్న మిథ్యామర్యాదను బట్టబయలు చేసి 'వినాయకుని బొడ్డులో తేలున్న' సంగతిని తెలిపినవారు శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారు. ఆయన 'కీర్తిశేషులు' నాటకము తెలుగు రచయితల తీరని సమస్యలకు దర్పణము. ఆ నాటకమును చదివిన, వినిన, చూచిన వారికి మంగళమహాశ్రీ.*

---

* 'యువభారతి' వారి 'మహతి'లో ప్రచురితం. ప్రచురణ ఆగస్టు 1972.

6. సాహిత్యము – యాథార్థ్యము

కవు లూహాప్రపంచములో విహరించుచుందు రనియును, వాస్తవిక వ్యాపారములతో సంబంధము లేని కల్పాలను చేయుచుందురనియును, కవుల రచనల వలన సంఘమున కొనఁగూడు ప్రయోజన మొండులేదనియును, యాథార్థ్యమునుగాని సత్యమునుగాని కవులు ప్రగటించుటకుఁ బూనుకొన్నప్పుడు శాస్త్రప్రాంగణములోని కడుగిడినప్పుడు మాత్రమే తమ భావములకు సార్థక్యము చేకూర్చుకొనుచుందురనియును కొందరు- కవుల ప్రాముఖ్యమును తృణీకరించు ప్రయత్నము చేయుచుందురు. కవిత్వమనగా నదేదియో యసంభావ్య విషయమని వారి నమ్మకము. అభూతకల్పనలకు మారుపేరని వారి మతము. అవాస్తవికమైన, నిష్ప్రయోజనకరమైన ప్రయత్నమని వారివాదము. మానవుని మనఃప్రపంచము అనూహ్యమైనట్టిది. బ్రతుకుమనుగడకు కూడునీడలే చాలు ననుట చాలసులభము. మనస్సు ఊహాధీనమైనప్పుడే, స్వాప్నికజగత్తునందు విహరించగలిగినప్పుడే మనిషి ఆనందానుభూతిని పొందగలుచున్నాఁడు. ఆ యనుభూతియే అతనికి బ్రతుకుపై నాశను పెంచి, బ్రతుకులోఁ గమ్మదనమును పెంపొందింపఁ గలుగుచున్నది. మనోలోక స్వరూప మిట్టిదని నిశ్చయముగా చెప్పలేము కనుకనే కవిత్వమునకును, కళకును నిర్వచన మిప్పటికిని నేర్పడియుండలేదు.

తర్కమునకుఁ దట్టుకొనజాలిన భావములు యథార్థములని మనము స్థూలముగా చెప్పవచ్చును. తర్కము శాస్త్రము. అనుభవసిద్ధము. అనుభవము పుంజుకొనుచున్నకొలఁది శాస్త్రము విస్తరించుచుండును. కవిత్వ మట్లుకాక రాగద్వేషాదులకు పుట్టిల్లయిన హృదయము నాశ్రయించుకొని యుండును. మేధాహృదయములకు జరుగుచున్న సంఘర్షణమే కవిత్వేతిహాసమని చెప్పవచ్చును. సాహిత్యమునందు యథార్థ్యమే ప్రకటింపఁబడవలెనను నియమము లేదు. యథార్థ విషయములు సాహిత్యపరముగ,కావ్యపరముగ చెప్పవలసివచ్చినప్పుడు భాషలో, శైలిలో మార్పులు సహజముగనే కలుగుచుండును. యథార్థ విషయములు కవితాప్రాంగణమున ప్రవేశించునపుడు ధ్వనిప్రాణయుతములై అలంకారోపేత

శరీరములై వచ్చుచుండును. ఈ వేషమున నున్న యాథార్థ్యములు మన కవాస్త వికములుగ నొక్కొకసారి ద్యోతకమగుచుండును. కవి యనుభూతి నిత్య నూతనముగ నుండును. నూతనమైన కల్పన చేయలేని కవి ప్రతిభాసమన్వితుఁ డని చెప్పలేము. తనకుఁ గలిగిన భావావేశమున్కు రూపకల్పన చేయవలసివచ్చి నప్పుడు శబ్దార్థములపై యతనికున్న యధికారమువలన నవి ముడిసరుకులుగా నుపయుక్తము లగును. ఆ శబ్దార్థములలో శబ్దమున కతీతమైన యర్థము, అర్థ మున కతీతమైన భావశబలత కవితకు ప్రాణమునూది చైతన్యవంతము చేయును. శబ్దార్థములపై యధికారమును సంపాదించుకొనుట వ్యుత్పత్తి. ఈ వ్యుత్పత్తి కావ్యమునకు శరీరమైనచో దైవదత్తమై జన్మతః అలవడు ప్రతిభ యాత్మ యగును. వ్యుత్పన్నుఁడైన వాని ప్రతిభ అసత్యములైన వానిని సత్యములు గను, అసుందరములైన వానిని సుందరములుగను భాసింపఁజేయుచుండును. సుఖదుఃఖముల కతీతములైన. అతీంద్రియములైన భావములు కవితాపరిధిలోనికి రావు.

దైనందిన జీవిత సమస్యలను యథాతథముగ చిత్రించుటవలన సాహిత్యకుఁడు తన కళా ధర్మమును నిర్వర్తించువాఁడగునని యొక మత మున్నది. అయినచో నీయాథార్థ్య ప్రకటనము, ఈ యాథార్థ్య వర్ణనము కళా విహీనమై, మానవానుభూతుల కతీతమై, నీరసమై యున్నచో నది సాహిత్యమే యనిపించుకొనదు. రాజకీయ పక్షముల కార్యకలాపాల ప్రచారము యథార్థ చిత్రణమనిపించుకొనదు. ఇటీవల వాస్తవికచిత్రణమను పేరుతో ననేక ప్రక్రియ లలో ననేకరచనలు వెలువడుచున్నవి. అయా రచనలను మన మించుక పరిశీ లించినచో నవి కావ్యకర్తల భావములో, కార్యకర్తల భావములో యనుసందేహము బొటమరించి, చివరకు రాజకీయ పక్షములు లేపిన దుమారముగా కనిపించును. కనుకనే యవి శాశ్వతత్వము కోల్పోయి సార్వకాలీనతను సార్వజనీనతను సంతరించుకొనలేక పోవుచున్నవి. స్వేచ్ఛా స్వాతంత్ర్యముల నెలుగెత్తి చాటు చున్న యీ రచయితలు రేపు తమ యధికారము చెల్లినచో సీ స్వేచ్ఛా స్వాతంత్ర్యములను నితరు లనుభవించినచో సహించగలరా? అప్పుడు వారిని ప్రతీప శక్తులని, యభివృద్ధి నిరోధకులని ముద్రలు వేయరని నమ్మకమేమి? ఏదో యొక సిద్ధాంతము ప్రకారము ప్రజాబాహుళ్యమునకు సుఖ శాంతులు

చేకూరునని నమ్మినదాని నాధారము చేసికొని కళాసృష్టికిఁ బూనుకొన్నచో నాలోచనావలయము పరిసీమితమై, కళాసంబంధములైన విలువలు మృగ్యములై పోవా? తమ సిద్ధాంతమునకు భిన్నమైన సాహిత్యమును సాహిత్యమే కాదని ప్రచారమునకుఁ బూనుకొనవలసి వచ్చును. ఇట్టి సందర్భములలో నౌదార్యము తన్నుమాలిన ధర్మము క్రింద పరిణమించదా? అప్పుడు యాథార్థ్యమునకుఁ గులగోత్రము లేర్పడును. దేశాకాల పాత్రము లేర్పడును. ఆలోచనలకు హద్దు లేర్పడి లోచనములకు సులోచనములు తగుల్కొని గమనమును కుంటుపరచి, చూపును గ్రుడ్డిపరచును. అప్పుడు "ఒకే ఒక ప్రపంచ నాదం - ఒక్కొక్కని దొక్క ప్రపంచం" అన్న కాళోజీకవి వ్యంగ్యకథనమునుఁ గుర్తుకుఁ దెచ్చును.

ప్రతిభా ప్రకటనమునకుఁ బరిపూర్ణ స్వేచ్ఛను ప్రసాదించినచో రచయిత కృత్రిమ వాతావరణమును చిత్రించుటకుఁ బ్రయత్నించడు. ఒకవేళ కొన్ని యొత్తిళ్ళకు లోబడిపోయినను వ్యంగ్యముగనైనను తన సార్థక్యమును, తన వ్యక్తిత్వమును, తన ప్రతిభా సంపత్తిని వెలువరించి తీరును. వైవిధ్యసము పేతమైన సారవంతమైన సాహిత్యము ప్రతిభాలేశమైనను లేనప్పుడు వెలికిరాదు.

రాజకీయ పక్షముల యదుపులు సాహిత్య సృష్టికి సంబాధకములైనట్టే అలంకారశాస్త్ర సూత్రములు ప్రతిభామార్గమునం దర్గళము కావా యని యొక ప్రశ్న మున్నది. దురదృష్టవశమున అలంకార శాస్త్రమును సాకల్యముగ నధ్య యనము చేయని, చేయలేని వారాశాస్త్రమును సంబాధకమైనదిగా భావించి ప్రచారము చేయుచున్నారు. తెలుగు భాషాధ్యయన ప్రణాళికనుండి సంస్కృత మును తప్పించిన పుణ్యమేమహానుభావునిదో తెలియదు. సంస్కృతభాషా పరిచయము లేనిదే ప్రాచీనాంధ్ర సాహిత్యాధ్యయనము వలనుపడదు. నేటికిని అలంకారశాస్త్ర రహస్యములన్నియును గీర్వాణభాషావిదులకే యవగత మగు చున్నవి కాని తదితరుల కగుటలేదు. అలంకార శాస్త్రములు హద్దుల నేర్పరుచు రాజకీయపక్షాల ఎన్నికల ప్రణాళికలు కావు. ప్రభుత్వ శాసనములకు వ్యాఖ్యా నము లంతకంటె కావు. అవి సాహిత్యమును గూర్చిన వివేచనమున్న గ్రంథ ములు, సాహిత్యాధ్యయనమునకుఁ దోడువడు కరదీపికలు. కరదీపికతో మనము

చూడదలచుకొన్న వస్తువును చీకటిలో చూడవచ్చును. కరదీపిక చూపదు. మనము దాని సాయముతో చూతుము. ఇక నాకర దీపికలు చిన్నవియును, పెద్దవియును నుండవచ్చును. పట్టుకొనువాని కనుచూపునుబట్టి, ఎఱుకనుబట్టి, ఓపికనుబట్టి యవి వెలుగును గ్రుమ్మరించుచుండును. అలంకారశాస్త్రము లొకమూసలోపోసినవి కావు. ప్రతిభావంతులైన యాలోచకులు పండించినవి. పరస్పర భిన్నములైన సిద్ధాంతములు వారు చేసిరి. ఒకరికంటె నొకరు కవి ప్రతిభను స్వేచ్ఛను గుర్తించుటకు ప్రయత్నము చేసిరి. వారి వాదోపవాదములు, సాహిత్యమును సౌష్ఠవంతముగఁ జేయుట కెంతేని తోడ్పడినవి.

యథార్థ్యమును ప్రకటించు ప్రయత్నములో నలంకారశాస్త్రములుపయోగ పడలే వను వాదమును త్రోసినరాజని మరొక వాదమునకు వత్తుము.

అనాథునికి, అగర్భ శ్రీనాథునికి జరుగుచున్న ఘర్షణను చిత్రించుటే యథార్థ్యమని యొకవాదము. ఆర్థికమైన యసమానత్వము వలన సమాజములో గలుగుచున్న సంక్షోభము కావ్యవస్తువు కావలెనని యీ వాదములోని సారము. ప్రజా శ్రేయస్సునకు నిర్వచనములు మారుచునే యున్నవి. సునిశ్చితమైన యార్థిక విధానమొకటి నిశ్చయించలేమని యిట్టి కవిప్రయోగములే చెప్పుచున్నవి. ఈ వర్గపోరాటము కూడ సామాజిక విప్లవమున నొక దశగా ఈ వాదము వారు పేర్కొనుచున్నారు. ఈ దశదాటిన తరవాత మానవుని మనఃస్థితి యెట్లుండును? మానవు డొక పద్ధతి ప్రకార మూహించునా? బాహిరమైన కట్టుబాట్లకు హృదయము లొంగిపోవునా? నిత్యావసరములు తీరునట్లు మనసులుకూడ నిండునా? రాగద్వేషములు లేని, మమతా త్యాగములు లేని, స్వార్థము లేని మనుమలు యాంత్రికముగా సిద్ధమగుదురా? ఈ స్థితిలోని మానవులు స్థాణువులా, ప్రాణ మున్నవారా? తెలియదు. వర్గవైమనస్యము వలన ప్రేమ పుట్టుకొని వచ్చునా? ఘర్షణ వలన కలుగునది అనలముకదా? సాహిత్యము హృదయనిష్ఠమని యొప్పుకొన్నప్పుడు, హృదయోద్భూతమైన భావనల కదుపు లుండ కూడదను మాటను మన్నించినప్పుడు. ఉత్తమ సాహిత్యము సహజముగ యాథార్థ్యమునే చిత్రించును కాని అయథార్థమును కాదు. కవితాప్రాంగణమున జాలువారుచున్న భావలహరి శక్రచాపమువలె వర్ణరంజితమై వక్రసుందరమై ప్రతిభాసించును

శరీరము పాంచభౌతికమైనది. తన పరిసరములను విడిచి యది మన లేదు. ఒకవేళ హృదయము పరిసరములను వీడి యెటకో పోయినను కల్పనాజగత్తులో విహరించి నను పార్థివశరీరముతో సంబంధ ముంచుకొనియే తీరును. సహృదయుడు మాత్రమే లోనారసి సంతుష్టుఁడు కాగలఁడు. అతనికి మాత్రమే యీ కల్పనాజగత్తునకు పార్థివశరీరమున కెక్కడ సంబంధము కలుగునో తెలియును. ఈపట్టున మహా కవులు, సహృదయ విమర్శకులు, సాహిత్యమర్మజ్ఞులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి యీ వాక్యము స్మృతిపథమున తారసిల్లి నా యీ మనన గమనమునకుఁ జేయూత నిచ్చుచున్నవి.

"తత్త్వశాస్త్ర సిద్ధాంతు లేమందురో కాని సాహిత్యముఖారమగు మనకు సత్యము లేని యసత్యము కాని, యసత్యము లేని సత్యముగాని దొరకు పదార్థము కాదు."

ఏదేని యనుభూతిని వాచ్యముగా జెప్పదలచుకొన్నప్పుడు కవితాప్రక్రియ నాశ్రయించనక్కరలేదు. ఉన్నది యున్నట్లుగా చెప్పుటచేత నది యందరకును నర్థమై యానందమును కలిగించునుగాని వక్రముగా చెప్పినచో నది యేకొందరికో నవగతమై సాహిత్యము పరిసీమితవర్గమునకు వినోదార్థము కల్పించబడిన ఖేలనముగా రూపొందునని యాథార్థ్యవాదుల నమ్మకము. ఎల్లరకును నర్థ మగుట యనగా నేమి? పదజాలము సామాన్యమైనదిగా నుండవలె ననియా? పరిసరములకు సంబంధించిన సామాగ్రి యుండవలె ననియా?

"అదృష్టవంతులు మీరు
వెలుగును ప్రేమిస్తారు,
ఇరులను ద్వేషిస్తారు,
మంచికి చెడ్డకీ నడుమ
కంచుగోడ లున్నాయి మీకు.
మంచి గదిలోనే
సంచరిస్తాయి మీ ఊహలు
ఇదివరకే ఏర్పడిందాగది
అందుకే వర్ధించిన విస్తరి మీ జీవితం."

మహాకవి శ్రీశ్రీ పలుకు లివి. ఇందులో నర్థము గాని మాటేది? కాని కవి హృదయము కేవలము వాచ్యార్థము బోధించలేదు కదా? ఆర్థిక వైషమ్యమును బలవంతులు బలహీనుల బ్రతుకులను తమ విలాస జీవితమున కుపకరణములుగా నుపభోగించు చున్నారని యెత్తిపొడుపుగా నన్నిన పలుకు లివి. సహృదయుఁడు కాని వానికి, కవితామర్మములు తెలియనివానికి దీనియందలి వ్యంగ్యము ధ్వని ఆస్వాదనీయము లగునా? కనుక కవిత గాలివలె నీరువలె అందరును ననుభవించగల రనుమాట ఆలోచించి యన్నదికాదు. శబ్దజాలము అలంకారములు ఛందస్సు కవితకు బాహిరరూపములు కవితాశరీరమున కంగములు. కవితాత్మ ధ్వని. ఈ సిద్ధాంతము పరిధిలో భావసమానమగు భావము కవితాసంపద్యుక్తము. "తనకే స్పష్టంగా తెలియనప్పుడు తన చేతగానితనాన్ని, అర్థ అస్పష్టతని, ఛందస్సుచీరల వెనక, అలంకారాలమధ్య, కఠిన పదాల బురఖాలలోను దాచి మోసగించాలని చూస్తాడు కవి- ముఖ్యం, సహజసౌందర్యం తక్కువైనప్పుడు సులభంగా, సూటిగా చెప్పేసి ఇంత ధ్యానానికి, మౌనానికీ, కార్యాలకీ, విజయాలకీ, వ్యవధి నివ్వరాదా అని చెలం కోర్కె."

సాహిత్య శాస్త్రములతో సమగ్ర పరిచయమున్న వాఁ డెవ్వడును చెలంగారి యా అభిప్రాయముతో నేకీభవించకుండ నుండఁడు. సాహిత్యతత్త్వజ్ఞులు కనుకనే చెలంగారు స్పష్టముగా నచ్చమైన కవిత్వలక్షణములను వెలువరించినారు. 'అర్థ అస్పష్టత' యను దోషము వ్యుత్పన్నతవలన పరిహరింపబడుచుండును. పద్య రచనను కవిత్వమనుకొనుట వలన, పాండితీప్రకర్షా ప్రదర్శనమును కవిత్వ మనుకొనుట వలన కలిగిన ఈ అభిప్రాయముల కకారణముగా ప్రాచుర్యము లభించుచున్నది. రకరకముల ముద్ర లీదురభిప్రాయములకుఁ బట్టుగొమ్మలై రసాస్వాదనారీతులను భగ్నము చేయుచున్నవి. ఈ కారణము చేతనే జనబాహుళ్యము కవిత తమకు సంబంధించని యూహాలోకము కవులదను తలపునకు లోగిపోవుచున్నారు. సాహిత్య లోకమునందు రసమే యాథార్థ్యము. ఆ రస స్వరూపమును సిద్ధహస్తుడును, మననశీలియును, స్పందనగుణము గలిగినట్టి వాడును నైన కవి సాక్షాత్కరింపఁజేయును. రసము సహజమని అసహజమని యుండదు.

కనుక యథార్థచిత్రణము సాహిత్య సమస్య కాదు. ఏదేనియొక విషయమును వివరముగ చెప్పవలసి వచ్చినప్పుడు వాచ్యముగ స్పష్టముగ చెప్పవలయును. కృత్రిమమైన శైలిగాని భాషగాని యిట ప్రయోగింపరాదు. విషయమునందలి పదజాలము నాధారము చేసికొని అర్థభేదము నూహించుకొనుటకు ప్రయత్నమిట ప్రసక్తము కాదు. వస్తువునుబట్టి విషయమునుబట్టి భాషామర్యాదలలోఁ బరివర్తనములు కల్గుచుండును. కేవలము తెలివిడి కొరకు, ఉదాహరణమునకు వరివంటకమేఁబట్టు తెగులును నివారించుటకుఁ గైకొన వలసిన చర్యలను గూర్చి చెప్పదలచినప్పుడు ఛందోబద్ధముగా, శబ్దార్థాలంకారయుక్తముగా చెప్పినచో నది కవిత్వమని వ్రాసిన వాఁడనుకొనవలసినదేకాని తదితరులకాబాధ్యత లేదు. అప్పుడు తెలియవలసిన విషయములకంటె తెలియని విషయములు ప్రవేశించి యస్పష్టత కారచన తావలమగును. ఇట్టి సందర్భములలో అలంకారాదులు, ఛందస్సులు సహజములై పరిణమించును, సార్వకాలీనము, సార్వజనీనమైన సాహిత్యమునందలి సత్యములు వేరు, యాథార్థ్యములు వేరు. తథ్యము లిచ్చట నుండవు. హృదయ వ్యాపారము నిశ్చలమైనప్పుడు నిశ్చితమైనప్పటి పరిస్థితిలో దైనందినానుభవమువలన నెఱుకకు వచ్చిన విషయమునకును సాహిత్యమునకు నభేదమేర్పడునేమో!*

---

* పాటిబండ మాధవశర్మ షష్టిపూర్తి సమ్మాన సంచిక 'అక్షరార్చన'లో ప్రచురితం 1972.

7. ఆస్తికభావం

దైవం కోవెలలోనే ఉంటుందనుకుంటారు కొందరు. అంతట వ్యాపించి ఉన్నదైవం కోవెల్లోనే ఉండటం ఏమిటి? అని మరికొందరి తర్కం. పేరు కాని, రూపం కాని లేని దైవానికి ఒక రూపం కల్పించి, మనిషికున్న రాగ ద్వేషాలు దానికీ ఉంటవని నమ్మి రకరకాల మర్యాదలు చేసి తృప్తిపరచి తమ కోరికలన్నీ అది సంతోషించి తీరుస్తుందని వ్యవహరించేవారు ఆస్తికులు కానే కారని బాహాటంగా ప్రకటిస్తుంటారు కొందరు.

తాము ఆస్తికులమని నమ్మేవారికి ఇలాంటి వ్యాఖ్యానాలు, తర్కాలు బాధ కలిగిస్తుంటాయి నిజానికి. ఆస్తికతకు ఈ పూజాపునస్కారాలకు ప్రత్యక్ష సంబంధం ఏమీలేదు. ఆస్తికత ఒక విశ్వాసం, ఒక లక్ష్యం, ఒక మనోవైఖరి, ఒక జీవిత విధానం. ఆస్తికునికి తాను దైనందిన జీవితంలో చేసే ప్రతి పనీ ఒక ఆరాధనా విశేషం. అతడు ప్రతి మనిషిలో దేవుణ్ణి చూస్తాడు. ప్రతి మనిషిలోని మంచిని ప్రతిభను దైవ స్వరూపంగా భావిస్తాడు. భగవంతుడు ప్రజ్ఞాస్వరూపుడు. కనుక ఆ ప్రజ్ఞ ఎక్కడున్నా ఎప్పుడున్నా గుర్తించి ఆరాధించి సంతోషిస్తాడు. భాషలు, దేశాలు, యుగాలు, అతని మనోనేత్రమందు ఒకటిగానే భాసిస్తాయి. తన భగవంతునికి, తన మతానికి తాను రక్షకుణ్ణని భావిస్తూ ప్రచారం చేస్తున్నవాడు ఆత్మవంచనకు, పరవంచనకు, దైవ వంచనకు పాల్పడు తున్నాడని చెప్పవచ్చు. తాము ఆస్తికుల మనుకుని నిత్య పూజా పురస్కా రాల్లో నిమగ్నులై ఉండేవాళ్ళల్లో పలువురికి హృదయ సంస్కారం ఉండదు. తమ పూజలకు ఏమి లక్ష్యమనే సంగతి వాళ్ళకు తెలియదు. పాపభీతి లేని దైవభీతి వట్టి బూటకం. ఆస్తికులమని చెప్పుకుంటూ బియ్యంలో రాళ్ళు, పాలల్లో నీళ్ళు గలిపి జాతి కన్ను గప్పి, ఆదాయపు పన్ను ఎగగొట్టి వచ్చిన లాభాల్లో చిన్నమెత్తు భాగాన్ని ధర్మదాయ సంస్థలకిచ్చి దానకర్ణులని, భక్తులమని రకరకాల బిరుదులను తగిలించుకొని సమాజంలో లబ్ధప్రతిష్ఠులై తమ వ్యాపారం సాఫీగా సాగించుకుంటున్నారు. తమ స్వార్థానికి దెబ్బ

తగలకుండా తగిన రక్షణ కవచం ధరిస్తున్నారన్నమాట. జీవకోటిని అధిక లాభార్జనకోసం రోగగ్రస్తంచేసి దారిద్ర్యానికి బలిచేసి, అదే వృత్తి ధర్మం అని సరిపెట్టుకొని, కొన్ని పుణ్యకార్యాలుచేసి ఆ పాపపరిహారం చేసుకుంటున్నారు. అవసరం కంటె ఎక్కువ సంపాదించడం ఆస్తికుని లక్షణమే కాదు. ఒకవేళ నిష్క్లేశంగా లభించినా ఆ ద్రవ్యం, ఆ సౌఖ్యం సమాజానిది. తాను దానికై ధర్మకర్త మాత్రమే. అవసరాలను తగ్గించుకొని, ఉన్నదానిలో తృప్తిపడి తన శక్తియుక్తులను తోడివారి కష్టాలను నివారించడంలో తోడ్పడడంలోనే ఆస్తికతకు సార్థక్యమున్నది.

జపతపాలనూ పూజా పురస్కారాలను అలవాటుగా చేసుకున్నవారు వాని ప్రాముఖ్యాన్ని గాని, వాని పరమార్థాన్నిగాని అవగతం చేసుకోలేదని చెప్పాలె! తన పెరుమాళ్ళకు, తన ఇష్టదేవతకు సకాలానికి పూలు కోసి తెచ్చియ్యని దాసుణ్ణి యజమాని పశువును బాదినట్లు బాదుతూ ఉండటం మనం చూస్తూనే ఉన్నాము, జీవుణ్ణి మరచి దేవుడి వెంటబడితే దేవుడు దొరకడు. కనుక తనవంటి జీవుని రూపంలో దేవుడు అవతారాలెత్తి తనవలెనే కష్టాలనుభవించి, తానూ కర్మకు అధీనుడేనన్న సత్యాన్ని బోధించిన సంగతి అందరికి తెలుసు. ఆస్తికత్వం స్వార్థానికి పెట్టనికోటగా ఉండి బలహీనులను మాడ్చుకు తినడానికి తరతరాలుగా తోడ్పడుతున్నదని కొందరు సిద్ధాంతమే లేవదీశారు. ఈ సిద్ధాంతం లేవదీసినవారు కూడా ఒక విధంగా ఆస్తికులే. జీవుని కష్టాలకు కారణాలను పరిశోధిస్తే వారికి దొరికిన ఒక కారణం ఇది. తృష్ణ దుఃఖాలకు కారణమని గౌతమబుద్ధుడన్నాడు. మొత్తానికి దుఃఖాలను చూడలేక తమ ప్రతిభావ్యుత్పత్తులను ధారవోసి సిద్ధాంతీకరించినారు. ఇక్కడ స్వార్థమేమీలేదు. దారిద్ర్య నిర్మూలనం సమతాస్థాపనం కేవలం బాహిరమైన ప్రయత్నాలవల్ల సాధ్యంకాదు. అంతరంగిక సంస్కారంవల్ల వ్యక్తిగతంగా ప్రతి జీవుడు సాధించవలసిందే. ఈ సృష్టి అంతా భగవత్స్వరూపమే అని నమ్మేవాడు నిజానికి ఎవణ్ణీ తన సౌఖ్యంకోసం ఉపకరణంగా భావించడు. ఇతరుల ద్రవ్యానికి ఆశపడడు.

మతాన్ని వదలి మతప్రవక్తల జీవితాలపై వారి సమకాలీన జీవిత ప్రవృత్తులను మనం పరిశీలిస్తే వారికీ వారి మతానుయాయులకూ ఉండే భేదం బోధపడుతుంది. నిజానికి మతానుయాయులలో పెక్కురు స్వార్థపరులు.

మూఢులు. ఆ మతానికి వక్ర వ్యాఖ్యానాలు చేసి సంఘ శ్రేయస్సుకు భంగం కలిగిస్తూంటారు. శ్రీ విష్ణువు అష్టాక్షరీ మంత్రం అతి రహస్యమైందనీ అది విన్నవారికి పుణ్యం కలుగుతుందని గురువు చెప్పగానే శ్రీమద్రామానుజులు శ్రీరంగం కోవెల గోపురమెక్కి ఆ మంత్రాన్ని ఉచ్చరించారట. ఏమిటిదని గురువడిగితే మరి అందరికీ పుణ్యం కలుగాలెకదా! నాకొక్కనికేనా! అన్నాడట. చండాలుడు బ్రహ్మస్వరూపుడని నమస్కరించ గలిగే అద్వైతు లెందరున్నారు? హరిజనుణ్ణై జన్మిస్తాను అని అనగలిగిన వారెందరున్నారు గాంధీజీ అనుయాయుల్లో? ఒకే గీత ఆచార్యత్రయానికి అర్థత్రయాన్ని ప్రసాదించింది. మరి ఆ ఆచార్యుల కిప్పుడు పడదు. శంకర, రామానుజ, మధ్వాచార్య లొకేకాలంలో బ్రతికి ఉంటే కలిసి పనిచేసి ఉండేవారు. ఎందుకంటె వాళ్ళు మేధావులు, దేవుణ్ణి చూసినవారు, తపోమూర్తులు. దృక్కోణంలోని భేదంకాని లక్ష్యంలో లేదు. దేశాలను, సంఘాన్ని, మనుషుల్ని విడదీయమని ఏ మతం చెప్పలేదు. ఏ ప్రవక్త చెప్పలేదు. కాని ఆ మతానుయాయులు మాత్రం తమ మతమే గొప్పదని, అది మాత్రమే స్వర్గానికి చేరుస్తుందని, దాన్ని నమ్మనివాళ్ళు చెడిపోతారని, తమ మతాన్ని నమ్మనివాళ్ళు తమకు శత్రువులని ప్రచారం చేయడం వల్ల ఎంత దౌర్జన్యం, ఎంత హత్యకాండ, ఎంతకాలం జరిగిందో, జరుగుతున్నదో ప్రపంచేతిహాసం ఋజువు చేయగల్గుతుంది. ప్రవక్తలకున్న ప్రతిభ, హృదయనైర్మల్యం మతప్రచారకులలో, మతానుయాయులలో సకృత్తుగానే ఉంటుంది. పలువురు మతప్రచారకులు మత జీవికకోసం ఆ పనిచేస్తూ ఉండటం మనం గమనిస్తూనే ఉన్నాము. మత ప్రచారం ముసుగులో గూఢచారి చర్యలు కొనసాగుతుఃటవి. ప్రవక్తలూ చిత్తశుద్ధితో నమ్మిన విషయాల్ని తన్మతానుయాయులు కర్కశ తర్కంతో సమర్థించే ప్రయత్నం చేస్తారు. ఈ మతానుయాయులు రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకొని ఇతరమతం వాళ్ళను చిత్రవధ చేసిన ఘట్టాలు చిత్రించందే చరిత్ర సమగ్రం అనుపించుకోదు. ఇవన్నీ పరిశీలించి కొందరు మేధావులు మతమే మనిషికి వేరుపురుగు అని సిద్ధాంతీకరించే స్థితికి వచ్చారు. వీళ్ళ చిత్తశుద్ధిని శంకించడం న్యాయం కాదు.

పరహితచింతన దైవభీతి లేనిదే మనిషిలో ఉత్తమ సంస్కారం రాదు. శాసనానికి చాలా పరిమితమైన శక్తి ఉన్నది. అది మనస్సును ఏమీ చెయ్యలేదు.

ఎన్ని పద్ధతులు అవలంబించినా, ఏదో ఒక రూపంలో మనిషిలోని దౌష్ట్యం విజృంభిస్తూనే ఉంటుంది. కనుక దైవభీతి వ్యక్తిలో సంస్కారాన్ని కలిగిస్తుంది. సంఘానికి వాని ఉనికి ప్రయోజనకరంగా పరిణమిస్తుంది. ఒకరిని నొప్పించక బ్రతుక గలిగితే అంతకంటే ఆస్తికత లేదు. దేవుడొకడున్నాడనే భావమే ఆస్తిక భావం. అంతేకాని వాణ్ణి సంతోషపెట్టవచ్చు. వానికి కోపం తెప్పించ వచ్చు. వాణ్ణి బుట్టలో వేసుకోవచ్చు అనికాదు. బుట్టలో పడేది ప్రతిమ. దేవుడుకాదు. మరి ఈ బొమ్మలు, దేవాలయాలు, ప్రార్థనామందిరాలు ఎందుకు? ఆయా ప్రదేశాల్లో మనిషి తన మనస్సును పరీక్షించుకుంటాడు. అది దైవ సన్నిధి అని నమ్మి తన పాపం క్షాళనం కావాలని కోరుకుంటాడు. ఎక్కడైనా మనిషి తాను దైవాధీనుడని అనుకోవాలె. తనవలెనే ఇతరులుకూడా అనుకుంటున్నారు అని వారికి తెలియాలి. దేవాలయాలు ఈ వాతావరణాన్ని సృష్టించగలుగుతాయని ఒక నమ్మిక. అక్షరాస్యత బహుళ వ్యాప్తంగా లేని రోజుల్లో ఈ దేవాలయాలే ప్రజానీకానికి ధర్మాన్ని, జీవితలక్ష్యాలను బోధిస్తూ ఉండేవి. ఊరి వారందరూ కోవెలనీడలో తాము సురక్షితులమని నమ్మి తాము దైవసన్నిధిలో ఉన్నారని నమ్మి సద్భావంతో, సత్కార్యంతో తమ సంబంధం పెట్టుకొని సంఘాన్ని రక్షించుకునేవారు. లోకానికి మేలుచేస్తున్న దేవునిలో తనను చూసుకుంటాడు. మనిషి దేవాలయంలో తాను మేలుచేయాలనుకుంటాడు. ఆ దేవుణ్ణి ఊరేగిస్తాడు. తొట్టిలోవేసి జోలపాట పాడుతాడు. నృత్యం చేస్తాడు. పాట పాడుతూ మైమరచిపోతాడు. తాను తినేది అతనికి నివేదించి అతని దయ వల్ల తనకు లభించింది కాని తన గొప్పదనంవల్ల రాలేదని భావించి తింటాడు. మనిషిలో ఈ దేవాలయ వాతావరణం పూజా పురస్కారాలు "అహంతను నశింపచేసి ఉత్తమ సంస్కారాన్ని కలిగిస్తాయి." ఆస్తికభావానికి ఈ దేవాలయాలు కేవలం బాహిర రూపాలు. కాని శరీరంలో లేని ప్రాణం ఊహకు తట్టుతుందా? అట్లని శరీరాన్ని కాదంటున్నామా?

ఆస్తికత్వమొక ఆలోచనా విధానమని పరిశీలిస్తే ఈ ఆస్తిక భావం సంఘంలో క్రమశిక్షణను, ధర్మాభిరతిని నిన్న ఎలా పెంపొందించగలిగిందో ఈ వేళ ఎలా పెంపొందించగలుగుతుందో తెలుస్తుంది. కాలానుగుణమైన మార్పులు చేసుకుని దేవాలయ నిర్వహణను ప్రయోజనకంగా పరిణమించేలా

చేయాలి. ఇది మూఢవిశ్వాసం కాదు. సర్వకాల సర్వావస్థల్లో ఆస్తికునిగా వ్యవహరించడం మేధావికే సాధ్యమవుతుంది. మూఢునికి కాదు. నిజమైన ఆస్తికుడు నిర్భయుడు, పరిశుద్ధ మనస్కుడు, విశ్వాత్ముడు. నేడు అతివ్యాప్తంగా వినబడుతున్న విశ్వమానవ సౌభ్రాత్రం ఆస్తిక సమాజానికే సాధ్యం, నాస్తికులిది సాధించలేరు. నిజమైన ఆస్తికునికి క్రీస్తుప్రభువు పూజనీయుడు. మహమ్మదు పూజనీయుడు. సోక్రటీసు పూజనీయుడు. లెనిన్, గాంధి, లింకను పూజనీయులు. లెనిన్ నాస్తికుడంటారు. ఆయన దేవుడున్నాడా లేదా అనే చర్చలజోలికి పోక జీవులపట్ల కరుణామయుడై పూత చేతస్సుతో ఆత్మార్పణం చేసినవాడు. చిత్తశుద్ధి గల నాస్తికునికి నాకు భేదం లేదు అన్నారు గాంధీజీ. ఆస్తికుని మాటల్లో, చేతుల్లో, తలపుల్లో ఒక విశిష్టత ఉంటుంది. అపారమైన కరుణ, ప్రేమ ఉన్నప్పుడే సమన్వయ దృష్టి ఏర్పడుతుంది. సాత్వికత ఆస్తికతకు ప్రాణప్రాయం. ఆస్తికత భావానికి విస్తృతమైన అర్థాన్ని ప్రయోజనాన్ని సమగ్ర స్వరూపాన్ని విశ్లేషించి చెప్పింది భగవద్గీత. భగవద్గీత పారాయణంతో తృప్తిపడక గీతాపరాయణుడు కాగలిగినప్పుడే ఆస్తికత్వానికి ఫలాన్ని అందుకోగలుగుతారు. ఆస్తిక భావానికి సుముచిత వ్యాఖ్యానం భగవద్గీత.*

---

* 'శ్రీస్వామి' వార్షిక సంచికలో ప్రచురితం ముద్రణ 1972.

8. పోతన చరిత్రము – సమకాలీన ప్రభావము

శతకములు, ప్రబంధములు, ద్విపదకావ్యములు, మాత్రాగణబద్ధములైన గేయకృతులు మున్నగు ప్రాచీన సాహితీప్రక్రియలకు నేటికిని తెలుగు సాహిత్య లోకమున చెల్లుబడి యుండుట గమనింపదగిన యంశము. ఖండ కావ్యములు, వచన కవితలు వెలువడుచుండినను మహాకావ్య ప్రణేతలకే యగ్ర తాంబూలము లభించుచుండుట ఒక విశేషము. ఈ యిరువదవ శతాబ్దమున పురాణములు, మహాకావ్యములు, ఇతిహాసములు ప్రాచీనకాలమున వెలువడినట్లుగనే వెలువడినవి. భాగవతములు, రామాయణములు, పురాణములు కేవలాక్షరాస్యుల నాకర్షింపలేక పోయినను, వ్యుత్పన్నులైన సరసుల ఆమోదమును పొందుచునేయున్నవి. పురాణేతిహాసములందలి యితివృత్తములనే కాక ఇటీవల భారతీయుల చరిత్ర నుజ్జ్వలము గావించిన చరితార్థుల భవ్యచరిత్రములు, దేశభక్తుల గాథలు మహా రచయితలకు ప్రతిపాద్యములైనవి. శివభారతము, రాణా ప్రతాప చరిత్రము, మహాత్మకథ, జాతిరత్నం వంటి రచనలు మహాకావ్య గౌరవములను పొంద గలిగినవి. ఇక దేశనాయకుల వీరోచిత సమరము నుగ్గడించు గ్రంథము లసంఖ్యాకములల చెప్పినచో నత్యుక్తికాదు. వస్తువులో వైవిధ్యము కనిపించినను, మహాకావ్య ప్రక్రియ ప్రాచీన కవితా కళామర్యాదలతోఁ బాటు, అర్వాచీనములైన విలువలను సంతరించుకొని వెలువడిన కావ్యములు క్వాచిత్కములేయని చెప్పక తప్పదు. సనాతనాధునాతన కావ్యకళాభిరుచులను తలస్పర్శిగా నవగాహన చేసి కొన్న మహాకవు లరుదుగనే యున్నారు. వస్తువు నెన్నుకొనుటలోనే సమకాలీనాలోచనలను ప్రస్తుతించిన వారిలో, నా యెరుకలో శ్రీ వానమామలై వరదాచార్యులే ప్రథములు, అగ్రేసరులు.

తెలుగు భాషా సంస్కృతులపై కత్తిగట్టిన నిరంకుశ నిజాం పరిపాలనలో నరకయాతనల ననుభవించిన తెలంగాణా ప్రజల కడగండ్లను చూచినారు.

ఆచార్యులుగారు. బూజుపట్టిన రాచరికమును సహించని దేశభక్తుతో శ్రీవారికి పరిచయము. 'మనుజేశ్వరాధముల'కు కావ్యము నంకితము చేసినచో నరక ప్రాప్తి యగునని నమ్మిన బమ్మెర పోతన మహోదాత్త జీవితము ఆచార్యుల వారి నాకర్షించినది. కావ్యవస్తువుగా కవిజీవితమును గ్రహించిన వారీకాలమున ఆచార్యులవారొక్కరేనేమో! దశకుమారచరిత్ర అవతారికలో కేతన తిక్కన జీవితమును, పాల్కురికి సోమనాథుడు పండితారాధ్యుని జీవితమునుగ్గడించిన సందర్భములు తప్ప మనకు ప్రాచీనకాలమునందును కవిజీవితములు కావ్య వస్తువుగా గ్రహించిన పట్టులు తక్కువ.

ఉన్నత విద్యలన్నియును మాతృభాషలో జరుగవలెనన్న పట్టుదల గల ఈ రోజులలో దేవునికంటెను, గోమాత కంటెను తల్లిభాష గొప్పదని వరదన్న తన పోతన చరిత్రమున ప్రకటించెను. పదునేనవ శతమానమున బ్రతికిన కవి జీవితమును రచింపబూనుకొన్నను నేటి జీవితవృత్తచ్ఛాయలలోనే యీ కావ్యము నడిచినది. ఈ కావ్యమున కింత గౌరవము లభించుటకిది కూడ నొక హేతువు. ఇతివృత్తమును స్వీకరించుటలోనేమి, కథాఘట్టములను సృష్టించుటలోనేమి, వర్ణనాదులలోనేమి వరదన్న కొత్త పుంతలలో నడిచెను. సమకాలీనపు భావమీ కావ్యముపై నున్నదనుటకంటె ప్రాచీనేతివృత్తముగల నవీన కావ్య మనుట సమంజసము. సమకాలీన ప్రభావమును సూచించుపట్టు లనేకమున్నవి. వాని నుటంకించుటకు బ్రయత్నము చేసినచో గ్రంథము విస్తరించును. కనుక దిఙ్మాత్రముగ సూచించుటకు ప్రయత్నింతును.

గీర్వాణభాషకేదో యపచారము జరుగుచున్నదని యెంచుచున్న ఇంద్రుడు వరదన్న దృష్టిలో పామరుడు. వ్యంగ్యముగా కవి మాతృభాషకు ప్రాముఖ్య మిచ్చినంత మాత్రమున సంస్కృతమునకు లోటు వచ్చుననుకొనుట పామరత్వమే యగునని సూచించియున్నాడు.

కవులు వైతాళికులను భావమీదినములలో నెక్కువ ప్రాచుర్యము నందు కొన్నది. పోతన జనన సందర్భమున "క్షోణి మేల్కొల్పు కవి యనఁజుక్క పొడిచె"నని వరదన్న ఈ భావమునే ప్రకటించెను.

పాల్కురికి జాతర వర్ణ మిప్పటి తెలంగాణా గ్రామాలలోని జాతరలదే.

ప్రకృతిని సుందరిగా నభివర్ణించుట ప్రాచీనుల యలవాటు. ప్రకృతిని తల్లిగా నుపాసించుట మనకిటీవల నబ్బినది. వరదన్న పీలు దొరికినప్పుడు ప్రకృతి యందలి మాతృభావమునే ప్రదర్శించెను.

దొరలపిల్లలను కొంగలగుంపుగ నుపమించుటయును, ద్వితీయాశ్వాసము నందలి కాపుపడుచు ఉదంతమును కలిమికి బలిమికి నెదురుతిరిగిన నేటి రైతాంగపు మనస్తత్వమునకు దర్పణములు.

నేటి సంఘమునందలి వైవాహికరీతులలోని యసహజపద్ధతులను వరదన్న మందలించియే వదలెను.

"పట్టుమని పదినాళులు పడుచుదనవు
ముద్దుముచ్చట లోకయింత ముగియకుండఁ
జంటిపిల్ల వెంటనె యొక దంటపిల్ల
కాలఁజేత వ్రేలాడగా నేల యనుచు"

నేటి కుటుంబ నియంత్రణ తత్త్వమును సృష్టించినారు వరదన్న. వర్ష ఋతువర్ణన సందర్భమున-

'ప్రజాహిత దౌర్జన్యప్రభుత' నూహించినారు. స్వానుభవమిది.

ఋతు వర్ణనములే కాక వరదన్న మహాకావ్య లక్షణము ననుసరించి యష్టాదశ వర్ణనములుచేసి యున్నారు. ఈ వర్ణనలు గతానుగతికమైన కవి సమయపు మూసలలో గాక సమకాలీన ప్రజాజీవితమునకు సంబంధించిన ఖేదమోదములను, అలవాట్లను స్వానుభవముతో మాండలిక పలుకుబళ్ళతో సరసముగ రచించి యున్నారు. కులీనవ్యవస్థ ఇనుప పాదముల క్రింద నలిగిపోయిన తెలంగాణా రైతుల బ్రతుకు బరువుల నేకావ్యము చిత్రించియుండలేదు. 'మానవాసురుల రాజుల కాలము వోయె సత్కృపి' యని యనగలిగిన కవి, పోతన చరి

త్రము నూహించి వ్రాసిన తీరుతెన్ను లెట్లుండునో మనము సుబోధము గ్రహించగలుగుదుము. 'కర్షక జనగీతిక లాలపించు' మనియును, 'శ్రీనాథుల దినాలు గడచిపోయెఁ గర్షకుని దైవము ఫలించు కాలమిదియె' యనుచును సమకాలీన కవుల ప్రవృత్తులను తమ పీఠిక (కావ్యావతారిక) లో వాక్రుచ్చిరి. సుకవిస్తుతి చేయు సందర్భము పోతనవలె 'వర్తమాన కవులకు శుభంబు పలుకు'టయేగాక నవీన కవులనియును అభ్యుదయ కవులనియును పేర్కొనినారు. పరస్పర విరుద్ధములైన కవితామర్యాదలకుఁ గట్టుబడిపోయిన కవుల నెల్లరను సరసభావముతో సమ్మానించినారు వరదన్న. సాహితీరంగమున కలత లాదరణీయములు కావనియును, నేటి యస్తవ్యస్తమైన తెలుగు సాహితీప్రపంచమున నెవరెవరు ఎన్నెన్ని కోటలు కట్టుకొన్నను అచ్చమైన కవియైన వరదన్నకు శ్రీశ్రీ, విశ్వనాథలు కవితామూర్తులుగనే భాసించినారు. వరదన్న వ్యంగ్యముగా నేటి సాహితీరంగమున ఉండవలసిన, రావలసిన యౌదార్యమును, సౌమనస్యమును సూచించినారు. ఇంత సమభావమును ప్రదర్శించిన వరదన్న సమకాలీన కవిలోకమున సమాదరణీయులు. ప్రతిభామూర్తికి ప్రాతకొత్తలులేవు. అనుక్షణము పరివర్తనము జెందు బాహిర పరిస్థితులకు కవిత కట్టుబడి యుండదు. కవిది అంతర్దృష్టి. వస్తువేదైననేమి? దానికి సౌందర్యము నాపాదించును; రసమయము చేయును. ఖండకావ్యములేకావు, మహాకావ్యములు సైత మాస్వాదనీయములే. సహృదయత్వ మన్నది ఆశించదగినదే కాని నిర్బంధింపదగినది కాదు. అది సిద్ధము. సాధ్యము కాదు. సమకాలీన సాహితీపరులకు వరదన్న పోతన చరిత్రము వ్యంగ్యముగా నీ సూచన చేసినదని చెప్పుట సాహసము కాదు. శబ్దసౌందర్యమునకును, రసపుష్టికిని ప్రతిభావ్యుత్పత్తులకును నాదర్శప్రాయమైనది పోతన చరిత్రము. సమకాలీన జీవితానుభవమును ప్రస్తుతించుటకే వరదన్న ఈ కావ్యమును వ్రాసినారని నా నమ్మకము. లేకున్నచో ఊహాపోహలలోఁజిక్కుకొన్న పోతన చరిత్ర మెక్కడ? వ్యంగ్య వైభవముతో నేటి సామాజిక చిత్రణ మెక్కడ? కథాఘట్టములను కల్పించు సందర్భములందును వరదన్న తన సమాజమును మరచి యుండలేదు. తన యనుభూతులను కప్పిపుచ్చి యూహాలోకమున సంచరించలేదు.

నాటి పోతనకు నేటి పోతనకు ఒకే పోలిక. ఇరువురును దైవభక్తులు. రాజుల నిరువురును నిరసించినవారు. ఇరువురును నద్వైత భావమునందు ప్రత్యయ మున్నవారు. మహాకవులు. శబ్దరహస్య మెరిగినవారు. ఛందస్సులపై అధికారము నెరపినవారు. కాని ఒకే ఒక భేదము - ఆ పోతనకు వ్యాసుని సమాజము. ఈ పోతనకు తన సమాజము. తన సమాజమునందలి యార్థిక వైషమ్యములను, రాజకీయ వైమనస్యములను చక్కగా నర్థము చేసికొన్న కవి వరదన్న. పోతన చరిత్రము ఒక సమగ్ర సుందరమైన మహాకావ్యము. ఈ కావ్యమును చదివి, విని, పరిశీలించి రసికులు తమ సరసత్వమును ప్రకటించుకొనుట కంటె వరదన్నకు మరొక విధమైన మన్నన యవసరము లేదు. *

* 'అభినవపోతన' (వానమామలై వరదాచార్యులు) షష్టిపూర్తి సన్మాన సంచికలో ప్రచురితం. ముద్రణ ఆగస్టు 1978)

9. మన చదువు సంధ్యలు

ఒక దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సముపార్జించడానికి ఎందుకు ప్రయత్నిస్తుంది? దాస్యం ప్రకృతి విరుద్ధం కనుక పరప్రభుత్వం నిష్ఠురంగా పరిపాలించి అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్నీ పెంచి దేశీయుల ప్రతిభా ప్రాభవాలను రూపుమాపుతుంది. దాస్యంలాంటి పాపం మరొకటి లేదు. అది ఎన్నో పాపాలను చేయిస్తుంది. మనిషిలోని పశుత్వాన్ని ప్రకోపింపజేస్తుంది. మనిషి మనుగడను నిష్ప్రయోజనం చేస్తుంది. కనుకనే బానిసలు తిరుగుబాటు చేసి స్వేచ్ఛను సంపాదించుకుంటారు. ఆయాదేశాల ప్రజల నరనరాల్లో తరతరాలనుంచి ప్రవహిస్తున్న సంస్కారాని కనుగుణంగా స్వాతంత్ర్య సమరాన్ని నిర్వహిస్తారు. స్వాతంత్ర్య ప్రాప్తి అనంతరం తమ సంస్కృతి కనుగుణంగా పునరుద్ధరణకు పూనుకుంటారు.

మన భారతదేశం అనాదిగా అజ్ఞాతంగా ఉండి ఎవరో వలసవచ్చిన వాళ్లు నిర్మించింది కాదు. ఎవరిచేతనో ప్రభావితులై తమ ఆచార వ్యవహారాలను తీర్చిదిద్దుకున్న జనం ఇక్కడిదికాదు. ప్రపంచంలో అనాగరికత నుద్ధరించ వలసిన బాధ్యత తమదేననే దురహంకారంతో తమ బలదర్పాలతో కుయుక్తులతో స్వతంత్ర దేశాల అధికారాలను చేజిక్కించుకొని వలస లేర్పరచుకొని తమ ప్రాభవ వైభవాలకు, తమ దేశాభ్యుదయానికి ఆ వలస దేశాల మానవశక్తిని, ప్రకృతి సంపదను కొల్లగొట్టి సూర్యుడస్తమించని సామ్రాజ్యాలను స్థాపించుకున్నారు. రాజకీయాధికారాన్ని సుస్థిరం చేసుకోవడంతో వాళ్ల ప్రయత్నాలు ఆగలేదు. శాశ్వతంగా బానిసలను చేసుకోవడానికి మనదేశంలో సంప్రదాయసిద్ధంగా వస్తున్న విద్యలపట్ల తూష్ణీంభావాన్నే కాక అసహ్యభావాన్ని కలిగించడానికి సాయశక్తుల ప్రయత్నించారు. వైదుష్యానికి ప్రతీకైన సంస్కృత భాషను తొలగించి ఇంగ్లీషును ప్రవేశపెట్టారు. చదువంటే ఇంగ్లీషేనని కొత్త విలువలను సృష్టించారు. మనుమలు తాతలను ఎక్కిరించేటట్టు చేశారు. సంస్కృతం చదువుకోకుండా వ్యాస వాల్మీకి కాళిదాసాదులను దూషించడం పరిపాటి అయిపోయింది.

ఇంగ్లీషు చదువంది ఏ ఇంగ్లీషు కవిని ఏమీ అనడానికి వీలులేదు. నీకు ఇంగ్లీషు వచ్చా? చాలా చదివి మాట్లాడాలె అనేవారు. మరి సంస్కృతం గ్రంథాలు మూలంచదవందే విమర్శించే అధికారం ఎలా కలుగుతుంది? ఎవరూ పట్టించుకో లేదు. భావదాస్యం విలయతాండవం చేసింది. తమ దేశంకూడ ఒకప్పుడు మహో న్నత నాగరకతకు నిలయమై విశ్వానికి జ్ఞానభిక్ష పెట్ట కలిగిందని, పాశ్చాత్యు లను గుడ్డిగా అనుకరించడం తన్నుమాలిన ధర్మమనీ దేశీయులకు ఉపదేశించ డానికి స్వామిదయానందులు, శ్రీ వివేకానందులు, అనీబిసెంటు, గాంధీజీ మున్నగు మహాత్ములవతరించారు. కట్టుకథలల్లి, దోష దూషితమైన చరిత్రను స్కూళ్ళలో బోధించడవల్ల పాశ్చాత్య నాగరకతావ్యామోహంలో పడి విద్యావంతులై భారతీయులు తమ సంస్కృతిని, దేశభాషలను, ఆచార వ్యవహారాలను దుయ్య బట్టడం సముదాచారంగా కూర్చుకున్నారు. పూర్వం భారతీయులు సాధించిన సిద్ధులను చరిత్ర పరిశోధకులు ప్రాచ్యభాషా పండితులు వెలుపలికి తెచ్చిన తరువాతనే స్వరాజ్యోద్యమం, స్వదేశీ ఉద్యమం బలపడినవి. తామెందుకు స్వేచ్ఛను కోరుతున్నారో భారతీయులు తెలుసుకోగలిగారు. కేవలం ఆర్థిక, రాజకీయ దాస్య విముక్తి ఉద్యమ లక్ష్యంకాదు. తమ ఆలోచనలకు, తమ సంస్కృ తికి అనువైన విధంగా దేశాన్ని తీర్చుదిద్దుకోవాలనే ఆకాంక్ష ప్రగాఢంగా పని చేసింది. దేశభాషలనుద్ధరించవలెననీ, ఇంగ్లీషుకు దీటుగా నిల్పవలెననీ ఆయా భాషల పండితులు విజ్ఞాన సర్వస్వాలను, పత్రికలను ప్రారంభించారు. దేశ భాషలో మాట్లాడటం దేశభాషాభ్యుదయంకోసం కృషిచేయడం నిర్మాణాత్మక కార్యక్రమంగా భావించారు. జాతీయోద్యమానికి ఆలంబనంగా నిలిచింది సంస్కృతి ప్రియత్వం. రామరాజ్యాన్ని ఆదర్శంగా చూపించి గాంధీజీ ఉద్యమ నిర్వహణ విధానాన్ని భారతీయ సంస్కృతి కనుగుణంగా మలచి, పాశ్చాత్యుల జీవిత విధానం తన అనుయాయుల్లో చోటు చేసుకోకుండా చేసి, ప్రజలకు సన్ని హితంగా చేరాడు. స్వాతంత్ర్యోద్యమం పెంపొంది ప్రజ్వరిల్లిన తీరు తెన్నులను చూస్తే భారతీయుల తమ పురాణ సంస్కృతిని విస్మృతికి బలిచేయకుండా ఇటీ వలి ప్రపంచంలో కలిగిన వైజ్ఞానిక పరివర్తనలతో సమన్వయం చేసుకుని పురోగమించాలనే కోరిక ఉందని ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మన దేశ నాయకుల రచనల్లోను, ఉపన్యాసాల్లోనూ, కార్యకలాపాల్లోను ఈవైఖరి దృగ్గోచరమవుతుంది.

స్వాతంత్రం సిద్ధించిన తరువాత మన ప్రభుత్వం గాని, మన ప్రతినిధులు గాని మన ప్రజాహిత సంస్థలు కాని సాంస్కృతిక పునరుజ్జీవనానికి చెప్పుకో దగినంత చేయూత నివ్వలేదనే చెప్పవలసివస్తున్నది.

మన సంస్కృతికి మూల కందమైన సంస్కృత భాషకు ఇతోధిక ప్రాముఖ్యం కాని ప్రాచుర్యంకాని కలుగలేదు. మన ఆలోచనలకు, మన జీవిత విధానానికి, మన దైనందిన కర్మలకు, మన సాంప్రదాయాలకు వ్యాఖ్యానప్రాయము లని చెప్పదగిన పురాణేతిహాసములకు పాఠ్యగ్రంథాల్లో సముచితస్థానం కల్పింప బడలేదు. రామాయణ, మహాభారత, భాగవతాలతో పరిచయంలేని వాడు భార తీయతకు బాసటగా నిలువలేడు. దేశభాషలలోని సాహిత్యామృతాన్ని ఆస్వాదించ లేడు. అవగాహన చేసుకోలేడు. పురాణ సంబంధములైన పద బంధాలతోగాని, విశ్వాసాలతోగాని, ధర్మ రహస్యాలతోగాని తలస్పర్శిగా పరిచయం సంపాదించు కొనలేడు. అధునిక సాహితీ మర్యాదలను అర్థం చేసుకోవాలన్నా ఈ పురాణేతి హాసాల అధ్యయనం అత్యంతావశ్యకం. భారతీయుల ఆలోచనలకు, భావాలకు, పదాలకు, లోకోక్తులకు, కవి సమాయాలకు, సిద్ధాంతాలకూ పురాణేతిహాసాలకూ చాలా సంబంధముంది. కబంధహస్తాలు సముద్రమథనం యజ్ఞోపవీతం హోమం, మిహిరవాజితతి ప్రణవం, బలి, రామబాణం, యముని మహిషపు లోహఘంటికలు, సర్పయాగం, శాపం, వరం, భక్తి-ముక్తి, మంత్రము, ఉపని షత్తు, ఉపదేశము, గురుశిష్యులు లాంటి శబ్దాల నెన్నింటినైనా పేర్కొనవచ్చు. అయితే ఈ శబ్దాలు కవుల ప్రతిభావ్యుత్పత్తులనుబట్టి ప్రకరణాన్నిబట్టి అవా చ్యంగానేకాక లక్ష్య, వ్యంగ్యార్థ ప్రతిపాదకాలై, సమకాలీన జీవితేతివృత్తంతో పెనవేసుకొనిపోయి ఉన్నాయి. ఈ శబ్దాలకర్థం తెలిసి వాడుతున్న కవుల రచనలు సమాజానికి రసాన్ని ప్రసాదిస్తున్నాయంటే, సమాజంపైన కవులపైన పురాణేతిహాసాల ప్రభావం ఎంతగా ఉందో ఊహించుకోవచ్చు. అ పురాణేతిహా సాలు నిన్న గీర్వాణ దేశభాష సాహిత్యాలకు వస్తువును అందించినవి. నేడు పదాలను, అర్థాలను, అలంకారాలను ప్రతీకలను అందిస్తున్నాయి. ఇవి పోతే అసలు భాషకు ఎన్నో భావాలు అందడంకూడా కష్టం అయిపోతుంది.

రామాయణాన్నే తీసుకుందాం. వాల్మీకి అందించిన ఉపమాసామాగ్రి స్రోతస్విని నుంచి ఇంకా భావుకులు రసాన్ని ఏతమెత్తుతూనే ఉన్నారు. రామకథా

స్వాదనాపరులు దేశం నలుమూలలా వ్యాపించి ఉన్నారు. రామాయణంలోని ఆదర్శాలనిప్పటికి ప్రశ్నించేవాళ్ళు లేరు. పైగా ప్రజాస్వామ్యానికి రామరాజ్యానికి శ్రేయోరాజ్యానికీ అర్థం ఒక్కటేననీ అంతా నమ్ముతున్నారు. వివాహబంధం, సౌభ్రాత్రం, ఆర్తరక్షణ, త్యాగం, కర్తవ్యం, నిర్వహణ, పితృభక్తి, గురుభక్తి, పాతివ్రత్యం, చదువు సంధ్యలు, ప్రజాభీష్టానికి లొంగిపోవడం వంటి విలువలు భారతీయుల కుపాదేయాలై ఉన్నంతకాలం రామాయణం సమసిపోదు. అది కావ్యవస్తువుగా, కళాసామగ్రిగా రానున్న తరాలకు మార్గదర్శకం అవుతుంది. రాష్ట్రకవి శ్రీ మైథిలీశరణ్ గుప్త "దేవా! నీ చరితమే సహజ కావ్యం. నీ చరిత్రను గానం చేసినవాడు కవి కావడం సంభావ్యం" అన్నాడు.

ఇక భారతం, అందులోని భగవద్గీత, రాజనీతి, ధర్మ రహస్యాలు, ఉపాఖ్యానాలు భారతీయ సంస్కృతికి మణిదర్పణాలవలె భాసిస్తున్నవి. భారతీయుల విజ్ఞాన సర్వస్వమది. "యన్న భారతే తన్న భారతే" - ఏది భారతంలో లేదో అది భారతదేశంలోనే లేదు అనే ఆభాణకం ప్రాచుర్యాన్ని అందుకున్నది. తిక్కన సోమయాజి -

'వేదములకు నఖిలస్మృతి
వాదములకు బహుపురాణవర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థకముల మోక్షస్థితికిన్'

అని తన భారతావతారికలో పేర్కొన్నాడు. నన్నయభట్టు తన భారతావతారికలో మహాభారత ప్రశస్తిని-

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని, యైతిహాసికు లితిహాసమనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని" ఉగ్గడించినారు.

ఇక భాగవతం అవంధ్య జీవనులైన భాగవతుల మహిమాభివర్ణనంతోను, భక్తి తత్త్వంతోను, పారమార్థిక జ్ఞాన సర్వస్వంతోను ప్రకాశిస్తున్న మోక్షసాధన గ్రంథం.

ఈనాడు గ్రంథాలనేక రూపాల్లో, అనేక సాహిత్య ప్రక్రియలుగా భారతీయ భాషల్లో అవతరించినవి. సంస్కృతంతో పరిచయం లేనివాడు కూడా దేశభాషలో వాటి అనుకృతులను, అనుసరణలను అధ్యయనంచేసి అవగాహనం చేసుకోవచ్చు. ఈ గ్రంథాలలో అంతో ఇంతో పరిచయం స్వతస్సిద్ధంగా నిన్నటి తరానికి హరికథలవల్ల, పురాణకాలక్షేపాలవల్ల, పెద్దలవల్ల అలవడేవి. కనుక నిన్నటి తరంవాడు భారతీయ సమస్యలను ఎంత సంయమనంతో, ఎంత ఓరిమితో, ఎంత సానుభూతితో, ఎంత ఉత్తమ సంస్కారంతో అర్థంచేసుకుని పరిష్కరించడానికి ఉద్యుక్తుడయ్యేవాడో ఇప్పటి తరంవాడు చేసుకోలేక పోతున్నాడు. తత్ఫలితంగా సామాజిక జీవనంలో తల్లిదండ్రులపట్ల తమ బాధ్యతలను, గురువులపట్ల భక్తివిశ్వాసాలను, సంఘంపట్ల తమ కృతజ్ఞతాబుద్ధిని ప్రదర్శించలేకపోతున్నారు. కళాశాలల్లోని పాఠ్యప్రణాళికలు ఐహికదృష్టితో రూపింపబడటంచేత ఆముష్మికజ్ఞానం అలవడక విద్యార్థులు తమ చదువును సార్థకపరచుకోలేకపోతున్నారు. కనుకనే సంఘం చదువుకున్నవాళ్ళు తనకేమీ చేయలేని కుక్షింభరుల్లాగా తయారౌతున్నారని మొరపెట్టుకొంటున్నది.

దేశంపట్ల సంఘంపట్ల తమకు బాధ్యత ఉందనీ, ఆ బాధ్యతను తీర్చే సంస్కారాన్ని, బుద్ధిబలాన్ని విద్యాలయాలు తమకు ప్రసాదిస్తాయనే విశ్వాసం విద్యార్థులకేర్పడే పద్ధతిలో విద్యా విధానం రూపొందింపబడితే ప్రస్తుతం పెచ్చు పెరిగిపోతున్న క్రమశిక్షణారాహిత్యం అంతమవుతుంది. ప్రాచీన విద్యా సంస్థలు ఆశ్రమాలు విద్యను అర్థించి అంటే యాచించి వచ్చినవానికే ప్రవేశం కలిగిస్తుండేవి. ఇష్టమున్నా లేకపోయినా చదువుచెప్పి తీరాలనే నియమం అప్పటి విద్యాలయాలుగాని, ప్రభుత్వం కాని పెట్టుకొన్నట్లు కనిపించదు. అక్షరాస్యత వేరు. ఉన్నత విద్యవేరు. ప్రతివాడు అక్షరాస్యుడు కానిదే ప్రజాస్వామ్యం సఫలంకాదు. కాని ఉన్నత విద్య నిర్బంధంగా గరపడంలో అర్థంలేదు. సామాజిక బాధ్యతను దృష్టిలో ఉంచుకొని, దేశహితాన్ని దృష్టిలో ఉంచుకొని అంతర్లీనమైన ప్రతిభను ఉద్దీప్తం చేయాలనే ఆశయంతో, వ్యక్తిత్వంలో సార్థక్యాన్ని సంరక్షించే ఉద్దేశంతో ఉన్నత విద్యా ప్రణాళికను సిద్ధం చేసినప్పుడే చదువుకున్నవాడు సంఘానికి పనికొస్తాడు. సాంకేతిక శాస్త్రం, విజ్ఞానశాస్త్రం విక్రమావతారం దాల్చి పశ్చిమ దేశ దేశాల్లో ప్రజల మనస్సుల్లో శాంతి లేకుండా చేస్తున్నవి. పారిశ్రామికంగా

ఉత్పత్తి ఎక్కువచేసి కొనుగోలుదారుల సృష్టించుకునేందుకు, తమను రక్షించుకునేందుకు మారణాయుధాలను సృష్టించుకుని, అనుక్షణం యుద్ధభయంతో, పరస్పరం అవిశ్వాసంతో కాలం గడుపుతున్నారు. కనుక విద్యావిధానం భౌతిక దృష్టికి గురి కాకూడదు. పారమార్థిక చింతన దైనందిన జీవితంలో సుఖ శాంతులను వర్షించగలుగుతుంది.

రామాయణ, మహాభారత, భాగవతాలలోని విషయాలను, దశలవారీగా, ప్రాథమిక దశనుండి ఉన్నత విద్యాదశ వరకు విద్యార్థులకు అందజేయాలె. బర్బరత్వం, రాక్షసత్వం, దారిద్ర్యం, అజ్ఞానం విలయతాండవం చేస్తున్నాయని, అన్ని రంగాలలో విలువలు అర్థంలేకుండా, ప్రయోజనం లేకుండ తారుమారౌతున్నాయని నైరాశ్యాన్ని ప్రకటించడం ఉత్తమ సంస్కారి లక్షణం కాదు. స్వాతంత్ర్యోద్యమం తారాస్థాయి నందుకున్న దినాలలో మన దేశనాయకులు పశ్చిమ దేశాల ఆర్థిక. రాజకీయ, సాంఘిక విధానాన్ని కాక ఒక విలక్షణమైన సమాజాన్ని, ప్రపంచానికి ఆదర్శప్రాయమైన సమాజాన్ని నిర్మిస్తామని ఉద్ఘోషించారు. టాగూరు, గాంధీజీ. నెహ్రూవంటి మహా దేశభక్తులు దార్శనికులు, తామూహిస్తున్న సమాజానికి రూపురేఖలు చిత్రించి, తమ స్వప్నాలకు ఆకృతులను ప్రత్యక్షం చేశారు. వా రూహించిన సమాజాన్ని దర్శించడం కేవలం పశ్చిమ పద్ధతిలో శిక్షణ పొందిన భారతీయులకు సాధ్యం కాదు.

కనుక మన చదువు సంధ్యల కొక ప్రయోజనాన్ని సృష్టించాలె. భారతీయ దృక్పథంతో అవి రూపొందింపబడాలె అప్పుడే స్వాతంత్ర్యానికి సరియైన అర్థం సిద్ధిస్తుంది. గాంధీజీ India of my dreams; టాగూరు గారి Heaven of freedom లోని భావాలకు వ్యాఖ్యానమే స్వతంత్ర భారత ధ్యేయం.*

---

* 'మా స్వామి' సంచికలో ప్రచురితం. ముద్రణ 1978.

10. దేవాలయముల ప్రాశస్త్యము

దేవాలయములు పురాసంస్కృతి నిలయములు. పురాణేతిహాసముల చరిత్ర వ్యాఖ్యానములు, శిల్పకళామతల్లి వ్రాసిన పందిళ్ళు. ప్రాచీనులు భగవద్దత్తములైన కళాప్రతిభలను దేవాలయములందు ప్రదర్శించి, తరించి, శాశ్వత కీర్తిని సముపార్జించుకొనిరి. నాటి జనుల దైనందిన జీవితసమస్యలు దేవాలయములతో పెనవేసికొనిపోయినవి. గుడియే బడి, గుడియే గడి. రాజులకు తమ కోటలకంటె దేవాలయములే భద్రమైనచోట్లు. ప్రాయికముగా ప్రజలు నిరక్షరాస్యులుగ నుండినను వారికి జీవితసాఫల్యమునకు కావలసిన పురుషార్థముల గూర్చిన జ్ఞానమును ఆ దేవాలయములే ప్రసాదించుచుండినవి.

నృత్యము, సంగీతము, శిల్పము, కవిత్వము మున్నగు కళలకు దేవాలయములు పట్టుగొమ్మలై తేజరిల్లినవి. నాటి హిందువుల సర్వస్వము దేవాలయములు. వానిని సంరక్షించుకొనుటయే తమను, తమ సంస్కృతిని, తమ వ్యక్తిత్వమును సంరక్షించుకొనుటని వారు విశ్వసించియుండిరి. గుళ్ళలోని దేవుళ్ళు, దేవేరుల నగ, నట్ర కేవలమలంకార ప్రాయములని వారు తలంచియుండలేదు తమ ప్రాణముకంటె అధికమైన మతముపై కత్తిగట్టి కయ్యానికి కాలుదువ్వి, దక్షిణాపథమును రక్తప్లావితము చేయుటకై దండెత్తివచ్చిన ఇస్లాము శక్తికి ఎదుర్కొడ్డి నిలిచి, విశాలమైన హైందవ సామ్రాజ్యమును స్థాపించిన విజయనగరాధీశులకు తొలుదొల్త అంగబలమును అర్థబలమును చేకూర్చినది హంపీ విరూపాక్షస్వామి దేవాలయ భాండాగారమే.

లోకహితమునకై సిరిగలవారు ఎన్నియో ధర్మకార్యములు చేయవలయును. అది నాటి ధనాఢ్యుల పరాకాష్ఠ. చెరువు త్రవ్వించుట, నిధిని నిక్షేపించుట, అగ్రహారముల నిచ్చుట, దేవాలయ ప్రతిష్ఠాపనము, వనమును వేయించుట, కావ్యరచనము లేక కావ్య స్వీకారము, పుత్ర సంతానము - ఈ యేడింటిని సప్త సంతానములందురు. ఒక మహత్తరమైన ఆకాంక్ష ఈ సంతానములను

గుర్తించుటలో నిమిడియున్నది. మహారాజులు దండనాథులు శత్రుంజయార్థమును, శత్రుదమనము తరువాతను, సూర్యచంద్రగ్రహణ కాలములందును మరికొన్ని పవిత్ర సందర్భములందును దేవాలయములను కట్టించి, ధూపదీప నైవేద్యములకు అచంద్రతారార్కము లోటు లేకుండ ఏర్పాట్లు చేసి శాసనములను వ్రాయించి తమ భక్తివిశ్వాసములను ప్రకటించుకొనిరి. ఆ శాసనములలో దేవాలయారాధనమునకు భంగము కలిగించువారు కాశిలో గోహత్య చేసినవారగుదురనియు, ధర్మచ్యుతులగుదురనియు వ్రాయించిరి. దేవస్థానములు నాటి ప్రజలకు ప్రతిష్ఠాహేతువులు, ఆస్తికత్వమునకెత్తిన వైజయంతికలు.

పవిత్రములైన నదీతీరములయందును మహోన్నతములైన గిరిశిఖరములయందును సాగరతీరములయందును ఎక్కువగా ఈ దేవాలయములు వెలసినవి. మానవుని సౌందర్యపిపాస యట్టిది. తన మనస్సు ఎచ్చట ఊహాలోకమునకు ఉవ్వెత్తుగా ఎగిరిపోవునో ఆ చోటు నతడు ప్రేమించెను. అచట గుడిని నెలకొల్పి తన దేవుని నిలిపి ఆ దేవునిలో తన్ను చూచుకొనెను. వేదర్షులకు ప్రకృతియే దేవాలయముగా భాసించినది. ఉషోరేఖలు, తటిల్లతలు, జలదమాలికలు, మహోన్నతాద్రికూటములు, మహావేగముతో పరువులెత్తెడు నదీనద సముదాయము, మహా జలపాతాల విద్యుత్సంగీతము వారి మనః ఫలకములపై చెరిగిపోని చిన్నెలై రూపొందినవి. ఈ ప్రకృతి లీలలలో వారు పరమాత్మను దర్శించి మంత్రములతో ప్రార్థించిరి. పిదప ఆ ప్రకృతి శక్తులకు రూపకల్పన చేసి ఆరాధించిరి. వారి దృష్టిలో జీవుడే ఒక దేవాలయముగ భాసించెను. పరహితాచరణము చేత, తపస్సుచేత, త్యాగముచేత, జ్ఞానముచేత ప్రకాశించు దేహము దేవతలకు స్థావరమ్ము కాదా! బాహ్యాంభ్యంతర శుచిచేత మానవదేహము దర్శనీయమై, పుణ్యప్రదమై, కల్యాణదాయకమై, కల్పవృక్షమై ప్రకాశించును. కనుక దేహమును స్వచ్ఛతమముగా ఉంచుకొనగలిగినప్పుడే అతనిలోని శక్తులు సర్వవిధముల వికాసమును పొంది భాస్వంతములగును. దేహమెట్లో సంఘముకూడనట్లే! సాముహికమైన ప్రార్థనలకు ఆరాధనలకు యజ్ఞయాగాది మహాక్రతువులకు దేవాలయము కేంద్రమై విలసిల్లినది. దేవాలయము సామాజిక సమైక్యమునకు కేంద్రము. దేవాలయముపట్ల ప్రజాబాహుళ్యమునకు అనాదినుండి ప్రేమ, భక్తి గౌరవములు సహజముగా నేర్పడియుండుటచేత అవి అందరికిని ఉప

యుక్తమైన సంస్థగా రూపొందినది. సమాజమునకు కావలసిన వస్తు సముదాయము సమకూర్చుటకు దేవస్థానములు సాధనములయ్యెను.

ప్రాచీనులు దేవాలయ నిర్వహణమునకు కట్టుబాట్లను కొన్ని ఏర్పరచి లోకహిత దృక్పథము ననుసరించి ఆ దేవాలయము నొక సంస్థగా అవతరింప జేసిరి. ఈ దేవాలయ సంస్థాపనము, నిర్వహణమునకు ప్రత్యేకముగా శాస్త్ర మేర్పడెను. అదే ఆగమశాస్త్రము. జగత్కల్యాణ సంధాయకములగు దేవాలయ ములకు, దేవతా విగ్రహ నిర్మాణమునకు, వాని స్థాపనలకు దేవతాసాన్నిధ్యము రూపొంది పెంపొందుటకై చేయదగు పూజా ప్రకారములను తెలుపు శాస్త్రమే ఆగమశాస్త్రము. మరి ఈ శాస్త్రమునకు సంబంధించినట్టి కళలుగాని విద్యలుగాని లేవనుట పొసగని మాట. ఆగమశాస్త్ర విషయములు సర్వజనానుభవమునకు సంబంధించినవి. కనుక అవి సాక్షాత్కార సంపాదనమునకై మార్గదర్శకములై వర్ధిల్లినవి. ఈ యాగమశాస్త్రములు అనాది కాలమునుండియే ప్రకృతి శక్తులలో అంతర్నిహితములై, నిక్షిప్తములై యున్న దేవతాశక్తుల నాకర్షించి, ఆహ్వానించి పూర్ణకుంభము లందును, ద్వారబంధములందును, యంత్రముల యందును, దేవతా విగ్రహములయందును నిక్షేపించి, నిత్యారాధనతో షోడశోపచారములతో, జప తపాదులతో, ఆ శక్తుల నుద్దీప్తము చేసి, సర్వజీవుల అభీష్టములను తీర్చు నద్భుత శక్తిని ప్రదర్శించుచున్నవి. దేవాలయములా యద్భుతశక్తికి మనికిపట్టులు.

పాడిపంటలకును, దేవాలయ నిర్వహణమునకును విడదీయరాని సంబంధ మేర్పడి జన్మల కౌటుంబిక, ఆర్థిక జీవనము దేవాలయాశ్రితమై జనులలో ధర్మ భీతి, మతానురక్తి పెంపొంది ధర్మ పరిపాలనకు అనువైన వాతావరణము కల్పింపబడెను తోటలు, గోశాలలు మున్నగునవి నేరుగా దేవస్థానములకే అంకితమై యుండెడివి.

తిరునాళ్ళ సందర్భమున, ఉత్సవముల సందర్భమున వాణిజ్య వ్యాపార ముల కవకాశములు కలుగుచుండును. వివిధ గ్రామములకు రహదారులేర్పడును. ఆచార వ్యవహారములలోని వైవిధ్యములను, అనేక భాషావిన్యాసములను, విచిత్ర వస్తు సందర్శన క్రయవిక్రయావకాశములను ఈ తిరునాళ్లు ప్రజలకందించినవి.

యోగులు, సన్యాసులు ఎందరో ప్రజలలో ధర్మాభిరతిని ప్రచారము చేయుటకు అవకాశము కలుగుచుండెడిది.

దేవాలయములు విద్వాంసులకు నిలువనీడలై వర్ధిల్లినవి. విద్యార్థులు, గురువులు, దేవాలయములందు తమ విద్యా వ్యాసంగములను సాగించిరి. దక్షారామము, సింహాచలము, శ్రీకూర్మము, శ్రీశైలము, శ్రీకాకుళము, అహోబిలము, తిరుపతి, శృంగేరి, నాగార్జునకొండ, అమరావతి, అజంతా, కాశీ, నవద్వీపము, ద్వారక, మధుర మున్నగు పుణ్యక్షేత్రములలో విద్యాసంస్థలు వెలిసి, సంప్రదాయ సిద్ధమైన ఆర్షవిద్యలకాలవాలములై పరిఢవిల్లినవి. బౌద్ధుల, జైనుల ఆరామములు, ఆశ్రమములు, విహారములు, చైత్యములు, దేవాయతనములు హిందువుల దేవాలయములవలెనే జాతీయ జీవనమునకు భక్తిని, ముక్తిని, రక్తిని ప్రసాదించి, ఆత్మశక్తిని ఉద్బుద్ధముచేసినవి.

దేవాలయ శిఖరములు, గాలిగోపురములు ఒకదానికంటె నొకటి ఉన్నతములై ఆకాశమును చుంబించు చున్నట్లగుపడుచుండును. ఊర్ధ్వలోకముల వైపు మానవుడు ముక్తినాశించి ప్రయత్నశీలుడగుచుండునను పరమసత్యము నీ గాలిగోపురములు ఎలుగెత్తి చాటుచున్నవి. శ్రీరంగ దేవాలయపు గాలిగోపురము నధిరోహించి శ్రీమద్రామానుజాచార్యులు అష్టాక్షరీ మంత్రమును ఎలుగెత్తి ఉచ్చరించి మానవజాతిని పూతమొనర్చియుండిరి. శ్రీశైల శిఖర దర్శన మాత్రముననే జన్మరాహిత్యము లభించునని హిందువుల విశ్వాసము కదా! ఈ శిఖరముపై కలశములు కళ్యాణప్రదములై విలసిల్లు చుండును. శిఖర వేదికలపై పురాణగాథలు, దేవతా ప్రతిమల దర్శనమిచ్చుచుండును, దేవాలయములకు సంబంధించిన క్షేత్రమాహాత్మ్యములు నవరసభరితములై, భక్తిభావబంధురములై, భక్తుల హృదయములను పునీతమొనర్చి మోక్షప్రాప్తికి నర్హుల చేయుచుండును. కాళహస్తి కన్నడు, భద్రాద్రి గోపన్న, తిరుమల అన్నమాచార్యులు, మొవ్వ క్షేత్రయ్య మున్నగువారు తమ భక్తిభావములను ఆయా దేవాలయ కుడ్యములపై ముద్రించినారు. చెవులున్నవారు, కనులున్నవారు, హృదయమున్నవారు నేటికిని ఆ మహాభక్తుల అమృతవాణిని స్ఫటికాచ్ఛమైన జీవితమును దివ్యానుభూతిని కనగలరు, వినగలరు, అనుభవించగలరు. కనుకనే ఈ దేవాలయములు

నేటికిని సంస్కృత హృదయములను ఆకర్షించుచునే యున్నవి. దివ్యక్షేత్ర సందర్శనము మూఢవిశ్వాసమని నిరాదరించువాడు తన సంస్కృతిని, తన సంప్రదాయమును, తన వ్యక్తిత్వమును, తన సామాజిక దృక్కోణమును, తన పరహిత చింతను తృణీకరించువాడని వేరుగ చెప్పవలసిన అగత్యము లేదుకదా?

గృహస్థులేమి, బ్రహ్మచారులేమి, సన్యాసులేమి దివ్యక్షేత్ర సందర్శనము, పవిత్ర తీర్థసేవనమును ఆవశ్యాచరణముగ బెట్టుకొని ఈ నెపమున తమ దేశమునెల్ల కన్నులార చూచి జ్ఞానసముపార్జనము చేసికొనిరి. జానపదగాథలలో, ప్రాచీన కథా సాహిత్యములలో తీర్థయాత్ర ప్రసక్తి ఎంతో ప్రాముఖ్యమును వహించి యున్నది. అవతార పురుషులైన రామకృష్ణాదులుకూడ తీర్థసేవనము గావించి ఆయా తీర్థక్షేత్రముల మాహాత్మ్యముల నినుమడింపజేసిరి.

దివ్యతీర్థ నామోచ్చారణము చేతనే సర్వపాపములు నశించును. తీర్థయాత్రలెట్లు చేయవలయునో, యాత్రాస్థలములందు పాటింపవలసిన నియమములెవ్వియో పురాణములం దుద్ఘోషింప బడియున్నవి. మున్యాశ్రమములలో భవ్యపురుషుల దర్శనము చేయవలెను. కేవలము భౌగోళిక సౌందర్యము నాస్వాదింపు తలపులో యాత్రలు చేయుటవలన ఆత్మోన్నత్యము లభించదు. చతుర్వర్ణముల వారు నాల్గు ఆశ్రమములవారు అందరును తీర్థయాత్ర చేయదగిన వారే.

భారతదేశము పుణ్యభూమి, కర్మభూమి. స్వర్గమునందు ఒక కల్పము సుఖముగా నుండుటకంటె భారతదేశమున జన్మించి అల్పకాలముండినను చాలునని భాగవతము నందున్నది. ఆ సేతుశీతనగము సహస్ర సంఖ్యలలోనున్న దేవాలయములను పుణ్యనదులను సేవించి జాతికి జీవగఱ్ఱలైనాటి పౌరులు వెలిసిరి.

నిన్న మొన్నటివరకు ప్రజలకు క్రమశిక్షణము, ధర్మపరాయణత్వమును ప్రసాదించిన దేవాలయములే కదా! ప్రాచీనుల దృష్టిలో జ్ఞానము అనగా దేవుని స్వరూపమును తెలిసికొనుట మరి కళయనగా ఆ దేవుని ఆరాధించు ప్రయత్న విశేషము. వారును ఊహల్లేలిరి. ఊహాతీతములైన శిల్పమునకు రూపకల్పన చేసిరి. సౌఖ్యములనుభవించిరి. జీవిత పరమార్థమును కోల్పోవక బ్రతుకుబాటలను చక్కదిద్దుకొనిరి. ఇట్టి మహోన్నతాదర్శములు కలిగియున్న నాటి ప్రజల

జీవిత దృక్పథమునకు, లక్ష్యమునకు, ఆచరణమునకు ఈ దేవాలయముల ప్రతిబింబములనుటలో అతిశయోక్తియుండునా?

జాతీయ పునరుజ్జీవనమును గూర్చి ప్రసంగములు సల్పువారు దేవాలయ పునరుద్ధరణమునకు పూనుకొని జన సామాన్యమునందు ఆస్తికత్వమును పెంపొందింపకపోయినచో భారతీయులు నేటివరకు నిలుపుకొనుచు వచ్చుచున్న పార్థక్యము, వైశిష్ట్యము నశించిపోగలదని చెప్పుట సాహసోక్తి కానేకాదు. మనకిప్పుడేమి మిగిలినది? అన్ని రంగములలో పాశ్చాత్యులను గ్రుడ్డిగా అనుకరించుటలోనే మనకు ముక్తి యున్నదని ఇప్పటి విద్యావంతులతో పలువురను కొనుటయేకాదు ప్రచారముకూడ చేయుచున్నారు. దీర్ఘకాల దాస్యమువలన మనకీ గతి సంప్రాప్తమైనదని పదిలముగ నాలోచించినవారికి అవగతము కాకపోదు.

మనకంటే మధురముగ, సుందరముగ, ప్రజాహితపరముగ, స్వేచ్ఛామయముగా నిత్యజీవితము గడుపుటకు ప్రాచీనులకు మార్గదర్శకములైన దేవాలయ సంస్థల నిర్వహణా విధానములను పరిశీలించి నేటి పరిస్థితుల కనుగుణముగా మార్పులు చేర్పులు చేసి జాతిని జాగరితము చేయుటకు దక్షులైనవారు ప్రయత్నింతురని ఆశాభావమున వెల్లడించవచ్చును గదా!*

---

* దీని ప్రచురణ వివరాలు లభించలేదు.

11. కాళోజీ - జీవనగీత

కులమతాల విషవలయాలకు అతీతంగా ఆలోచించడం, నిర్మొహమాటంగా తాను నమ్మిన సత్యాన్ని సాహాటంగా ప్రకటించడం కాళోజీ వ్యక్తిత్వంలోని విశిష్టగుణాలు. దైనందిన జీవిత సమస్యలను ఎంత సూటిదనంతో అర్థం చేసుకున్నాడో అంత సూటిదనంతో చెప్పే భాషనుగూడా సొంతం చేసుకున్నాడు కాళోజీ. ఆ భాష ప్రజలది. పండితులదికాదు. ఆ భాషలో అతడు నిర్భయంగా ప్రకటించిన భావాలు సామాన్యుని వేదలు. కరుడుగట్టి హేతువును గోల్పోయిన సంప్రదాయాలకు ఎదురుతిరిగిన విశ్వకవి ఖలీల్ జిబ్రాన్. భావలోకంలో విహరించి కాళోజీ తనను ఆ లోకవాసిగా గుర్తించుకున్నాడు. తన భావాల కేమిగాని ఖలీల్ భావాలకు తెలుగుదేశంలో ప్రాచుర్యం కలిగించాలనే మహత్వాకాంక్షతో అనుసృతి ప్రారంభించాడు. మానవతావాదానికి ప్రతీక జిబ్రాన్ కవిత. సత్ప్రవర్తనకును, విశుద్ధమైన ఆలోచలకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు జిబ్రాన్ కవితా కృతిని కల్పించాడు. అతనిది లెబ్నాన్ దేశం. అతని ఆర్జవాన్ని, స్వేచ్ఛా ప్రియత్వాన్ని ఆదేశంవాళ్ళు సహించలేకపోయారు. జిబ్రాన్ దేశంవిడిచి పోయాడు. జీవితశేషం అమెరికాలో గడిపాడు. కవితలు, కథలు, వ్యాసాలు ఎన్నో వ్రాశాడు. తమ మతాన్ని గుడ్డిగా నమ్మే అనుయాయుల దుష్ప్రవర్తనవల్ల జిబ్రాన్ హృదయం తల్లడిల్లిపోయింది. ఆతని అనుభూతులు, భావాలు, మహాప్రవక్తల సందేశాలను పోలివుంటాయి. మానవ జీవితానికి సంబంధించిన అన్ని సమస్యలను ఆర్ద్ర హృదయంతో పరిశీలించిన మేధావి ఖలీల్. వివిధ దేశాల్లో, వివిధ దశల్లో, వివిధరూపాల్లో ఉవ్వెత్తుగా ఎగసిన విప్లవాలను - వాటిని రేపిన పరిస్థితులను అవగాహన చేసుకున్న జిబ్రాన్ శాశ్వత శాంతి బాహిరమైన మార్పులవల్ల, ప్రభుత్వాల కట్టుబాట్లవల్ల, శాసనాలవల్ల ఏర్పడదని నమ్మినవాడు. హృదయ పరివర్తనంపట్ల నమ్మకం ఉన్నవాడు. మారే మతాల కంటే మారని నైతికపు విలువలు మనిషికి సౌఖ్యాన్ని ప్రసాదిస్తాయనే నమ్మకంతో రచనలు సాగించినవాడు.

ప్రజల గొడవను తన గొడవగా పాడుకున్న కాళోజీ ఖలీల్ జిబ్రాన్ భావాలకు సహజంగానే పరవశుడై పోయాడు శ్రీ ఏల్చూరు సుబ్రహ్మణ్యంగారు కాళోజీ "చెలిమి" గేయం విని, "మీరు ఖలీల్ జిబ్రాన్ రచనలు బాగా చదివినట్టున్నార్లు" అన్నారట. అప్పటికి జిబ్రాన్ సంగతి కాళోజీకి తెలియదు. జిబ్రాన్ కవితలో ఉన్న వేదన, సూటిదనం కాళోజి కవిత్వంలో కనిపించింది సుబ్రహ్మణ్యం గారికి. కాళోజీకి ఆయన జిబ్రాన్ రచనలతో పరిచయం కలిగించారు; ది ప్రాఫెట్ అనే జిబ్రాన్ గ్రంథాన్ని కాళోజి "జీవనగీత"గా తెలుగు చేశారు. దాదాపు పదిహేనేళ్ళు జీవనగీత అజ్ఞాతంగానే ఉండిపోయింది. "యువభారతి" వారు "జీవనగీత" రెండుమార్లు ప్రచురించి, పదివేల ప్రతులను తెలుగు పాఠక లోకానికి అందజేశారు.

కాళోజి తన జీవనగీతను ప్రచురించడానికి పూర్వం ఎందరో విశ్వవిద్యాలయాధ్యాపకులకు చూపించారు. భాషా దోషాలు అందులో లేవనీ, నుడికారం, ఇంపు సొంపులు అందులో దండిగా ఉన్నాయని తప్పకుండా ప్రచురించాలనీ పలువురు ప్రోత్సహించారు.

ఖలీల్ జిబ్రాన్ భావాలు చాలా తీవ్రమైనవి. లోతైనవి. వాటిని పూర్తిగా జీర్ణం చేసుకుని సొంత భాషలో చెప్పడం ఒక పద్ధతి. అయితే కాళోజి అనువాదం సమంజసంగా లేదని విమర్శలు వచ్చినవి. అయినా పదివేల ప్రతులు చెల్లిపోయాయి. ఇంకా "జీవనగీత" ప్రతులకోసం "యువభారతిని" అడుగుతున్నారట.

తన అనువాదం బాగాలేకపోయినా, "మరెవరైనా అంతకంటే మంచి అనువాదం వెలువరిస్తే సంతోషిస్తాన"ని కాళోజి అన్నాడు. కాళోజికి కావలసింది విశ్వాత్మమైన జిబ్రాన్ భావాల ప్రసరణం. తనకు తోచిన రీతిలో వాటిని ఆయన ప్రచురించినా అశేష ప్రజలు వాటిని ఆదరించారు.

"గుడి పునాది రాయికంటె, గోపురానవున్న రాయి
గొప్పదేమికాదు, గుడి రాయే ఏదైనను."

"మీరు మీ మృదంగాల పలుకకుండ చేయగలరు
మీ వీణల తీగలన్ని త్రెంచి పారవేయగలరు
కాని ఆ రసమున విహరించుచు
తియ్యని పలుకులు పలికెడి
చిలుకలను ఎవ్వడ్డాపగలడు"

"ఆలోచన అంతరిక్ష విహంగము
మాట పంజరాన అది రెక్కల తప్పక విప్పును."

ఇవి చాలా గంభీరమైన భావాలు. కొంచెం ఆలోచిస్తేనే గాని అంతు తెలియదు. ఈ భావాలలోని శబలత, ఆంతర్యం ఎందరో పాఠకుల నాకర్షించింది. చదువుకోని, తమను ఆలోచనాధనులను చేసిన జిబ్రాన్‌ను, కాళోజీని అభినందించుకున్నారు. యువభారతి ప్రచురించిన తర్వాత వ్యాప్తిలోనికి వచ్చిన జీవనగీత ఉత్తమ అనువాదమని ఆంధ్రప్రదేశ్ కాళోజీకి బహుమతి ఇచ్చి సత్కరించింది.

తెలుగు పాఠకలోకానికి జిబ్రాన్‌ను పరిచయం చేసిన కాళోజీ మానవత్వం మీద, కవితా ప్రతిభమీద తనకున్న నమ్మకాన్ని ప్రకటించాడు. జిబ్రాన్ సాహిత్యం అంతా తెలుగులోకివస్తే కవిత్వాన్ని గురించి తెలుగుదేశంలో అల్లుకుపోయిన దురూహలెన్నో చెదిరిపోతాయి. జిబ్రాన్ మాతృభాష అరబ్బీ. ఆయన రచనలను ఆయనే కొన్ని ఇంగ్లీషులోనికి అనువదించుకున్నాడు. కొన్ని స్వయంగా ఇంగ్లీషులో వ్రాశాడు. జీవనగీతను ప్రచురించి కాళోజీ ఒక వినూత్నమైన, విలక్షణమైన ప్రతిభాసౌధద్వారం తెరిచాడు. అది మన తెలుగువాళ్ళకు కొత్తది. అయినా అతనిలో మరో వేమన్నను తెలుగు పాఠకులు చూడగలుగుతారు.

సభ్యతాప్రపంచం కనులు నులుముకుని తన్ను తాను చూచుకునే ప్రేరణను జిబ్రాన్ కలిగించాడు. జిబ్రాన్ కవిత కారుణ్యోపనిషత్తు. అంధీభూతమైన సంప్రదాయాలను, ఇనుప చట్టాల ప్రభుత్వాలను, పాశవికోన్మాదాన్ని నిర్హేతుకమైన విధ్యద్విధానాలను జిబ్రాన్ నిరసించాడు. ఆ నిరసనాన్ని స్వచ్ఛంగా అందంగా చెప్పాడు. కవియై చెప్పాడు.

కేవలం తన కిష్టంలేని వ్యవహారాలను ప్రకటించడం కవిత్వంకాదు. తన అక్కసు వెళ్ళబోసుకోవడం కవిత్వంకాదు. తిట్టడం, దుష్ప్రచారం చెయ్యడం, తనకే స్పష్టంగా తెలియని సిద్ధాంతాలను కవిత్వంగా చెలామణి చెయ్యడం కవిత్వం కాదు. ఆనందంలోనో, వేదనలోనో స్పందించిన హృదయం శబ్దాకృతిని పొందేటప్పుడు ఎంతో సంయమనాన్ని, ఎంతో గాంభీర్యాన్ని సంతరించుకుంటుంది. ఇది మహాకవులకు సహజమైనది. ఈ సహజత్వమే సార్వకాలీన సార్వజనీన సత్యాలను బాహిరిల్లజేయడానికి హేతుభూతమౌతుంది. 'ఎవరికి చేపని యెండిన చన్నులు, రసవిహీనములు రాజకీయములు' అన గలిగిన కాళోజీకి "జిబ్రాన్" సన్నిహితుడైనాడు. అల్బర్ట్ ష్విట్జర్-

నాగరికత పాపాలకు ప్రాయశ్చిత్తం చేసికొన
ఆది మానవులలో ఒకడై, బ్రతుకును
పూజిస్తూ బ్రతికి
మానవసేవయే మాధవసేవగా యెంచి
ప్రపంచానికి బ్రతుకుబాట చూపిస్తూ

అమరత్వం సాధించిన మానవుడు"గా కాళోజీకి కనిపించాడు. కనుకనే కాళోజీకి జిబ్రాన్ భావాలు నచ్చినవి. 'నా గొడవ' ప్రథమ సంపుటంలో ఉన్న గీతికలు కాళోజీ తాత్త్విక జిజ్ఞాసను పరిచయం చేస్తాయి. అతని తత్త్వ జిజ్ఞాసా ఫలమే జిబ్రాన్ కవితాభిమానం. జిబ్రాన్ కవితా విహాయసాల అందాలను చూడమని కాళోజీ కిటికీ తెరిచాడు. ఆ కిటికీ 'జీవనగీత'. జీవనగీత (The Prophet) కవిని—

అంత గొప్ప కవిని పరిచయం చేసి కాళోజీ తన హృదయం ఎంత ఉన్నతమైందో, ఎంత స్వచ్ఛమైందో ఋజువుచేసుకున్నాడు.*

---

* కాళోజీ షష్టిపూర్తి సంచిక 'అరవై యేండ్ల యోధుడు కాళోజీ'లో ప్రచురితం, ముద్రణ 1974.

12. "మంటలూ – మానవుడూ – ధ్వనికావ్యం"

"నా కన్నవి, విన్నవి విన్నవించగా మాటలకై వెదుకాడబోతే, అవి పురఖాను పురఖంగా శ్మశానాలవంటి నిఘంటువుల దాటిరా"వని శ్రీశ్రీ నిఘంటువులను శ్మశానాలతో పోల్చినారు. నిఘంటువులలో శబ్దాలకు ప్రాణం ఉండదని ధ్వని. శబ్దానికి వాచ్యార్థాన్ని మాత్రం బోధిస్తుంది నిఘంటువు. కవి తన ప్రతిభ చేత ఆ శబ్దాలకు ప్రాణం పోస్తాడు. అంటే లక్ష్యార్థాన్ని, వ్యంగ్యార్థాన్ని ఆ శబ్దాలు ఆశ్రయించేట్టు చేస్తాడు. తన భావాలను పొడిపొడిగా ప్రకటించడం కవి లక్షణం కాదు. తాత్కాలికమైన ప్రయోజనాన్ని కూడా సాధించలేడు. ఏ శబ్దానికి ఎంత శక్తి ఉందో తెలుసుకున్నవాడు మాత్రమే కవితా ప్రాంగణంలోకి ప్రవేశించే అర్హతను సంపాదించుకోగలుగుతాడు.

శబ్దం బహిర్వేషాన్ని, గమనాన్ని, రహస్యాన్ని కనుగొని కవిత్వ రచనకు పూనుకున్న వారిలో నారాయణరెడ్డి అగ్రేసరుడు. స్వాతంత్ర్యం తర్వాత తెలుగు సాహితీ విహాయసంలో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్న కవి ఆయన. ఇటీవల ధ్వని ప్రాణితంగా కవిత్వం వెలువరిస్తున్న అరుదైన కవులలో ఒకరు నారాయణరెడ్డి.

మంటలూ - మానవుడూ 20 ఖండికల సంకలనం. 1970 లో ప్రచురణ. ఆయా ఖండికల రచన ఏయే తేదీలలో సాగినవో కవి పుస్తకంలో సూచించారు. సంఘాన్ని, కవి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన ఏదో ఒక సంఘటన విశిష్టమైన పాఠకులకు గుర్తుకొస్తుంది. కాని అదొక వార్తాపత్రిక ఖండికగా ఉండక కావ్య ఖండికగా భాసిస్తుంది. దేశాల ఎల్లలను, కాలాల అవధులను దాటిపోతుంది. సంతప్త మానవాళి గుండెల్లో రగుల్కొంటున్న మంటలివి

'మానవుడు అనాదిగా
మంటల్లో బతుకుతున్నాడు
మంటల గంటలను మోగిస్తూ
మహోదయ ద్వారాలు తెరుస్తున్నాడు'

అంటూ మంటలను మానవోద్యమ ప్రతీకలుగా భావిస్తాడు. ఏదో కథ చెపుతున్నట్లుగా ప్రారంభమవుతాయి కొన్ని ఖండికలు. సూత్రప్రాయంగా, సందేశగర్భితంగా ముగుస్తాయి: "లక్ష రూపాయల బహుమతి" "జోడెద్దులకుమ్ములాట" "అనగా అనగా ఒక రాజు" సరికొత్త సత్యం లాంటివి. కొన్ని ఖండికలకు ప్రశ్న మొదలు ప్రత్యుత్తరం చివర.

'మూడు శిఖరాలూ, మూడు తలకాయలూ' అనే ఖండిక అంతర్జాతీయ సత్తా రాజకీయాలకు సుదూర సంబంధం ఉన్నట్టు కనిపిస్తుంది. యుగయుగాలుగా కాలం నేర్పిన జగజ్జనీన పాఠంగా ముగుస్తుంది.

సంఘాన్ని గుర్తించి సంఘం సమస్యలకు పరిష్కారం చూపడానికి కవే కానక్కరలేదు. సంఘాన్ని కవి గుర్తించే తీరు వేరు. కవితాత్మ ఘోషించే తీరు వేరు. కవి ఏరుకునే పదాలు వేరు వాటిని నడిపించే దారులు వేరు. అనుప్రాస లప్రయత్నంగా శ్వాస పీల్చుకుంటూ గమిస్తాయి. లయ స్పందిస్తుంది. ఛాయగా అర్థం వెన్నాడుతుంది. ఇంత ఘాటుగా సంఘంలోని దౌష్ట్యాన్ని బట్టబయలు చేసిన కావ్యం ఇటీవల రాలేదు.

'కాలం శ్రీ క్రాసులాంటిది
అది సహించింది
పందొమ్మిది వందల దెబ్బై మేకులు
....
ఆదర్శాన్నే సీసాల్లో బిగించి
అమలిన సత్యాన్ని మూసలో బంధించి
కాసులు చేసుకునే కుహనానీతిజ్ఞులు
క్రాసుకూ, మోహనదాసుకూ వెలకట్టలేరు'

వంటి భావాలు సూటిగా ఉన్నా నిరంతరం అధ్యయనానికి, వ్యాఖ్యానానికి నోచుకొన జాలినని.

చిచ్చరకంటి మంట, చుప్పనాతి, కాకాసురుడు, శచి, మందేహులు, సత్యభామ, నరకుడు, ఓంకారం, వామనత్వం, త్రివిక్రమత్వం లాంటివి ఖండికల్లో చోటుచేసుకుని, కవి సంప్రదాయాభిజ్ఞతను, ఆ సంప్రదాయగతమైన సంస్కారాన్ని కవిత్వం మూసతో పోసుకునే చతురతను చాటుతున్నాయి. పురాణాలలోని ఈ విషయాలు ఆధునికునికి రుచించేలా వాడుకొన్న పద్ధతి అపురూపంగా ఉన్నది.

"ఇంకిపోయిన బావి" అనే శీర్షిక ఉన్న ఖండికలో గతాన్ని పలుకరించిన తీరు వర్తమానాన్ని సమాశ్వాసించిన నేర్పు గొప్పగా వున్నాయి. గతం చచ్చిందని దెప్పిపొడిచిందానికంటే గతాన్నెందుకు విడనాడాలో చెప్పడానికి ప్రయత్నించడం ఈ గేయంలోని ప్రత్యేకత.

చిరునవ్వు - ఉత్తరాలు - గావుకేక - చీకటి చదువు వంటి ఖండికలు కవి శబ్దవాచ్యుడైనవాడు సమస్యాస్వరూపం చిత్రించే తీరును తెలుపగలుగుతున్నాయి.

"ఇద్దరూ ఒకటే" అనే గేయంలో తేడాలను వివరిస్తూ, "ఉల్లీ మల్లి వాసనలు భిన్నంగా ఉన్నా ఉన్న నేల ఒకటే" అనే దృష్టాంతం ప్రసక్తి తెచ్చి ఆ ఒకటే అంటే ఏమిటో వివరిస్తాడు. వాటిని బంధించే ఏక సూత్రత కనబరుస్తాడు.

"బ్రతుకంటే నిప్పులు గక్కడమూ కాదు
కన్నీళ్ళు కనుగుడ్లల్లో కుక్కడమూ
జుట్టు పీక్కోవడమూ కాదు
చుట్ట చుట్టుకొని పడుకోవడమూ కాదు
బ్రతుకంటే ఉద్దీప్త చైతన్యం
జలవిద్యుత్తుతో దాని బాంధవ్యం
బ్రతుకంటే వర్షామేఘం
బీళ్ళతో ఏళ్ళతో దాని అనుబంధం"

వంటి నిర్వచనాలు చదువుతుంటే కవిత్వం వ్రాయడానికి ఎంతో జ్ఞానం ఉండాలని తెలుస్తుంది. ఉద్రేకం పాలు ఎక్కువైతే హేతువు కన్నుమూస్తుంది. హేతువు పాలు ఎక్కువైతే ఉత్సాహం చక్కబడుతుంది. ఎక్కడో వీటికి లంకె కుదురాలె. అప్పుడది కవిత్వం అవుతుంది.

"కొవ్వొత్తి గుండె లోతు నీకేం తెలుసు?
అగర్వత్తి అంతర్మథనం నీకేం తెలుసు?
అమృతం కొనగలుగుతావు గానీ
అంబలి కొనగలుగుతావా?
మధువు ఇవ్వగలుగుతావు గానీ
మనసు ఇవ్వగలుగుతావా?
అది అవ్వకాచి ఇవ్వాలి
అందులో
ఆత్మ రంగరించి పొయ్యాలి."

"నాకూ నీకూ ఏం పోలిక?" అనే ఖండికలోని ఈ భావాలను కొంచెం పరిశీలించండి. శబ్దం, అర్థం, ఎలా కాపురం చేస్తూన్నాయో అవగతమవుతుంది. ఏ గణాల్లో పొదగని ఈ భావాలతో అంతర్లయ ప్రవహిస్తున్నట్లు పాఠకుడు స్పందిస్తాడు. ఆత్మీయత - ఎత్తిపొడుపు రంగరించి చెప్పినా, పాఠకుని హృదయానుభూతి వీటిని వింగడించుకుని ఆనందిస్తుంది.

"అనగా అనగా ఒక రాజుగారు" అనే ఖండికలోనూ
"ద్వారాలకు తోరణాలు లేవు
ధమ్మిల్లాలకు మల్లెపూలు లేవు
మానవుల సంగతి అడక్కండి
దేవునికే దిక్కూ మొక్కూలేదు" అంటూ అదే శబ్దరహస్యాన్ని బోధించాడు.

"చీకటి చదువు" అనే ఖండికలో
"చదువుకున్న చిరంజీవి చీకటి
అధికారంలోకి వస్తే
గుడ్లగూబలే వైతాళికులు
గుంటనక్కలే ఆస్థానకవులు
హత్యలే ప్రభాతకృత్యాలు
అనృతాలే అపూర్వసత్యాలు"

అంటూ వెలువరించిన భావాలు సహృదయులను ఆలోచనాధీనుల్ని చేస్తాయి. చీకటి దేనికి ప్రతీక ? ఆ ప్రతీకను ముందు అనుసంధించుకొని చదువాలె. మొదటిసారి చదివినప్పుడు చప్పున తోచదు. ఇక ఈ గేయంలో కవి చూపిన నుడికారాలు ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. 'ఓకిలిస్తుంది', 'గుటక తేస్తుంది' 'పెదవి విరుస్తుంది' 'జబ్బ చరుస్తుంది' 'బుడత చీకట్లు'. నుడికారాలు అర్థ గాంభీర్యాన్ని కలిగించడానికే తోడ్పడతాయి. కవికి తన భాషమీద అధికారాన్ని ప్రదర్శించగలుగుతాయి. ప్రజాసామాన్యంతో ఉన్న సంబంధాన్ని చూపెడతాయి. అలాంటి నుడికారాలతో ఆయన ఈ కావ్యంలోనూ, ఇతర కావ్యాల్లోనూ సాధించిన సిద్ధులు అనితర సాధ్యమైనవని చెప్పడం సాహసం కాదు. నుడికారం మహాలక్ష్యం.

"కుట్రపోతు కుతంత్రాలు చేయలేనిది
గోరంత త్యాగం చేస్తుంది,
దురంత పద్మవ్యూహాల వల్ల కానిది
రవంత అనురాగం వల్ల ఔతుంది."
"నేనూ నా తమ్ముడూ" అనే గేయంలో
"మనుషుల మీద నమ్మకం పోయినవాడు
మట్టినీ గుట్టను పట్టక ఏం చేస్తాడు?"

అంటూ అనుభవం రంగరించి పోసి తనకున్న సామాజిక స్పృహ ఎంత మహనీయమైందో చెప్పాడు. అచ్చం సామెతలాగా చెప్పాడు.

అన్ని ఖండికల్లో అనుభూతి, సందేశం, ధ్వని ముప్పిరిగొన్నట్టు కనిపిస్తాయి. ఆవేశం జడలు దులుపుకుని ఉరకలు వేస్తుంది.

కవిత్వం ఒక ఆవేశమే కాని ఆ ఆవేశం విద్వత్సంస్తవనీయం కావాలె. సామాజిక స్పృహ అంటూ కరపత్రాల్లాంటివి వెలువరించి కవిత్వం కింద చెలామణి చేస్తున్నవారు ఈ ముప్పై ఖండికలను చదివి, వీటి వెనుక ఉన్న సామాజిక సమస్యా స్వరూపాన్ని పోల్చుకోవలసిందని ఆహ్వానిస్తున్నాను. శబ్దానికున్న పరిమితులను అర్థం చేసుకోగలిగే పాఠకులు మాత్రమే, కావ్యాత్మ ధ్వని అని నమ్మేవారు మాత్రమే ఈ ఖండికలో కవిత్వాన్ని సాక్షాత్కరింప జేసుకోగలుగుతారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి బహుమతికి పాత్రమైనది ఈ గ్రంథం. 'కావ్యాత్మ ధ్వని' అన్న కవితా సిద్ధాంతానికి "మంటలూ-మానవుడూ" లక్ష్యప్రాయమైంది.*

* 'చైతన్య శిఖరం'లో ప్రచురితం. ముద్రణ మార్చి 1975.

13. విప్లవ కవిత

నిన్న విప్లవానికున్న అర్థం - దేశోపద్రవం, వినాశనం, శత్రుభయం, ప్రమాదం. కాని నేడు విప్లవం అంటే మానవాభ్యుదయాన్ని కుంటుపరుస్తున్న వ్యవస్థపై తిరుగుబాటు. నవ సమాజ నిర్మాణానికి నాంది. ఈ దృష్టితో పరిశీలిస్తే చరిత్ర నిర్మాణంలో విప్లవాలు నిర్వహించిన పాత్ర చాలా ప్రధానమైనదని చెప్ప వచ్చు. మార్పును అభిలషించడం, మార్పు తుపానులా, ఉప్పెనలా దుర్ని రీక్ష్యంగా రావాలని అభిలషించడం విప్లవం అనిపించుకుంటుంది. సాంఘిక, రాజకీయ, ఆర్థికాది సమస్యలు సమాజాన్ని సతమతం చేస్తుంటే వాటిని త్రుంచ డానికి స్వేచ్ఛాయుతంగా, భయరహితంగా సాగే ఉద్యమం విప్లవం. సంస్కృతం లోనే రచన సాగాలనే మౌఢ్యానికి ఎదురుతిరిగి నన్నయ తెలుగులో రచించ డానికి పూనుకోవడం విప్లవమే! భాషాఛందోవస్తు బంధాలను తెగనరికి పాల్కురికి సోమనాథుడు ఒక సాహిత్య విప్లవానికి సారథ్యం వహించాడనే చెప్పవలసి వస్తుంది. కందుకూరి గురజాడలు విప్లవ మార్గాన్ని వరించినవారే! మార్పును కోరని వాళ్ళకు విప్లవం భయావహమే మరి! విప్లవం పరివర్తనానికి సూచిక. నిన్న విప్లవాలు చెలరేగినవి. ఇప్పుడూ ఉన్నవి. ముందుకూడ విప్లవాలుంటాయి. అనుక్షణం పరిణామశీలమైన ప్రపంచంలో విప్లవాలు ఆగవు. అసంతృప్తి మాన వాత్మ విప్లవాలను సృష్టించుకుంటుంది. తుది విప్లవం అంటూ మానవేతిహాసంలో ఉండదు. ఉద్ధృత పరిణామమే విప్లవం ఈ ఐతిహాసికమైన యథార్థ్యం సాహి త్యానికి కూడా వర్తిస్తుంది. అర్ష వ్యవస్థను కూలద్రోయడానికి బౌద్ధ విప్లవం వచ్చినట్లే జనసామాన్యానికి అందుబాటులోలేని భాష ఉపయోగార్హం కాదనే భాషా విప్లవానికి గిడుగువారు బీజావాపం చేశారు.

ఆధునిక ఆంధ్రసాహిత్యంలో విప్లవ కవిత అంటూ ప్రత్యేకమైన సాహితీ ప్రక్రియ ఏదీలేదు. అయితే కొందరు రచయితలు కుళ్ళిన సంఘ వ్యవస్థను తూర్పారబట్టిన సందర్భాలు విప్లవ కవితా ధోరణులను దర్పణాలుగా ఉన్నవి. శ్రీశ్రీ తాను 'వైప్లవ్య గీతా'న్నని ఉద్ఘోషిస్తే, సి. నారాయణరెడ్డి విప్లవాన్ని 'విప్లవాక్షి'గా దర్శించాడు. శ్రీశ్రీ మహాప్రస్థానగీతం తొలిసారిగా విప్లవ శంఖా రావంగా తెలుగు పఠితలకు వినిపించింది.

రాజకీయాలతో, రాజకీయపు టాటుపోటులతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్పందనం పొందని మనిషే ఊహకు తట్టనట్టు రాజకీయ స్పృహలేని విప్లవ కవిత్వం అరుదే! రాజకీయ వ్యవస్థను కూలద్రోయాలనే ప్రబోధం విప్లవ కవితకు ప్రాణం వంటిది. ఒక్క రాజకీయ రంగంలోనే కాకుండా అన్ని రంగాల్లోనూ విప్లవ భావాలుండవచ్చు. కాని సాంకేతిక శాస్త్రాభివృద్ధి ఫలితంగా రూపు దిద్దు కుంటున్న ప్రపంచ రాజకీయాలు ఒక వినూత్నమైన భావ ప్రసరణానికి దారి తీసినవి. రాజకీయ వ్యవస్థ ఏదైతేనేమి! సంఘంలో మార్పులు సహజంగా, పదిలంగా, ఎవరికీ నష్టం కలగని విధంగా వస్తాయనే అభిప్రాయాని కిటీవల చెల్లుబడి లేకుండా పోతున్నది. సంఘంలో ఏ మార్పు రావాలన్నా రాజకీయ వ్యవస్థ మారాలిసిందే. ప్రభుత్వ విధానం మారాలిసిందే. ఇలాంటి భావాలిప్పుడు ప్రపంచ వ్యాప్తమవుతున్నవి. కనుక నిన్నటివలె ఇప్పుడు సంస్కరణోద్యమాలు లేవు. వాని ప్రభావం కూడా కనిపించడంలేదు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలేమి నియంతృత్వం మీద నమ్మకం వున్న ప్రభుత్వాలేమి సర్వవిధాల సమాజ శ్రేయస్సుకు సంబంధించిన సమస్యలను శాసనం ద్వారా ప్రభుత్వమే పరిష్కరించాలనే ధోరణికి ప్రాబల్యం హెచ్చుతున్నది. మధ్యయుగం నాటి ప్రభుత్వాలకు అంతర్బహిశ్శత్రు నిర్మూలనమే ముఖ్య కర్తవ్యం. సంఘ సంస్కరణం మతాధికారులకూ, కవులకూ, భక్తులకూ సంబంధించిందిగా ఉండేది. ఇప్పుడు సంస్కరణోద్యమం అంటే—ప్రభుత్వమే ఫలానా సమస్యలను పరిష్కరించడంలేదనీ, దాని వల్ల సాంఘిక భద్రతకు అఘాతం ఏర్పడుతున్నదనీ, ప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ రచనలు సాగించడం, ధర్మాగ్రహాన్ని ప్రకటించడం విప్లవ కవిత అనిపించుకుంటున్నది. కనుక విప్లవ కవిత రాజకీయ రంగానికి సంబంధించిన కవితగా సాహిత్యంలో చోటు చేసుకుంటున్నది. ఇట్లా అనడం సాహసం కాదు. ఫ్రాన్సు, చైనా మున్నగు దేశాల్లో సాంఘిక న్యాయత విప్లవానంతర ప్రభుత్వాల హయాంలోనే సాధింపబడిందని విప్లవ కవుల వాదం.

'విశ్వశ్రేయః కావ్యం' అనే అర్యోక్తికి నిన్న ఉన్న అర్థం వేరు. ఇప్పుడు శ్రేయస్సు అంటే నిన్నటి మోక్షం కాదు శ్రేయస్సంటే సుగమంగా సాగిపోయే దైనందిన జీవితం: ఉన్న వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో పికివేయవలెనని విప్లవ కవుల సందేశం! అయితే కవిత్వానికి ప్రాణంవంటివైన ధ్వని, వ్యంగ్యం విప్లవ కవి శబ్దవాచ్యాల్లో మృగ్యం. ప్రబోధం వ్యంగ్యంగా చెయ్యడానికి వీలు లేదా!

సూటిగా సందేశం ఇయ్యదలచుకున్నప్పుడు కవిత్వాన్ని ఆశ్రయించడం దేనికి? వాచ్యార్థానికే ప్రాముఖ్యం ప్రబలంగా ఉంటున్నదీ విప్లవ కవితల్లో. కనుక అవి ఆలోచనామృతం కాలేకపోతున్నవి. మననం చేసుకోవడానికి వీలు లేకుండా పోతున్నది. ఏదో తిడుతున్నారు, దూషిస్తున్నారు అన్న భావమే కలుగుతున్నది, కాని తమకు సిగ్గువచ్చేందుకు, తమను మార్చడానికి రచనలు చేస్తున్నారనిపించడంలేదు. 'అనితరసాధ్యం నా మార్గం' అన్న శ్రీశ్రీ అడుగుజాడల్లో నడిచి తమ విశిష్టతను నిలుపుకోలేకపోయారు. వ్యంగ్యార్థాన్ని ఆశ్రయించిన అతని కవిత ఎందరికో సామ్యవాద వ్యవస్థ పట్ల అనక్తిని ప్రేరేపించింది. ఆయనకు విద్వత్తు ఉంది, గంభీరమైన అధ్యయనశీలత ఉంది. ప్రాచీనకవితా మర్యాదలను జీర్ణం చేసుకుంటేనే తప్ప రచయిత తనకొక మార్గం ఏర్పరచుకోరాదనే నమ్మకం ఉన్నవాడు. అతని అనుయాయ్రులు ఈ యాథార్థ్యానికి దూరంగా ఉండడమే కాదు, దూరంగా ఉండడం పద్ధతిగా ఆరాధిస్తున్నారు. ప్రాచీన కవుల ప్రతిభా సామర్థ్యాలను పరిశీలించకుండానే వాళ్ళను అభ్యుదయ నిరోధకులుగా భావిస్తున్నారు. పరిమితమైన పదజాలంతో అధ్యయన రాహిత్యంతో కావ్యకర్తలుగా రూపొందలేకపోతున్నారు. కేవలం వాచ్యార్థ ప్రతిపాదనం కవిత్వమనిపించుకోదు. వాచ్యార్థ ప్రధాన రచనలు వార్తాపత్రికలవలె మరునాటికే పఠితల మనఃప్రపంచంలో నిలువకుండా పోతున్నవి. కనుకనే భావ విప్లవానికి ప్రజా హృదయాలను ఆయత్తం చేయలేకపోతున్నవి. కవిత్వం చెప్పినప్పుడు కవిత్వానికుండే వ్యంగ్యాది లక్షణాలుండి తీరవలసిందే. సమస్యలను వివరించడానికి వేరే ప్రక్రియలున్నవి. వ్యంగ్య మర్యాదలులేని కవితలకు ప్రాచుర్యం రాదు. ఇతివృత్తం సమాజమే కానక్కరలేదు. ఏది తీసుకున్నా, వ్యంగ్యంగా, సభ్యంగా, గంభీరంగా, చెప్పగలగడంలో ఉంది ప్రజ్ఞ అంతా. కులమత వ్యవస్థకు ఎదురు తిరిగిన వేమన్న ఇప్పటికీ కవిగా మిగిలి పోగలుగుతున్నాడు కదా! అతని కవితకు ఇతివృత్తం కేవలం సమాజం కాదు. అయితే అతనికి సామాజిక స్పృహలేదని వాదించవచ్చా? నిజానికి సిసలైన కవి భావాల్లో సామాజిక స్పృహ ఉండి తీరుతుంది. తన పార్థక్యం, వ్యక్తిత్వం నెపంతో అతడు స్పృశించేది సమాజాన్నే! సామాజిక స్పృహ విప్లవ కవులకే ఉంటుందనుకోవడం కేవలం భ్రమ. విప్లవకవులు, విప్లవేతర కవులు అనే వింగడింపు అనవసరం. రాజకీయ పక్షాల కరపత్రాల స్థాయికి దిగజారిపోయే స్థితికి కవిత్వాన్ని తీసుకురావడం వాంఛనీయం కాదు.

ఇటీవల విశేషప్రచారాన్ని అందుకున్న దిగంబర కవిత్వం విప్లవ కవితా శాఖకు చెందినదే. సంస్కరణ పట్ల సానుభూతి ఉన్నవాళ్ళు కూడా భరించలేని తీక్ష్ణతను ఈ కవులు ప్రదర్శిస్తున్నారు. అయినా సంప్రదాయబద్ధంగా వస్తున్న పలుకుబళ్ళను, కవి సమయాలను వదలలేకపోతున్నారు "వ్యాసుడు విద్వత్సంస్తవనీయ భవ్య కవితా వేశుడు." అంటే కవిత్వం ఆవేశోద్భూతమే. అయితే అది మననం చేసుకొనేవాడికి విద్వాంసునికి సంస్తవనీయం కావలె. విద్వాంసుల మెప్పుదలతో తమకు పనిలేదనడం కవిత్వాన్ని మ్యూజియంలో పెట్టడమే! కవి కప్పి చెబితే విమర్శకుడు విప్పి చెప్పుతాడు. విమర్శకుడు కవి హృదయాన్ని ఆవిష్కరిస్తాడు. విమర్శకుడు అభ్యుదయ నిరోధకుడు కాడు. విమర్శకుడు లేనిదే కవి బ్రతుకడు. కవిత్వం మంచినీళ్ళవలె అందరికీ అందుబాటులో ఉండాలనే మాట ఆలోచించి అన్నదికాదు. కనుక దిగంబర కవితమీద వస్తున్న విమర్శలు అందులో కవిత్వం ఉన్నదనే సత్యాన్ని కూడా నొక్కి చెబుతున్నవి.

శ్రీశ్రీ, నారాయణబాబు, దాశరథి, అనిసెట్టి, నారాయణరెడ్డి, ఆరుద్ర, తిలక్ తమ కవిత్వాల ద్వారా విప్లవ ధోరణులకు స్వాగతం చెప్పినవారే. అయితే శబ్దార్థాల మర్యాదలను, లక్షణాలను జీర్ణం చేసుకొని విప్లవ భావాలను వెదజల్లినవారు కనుకనే సంప్రదాయాలను పట్టుకొని ప్రాకులాడే కవి పండితులకు సమాదరణీయులు కాగలిగినారు. కవిత్వం మనస్సంస్కారానికి సంబంధించింది. ప్రభుత్వాలను మార్చాలనే నినాదాదంకంటే కవిత్వంలో ఆ నాదం వచ్చేట్టు చెయ్యడం విప్లవ కవిత అనిపించుకుంటుంది. సంఘంలోని కుళ్ళును, రాజకీయాల కుయుక్తులను నిరంకుశ ప్రభుత్వమే సాధించ గలుగుతుందనే నమ్మకం ఉన్న వాళ్ళు కవిత్వం వ్రాయనక్కరలేదు. ఆ నమ్మకాన్ని కవిత్వానికి అవలంబనం చేసి విప్లవ కవిత అనడం కవిత్వాన్ని కాదనడమే; కవితా శక్తిని తక్కువగా అంచనా కట్టటమే! ఈ వ్యాసోద్దేశం విప్లవ కవితను నిరసించడం కాదు. విప్లవ కవితను కువ్యాఖ్యలనుంచి తప్పించడమే తిరుగుబాటు ధోరణులను విప్లవ కవితా సనాథములుగా మనం గుర్తించగలిగితే నాటినుంచి నేటివరకు విప్లవ కవిత ఋతుచక్రంలో గ్రీష్మంవలె మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటుంది. పుడమికి వేడి అవసరం. అప్పుడే అది సారవంత మవుతుంది. సస్యశ్యామల మవుతుంది.*

---

* ప్రథమ ప్రపంచ మహాసభల ప్రత్యేక సంచిక 'తెలుగు వాణి'లో ప్రచురితం. ముద్రణ, ఏప్రిల్ 1975.

14. శ్రీ మహాభాగవతం–ఉపాఖ్యానాలు

"భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనులవలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపరతు."

ఆస్తిక హృదయులైన అక్షరాస్యులందరికినీ తెలుగుదేశంలో భాగవతం పఠనీయ గ్రంథంగా, నిరక్షరాస్యులైన వారికి ఆరాధ్య గ్రంథంగా రూపొందిన మహాకావ్యం. భాగవతోత్తముడైన పోతనామాత్యుడు కీర్తి కొరకో ద్రవ్యం కొరకో కాక కైవల్యాన్ని ఆకాంక్షించి రచించిన గ్రంథమిది. భాగవతం భక్తిని విశేషంగా ప్రతిపాదించే ఏకైక మహాపురాణం. దీనికి వ్యాఖ్యానాలు ఎన్నో వెలిసినా శ్రీధరుడు వ్రాసిన వ్యాఖ్యానాన్ని ఆధారంగా పోతన ఆంధ్రీకరించినాడు. అయితే ఆయా అంశాలను విడమరచి చెప్పవలసి వచ్చినపుడు శ్రీధరుడు చేసిన వ్యాఖ్యానంలోని విషయములను కూడా పోతన తెనిగించి, పరిమాణంలో మూలానికంటే ఆంధ్రీకరణాన్నే రెండింతలు పెంచినాడు. ఇలా పెంచడానికి కారణం ఒకే ఒకటి - పోతన్నది ప్రచార దృష్టి. భక్తిని ప్రచారం చేయడానికి, ఒకే విషయాన్ని ఎన్నో తీరుల చెప్పడానికి అతడు ప్రయత్నం చేయడమే. నాద రహస్యాన్ని తెలిసిన ఆ భక్త కవి ప్రతి పద్యాన్ని అందమైన పదాలలో పొదిగి, విన్నంత మాత్రాన జిహ్వాగ్రాలపై నర్తించే విధంగా రచించగలిగాడు. అనుప్రాస యమకాది శబ్దాలంకారాలూ, ఉల్లేఖించి ఉపమ, రూపకం వంటి అర్థాలంకారాలూ తెలుగు పఠితృ లోకానికి నిత్యమననీయంగా ప్రయోగించినాడు.

సర్వ పురాణసార మనదగిన శ్రీ మహాభాగవంలో ఎన్నో ఉపాఖ్యానాలున్నవి. శ్రీ విష్ణువు దశావతార వర్ణనం ప్రధానంగా ఉన్న ఈ కావ్యం సహజంగానే ప్రధానమైన పది కథలకు పుట్టిల్లైనది. ఇక ఈ పది కథలను ఆశ్రయించుకొని ఎన్నెన్నో కథలు ఇందులో చోటు చేసికొన్నవి. 'సుందరోజ్జ్వల

వృత్తంబు' అనుటలోనే భాగవతంలోని ఉపాఖ్యానాల ప్రాశస్త్యం వెల్లడౌతున్నది. పోతన ప్రతిస్కంధం చివర 'అను కథలు గల' స్కంధము అని రచించినాడు. అతని దృష్టిలో భాగవతం కథల సంకలనం.

ఇందలి కథలు అతిలోక వృత్తాంతాలతో మనుష్యులు దేవతలు పాత్రలుగా సహజత్వానికి దూరంగా కనిపిస్తాయి. తర్కబుద్ధితో పరిశీలించినపుడు ఈ కథలు అంత రుచిరంగా తోచకపోవచ్చు. కాని భక్తి భావబంధురంగా మలచబడ్డ ఈ కథలు ఆస్తికులకు అసంబద్ధాలుగా తోచనే తోచవు. భగవంతుని శిష్ట పోషణ పరాయణత్వం, దుష్టశిక్షణ, భక్త వాత్సల్యం, భక్తిపారమ్యం నిరూపించడానికే ఈ కథలల్లబడినవి కాని, లౌకిక మర్యాదా ప్రాంగణంలో విహరించడానికి కాదు. భాగవత కథల్లో కావ్య కళా దృష్టి కంటే ప్రజా బాహుళ్యానికి భక్తిమార్గాన్ని అలవడజేయడమే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ కారణంచేతనే భక్తికి పరమాత్మకూ సంబంధించిన సన్నివేశాలు కథలో వచ్చినపుడు కావ్యకళ గౌణమైపోతుంది. మూలంలో కంటే ఈ పరిస్థితి తెలుగులో సమధికంగా కనిపిస్తుంది. భక్తి పారవశ్యంతో పోతన ఈ పెంపుదల చేసినట్లు పఠితలు గమనిస్తారు.

గజేంద్ర మోక్షం వంటి కథలు ప్రతీకాత్మకంగా వేదాంత రహస్య ప్రతిపాదకంగా విలసిల్లినవి. ప్రతి కావ్యం కూడా అఖ్యానమే. అంటే చెప్పడం. ముందున్నవారిని సంబోధించి చెప్పినట్లు రచించకున్నా కావ్యకర్త పరోక్షంగా ఉత్తమాధికారికి చెప్పుతున్నట్లుగానే ఊహించవచ్చు. అఖ్యానం నడుస్తూవుంటే సందర్భానుసారంగా ఉపాఖ్యానాలు కూడా పుట్టుకొస్తాయి. అన్ని పురాణాల్లో ఉన్నట్టే భాగవతంలో కూడా ఉపాఖ్యానాలు అనేకంగా ఉన్నవి. ధ్రువోపాఖ్యానం, పురంజనోపాఖ్యానం, జడభరతోపాఖ్యానం, అజామిళోపాఖ్యానం, చిత్రకేతూపాఖ్యానం, సుయజ్ఞోపాఖ్యానం, అంబరీషోపాఖ్యానం,కుచేలోపాఖ్యానం, పింగళోపాఖ్యానం, మార్కండేయోపాఖ్యానం ముఖ్యంగా భాగవతంతో పేర్కొనదగిన ఉపాఖ్యానాలు. పోతన్న చేతిలో కుచేలోపాఖ్యానం ఎంత సముచితమైన లౌకికమర్యాదలను సంతరించుకున్నదో, అంత పారలౌకికమైన ఆంతర్యాలను స్పృశించుకొనగలిగింది. జీవేశ్వర సమైక్యతత్త్వాన్ని వ్యంజించగలిగింది.

ఉపాఖ్యానాల్లోని కథాసంవిధానం ఎలా ఉన్నా పోతన్న నాదమాధురి, భావావేశం పఠితలకు ముందు శ్రవణతర్పణం కలిగించి పిమ్మట హృదయాన్ని వశీభూతం చేసుకుంటుంది. వినగల్గినప్పుడేకదా ఆలోచించడానికి అవకాశ మేర్ప డడం? చెవులకు ఇంపుగా లేనప్పుడు ఎంత చెపితే ఏమి? ఎలా చెపితే ఏమి? ఈ రహస్యం తెలిసిన పోతన—

"భూషణములు వాణికి నఘ
పేషణములు మృత్యుచిత్తభీషణములు హృ
త్తోషణములు కల్యాణ వి
శేషణములు హరిగుణోపచితభాషణముల్"

అని హరి గుణాలను ప్రస్తుతించినాడు. అవి శారదకే అలంకారములట! కల్యాణమునకే విశేషములట! నిజంగా ఇవి పోతన వాగ్గుంభనానికి విశేషణములు.

భక్త్యావేశసూత్రంతో కూర్చిన ఈ ఉపాఖ్యాన ప్రసూనమాలికను పోతన భగవదర్పితంచేసి, భక్తులైన పాఠకులకు ఒకే ఒక్క కథను అందించినట్లు భాసింపజేసినాడు. నిజానికి ఆవేశంతో చదువుతున్న పాఠకునికి ఇవి ఉపాఖ్యానాలుగా తోచనే తోచవు భాగవతం అంటే భాగవతుల కథగా దర్శనమిస్తుంది. ప్రసక్తానుప్రసక్తంగా ఈ కథలు భాగవతంలో కనిపించినా ఏ కథకు ఆ కథ స్వతంత్రంగా కనిపిస్తుంది. ఉపాఖ్యానంలోని ప్రధానపాత్రను కథాప్రారంభం లోనే కొన్ని విశేషణాలతో పరిచయం చేస్తాడు. కథాంతంలో ఫలశ్రుతి వంటిది ఉంటుంది. అజామిళోపాఖ్యానం ప్రారంభంలో "బ్రాహ్మణుఁ డజామిళుఁడనంగఁ బాతకుం డతుల నిర్భాగ్యుం డవజ్ఞుండు నష్టసదాచారి కష్టరతుఁడు" అని వ్రాసి-

"కోరిన వారలకెల్లను
జేరువ కైవల్యపదము సిరివరుని మదిం
గోరని వారలకెల్లను
దూరము మోక్షాప్తి యెన్ని త్రోవలనైనన్"

అని ముగించినాడు. కథామధ్యంలో భక్తి వేదాంత విషయాల చర్చ వచ్చినప్పుడు పోతన్న సంక్షిప్తం చేసికోలేదు. ఆ భక్తకవికి కావ్యకళ జన్మ రాహిత్యానికి దారితీసే ఆరాధనా విశేషం. కనుకనే తెలుగులో భాగవతాన్ని రచించే అవకాశం తన పురాకృతపుణ్య వైభవంవల్ల లభించిందని నమ్మినాడు. భాగవతాన్ని భగవంతుడే తనతో పలికించినాడనీ, తాను నిమిత్త మాత్రుడననీ చెప్పుకున్నాడు. కావ్యకళకు ఇంత పవిత్రత నాపాదించి కావ్యప్రయోజనం భక్తి ప్రబోధమే అని నమ్మిన పోతన్న కథల్లో కావ్యగుణాలను వెతకడానికి ప్రయత్నించడం అంత ఫలప్రదం కాకపోవచ్చు. ఈ కారణంచేతనే శ్రీ విశ్వనాథ వారు పోతన్నను "తెలుగుల పుణ్యపేటి"గా అభివర్ణించారు. ఇది శతధా యథార్థమైన విషయం. అయితే "కమలాక్షున్ శరణంబు వేడని జనుల్ కల్యాణ సంయుక్తులే" అనీ-

"చేతులార ంగ ....
కలుగ నేటికిఁ దల్లుల కడుపుచేటు" అనీ నమ్మిన పోతన్న కావ్య కళారహస్యమంతా భక్తిని ప్రబోధించడంలో చూపించే కౌశలంలోనే ఇమిడి ఉన్నది. పురాభారతీయుల కావ్యకళా సిద్ధాంతాలనూ కావ్య ప్రయోజనాలనూ సమన్వయించి పరిశీలిస్తే, పోతన్న భాగవతం, అందలి ఉపాఖ్యానాలు సత్కావ్య శ్రేణికి చెందినవని విజ్ఞులు విశ్వసించితీరవలసినదే.*

---

* ఆకాశవాణి హైదరాబాదు నుండి ప్రసారితం. రచనాకాలం.19-1-1980.

15. ఉపజ్ఞాసమన్వితుడు—భరద్వాజ

వ్రాయగలిగిన చేవ ఉంటే ప్రతి మనిషి జీవితాన్ని మహాకావ్యంగా మలచ వచ్చని భావించిన ఒక మనీషి అభియుక్తోక్తి చాలాకాలం నుంచి నన్ను ఉత్తమ అధ్యయనానికి పురికొల్పుతున్నది. సాహిత్య సృష్టికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం ప్రధాన హేతువులుగా ప్రాజ్ఞులు గుర్తించినారు. అయితే వ్యుత్పత్తికి నిర్వచనం ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటుంది; ఉండాలి కూడా. నేటి కాలంలో పరిసరాలనూ, సమాజాన్నీ, దైనందిన జీవితానికి ఉపయోగపడే వస్తు సంపదను సృష్టి చేసే అంశాలనూ, తాను బ్రతుకుతున్న సంఘానికి సహజంగా అర్థమయ్యే భాషనూ క్షుణ్ణంగా తెలుసుకోవడం వ్యుత్పత్తి అనిపించుకుంటుంది. ప్రాచీన అలంకారికులు లోకజ్ఞతను గూర్చి కొంతవరకు విశ్లేషించినారు. పైన పేర్కొన్న అంశాలన్నీ ఈ లోకజ్ఞతా పరిధిలోనికి రావచ్చు. కాని వాళ్ళ దృష్టిలో వేదాది విద్యలు, వ్యాకరణాది శాస్త్రాలూ, దర్శనాల అధ్యయనం అతి ముఖ్యమైనవి. ఎందుకంటే, ఐహిక జీవితంకంటె పారమార్థిక జీవితానికి వాళ్లు ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఆముష్మిక విద్యారహస్యాలు వేదవేదాంగాలు చదువుకుంటేనే తప్ప అవగతం అయ్యేవికావు. ఇప్పుడు హేతువాదం, దైనందిన జీవితానుభవానికి సమీపంగా ఉండే కల్పన, సమకాలీన సంఘాన్ని అవగాహన చేసుకునేందుకు పరిజ్ఞానం సాహిత్యానికి లక్షణంగానూ ప్రయోజనంగానూ భావింపబడుతూ ఉన్నవి.

రావూరి భరద్వాజ కథకుడు, నవలా రచయిత, వ్యాసకర్త, మననశీలి, సంభాషణా చతురుడు. స్కూలుగాని, కాలేజిగాని, గురు సంప్రదాయంగాని అతనికి జ్ఞానాన్ని, అవగాహన విధానాలను ప్రసాదించలేదు. అతనికి జీవితమే గురువు. అతడు తన లోచూపుతో, స్వీయానుభవంతో చూసిందే లోకంకాని, చదువుకున్నది కాదు. అనుభవమే అతనికి విద్యగరపింది. తెలుగు నుడికారాన్ని హస్తగతం చేసుకుని, పరంపరాగతమైన దృక్కోణంతోకాక తన దృష్టితో చూడగలిగిన ఉపజ్ఞా సమన్వితుడు. అందుకే ఆతడు రెండు సాహిత్యప్రక్రియ

లను - కథనూ, నవలనూ - చేపట్టాడు. ఈ రెండు ప్రక్రియల్లో పాండితీ ప్రకర్షకంటే, కల్పనా చమత్కృతి కంటే, స్వప్న విహాయస విహారానికంటే, సారళ్యానికీ, వాస్తవికతకూ, సహజతకూ విలువ ఎక్కువ. అందుకే వ్రాయనూ చదువనూ వచ్చినవారందరూ ఈ రెండు ప్రక్రియల్లో వెలువడుతున్న పుస్తకాలను సమాదరిస్తున్నారు. శాస్త్రీయ విషయాలను కథారూపంలో వెలువరిస్తే, వాటికీ ఎక్కువ వ్యాప్తి కలుగుతున్నది. నేటి సమాజ వ్యవస్థలో బడుగు బ్రతుకులను సామాన్యులు ఎలా ఈడ్చుకుని పోతున్నారో, మాన్యులెంత తేలికగా కాలం గడుపుకోగలుగుతున్నారో భరద్వాజ తన కథలో భంగ్యంతరంగా చెప్పడానికి సఫల ప్రయత్నం చేశారు.

భరద్వాజ హృదయవాది, రసవాది, రసవేది. తర్కాన్ని హృదయానికి అనువర్తింపజేయడం శాస్త్రావలంబనం అనిపించుకుంటుందేమో కాని సాహిత్యావలంబనం అనిపించుకోదు. అంతమాత్రాన భరద్వాజ 'కళ కళకొరకే' అనే గుంపులో చేరినవారుకాదు. కేవలం కలలను ఒలకబోసేవాడు రచయిత కాకపోతే వచ్చే ప్రమాదం ఏమీలేదు. కలలు కనడానికి హక్కు సంపాదించుకోనక్కర లేదు. కొన్ని ప్రత్యేకమైన కలలు కొందరికే రావాలన్న నియమం కూడా ఏమీ లేదు. కలలు కనడానికి పరిశ్రమ అక్కరలేదు. అనుభూతి అంతకంటె అవసరంలేదు. ఆ కలలకు ఆకృతిని కల్పించడానికి కళాకారుడు ప్రయత్నం చేయవచ్చు. కలలను పండించుకోవడానికి మనిషి ప్రయత్నించవచ్చు. అయితే కలలకు వైయక్తికమైన అనుభూతి కారణం కావచ్చు. ఆ స్వప్నాలు ఒక జగన్మంగళాకాంక్షను పులుముకంటే - ఆ కలలు తన జీవిత లక్ష్యానికి ఘంటాపథాలు వేస్తే - ఆ కలలు తన వ్యక్తిత్వానికి నిలువుటద్దాలైతే, అలాంటి కలలు కనే వ్యక్తి రచయిత అయితే - అతని రచన సంఘశ్రేయసుకు వేగుచుక్క కావడంలో సందేహం ఉండడానికి అవకాశం ఉందా?

భరద్వాజ 'జీవన సమరం', ఆయన ఆర్ద్రమనస్కతకూ, సత్యగవేషణా దృష్టికీ, సామాజిక స్పృహకూ, చిక్కని చక్కని తెలుగు వచన రచనకూ, సజీవ భాషా విన్యాసానికీ, బిందువులో సింధువును దర్శించగలిగే అపురూపమైన దృష్టికి దృష్టాంతంగా ఉన్న కథ (అనుభవా)ల సంకలనం. ఆయన 'పాకుడు రాళ్ళు' చలనచిత్రకళ వైకుంఠపాళి. ఆయన 'కాదంబరి' నేటి సామాజిక

జీవితంలో ధనం నేతృత్వం వహిస్తే, పిశాచాలు కాచివడబోసిన సత్యాలను ఎలా నూరిపోస్తాయో, పూచికపుల్లలో బ్రహ్మాండాన్ని దర్శించినట్లు, ఒక సామాన్యుని జీవితంలో ధనం ప్రవేశించి వాణ్ణి ఎంతగొప్పవాణ్ణి చేస్తుందో, నిజాయితీ ఎలా వాడికి ఊడిగం చేస్తుందో చూపిస్తుంది.

భరద్వాజ వైజ్ఞానికాంశాలను సామాన్యుల భాషలో చెప్పడానికి ప్రయత్నించిన ధన్యుడు. ఎన్నో విజ్ఞానశాస్త్ర రహస్యాలను సాంకేతిక పదజాలాల గాలాలకు చిక్కకుండా విడమరచి హృద్యమైన భాషలో, సజీవమైన నుడికారంలో చెప్పడానికి పయత్నించినాడు - ఈ రంగంలో కృషిచేసిన వారు పలువురుండవచ్చు. కాని భాషాదృష్టితో పరిశీలించినప్పుడూ, జాతీయాల దృష్టితో పరిశీలించినప్పుడూ భరద్వాజ ఒక్కరే విజయం సాధించినట్లు కనిపిస్తుంది.

ఒక ప్రత్యేకమైన కథన విధానానికి, అందమైన భాషాసరళికి, హేతువాదానికీ, హృదయ వాదానికీ సుందరమైన, సంగమ స్థలంగా రూపొందిన భరద్వాజ రచనలకు ఇతోధిక ప్రచారం కలగాలనీ, మరింతమంది ఆయన రచనలను చదవాలనీ కోరుకుంటున్నాను. ఉత్తమాభిరుచిగల పాఠకులు శ్రీ భరద్వాజ రచనలను సమాదరించాలని ఆకాంక్షిస్తున్నాను.*

---

* ఆంధ్రపత్రిక దినపత్రిక (16-11-1980)లో ప్రచురితం.

16. తాళ్ళపాక అన్నమయ్య సాహిత్యం

తాళ్ళపాక కవులు తెనుగు పలుకుబళ్ళను బళ్ళకెత్తి పదిహేను పదహారు శతాబ్దాల్లో తెలుగుభాషకు ఒక సార్థక్యాన్ని ఒక వ్యక్తిత్వాన్నీ సంతరించి పెట్టిన మహనీయులు. ఈ కవులు సృష్టించిన సారస్వత సంపద పరవస్తు చిన్నయ్య సూరికి చిక్కివుంటే గ్రాంథికాంధ్ర కల్పతరువని పేరొందిన బాల వ్యాకరణం సజీవాంధ్రభాషా కల్పతరువై ప్రాచుర్యాన్ని సంపాదించుకొని ఉండేది. ఐదు వందల ఏండ్లుగా తెలుగు తల్లుల నోళ్ళలో తెలుగు బాలల ఆటల్లో తెలుగు భక్తుల పాటల్లో పెనవేసుకొనిపోయిన తాళ్ళపాక వారి సంకీర్తన సాహిత్యం కేవలం రేఖాసదృశం. శ్రీ ప్రభాకరశాస్త్రి వంటివారు తాళ్ళపాక వారి సాహిత్యాన్ని చదువనిదే తెలుగురాదని అభిప్రాయపడ్డారు.

ప్రవాహరూపంలో ఉన్న భాషకు ప్రమాణాలను ఏర్పరిచే ప్రయత్నం తెలుగులో ఆదికావ్య రచనతోనే ఆరంభమైనది. ఆంధ్ర శబ్ద చింతామణి, అథర్వణకారికావళి, వికృతివివేకం, ఆంధ్ర భాషాభూషణం, అహోబల పండితీయం అప్పకవీయం లాంటి వ్యాకరణాలు సంస్కృతంలోనూ, తెలుగులోనూ అవతరిస్తూ తెలుగుభాషకు హద్దులు ఏర్పరుస్తూ వచ్చినాయి. సంస్కృతంలో శాస్త్రాభ్యసనం చేసిన ఆంధ్ర పండితులు ఈ వ్యాకరణాలు గీసిన గీట్లతో పరిచయం ఏర్పరుచుకుని, వాటిని దాటటం భాషాపచారమని నమ్మి ఆ లక్షణ రేఖలతోనే తమ తెలుగు కావ్యాలను తీర్చిదిద్దుకున్నారు. కాని ప్రజాస్వామ్యం మాత్రం వ్యాకరణాలు గీసిన గీట్లను పండితులకు వదిలిపెట్టి తమ జీవద్భాషలో తమ నన్నయకంటె కొన్ని వందల ఏండ్ల పూర్వం నుంచే సాహిత్య సృష్టిని చేసుకుంటూ వచ్చింది. పాలకురికి సోమనాథుడు పేర్కొన్న ప్రభాత పదాలు, వెన్నెల పదాలు, వాలేశు పదాలు ఈ కోవలోనివే. నన్నయకు పూర్వమున్న భాష గాసటబీసటే కావచ్చు. నన్నయ తరువాత - అంటే తెలుగు వ్యాకారణాలు వచ్చిన తర్వాత - కూడా రాజస్థానాలకు వెలియైన ప్రజలు ఇతర కళలవలెనే కవితాకళను కూడా సృష్టించుని భద్రపరచుకున్నారు. మరి ఆ సాహిత్యానికి

కర్త ఎవరో తెలియకపోవచ్చు. కాని తరతరాలకు దాని పరిమళాలు అందుతూనే వచ్చినవి. బుర్రకథలు, జంగం కథలు, తోలుబొమ్మలాటలు, జముకుల కథలు, జోలలు, ఏలలు. యక్షగానాలు మున్నగు జానపద కళారూపాలు ఎన్నో సాహిత్య వాసనలను రూపక మర్యాదలను కళారహస్యాలను జన సామాన్యానికి అందిస్తూనే వచ్చినవి. అయితే ఈ సామాన్యుల భాషనుగానీ కళారూపాలను గానీ రాజాస్థానాల్లోని పండితులు సమాదర భావంతో చూసినట్లు కనపడదు. కావ్యాలలో అక్కడక్కడ ప్రసక్తాను ప్రసక్తంగా పాత్రచిత్రణ సందర్భంగానో స్వభావోక్త్యలంకారంకోసమో సమకాలిక సాంఘికేతివృత్తాన్ని రేఖామాత్రంగా తెలియజేయడంకోసమో తడిమినారే కాని వాటిలోని కళా వైదగ్ధ్యాన్ని గానీ సాహితీ సాముచిత్యాన్ని గానీ వాటిలోని వైవిధ్యాన్ని గానీ సందర్శించి అభినందించలేక పోయినారు. ఇక గుర్తింపు మాట దేవుడెరుగు. ఈ సాహిత్య కళారూపాలను గుర్తించి కొంతవరకు తమ తమ ప్రచారానికి అనువైన పద్ధతిలో మలచుకుని ఆదరించినవారు శివకవులు. అక్షర ఛందస్సులపట్ల కొంత మమతను విడిచి మాత్రాచ్ఛందస్సులనూ గాన యోగ్యమైన పదాలనూ ఆశ్రయించి శివ కవులు సామాన్య ప్రజలకు కొంత సన్నిహితులైనారని చెప్పడానికి వీలున్నది. పదిహేడవ శతాబ్దారంభంలో కంకంటి పాపరాజు, కందుకూరి రుద్రకవి, రంగాజమ్మ, రఘునాథ నాయకుడువంటి విద్వత్ప్రబంధ నిర్మాతలు ప్రజాసామాన్యానికి సన్నిహితమైన యక్షగాన ప్రక్రియను చేపట్టి వాళ్ళల్లో ప్రాచుర్యాన్ని అందుకున్న భాషా ప్రయోగాలను ఎన్నింటినో సొంతంచేసుకుని జీవద్భాషోద్యానంలో విహరించగలిగినారు ఇలాంటి వాతావరణం నాటి సాహిత్యలోకంలో కలగడానికి తాళ్ళపాక కవుల పదసాహితీ వసంతోదయమే కారణం. ఇంతకు పూర్వం తెలుగు ప్రబంధాలలోనికెక్కి వాటి భాషను శక్తిమంతం చేసిన లోకోక్తులూ జాతీయాలూ సామెతలూ పదబంధాలూ అన్నీ సామాన్య ప్రజలవే. కాని వాళ్ళ ఊసైనా ఎత్తకుండ ఈ కవులు వాళ్ళ భాషా చమత్కారాన్ని సజీవత్వాన్ని సొంతం చేసుకుని తమ కావ్యాలకు అచ్చమైన తెలుగుతనాన్ని పులుముకుని వాళ్ళనూ వాళ్ళ భాషనూ వాళ్ళ కళలనూ అశాస్త్రీయాలనీ గ్రామ్యాలనీ అప్రమాణాలనీ సంస్కృతంనుంచి అరువు తెచ్చుకున్న గడుసుదనంతో చీదరించుకున్నారు. పదిహేనవ శతాబ్దారంభములో అన్నమాచార్యుల అమృతోదయాన ఈ సామాన్య ప్రజానీకం పలుకుబడికీ సంగీతానికీ సుప్రభాతం పలికింది.

ఆ మహనీయుడూ అతని వంశంవారూ వైష్ణవ భక్తితత్వాన్ని వివిధ భక్తితత్వాలనూ తమ సంకీర్తనల ద్వారా రచనల ద్వారా ప్రజానీకంలోకి తీసుకొనిపోయినారు. గీర్వాణభాషాభేషజన్ని అతివేలంగా సంపాదించి కూడా ఈ వంశంవారు తీయని తెలుగు పలుకుబడికి తమ కవితను అంకితం చేసి స్వామి పదాలకు అర్పించటంకోసం ప్రజల పదాలను పట్టుకున్నారు. వీరి సాహితీ సృష్టి తెలుగు సాహితీ చరిత్రలో ఒక మలుపు. కవితను సంగీతానికి అతి సన్నిహితంగా తీసికొనిపోయిన ప్రయోగం వాగ్గేయకార సంప్రదాయానికి శ్రీకారం. వీరిలో ప్రథముడు మానవోత్తముడూ వాగ్గేయకారుడూ అయిన అన్నమాచార్యుల జీవితం అద్భుతావహమైన ఘట్టాల రాగమహిత సాహిత్యానుభవాల చయనిక.

అన్నమయ్య అవతరించిన కాలం నాటికి తెలుగు దేశంలో ఏకచ్ఛత్రాధిపత్యం వహించి తెలుగు దేశాన్ని ఒక త్రాటిపై నడిపిన కాకతీయ సామ్రాజ్యం నశించి తెలుగు ప్రజ పలుతీరుల పరిపాలనకు లోనయినది. ఉత్తరంలో గజపతి రాజులూ, తెలంగాణంలో బహమనీ రాజులూ, రాజమహేంద్రవరంలో రెడ్డి రాజులూ, విద్యానగరాన్ని రాజధానిగా చేసుకుని రాయలసీమను సాళువ తుళువ వంశపు రాజులూ రాజ్యం నెరపుతున్నారు. అన్నమాచార్యుల వంశీయులు కడప జిల్లాలోని తాళ్ళపాక గ్రామస్థులే అయినా అన్నమయ్య కాలం నుంచి తిరుపతినే నివాసంగా మార్చుకున్నారు. తురుష్కుల దండయాత్రలవల్ల ప్రజల్లో సాంఘిక భద్రత నానాటికి క్షీణిస్తున్నది. తెలుగు దేశంలోని పరిపాలకులలో తరచుగా యుద్ధాలు జరుగుతుండడం పలుసందర్భాలలో తురుష్కులదే పైచేయిగా ఉండడం వలన ధర్మరక్షకులని బిరుదులు అతికించుకున్న రాజులకే దిక్కులేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఇక ప్రజల గోడు ఎవరికి కావాలి? ఉత్తర భారతంలో హిందూ రాజులకు పట్టిన గతి. హిందూ సంస్కృతికి పట్టిన గతి దక్షిణ భారతంలోనూ పట్టింది. నమ్మిన ధర్మాన్ని వదలలేక విమత దుష్కృత్యాలను ఎదుర్కోలేక సామాన్య ప్రజానీకంలో శరణాగతితత్వం ప్రబలింది. భక్తితత్వం, కుల తత్వానికి విరుద్ధమైన భావాలకు ప్రాచుర్యం నిరయపాకరంగా తోచింది నాటి బుద్ధిమంతులకు. "భగ్నకృషీ భాగవతా భవంతు" అన్నట్లు అందరూ భగవత్తత్వచింతనకు మనసొగ్గడం నేర్చుకున్నారు. తత్వాలు వ్రాసే కవుల సంఖ్య ఆనాడు అధికం. భక్తి గీతాలు పాడుకుని భజనలు చేయించే భక్త

సమూహాల సంఖ్య ఆనాడు అతి వేలం. తెలుగులో ఫారసీ ఉర్దూ పదాల దిగుమతి సజావుగా సాగింది. చిల్లర రాజులు అతివేలమయిన శృంగార కావ్యాలు వ్రాయించుకున్నారు. సంస్కృత లాక్షణికులు ఏర్పరచిన హద్దుల్లో నడచిన కావ్యకాలంలో కావ్యత్వం అడుగంటి శబ్ద చమత్కారాలు, ఛందస్సు కసరత్తులు అధికమైనవి.

పదహారవ శతాబ్దారంభంలో ప్రబంధమనే ఒక వినూత్న ప్రక్రియ తెలుగులో అవతరించి స్వతంత్రకావ్య పద్ధతికి నారు పోసింది. రసవత్ ప్రబంధ రచనకు దారితీసింది. పది పన్నెండు మంచి ప్రబంధాలు ఈ ప్రబంధ విహాయసంలో ధృవ తారలుగా వెలసినవి. అంతే. సామాన్య ప్రజకు ఇవి కూడా దూరంగానే ఉండినవి. అన్నమయ్య పదసాహిత్యం తెలుగుదేశాన్ని ఉర్రూతలూగించిన తరువాత నూరేళ్ళకు కాని ఈ ప్రబంధ ప్రక్రియ పుట్టలేదు. పుట్టి నూరేండ్లు కూడా ఒకే విధంగా వెలుగలేదు.

బాల్యంనుంచే అన్నమయ్య భక్తి వివశుడై పాటలు పాడేవాడు. ఆ పాటలలో అతడు తన జీవితవృత్తం వ్యంజించినాడని చెప్పినా అబద్ధం కాదు. చిన్నతనంలోనే ఇంటిపనులు చేయలేక విసుగుచెంది దేవదేవుని దర్శనార్థం తిరుపతికి పయనమైనాడు. అప్పటికాతనికి పదహారేండ్లు. ఏడుకొండలనెక్కుతున్న భక్తులతో తిరుమలకు పోతూ మోకాళ్ళ పర్వతం దగ్గరికిచేరి అలసిపోయి అకలితో స్పృహతప్పి పడిపోయి నిదురపోయినాడు. కలలో లక్ష్మీదేవి సాలగ్రామాలతో నిండిన ఈ కొండను చెప్పులతో ఎక్కరాదనిచెప్పి, చెప్పులులేకుండా ఎక్కితే, అలసట కలుగకుండ కొండ ఎక్కవచ్చుననీ స్వామి దర్శనమవుతుందనీ తాను ఆరగించిన ప్రసాదాన్ని అన్నమయ్యకు పెట్టి అంతర్థానమైనదట. అప్పుడు అన్నమయ్య అలమేలుమంగపై ఒక శతకం చెప్పినాడట. ఆ తరువాత గరుడకంబంపై, పుష్కరిణిపై, బ్రహ్మపాదముపై, విష్వక్సేనునిపై, గర్భాలయంలో పరంజ్యోతిగా వెలుగుతున్న స్వామిపై అశువుగా సంకీర్తనములు చెప్పినాడట. అప్పటి నుండి కనీసం రోజుకొక్క సంకీర్తనం చొప్పున తాను పరమపదించేవరకు అన్నమయ్య కొన్ని వేల కీర్తనములు స్వామి వారినిగూర్చి చెప్పినాడట. పదహారవ ఏటనే స్వామి సాక్షాత్కారాన్ని పొంది, శఠకోప యతీంద్రుల వద్ద గురూపదేశాన్ని పొంది, కొంతకాలం తిరుమలలోనే ఉండిపోయి

నాడు అన్నమయ్య. ఆతణ్ణి వెతుక్కుంటూ అక్కడికి వచ్చిన తల్లిదండ్రుల కోరికనూ గురువు ఆదేశాన్నీ పాటించి అన్నమయ్య తిరిగి తాళ్ళపాక చేరుకొని గార్హస్థ్య జీవితాన్ని పాటించినాడు. అహోబిలం లాంటి పుణ్యక్షేత్రాలు సందర్శించి శ్రీ వేంకటేశాంకితంగా శృంగార సంకీర్తనలెన్నో రచించినాడు. హృదయావర్జకములూ శ్రుతిపేయములూ అయిన ఆ సంకీర్తనలు బహుశ్రుతమై టంగుటూరులో నాడు అధిపతిగా ఉన్న సాళువ నరసింగరాయలు దాకా ప్రాకినవి. అతడు అన్నమయ్యను దర్శించి అతని ఆశీర్బలంతో పెనుగొండలో పట్టాభిషిక్తుడై 1487 లో విజయనగర సింహాసనానికి అధిపతి కావడం తటస్థించినది. సాళువ నరసింగరాయలు అన్నమయ్య స్వామిని గూర్చి రచించిన శృంగార కీర్తనములు విని తన్ను గూర్చి కూడా శృంగార గీతములు రచింపుమని అడుగగా అన్నమయ్య నిరాకరించినాడు. రాచరికపు ఆవేశానికి వివేకమంతంతమాత్రమే గదా! అన్నమయ్యకు సంకెళ్లుపడినవి. కానీ ఆ భక్తుని దివ్యగాన ప్రభావంతో అవి తమంతటతామే తెగిపోయినవి. రాజు ఆ భాగవతోత్తమునికి శరణాగతుడైనాడు. సుప్రసిద్ధ కన్నడ వాగ్గేయకారుడూ, నాదబ్రహ్మోపాసకుడూ పురందరదాసు అన్నమాచార్యుణ్ణి విష్ణ్వవతారముగా భావించి సందర్శించెనట. అన్నమయ్య కూడా పురందరుని పాండురంగ విఠలునిగా భావించి ప్రస్తుతించెనట. ఈ ఇరువురు వాగ్గేయకారుల ప్రభావాలను కన్నడ తెలుగు దేశములు తప్పించుకొనలేకపోయినవి. ఆయన వ్రాసిన ఆధ్యాత్మ సంకీర్తనములూ, శృంగార సంకీర్తనములూ రాగతాళాలతో కూడినవి 32000 దాకా ఉన్నాయని ఆయన మనుమడు చిన్నన్న అన్నమాచార్య చరిత్రములో తెలిపినాడు. ద్విపద ప్రబంధంగా రామాయణాన్నీ, సంస్కృతంలో వేంకటాద్రి మాహాత్మ్యాన్నీ, సంకీర్తన లక్షణాన్నీ, తెలుగులో శృంగారమంజరి అనే గ్రంథాన్నీ పన్నెండు శతకాలనూ వ్రాసినాడు. ఆళ్వారులు రచించినవి ద్రావిడవేదమైతే అన్నమాచార్యుని సంకీర్తనలు ఆంధ్ర వేదమని శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు అభిప్రాయపడినారు.

అన్నమయ్య సాహిత్యాన్ని గూర్చి ఆరుద్ర "ఇతరుల కవిత్వంలో అయితే ఈ కవి వాడిన నానుడులు, పలుకుబళ్లు, సామెతలు అని ఒకటో అరో వెతికి వెతికి అతి కష్టంమీద పట్టి చూపించాలి. కాని అన్నమయ్య రచనంతా దేశీయమే.

అడుగడుగునా సామెతలే. ప్రతి చరణంలోనూ నానుడులే. అన్నమయ్య మూర్తీభవించిన తెలుగుతన"మంటూ కీర్తించినారు.

అన్నమయ్య రచనల్లో పురాణాల్లోని సారళ్యం, దేశి పలుకుబడులలోని తేటదనం పొంగులువారుతూ ఉంటాయి ఆయన అధ్యాత్మ కీర్తనలు వల్లించిన చిలుకపలుకులు కావు. ఆత్మప్రబోధాన్నీ, ఆత్మానుభవాన్నీ, లోకవృత్త రహస్యాన్నీ, స్వీయానుభూతినీ వ్యంజిస్తూ ఉంటాయి. అయితే శాస్త్రీయపరిభాషా శబ్దారణ్యంలో అవి చిక్కువడక స్వేచ్ఛగా పక్షిలా ఎగురుతుంటాయి. ఆ పక్షికి ఒక రెక్క అచ్చమైన తెలుగుభాష. రెండవ రెక్క సుందరమైన భావం. ఇక దాని ఉడ్డీనశక్తి కవితాశక్తి.

"విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా"

"కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేనూ మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డను
బాయిం పారవేసిన పాలు వెన్నయును
చేయి పెట్టకుందురా చిన్నిబిడ్డలు
మీ యిండ్లు జతనాలు మీరు సేసుకొనక
పాయక దూరేరేమే ప్రతిలేని బిడ్డను"

"నేనైతే ఈదేరుదు, నీకు లీలామాత్రమింతే
మానక నన్నేలుకొమ్ము మాధవగోవిందా
ఇందరిపై సూర్యుండు ఎండలు గాసించేను
అందు కొన్ని కిరణాలు అణిగిపోయేనా"

"ఏది తుద? యెన్నడు ముగుసును?
ఆదికి ననాది హరిమాయ
సాధించి సుజ్ఞానియైతే
యీదెస వెదికిన ఇహమే పరము"

"పొదుగుడు మనమున బొడమిన యాసలు
అదననెక్కడికి అదగునయ్యా
వొదగుచు జలముల నుండు మత్స్యములు
పదపడి యేగతి బాసేనయ్యా"

వంటి పంక్తులను ఎన్నింటినైనా ఎత్తి చూపవచ్చు. అన్నమయ్య సంకీర్తనానందసాగరంలోని మౌక్తికాలలో ఇవి కొన్ని మాత్రమే. "చందమామ రావే! జాబిల్లి రావే!" అని పాడందే ఏ తెలుగుతల్లీ బిడ్డకు అన్నం పెట్టదు. "జో అచ్యుతానంద! జో జో ముకుంద!" అని జోల పాడందే ఏ తెలుగు బిడ్డడూ నిదుర పోడు. ఈ పాటలు అన్నమయ్యవే. తెలుగుల దైనందిన జీవితంతో అన్నమయ్య కవిత పెనవేసుకపోయినది. ఇదే ప్రజాకవితా లక్షణం.

పదకవితా పితామహుడుగా సాహిత్య సంగీత కళాప్రపంచంలో ప్రసిద్ధి వడసిన అన్నమయ్య రచనలు "ఉజ్జ్వల రసానుభూతి నొదవించుచు ననేక దేవాలయములలోని యర్చామూర్తుల నభివర్ణించుచు శరణాగతి మహత్త్వమును ప్రతిపాదించుచు నింక ననేక విధముల లోకనీతి ధర్మోద్బోధ భూతదయాది విశేషాంశముల వెలయించుచు ఎంతో వింతగా వేడుకగా సంగీత సారస్యముతో, సవరని భాషతో, వేదవేదాంతేతిహాసాది సూక్తితదర్థ ప్రతిపాదనములతో వెల్లి విరిసి విజ్ఞాననిధులై విరాజిల్లుచున్న"వని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నుడివిన మాటలలో యథార్థ్యమే ప్రకాశిస్తున్నది.*

---

* "తెలుగు సాహిత్యం - మరోచూపు" గ్రంథంలో ప్రచురితం. ముద్రణ 1981

17. సహృదయలోకం ఉంటేనే సాహిత్యం

సుధాంశు బింబము లేని జ్యోత్స్న ఊహకందనట్లు, సామాజికుడు లేని ప్రయోగం అనుభవానికి అందనట్లు, సహృదయుడు లేని సాహిత్యం ఉండదు. అది అడవిగాచిన వెన్నెల. దాహం తీర్చని నీరు. ఎంతటి మనీషి సృజించిన సాహిత్యమైనా అది బీజం లాంటిదే. సహృదయక్షేత్రంలో అది మొలకెత్తినప్పుడే దానికి సార్థకత. సాహిత్యమెప్పుడూ ప్రసరణాన్ని కోరుతుంది. వికాసాన్ని కోరుతుంది. ఆస్వాదించే వాళ్ళకోసం ప్రతీక్షిస్తూ ఉంటుంది. సాహిత్య సృష్టి ఏ భాషలో జరుగుతుందో, ఆ భాష అర్థం కానిచోట, అది సాహిత్య సంకేతాన్ని స్థూలంగా కోలుపోతుంది సూక్ష్మంగా సాహిత్య సృష్టికి ఎక్కడైనా ఎప్పుడైనా అనుభూతే ప్రాతిపదిక. అయితే ఆ అనుభూతి పాఠకునిలో తాదాత్మ్యాన్ని కలిగించ గలగాలె. అంటే పాఠకుడు రచయిత హృదయపు లోతులనూ, సమున్నత మైన ఆలోచనలనూ దర్శించగలగాలె. తాను ఏ పాఠకులకు రచయిత తన రచ నలను అందించాలనుకుంటాడో, ఆ పాఠకుల బ్రతుకు బరువులనూ, ఆదర్శాలనూ, సంప్రదాయాలనూ, వాళ్ళ భాషలోని జాతీయతనూ అవగతం చేసుకోవలసి యుంటుంది. లేకపోతే, రచయిత ఎంత కొత్త విషయాన్ని, ఎంత మంచి విష యాన్ని చెప్పినా, పాఠకుల ఆలోచనా పరిధిలోనికి, అవగాహనా వలయం లోనికి రాకపోతే అది అర్థం కాదు. తెలుగుదేశం ప్రజల చిత్తవృత్తులనూ, దురాచారాలనూ, సహృదయ లక్షణాలనూ, సంస్కరణాభిలాషనూ, అందమైన శ్రవణ సుభగము లైన మాటల పొందిక పట్ల ఉండే అభిమానాన్ని తలస్పర్శిగా ఆకళింపు చేసుకున్న శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు తన పాఠకలోకాన్ని తానే సృష్టించుకున్నారు. సహృదయ లోకం, అతని రచనల పట్ల చూపిన ఆదరం, అతని సాహిత్యానికి సమున్నత ప్రమాణాలను ప్రసాదించి పెట్టగలిగింది. తమను తిడితే సహృదయలోకం హర్షించదు. తమ దోషాలను ఎత్తిచూపితే, పాఠక లోకం రచయితలను సరకుగొనదు. అంతమాత్రం చేత తమ సమస్యలనూ తమ భావాలనూ పట్టించుకొనని రచయితను పాఠకులు సమాదరిస్తారని అనుకోవ డానికి వీలులేదు. సుతిమెత్తగా వ్యంగ్యమర్యాదలను ఆశ్రయించి, కొంచెం ఆలో

చిస్తేనే గాని అంతుపట్టని పద్ధతిలో వ్రాస్తే పాఠకులు పైకి చిర్రుబుర్రుమన్నా, లోలోపల రచయిత చూపిన తప్పులకు బాధపడి సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారు. గురజాడ, వీరేశలింగం సమాజానికి చురకు అంటించినారు. కాని పాఠకలోకా నికి ఆ మహారచయితల వ్యంగ్యస్ఫూర్తి, నుడికారంలోని బలం, సజీవపాత్ర చిత్రణ, సమాజాన్ని పీడిస్తున్న చీడపురుగుల తీరుతెన్నులు పూలవానలాగా తోచినవి. తేనెలో కలిసిన చేదుమందులా ఆస్వాదనీయములైనవి. సహృదయ లోకం మనీషులను ఆదరించిన తీరు సాహిత్యం సంస్కరణం కోసమే సదా శయ ప్రచారం కోసమే అనే అభిప్రాయాన్ని రచయితల్లో కలిగించగలిగింది. 1920 తర్వాత తెలుగులో వచ్చిన సాహిత్యమంతా, సముదాత్త భావ ప్రసర ణానికి అంకితమై పోవడానికి, అన్ని ప్రక్రియల్లోనూ చైతన్య స్ఫూర్తి ప్రజ్వరిల్ల డానికి పాఠకలోకం పరోక్షంగా తోడ్పడిందనడానికి తికమక పడవలసిన అవ సరం లేదు. కనుక సహృదయ లోకం సాహిత్య సృష్టికి సాహిత్య ప్రసరణానికి ఎప్పుడూ తోడునీడగా ఉంటుంది.

యుక్తాయుక్త విచక్షణ, సౌశీల్యం, సౌందర్యం, సర్వజనామోదం లాంటి ఉత్తమ లక్షణాలు కలిగిన సహృదయులతోనూ, పండితులతోనూ అలరారుతున్న సభల పట్ల తన ఆదరాభిమానాలను నన్నయ ప్రకటించుకున్నాడు. అలాంటి సహృదయుల సభలు ఉన్నందుకే అంతటి మహాకావ్యం మహాభారతం అవత రించిందని మనవంటి వారికి తోచడం తర్కానికి అందని అంశం కాదు.

"ఒప్పు తప్పరయు రసజ్ఞులూహ తెలియంగల
లేఖక పాఠకోత్తముల్ దొరికినగాక
యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే"

అని అల్లసాని పెద్దన అలనాడే సాహిత్య సృష్టికి ఉత్తములైన పాఠకులు అవసర మని గుర్తించినాడు. పెద్దన దృష్టిలో కేవలం తన కావ్యంలోని గుణాలను చూసి మెచ్చుకునే వాడేకాదు, తప్పులను కూడా చూపగలిగే సమర్థులైన పాఠకు లుంటే తప్ప కావ్యసృష్టి జరుగదు అని వివరించినాడు. ఈ మనీషి ఆలోచనలను మరి కొంచెం పదిలంగా పరిశీలిస్తే మనకు కొన్ని విషయాలు తెలుస్తాయి. సహృదయు డంటే కేవలం పాఠకుడు కాదు. ఉబుసుపోకకోసమో పొద్దుపుచ్చడానికో చదువు

కునేవాడు సాహిత్య సృష్టికి కానీ ప్రసరణాని గానీ ఏ విధంగానూ తోడ్పడలేదు. కాలాంతకమైన పఠనం అంటే time killing కోసం పనికివచ్చేది సాహిత్య మనిపించుకోదు. తాత్కాలికమైన ప్రయోజనం, పరిమితమైన ప్రయోజనం ఉత్తమ సాహిత్య లక్షణం కాదు. ఎప్పటికీ సుందరంగా కనిపించేది, ఎప్పటికీ శ్రవణపేయంగా ఉండేది, ఎన్ని దృక్కోణాలతో పరిశీలిస్తే అన్ని అర్థాలను ప్రసాదించగలిగేది, దేశం కాలం గీసిన గీట్లను దాటేసుకుంటూ పోగలిగేది సాహిత్య మనిపించుకుంటుంది ఇలాంటి సాహిత్యం అందిస్తున్న రచయితకు అనువైన వాతావరణం ఉండాలి. అంటే సహృదయలోకం ఉండాలి. సహృదయు నికి భాషలో మంచి అభినివేశం ఉండాలె. రచయిత పట్ల సానుభూతి ఉండాలె. తానూ, తనవంటి వాళ్ళూ కోరుకుంటున్నదే రచయిత వ్రాసి తీరాలనే నిశ్చితాభి ప్రాయాలకు తన హృదయంలో స్థానం కల్పించుకోగూడదు. ఈ పట్టున సహృ దయుడంటే ఎవడో మనం నిశ్చయ బుద్ధితో తెలుకోవలసిన అవసరం ఉంది.

ధ్వనిసిద్ధాంతప్రవక్త ఆనందవర్ధనుని ధ్వన్యాలోకానికి లోచన వ్యాఖ్యను వెలయించిన అభినవగుప్తుడు—

"యేషాం కావ్యానుశీలనాభ్యాసవశా ద్విశదీభూతే
మనోముకురే వర్ణనీయ తన్మయీభవన యోగ్యతా
తే సహృదయ సంవాదభాజః సహృదయాః"

అని సహృదయ లక్షణాలను వివరించినాడు. అభినవగుప్తుని దృష్టిలో సహృద యుడు పండితుడేకాక నిర్మలమనస్కుడై ఉండవలె. తరుచుగా సత్కావ్యాలను పరిశీలించడంచేత హృదయదర్పణం నిర్మలమవుతుందట. అంటే పక్షపాత దృష్టి, మాత్సర్యం, వైయక్తిక వైషమ్యం ఇత్యాది దోషాలు లేకుండా పోవడం. ఇలాంటి నిర్మలమైన మనోముకురంలో ఆస్వాదించిన కావ్యంలోని రామణీయకత ప్రతిబింబిస్తుంది. అప్పుడు హృదయం తన్మయీభావాన్ని చెందుతుంది. ఇలాంటి హృదయం ఎవరికుంటుందో వారు సహృదయులు. ఈ సహృదయులు సాహి త్యాన్ని ఆస్వాదించి రచయిత కృషికి సార్థకత చేకూరుస్తారు. ఆక్సిజన్ కాల్చే వాయువిశేషం, హైడ్రోజన్ కాలే వాయు విశేషం. కాని ఈ రెండు వాయువులు రసాయనిక ప్రక్రియ ప్రభావంవల్ల నీరుగా రూపొందుతాయి. ఆ నీరు కాలదు. కాల్చదు. పైగా చల్లదనానికి మరో పేరవుతుంది. కేవలం ఆక్సిజన్ నీరు కాదు;

కేవలం హైడ్రోజన్ నీరు కాదు. అలాగే కేవలం రచన సాహిత్యం కాదు. కేవలం పాఠకుడు కూడా సాహిత్యం కాదు. రచన ఒక అంశం, పాఠకుడు మరో అంశం. ఈ రెండు అంశాల కలయిక సాహిత్యం. అయితే ఈ రెండంశాలు పరస్పరాశ్రితాలు అని స్థూలంగా చెప్పవచ్చునేమో కాని సూక్ష్మంగా కాదు. రచయిత వ్రాసింది ఎవడైనా చదువవలసిందే కదా! ఎవడూ చదువకపోతే అది పుస్తకం అవుతుంది. రచన అనిపించుకుంటుంది. సాహిత్యం అనిపించుకోదు. శబ్దార్థాలు కలిసి ఉండడం సాహిత్యం అన్న అర్థం ఒకటి ఉండనే ఉంది. కాని రచన - పాఠకుడు ఈ రెంటి కలయికే సాహిత్యం అని వ్యుత్పత్తి చెప్పుకున్నా విప్రతిపత్తి లేదు. ప్రజాబాహుళ్యంలో విశేషప్రచారానికి నోచుకున్న సాహిత్యమే సాహిత్యం. రాజశేఖరుడనే మనీషి కవులను ముత్తెరగులుగా వింగడించినాడు. కొందరు కవులుంటారట. వాళ్ళ రచనలు వాళ్ళ ఇళ్ళల్లోనే ఉంటాయట. మరి కొందరు కవులుంటారట వాళ్ళ రచనలు వాళ్ళమిత్రుల ఇళ్ళల్లో ఉంటాయట. ఇంకా మరికొందరు కవులుంటారట. వాళ్ళ రచనలు ప్రజల నోళ్ళల్లో ఉంటాయట. వీళ్ళే ప్రజాకవులు. అలనాటి పోతన్న, మొన్నటి వేమన్న ఇలాంటి కవులే. ఉత్తర హిందూదేశంలో ప్రతి ఇంట్లో తులసీ రామాయణం వినిపిస్తూ ఉంటుంది.

ప్రజాజీవితానికి ప్రజల భాషకూ అతి సన్నిహితుడైన కవిని సమాజం ఎప్పుడూ మరిచిపోదు. అలాంటి కవి విలువను సమాజంలో ఎపటికప్పుడు భద్ర పరుస్తూ ప్రచారం చేసేవాడే సహృదయుడు. కన్నతల్లి ప్రేమకంటే పెంచిన తల్లి ప్రేమ ఎక్కువ అంటారు. కవి సృష్టిస్తే ఆ సృష్టికి ఇతోధికమైన పఠన పాఠన వాతావరణాన్ని కలిగించేవాడు సహృదయుడు. అతడు కవికి సంరక్షకుడు. కవికి పట్టుగొమ్మ. కవికి కీర్తిని పెంచి, కవికి అజరామరత్వం కలిగించిన వాళ్ళు సహృదయులే. ఎంత తీయగా ఉన్నా పూలవాసన గాలి లేనిదే ఘ్రాణతర్పణ చేయలేదు. అందరి గుండెల్లోకి కవి పోతే - కవి గుండెల్లోకి సహృదయుడు పోతాడు. కవి మేఘం. సహృదయుడు సుక్షేత్రం. అందుకే కవిత్వం ఉంటే ఇంకేం కావాలి. రాజ్యమెందుకు? అని తలపోసినాడు భర్తృహరి. సాహిత్యాన్ని ఇలా సర్వస్వం అనుకున్న సహృదయుడే సాహిత్యానికి సంరక్షకుడై సంవాహకుడై సంవర్ధకుడై వర్ధిల్లుతూ వస్తున్నాడు. సహృదయుడే తరతరాల సాహిత్యాన్ని, విభిన్న భాషల్లోని సాహిత్యాన్ని, విభిన్న రూపాల్లోని సాహిత్యాన్ని నిరంతరంగా అందిస్తున్నాడు. మానవ సంస్కృతిని కాపాడుతున్నాడు. మానవతా మర్యాదలకు మారాకు హత్తుతున్నాడు.*

---

* ఆకాశవాణి హైదరాబాదు నుండి ప్రసారితం. రచనాకాలం 20-4-1982.

18. పోతన దర్శించిన కృష్ణుడు

సంస్కృతంలోని పురాణాలు తెలుగులో కావ్యాలైనవి. ఆంధ్రీకరణంతో కవిత్రయం వారు అవలంబించిన మార్గం కావ్యమార్గానికి అనుకూలంగా ఉండడం చేతనో, అనువాద పద్ధతి మరీ స్వతంత్రంగా ఉండడం చేతనో ఈ పరిస్థితి ఏర్పడింది. రసపోషణం, ఔచితీపోషణం రమణీయాక్షర ప్రయోగం తెలుగు పురాణాలకు కావ్యమర్యాదలను సంపాదించి పెట్టినవి. పురాణాలను తెనిగించిన కవులలో బమ్మెరపోతనది ఒక విశిష్టమైన మార్గం. పురాణ కవులలో ఎవరుగాని చేయని పని ఆయన చేసినాడు. అది మూలాతిక్రమణం. వ్యాస హృదయాన్ని ప్రతిపాదించడంతో పాటు శ్రీధరుని వ్యాఖ్యానంలోని విశేషాలుకూడా పోతన ఛందస్సుల్లో ఒదిగిపోయినవి. భక్తిప్రచారం పోతన ధ్యేయంగా పెట్టుకొన్నాడు. చెప్పిన అంశాన్నే పరిపరివిధాలా విడమరచి, శబ్దార్థాలంకార సమేతంగా చెప్పడం పోతన్న తెలుగుకవులకు చూపిన కొత్తబాట. పోతన్న తరువాత శతకకర్తలందరూ ఈ మార్గాన్ని అనుసరించినవారే. కవిత్వం మొదట శ్రవణతర్పణం కలిగించాలి. అ తరువాత హృదయాలను ఉద్రూత లూగించాలి. పోతన్న శివకేశవాద్వైతాన్ని సంస్కృతాంధ్ర సమభావాన్ని, నిరీహత్వాన్నీ, కాయకష్టం విలువనూ, ఆత్మాభిమానాన్ని, శరణాగతితత్త్వాన్ని నమ్మి వీటిని తన భాగవతం ద్వారా ప్రచారం చేసిన స్రష్టః ద్రష్ట. భాగవతానువాదం తన "పురాకృతశుభాధిక్యంబు"గా భావించి వ్యాసుణ్ణి అనుసరిస్తూనే పరిసరాలను దర్శించి స్పృశించి తన కావ్య పరిధిలోనికి తీసుకురాగల్గిన స్వేచ్ఛానువాదకుడు. కనుకనే మనకు పోతన పాత్రల చేష్టలలో, ఆయన సృష్టించిన వాతావరణంలో సమకాలీన వ్యక్తులూ, సమాజమూ రేఖామాత్రంగా భాసిస్తాయి. ఇప్పటికీ తెలుగునేలలో పురాణపురుషుల ఆకృతులకు పోతన వేసిన వేషంతోనే పరిచయముంది. ఇతర కావ్యాలలో ఆయాపాత్రల లక్షణాలు ఎలావున్నా పోతన చిత్రించిన తీరే తెలుగు ప్రజాహృదయాలకు హత్తుకుపోయింది; శ్రీకృష్ణుడు—

''నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వురా
జిల్లెడు మోమువాఁడొకఁడు" గానే పొడకడతాడు.

యశోదమ్మను శ్రీకృష్ణుడు ఎన్నోతీరుల సతమత పెట్టినాడు. ఆమె అతని చేష్టలకు వేసరి పడినపాట్లూ ఇప్పటికినీ తెలుగిళ్ళలో చిరుతప్రాయంలోని పిల్లలు తల్లులతో ఆడుకునే ఆటలూ భాగవతం ఇప్పటిపుస్తకమేనేమో అన్నంతభ్రాంతిని కలిగిస్తాయి.

గోపబాలకులతో శ్రీకృష్ణుడు చలుదులు తినే ఘట్టంలో పోతన శ్రీకృష్ణుణ్ణి దర్శించినతీరు ఎంత సహజమైనది! ఎంత హృదయావర్జకమైనది! "లోక రక్షైకారంభకుడు, భక్తపాలన కళాసంరంభకుడు, దానవోద్రేక స్తంభకుడు, కేళి లోలవిలసద్దృగ్జాల సంభూత నానాకంజాతభవాండకుంభకు"డైన శ్రీమన్నారాయ ణుణ్ణి బమ్మెరపోతన మహానందాంగనా డింభకునిగానే దర్శించినాడు. హరి వంశంలో మహాభారతంలో శ్రీకృష్ణుని వృత్తాంతం ఉంది. కాని కృష్ణుడు నాయ కుడుకాడు. మహాభాగవతంలోనూ కృష్ణుడు నాయకుడుకాడు. శ్రీమహావిష్ణువు దశావతారాల గాథాచయనం శ్రీమహాభాగవతం. నిజానికి మొదటి పద్యంలో కావ్యార్థసూచనచేస్తూ కవి విష్ణువు గుణాభివర్ణనం చేయవలసివుండెనేమో. విష్ణు కృష్ణులకు అభేదమున్నా 'మహానందాంగనా డింభకు'డుగా కావ్యనాయకుడు సంస్తుతింపబడడం పోతన్న హృదయాన్ని వ్యక్తం చేస్తున్నది. కావ్యం రామాం కితంగా ఉన్నా షష్ఠ్యంతాలు కృష్ణాంకితంగా ఉండడం మనకగుపించే విశేషం. భాగవత ప్రాశస్త్యాన్ని ఉగ్గడిస్తూ అవతారికలో "లలిత స్కంధము గృష్ణ మూలము" అన్న పద్యంలో శ్లేషానుప్రాణితంగా కృష్ణపారమ్యాన్నే చాటినాడు.

దశమస్కంధం శ్రీకృష్ణావతార ఘట్టానికి అంకితమైనట్టిది. దీనిని ఒక ప్రబంధంగా, ఆ ప్రబంధానికి శ్రీకృష్ణుణ్ణి నాయకుడుగా పోతన్న చిత్రించినాడంటే సముచితంగా ఉంటుంది. శృంగారం, వీరం, అద్భుతం, హాస్యం వంటి రసా లకు కృష్ణావతారఘట్టం ఆలవాలమైనది. గోపబాలురతో అతని స్నేహం, కుచేలు నితో అతని మైత్రి, రుక్మిణితో అతని ప్రణయం, కాళీయమర్దనాది వీరోచిత జీవిత ఘట్టాలు, విశ్వరూప సాక్షాత్కారం గోవర్ధనోద్ధరణం వంటి అద్భుత దృశ్యాలు

శ్రీకృష్ణుని జీవితాన్ని పలుదృక్కోణాలతో పరిశీలించే అవకాశాన్ని కలిగిస్తాయి. ఈ అవతార ఘట్టంలోనే ఋతువర్ణనలూ, సూర్యోదయాస్తమయాది వర్ణనలూ ప్రవేశించి ప్రబంధమార్గాన్ని చూపిస్తాయి. భ్రమరగీతలు గోపికాగీతలు పోతన్న ప్రతిపాదించదలచిన మధుర భక్తిభావాన్ని కవితాత్మకంగా ఉన్మీలించగలుగుతున్నాయి.

యవనసేనల దాడికి కాకతీయసామ్రాజ్యం అస్తమించిన తరువాత ముసునూరి కాపయ ప్రోలయనాయకులూ, రెడ్డి వెలమ ప్రభువులూ ఉన్నంతలో జాతీయ శక్తులను సమీకరించి చిన్నచిన్న రాజ్యాలను స్థాపించి హైందవ ధర్మ పతాకాన్ని రెపరెపలాడించినారు. పీడితులకు తాడితులకు రక్షణ కల్పించే నాయకుని కోసం ఎదురు చూస్తున్న ఆనాటి హైందవ ప్రజానీకానికి ఒక సముద్ధారకుడెవడో రావాలనే భావం ఉత్కటంగా ఉండేది. కంసుని హింసాత్మకచర్యలకు ప్రతిక్రియలు చేస్తూ ఇంద్రుని మనోభీష్టానికి ఎదురొడ్డి నిలిచి గోవర్ధనగిరిని ఎత్తి చివరకు ప్రజాకంటకుడైన కంసుని సంహరించి కారావాసంలోని తల్లిదండ్రులనూ రాజలోకాన్నీ విముక్తులను చేసి నాటి ప్రజాళి సంరక్షకుడైన ఒక మహా నాయకుడుగా శ్రీకృష్ణుడు నిలిచినాడు. భీకరమైన ఆ కాలాన్ని చూచిన పోతన శ్రీకృష్ణుణ్ణి ఒక లీలామానుష విగ్రహుడుగానే గాక ఒక ప్రజానాయకునిగా దర్శించగలిగినాడు. కనుకనే శ్రీకృష్ణుణ్ణి సాహసికుడైన వీరమూర్తిగా చిత్రించగలిగినాడు - అక్రూరుడు శ్రీకృష్ణుని ఉద్దేశించి-

"...పాషండముఖర మా
ర్గములచేత నిజగద్ధితార్థ
మైన వేదమార్గ మణగిపో వచ్చిన
నవతరించి నిలుపు దంబుజాక్ష"

అని అన్నాడు ఇక్కడ. పాషండ శబ్దం రాక్షసపరము కాదు. వేదమార్గం అనగా హిందూమతమే. శ్రీకృష్ణునిలో తాను ఊహించుకున్న ఒక మహానాయకుని దర్శించినాడు పోతన్న.

పోతన్న భావవీథిలో పొడకట్టిన శ్రీకృష్ణస్వరూపం-

> "కర్ణాలంబిత కాకపక్షములతో గ్రైవేయ హారాళితో
> స్వర్ణభ్రాజిత వేత్రదండముతో సత్పింఛదామంబుతోఁ
> బూర్ణోత్సాహముతో ధృతాన్నకబళోత్ఫుల్లాబ్జహస్తంబుతో"నే

నేటికీ ప్రతి ఇల్లాలికి తన కొడుకులో కనిపిస్తుంది. ఇది పోతన్న సాధించిన తపస్సు. వ్యాసుడన్న దానిలో తాను కన్నదానిలో భేదమున్నది; భేదమంటే అనుభూతి భేదం. చదివి, పాండితీ ప్రకర్షతో వ్రాసినదికాదు. చదివి, అనుభవించి సహజ పాండిత్య ధోరణిలో వ్రాసినది. యథార్థానుభూతిని ప్రకటించడానికి కావలసిన సామర్థ్యం అతనికి జన్మతో అబ్బినది. సంస్కారం దానికి మెరుగు పెట్టింది. అదే సహజ పాండిత్యం.

మధురానగరానికి బలరామకృష్ణులను తోడ్కొని పోవుటకు వెళ్ళిన అక్రూరునికి పోతన చూపించినది మన తెలుగుపల్లెనే. ఒక దీర్ఘమైన వచనంలో, పోతన్న స్వభావోక్త్యలంకారానికి రేపల్లెను ఆలవాలంగా చేసినాడు. ఆ అక్రూరునికి కనిపించిన బలరామ కృష్ణులు - పద్మనేత్రులట; రంగద్గాత్రులట; ధేను దోహనవాటీ గతుల నలంకృతులట; ఉద్యద్భాసులట; పీతనీల నవీనోజ్జ్వల వాసులట; కుసుమ మాలాధారులట; ధీరులట; వనితాకాములట. జగద్వంద్య క్రమోద్దాములట. కనుకనే——

> "వీఁడులేకున్న పుర మటవీస్థలంబు
> వీనిఁబొందని జన్మంబు విగతఫలము
> వీనిఁ జూడని చూడ్కులు వృథలు వృథలు"

సౌందర్యాధి దేవతగా, వీరావతారమూర్తిగా, శత్రు నిర్మథన ధనుడుగా, అభయ ప్రదాతగా, పసివాడుగా, అఘటనఘటనా సమర్థుడుగా, భగవత్స్వరూపుడుగా భాగవతంలో శ్రీకృష్ణుడు ఆయా ఘట్టాలలో దర్శనమిస్తాడు. కాని పోతన్న దృష్టిలో శ్రీకృష్ణుడు సర్వలక్షణ సంపన్నుడైన ఒక మహాపురుషుడు. వ్యాసుడు కృష్ణుణ్ణి పరమాత్మగా చిత్రించుటచేత అతని హృదయానికి భిన్నమైన మార్గాన్ని త్రొక్కక వ్యాసుని అనుసరిస్తూనే శ్రీకృష్ణుని ఒక విలక్షణమైన వీరపురుషునిగా చిత్రించి, అభివర్ణించి, ఆదర్శమూర్తిగా 'రసికభావవిదు'లకు అందించినాడు.

శ్రీకృష్ణుడు గుణరాశి ఆతని గుణపరీమళాలు ఎల్లలు దాటి ప్రసరించినవి. గుణాలను విని రుక్మిణి ప్రేమించింది. ఇష్టంలేని పెళ్ళి చేసుకోలేక సందేశం పంపింది. సందేశం అందుకున్న కృష్ణుడు సరియైన వేళకువచ్చి అనిష్ట వివాహం నుంచి ఆమెను తప్పించి, వీరోచితమైన పోరాటం చేసి ఆమెను చేపట్టినాడు. ఇక్కడ అద్భుతమేదీ లేదు. విశుద్ధ ప్రణయమున్నది. రుక్మిణి మనకు శ్రీకృష్ణుని భార్య. కాని శ్రీకృష్ణుడు పరమాత్ముడు. ఆమె భక్తురాలు. తన్ను ప్రేమించిన వారికి అన్నివిధాలా సంరక్షణ కల్పించేవాడు పరమాత్ముడు కాక ఏమవుతాడు? పరమాప్తుడే పరమాత్ముడు. ఈ స్నేహరహస్యాన్ని పోతన్న చిత్రించిన వైనం అపూర్వం. ఇదే విధంగా సత్రాజిత్తు తనపైన వేసిన అపనిందను మాపుకోడానికి జాంబవంతునితో వీరోచితంగా పోరాటంచేసి తన పురుషాకారాన్ని ప్రదర్శిస్తాడు. నిందను మాపుకుంటాడు. అనందితేందువదన సత్యభామను చేపట్టుతాడు. జాంబవతీకరగ్రహణం చేస్తాడు. భాగవతంలో శ్రీకృష్ణుడు తన పురుషకారానికి పర్యవసానంగానే భార్యలను పొందుతాడు. వీరశృంగారమూర్తి కనుకనే పదహారు వేలమంది గోపికల ఓపికలను దోచుకొనగలిగిన ప్రణయ మూర్తిగా కనిపిస్తాడు భాగవతంలో. రాసక్రీడాభి వర్ణనంలో కృష్ణుడు నృత్యమూర్తిగా, వేణుగానకళా విశారదుడుగా సాక్షాత్కరిస్తాడు.

తెలుగు కావ్యోద్యానంలో పోతన్న భాగవతం రమణీయ కవితా సరోవరం. అందులో దశమస్కంధం స్వర్ణకమలం. ఆ కమలం నడుమ పరిభ్రమిస్తుంది శ్రీకృష్ణ కథామిళిందం.

మనస్సుకు కూడా అప్రాప్యమైన ఆ పరమాత్మ స్వరూపాన్ని పోతన్న తన కవితాచక్షువుతో దర్శించి కలకాలం తెలుగువాళ్ళు చూసుకుని తరించే పద్ధతిలో చిత్రించి ధన్యుడైనాడు. అందుకే అన్నారు విశ్వనాథ 'పోతన్న తెలుగుల పుణ్యపేటి' అని*

---

* పోతన పంచశతి మహోత్సవ సంస్మారిక 'పోతన భాగవత నీరాజనము'లో ప్రచురితం. ముద్రణ. 1982.)

19. తెలుగు కథారచయితలు

"సున్తాహుఁ గౌర్ సే అఫ్సానయే హస్తి
కుఛ్ ఖాబ్ హై కుఛ్ అస్ల్ హై కుఛ్ అందాజె బయాఁ హై"

సృష్టి కథను సావధానంగా వింటున్నాను. కొంత స్వప్నంగా ఉంది. కొంత యథార్థంగా ఉంది. కొంత కథన కౌశలం ఉంది. ప్రసిద్ధ ఉర్దూ కవి అస్గర్ గొండ్వీ సృష్టిని ఒక కథగా ఊహించి కథకు ఉండవలసిన లక్షణాలను ధ్వనింపజేసినాడు. స్వప్నం అంటే కల్పన. యాథార్థ్యం అంటే వాస్తవం. కథన కౌశలం అంటే భాష, శిల్పం ఇత్యాది. ఈ మూడు లక్షణాలూ కథా నిర్మాణానికి ఆధారశిలలు. కథానిక ఒక సాహిత్య ప్రక్రియగా భారత దేశంలో చాలా కాలం నుంచి అనేక రూపాలతో ప్రజా బహుళ్యంతో పెనవేసుకుని వస్తున్నది. వేదాలలో, ఉపనిషత్తులలో, ఇతిహాసాలలో, పురాణాలలో, జానపదుల నోళ్ళల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా కదలుతూ మెదులుతూ కథా సాహితి ప్రజా సందోహానికి సద్యః పరనిర్వృతిని కలిగిస్తూనే వస్తున్నది. మహాకవులు చెప్పిన ప్రతి చాటుపద్యం చాటున ఏదో ఒక కథ ఉండనే ఉంటుంది. సామెతలన్నీ కథలను పుక్కిలిస్తూనే ఉంటాయి. ఎన్నో పదబంధాలకు కథలే పురుడు పోసినవి. కేవలం ఆనందం కోసమే కొన్ని కథలు పుట్టినవి. ప్రబోధం కోసమే కొన్ని కథలు పుట్టినవి. విజ్ఞానాన్ని నూరిపోయడానికే కొన్ని కథలు పుట్టినవి. తెలుగులో సాహిత్యసృష్టి జరగటానికి పూర్వం సంస్కృతంలో రసరుచిరములైన, అద్భుతావహములైన, కల్పనా కమనీయములైన కథా సంకలనాలు ఎన్నో వచ్చినవి. శాలివాహనుల కాలంలో పుట్టిన బృహత్కథ (కథాసరిత్సాగరరం) ప్రపంచ వ్యాప్తమైన కథలకు పుట్టినిల్లు. అదేకాలంలో పుట్టిన గాధా సప్తశతిలో ప్రతి శ్లోకంలో ఒక కథ పూవులో తావిలాగా అమరిపోయింది. దండి దశకుమారచరిత్రం పైకి పది కథలూ, లోన మరిన్ని కథలను ఇముడ్చుకున్న కథా మధుకోశం. ఇక మన తెలుగులోని పురాణేతిహాసాలన్నీ కథలే. కొన్ని సూతుడు చెప్పినవి. కొన్ని శుకుడు చెప్పినవి. కొన్ని వైశంపాయనుడు చెప్పినవి. నారదుని వలన వాల్మీకి

రామకథనువిని రామాయణ కావ్యంగా మలచినాడు. తులసీదాసు తన రామాయణంలో శివుడే పార్వతికి రామాయణం చెప్పినట్లుగా ఉల్లేఖించాడు. వ్యాసశిష్యుడు "పుణ్యకథా కథన దక్షుడ" ట. శ్రీనాథుని హరవిలాసం ఇంపు సొంపుల వెదజల్లు కథల హరివిల్లు. శుకసప్తతి, హంసవింశతి, సింహాసన ద్వాత్రింశిక నవనాథ చరిత్రం, కేతన దశకుమార చరిత్రం, నారాయణకవి పంచతంత్రం లాంటి కథాకావ్యాలు తెలుగులో వెలువడినవి. అయితే అక్షరాస్యులు పరిమితంగా ఉన్న ఆ కాలంలో విద్వాంసులకు మాత్రమే ఈ కథా కావ్యాలు తృప్తినివ్వ గలిగినవి. పామరజనం జిహ్వాగ్రాలపై లాస్యమాడే కథలు పుస్తకాల కెక్క లేదు. వారి బ్రతుకు బరువులతో చెట్టపట్టాలు పట్టుకుని పయనిస్తూనే ఉన్నవి. కొన్ని సందర్భాలలో ఈ జానపదుల కథలు పండితుల కావ్యాలలోకి చొరబడినవి. నిన్న మొన్న అశేష ఆంధ్రావళిని ఆకట్టుకున్న మధిర సుబ్బన్న దీక్షితుల 'కాశీ మజిలీ కథలు' తెలుగు కథాసాహితి సాధించిన సిద్ధికి అపురూప నిదర్శనం.

మింటి కెగసే కల్పన, మంటిని మాయం చేసే అద్భుతాలూ, పలువురికీ అందుబాటులోలేని భాషా శౌండీర్యం, బహుశాస్త్ర పాండితీ గరిమ ప్రాచీన కథా సాహితికి లక్షణాలుగా ఉండినవి. అయితే ప్రాచీనాంధ్ర మహాకవులలో కథా కథన కౌశలాన్ని ప్రదర్శించినవా రనేకులు. నన్నయ "ప్రసన్న కథాకలితార్థ యుక్తి" అందరూ ఎరిగినదే.

నవల, వ్యాసం, పత్రికా రచన, ఆత్మకథ మొదలైన ఆధునిక సాహిత్య ప్రక్రియలవలె కథ కూడా పాశ్చాత్య వాఙ్మయ ప్రభావంతో తెలుగులో ప్రవేశించిందని ఎవరైనా అనుకుంటే అది పూర్వాపరాలు ఆలోచించి అనుకున్న మాట కాదని నిశ్చయంగా చెప్పవలసివస్తుంది. ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక అనే కథాభేదాలను ప్రాచీన సాహిత్య శాస్త్రజ్ఞులు గుర్తించినారు. మహాకావ్యాలలో పురాణేతిహాసాలలో ఈ కథాభేదాలన్నీ కనిపిస్తాయి.

ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో కథ కావ్యమర్యాదలను పులుముకున్నది. ఛందోబద్ధంగా సాగింది. ఛందస్సుకు ఎన్ని బంధాలో పాఠకులకు అన్ని బంధాలు. కాని నేటి కాలంలో కథానిక సరళమైన వచనంలో సాగే ప్రక్రియ. అన్వయ కాఠిన్యంలేని చిన్న చిన్న వాక్యాలతో ఈ ప్రక్రియ సామాన్య అక్షరాస్యుల కందు

రకూ అందుబాటులో ఉంటుంది. ఈనాటి సమాజంలోని పరిస్థితులనుబట్టి 'సూక్ష్మంలో మోక్షం'గా ఈ ప్రక్రియ ప్రజల ఆదరాభిమానములను చూరగొంటున్నది. అనాయాసంగా ఆనందాన్ని ప్రసాదిస్తున్న ప్రక్రియ ఇది. కథలేని పత్రిక అరుదు. కథలేని రేడియో కార్యక్రమం చప్పచప్పగానే ఉంటుంది. పిల్లలకూ కథలే కావాలి. పెద్దలకూ అంతే. ఎంత గహనమైన అంశం అయినా సరే, కథగా కూర్చి చెప్పితే మనస్సులో నాటుకుంటుంది. కథలో కల్పించిన వాతావరణం పోతుంది, పాత్రలు పోతారు స్మృతి పథంలోనుంచి. కాని కథ కలిగించిన సంస్కారం మిగిలిపోతుంది. కథ అందించిన అనుభూతి మిగులుతుంది. కథ అందించిన సందేశం మనః ఫలకంపై ముద్రితమై పోతుంది. అందుకే అది విశిష్ట ప్రక్రియగా రూపొందింది.

వెనుకటివలె ఇప్పుడు కథాకావ్యాలు - వచన కవితల్లో వెలువడుతున్నవి. అయితే అవి కావ్యజాతికి సంబంధించినవి. వాటి ప్రసక్తి ఇక్కడ అనావశ్యకం.

కడచిన ఏడు దశాబ్దాల నుంచి తెలుగులో కథానిక ఉత్తమ సాహిత్య ప్రక్రియగా రూపొందినది. ఉత్తమ కథా రచయిత ఉన్నత ప్రమాణాలు అందుకున్న సాహిత్యస్రష్టగా గుర్తింపబడుతున్నాడు. అన్ని సాహిత్య ప్రక్రియలు ఈనాడు పరిమాణంలో చిన్నవిగా అవతరిస్తున్నవి. రసస్ఫోరకమైన రచన, పాఠకులను ఆలోచనాధీనులను చేయగలిగే రచన, దైనందిన జీవితానుభవానికి చాలా సమీపంగా ఉండే రచన, వివేకోదయానికి ఉపస్కారంగా ఉండే రచన ఇప్పుడు ఉత్తమ సాహిత్య మనిపించుకుంటున్నది. ఏ ప్రక్రియను సృష్టించదలచుకున్నా, రచయిత ఆలోచనలకు తాత్త్వికమైన భూమిక ఉండాలె. జనసామాన్యంలో ప్రాచుర్యంలో ఉన్న భాషతోనూ, నుడికారంతోనూ మంచి పరిచయం ఉండాలె. దేశ ప్రజల ఆచార వ్యవహారాలతోనూ, బ్రతుకుబరువులతోనూ, ఇతిహాసంతోనూ చక్కని పరిచయం ఉండాలె. ప్రక్రియలో నిష్ణాతులైన రచయితల సాహిత్యంతో తలస్పర్శి పరిచయం ఉండాలె. వాళ్ళు చెప్పనిది చెప్పాలనే కుతూహలం ఉండాలె. ఇతివృత్తంలోనో, కథన కౌశలంలోనో, భాషా విన్యాసంలోనో కొత్తదనం చూపెట్టగలిగినప్పుడే రచనకు పూనుకోవాలె. అయితే ఈ లక్షణాలన్నీ ఉత్తమ సాహిత్య కళా స్రష్టవి. కథా రచయిత కూడా ఈ లక్షణాల పరిధిలో వ్యవహరించవలసినవాడే.

తెలుగు కథా రచయితలలో అపూర్వ ప్రమాణాలు అందుకున్న బుచ్చిబాబు కథానికా ప్రక్రియనుగూర్చి చెప్పిన కొన్ని అభిప్రాయాలను అక్కడ ఉదాహరిస్తున్నాను.

విశ్వవిఖ్యాత రచయిత మామ్‌ను గురించి వ్రాస్తూ బుచ్చిబాబు :

"మామ్ చాలా కథలు వ్రాసినా రెండు మూడింటినే విమర్శకులు గొప్ప కథలుగా పేర్కొంటున్నారు. ఊహాబలం, కవితాశక్తి, జీవితం పట్ల ఉండాల్సిన గౌరవభావం మామ్ కథలలో లోపించడంవల్లనే అవి అంత సంతృప్తికరంగా ఉండవు. రచనా విధానంలో గొప్పశిల్పం ఉంది. అది వేరే విషయం. అందరూ ఆ కథలన్నిటినీ చదువుతారు. పెదవి చప్పరిస్తారు."1

"మళ్ళీ మళ్ళీ చదివించే ఖండ కావ్యంలా కొనసాగాలంటాను కథానిక."1
"కథ కెరటంగా కనపడాలి. ఆ కెరటం వెనక సముద్రం హోరు వినబడాలి."3

"బాహ్యజగత్తులో వస్తువు ఎంత అద్భుతమైనదైనా, అది కథకు అంతరంగ జగత్తులో ఆవిర్భవించే ఒక కళాదృష్టితో సమన్వయం కుదిరితనదైనప్పుడుగాని, లేకపోతే రచయిత ఆ వస్తువుని స్వీకరించడం మూర్ఖత్వం అనుకుంటాను.''4

''కల్పన లేకుండా మంచి కథ వ్రాయొచ్చు- కాని "అది గొప్పకథ అవుతుందా అని నా అనుమానం.''5

కథా నిర్మాణాన్ని గురించి బుచ్చిబాబు "కథా - దాని కమామీషు'' అనే వ్యాసంలో ఈ భావాలను ప్రకటించినాడు. ఈ భావాలను పరిశీలిస్తే కథానికా

1, 2, 3, 4, 5, కథా - దాని కమామీషు - నన్ను మార్చిన పుస్తకం (వ్యాసాలు) బుచ్చిబాబు; ప్రచురణ; ఆదర్శ గ్రంథ మండలి, విజయవాడ, 1965.

రచన ప్రతిభాశాలితునికే సాధ్యమనీ, దైనందిన జీవితంలో తారసిల్లే సంఘటనలను, తాత్త్వికంగా పరిశీలించే శక్తి ఉన్నవారికే సాధ్యమనీ. తక్కువ వ్యవధిలో అపరిమితమైన మనఃప్రపంచాన్ని చూపగలిగే శక్తి ఉన్నవానికే సాధ్యమనీ, జరిగిన సంగతులను యథాతథంగా వ్రాయడం కాదనీ తెలుస్తుంది. కావ్యంలో మనకు కనపడే వినపడే పదాల వెనుక ఉన్న గంభీరమైన, రమణీయమైన అర్థం స్ఫురిస్తుంది. ఆ విధంగానే కథలో కూడా సన్నివేశాలూ, పాత్రలూ, సంభాషలూ, వర్ణనలూ జీవితానికి సంబంధించిన ఏదో ఒక విశ్వసనీయమైన యాథార్థ్యాన్ని స్ఫురింపజేయగలగాలె. అయితే ఈ అంశాల పునాదులు పుడమిని దాటి పోకూడదు. నిన్న మొన్నటి సంగతులు కథలుగా మారినా, వాటిలోనూ ఇప్పటి అనుభూతులే, ఇప్పటి వ్యక్తులే, ఇప్పటి పరిస్థితులే పరిమళిస్తూ ఉండాలె.

కథలో పాత్రలు ఎక్కువగా వుండవు. ఒకటి రెండు సంఘటనలు మాత్రమే కథానిక మూల ద్రవ్యాలుగా ఉంటాయి. పాత్రల సమగ్ర జీవిత చిత్రణం నవల్లో వలె కథానికలో ఉండదు. మనిషికి సంబంధించిన ఒక గుణమో, దోషమో, ఒక తీరో, ఒక మనస్తత్వమో, ఒక అనుభవమో కథానిక అంతటా పరచుకొని ఉంటుంది. కథానిక అతి దీర్ఘంగా ఉండదు. పది పదిహేను నిమిషాలలో చదువుకోవడానికి వీలుగా ఉండాలని కొందరు విమర్శకులన్నారు.

వాస్తవిక జీవితానికి అద్దాలై వెలసిన ఈ కథానికలు సంఘంలోని మంచి చెడ్డలనూ. కళా ప్రియత్వాన్నీ, భాషా విన్యాసాన్నీ చక్కగా ప్రదర్శింపగలిగినవి. తెలుగు దేశంలోని అన్ని ఊళ్ళూ, ఏళ్ళూ, చెట్టూ చేమా, గుట్టా పుట్టా, యాసా భాషా, కట్టుబొట్టు, జుట్టు, కన్నీరు పన్నీరూ అన్నీ ఉన్నవి మహాకావ్య నిర్మాణ దక్షులు కూడా ఈ కథానికా రచనను చేపట్టి, అది సామాన్య విషయం కాదని భంగ్యంతరంగా నిరూపించినారు.

కథానికా రచనకు పడికట్టు రాళ్ళవంటి నిబంధనలు ఏవీ లేకపోయినా పాఠకులను ఉర్రూతలూగించి ఉత్తమ కథలుగా ప్రసిద్ధి పొందిన వాటిని పరిశీలిస్తే మంచి కథ చెప్పేతీరును కొంచెం అవగతం చేసుకొనవచ్చు. అవసరానికిమించిన సంభాషణలు మంచి కథలో ఉండవు. కథా ప్రదేశాలనూ కథలోని పాత్రలనూ వివరించాలనే కాంక్షతో సుదీర్ఘమైన వర్ణనలు చేయడానికి వీలుండదు. ఇలాంటి

వివరణలు నవలలో చోటు చేసుకొన్నప్పుడు, లేదా దీర్ఘమైన సంభాషణలు సాగినప్పుడు ఆ ప్రక్రియకున్న విపులమైన పరిధిలో అవి కమ్ముకుపోతాయి. కాని కథానికలో ఇవి ఎబ్బెట్టుగా తోచి కథోద్దేశానికే భంగం కలిగిస్తాయి. నవలల్లో, నాటకాల్లో, కావ్యాల్లో రచయిత భాషను ఇష్టం వచ్చినట్లుగా మలచుకోవడం, ఒక ప్రత్యేకమైన శిల్ప విన్యాసాన్ని భాషా చమత్కారాన్ని ప్రదర్శించడానికి, ప్రత్యేకమైన పాత్రలనే సృష్టించినట్లు మనకు కనిపిస్తుంది. కథానికలో ఇంత వాగ్విన్యాసానికి ఆస్కారం ఉండదు.

ఒకటి రెండు సంఘటనలు లేదా ఒక రకమైన మనస్తత్వాన్ని చిత్రించడానికి కథా సృష్టి జరుగుతుంది. కనుక కథకు పేరు పెట్టడం కూడా కళే. శీర్షికా సంవరణంలోనే కథాశిల్పం ద్యోతకమవుతుంది. మొదటి వాక్యం పాఠకుని హృదయ క్షేత్రంలో ఉత్కంఠను అంకురింపజేయకపోతే ఆ కథకు ప్రాచుర్యం కలగడం కష్టం.

ఇతర సాహిత్య ప్రక్రియలవలెనే కథారచన కూడా ప్రతిభాసంజనితమే. ఎవడు కథకుడు అన్న ప్రశ్నకు బుచ్చిబాబు సమాధానం :

"జీవితంలో తాను తెలుసుకున్న విషయాలను కుదించి కథగా సమకూర్చడంలో తాను పొందిన అనుభూతిని కళగా మార్చి ఇతరులతో పంచుకునేటందుకు కృషి చేసేవాడు."1

కథకుని లక్షణం ఇది. బుచ్చిబాబు ఈ తెలుసుకోవడాన్ని ఇంకా ఇలా వివరించినాడు:

> "తెలుసుకోవడం రెండు మూడు విధాలుగా ఉంటుంది; ఒక విషయాన్ని స్వానుభవం ద్వారా తెలుసుకోవడం; ఇతరులకు జరిగిన వాటిని-విన్నవీ; చదివినవే, చూసినవీ- పరోక్షంగా తెలుసుకోవడం, మూడోది ఊహ ద్వారా తెలుసుకోడం; మొదటి రెండు సాధ్యమైన తరువాతగాని ఇది సాధ్యపడదు."2

1, 2. కథకుడి అంతరంగికం-నన్ను మార్చిన పుస్తకం - బుచ్చిబాబు.

రచయితకు ఊహలు ఊరకేరావని బుచ్చిబాబు హృదయం. వినడం వల్ల, చదవడం వల్ల, చూడడం వల్ల కలుగుతాయి. అంటే ప్రాచీనాలంకారికులు చెప్పిన 'లోక శాస్త్రాద్యవేక్షణం' కథకునికి కూడా అవసరమని మనం తెలుసుకోవలసి ఉంటుంది. కేవలం తాను చూసింది చూసినట్లుగా వ్రాసినంత మాత్రాన అది కళా సృష్టికాదు. మంచి కథకాదు. 'కథా దాని కమామీషు' అనే వ్యాసంలో బుచ్చిబాబు :

"జీవితంలో ఎదుర్కొన్న యథార్థాన్ని సాహిత్యంలో ఎదుర్కొంటే హర్షించడు పాఠకుడు. అతనికి కావలసింది కళానుగుణమైన సత్యం: నగ్న సత్యం కాదు" అని వివరించినాడు.

తెలుగులో ఉత్తమ కథకులుగా ధ్రువతారలుగా నిలిచిపోయినవారు కొందరే ఉన్నారు వారి కథలను పరిశీలిస్తే, వారెంత మనీషులో, ఎంత అనుభవజ్ఞులో మనకు తెలుస్తుంది. గురజాడ, విశ్వనాథ, వేలూరి శివరామ శాస్త్రి, బుచ్చిబాబు, గోపీచంద్, చలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, కొడవటిగంటి, కరుణకుమార, చా.సో., పాలగుమ్మి పద్మరాజు, చింతా దీక్షితులు, అడవి బాపిరాజు, కాశీపట్నం రామారావు, జమదగ్ని, మా గోఖలే, అమరేంద్ర, పంతుల శ్రీరామశాస్త్రి, రాచకొండ విశ్వనాథశాస్త్రి, ఆచంట శారదాదేవి, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, కొమ్మూరి వేణుగోపాలరావు, మధురాంతకం రాజారాం, శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి, సత్యం శంకరమంచి, రావూరి భరద్వాజ. ఇంకా మరెందరో కథా రచయితలు కథా ప్రపంచానికి ఎనలేని అలంకారాలుగా ప్రకాశిస్తున్నారు.

విశ్వవిద్యాలయాలలో కథా సాహితి అధ్యయన, పరిశోధన పరిధుల్లోకి ప్రవేశించింది. ఇప్పుడీ సాహిత్య ప్రక్రియకు సంబంధించిన పరిజ్ఞానం లేకపోవడం ఆధునిక సాహిత్యంతో సమగ్ర పరిచయం లేకపోవడ మనిపించుకుంటుంది. వేల సంఖ్యలో వెలువడుతున్న కథలను, కథకుల సామర్థ్యాలను పరిశీలించవలసిన అగత్యం ఏర్పడినది. ఉత్తమ కథలకు పత్రికలు పోటీ పెట్టి బహుమతులు అందజేసి ప్రోత్సాహాన్ని, ప్రాచుర్యాన్ని కలుగజేస్తున్నాయి. కథా సంకలనాలు అనుదినం వెలువడుతున్నవి. తెలుగు కథలు ఇతర భారతీయ

భాషల్లోకి, ఇంగ్లీషులోకి అనువదింపబడుతున్నవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రతి సంవత్సరం ఒక ఉత్తమ కథకునికి బహుమతి అందచేస్తున్నది. ఎన్నిక చేసిన ఏడు కథా సంకలనాలను అకాడెమీ ఇంతవరకు ప్రచురించినది.

తెలుగు కథకు చక్కని రూపురేఖలు కల్పించి, ఒక శక్తిమంతమైన ప్రక్రియగా మలచి కథాసాహితికి ప్రయోజనాన్ని కల్పించిన తెలుగు కథకులను గూర్చి విమర్శనాత్మకమైన వ్యాసాలను విద్వాంసుల చేత వ్రాయించి ప్రచురించాలని అకాడమీ నిశ్చయించి ఒక ప్రణాళికను రూపొందించినది.*

* 'తెలుగు కథారచయితలు' గ్రంథంలో 'తొలిపలుకు'గా ప్రచురితం. ముద్రణ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1982)

20. భీమన్న నాటక సాహితి

కవిత్వం ఒక కళ అనీ, అది జన్మతః స్వతస్సిద్ధంగా మానవునికి ఉపలబ్ధమయ్యే ప్రతిభా విశేషమనీ భీమన్న విశ్వాసం. వేదాలన్నా అవి ప్రపంచిస్తున్న జ్ఞానమన్నా భీమన్నకు ఎంతో ఆదరం. ఎంతో గౌరవం. పురాణాల్లో ఇతిహాసాల్లో ఋషులు చెప్పిన కథలు కేవలం కల్పనలు కావనీ స్వార్థపరుల వ్యాఖ్యానాల వల్ల అవి రకరకాల స్వప్రయోజనాలకూ అహంకారాలకూ అజ్ఞాన తిమిరాలకూ దారి తీసినవనీ ఆయన తలపోత. ఇంకా సత్యాన్వేషణకు అవకాశాలు ఎక్కువ కావాలనీ కులమత వ్యవస్థకు దారితీసిన పరిస్థితులు హేతుబద్ధంగా వెలువరింపబడాలనీ మిడిమిడి జ్ఞానంలో వేదవిహితాలైన ధర్మాచరణాలను వ్యాఖ్యానించకూడదనీ ఆయన తమ నాటకాలలో వెల్లడించినారు. వాల్మీకి, రాగవాసిష్టం, బాలయోగి నాటకాల పీఠికల్లో ఆయన ఆలోచనలకు ప్రాతిపదికలు మనకు లభిస్తాయి. భీమన్న సాహిత్య వ్యక్తిత్వం కవిత్వాధీనం. కవితలు వెలయిస్తున్నప్పుడు ఆయనకున్న స్వేచ్ఛా ప్రవృత్తి నాటక రచనలో మరో రూపంలో ప్రతిబింబిస్తుంది. సన్నివేశ కల్పనలో పాత్ర సృష్టిలో సిద్ధాంత ప్రతిపాదనంలో ఆయన కొన్ని కట్టుబాట్లను ఏర్పరచుకుంటారు. అనన్య పరతంత్రమైన నవరసమైన హ్లాదైకమయమైన కవిత్వం వేరు. ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి ప్రతీకాత్మకమైన పాత్రలను సృష్టించి విజ్ఞాన స్ఫోరకాలైన సన్నివేశాలను సృష్టించి ఆలోచనాత్మకాలైన సంభాషణలను కల్పించి నాటకం వ్రాయడం వేరు. సాంఘిక నాటకాల కంటె పౌరాణిక నాటకాలలో భీమన్న దృక్పథం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కవిగానే కాక నాటక కర్తగా ఆయన అలవరచుకున్న లోకాలోకనం చాలా అరుదైన అంశం. తాను కల్పించిన సన్నివేశాలకు ఆధారాలను గూడా పేర్కొన్న సందర్భాలున్నాయి. అయితే ఆకారాన్ని నాటకాంశంగా అవతరింపజేయడంలో భీమన్న చూపే మెలకువలూ పనితనాలూ భాషా ప్రయోగ విలక్షణతా ఛందస్సంయోజనమూ అతివిశిష్టంగా ఉంటాయి. నిపుణుడయిన నాటక కర్త చతుర్విధాభినయాలను దృష్టిలో ఉంచుకోవలసిన మాట సర్వత్రా సామాన్యమే అయినా వాచికాభినయానికి అనుగుణమైన లేదా

ఉపస్కారకమైన సంవాద ఫణితిని అనుసరించవలసి యుంటుంది. వేషభూషలెంత బాగున్నా అంగాంగాలలో ఎంత కదలిక ఉన్నా సాత్త్విక వ్యాపారాలు ఎంత ప్రస్ఫుటంగా ఉన్నా సముచితవాక్సంయోజనం లేనిదే రూపకం రక్తికట్టదు. మాటలు లేని నృత్యం హృదయావర్జకం కావచ్చు, కానీ నృత్యానికి సాహిత్యం కూడా అంటే వచోవిన్యాసం కూడా తోడైతే అది మరింత రసాద్భుతికి కారణమవుతుంది. భీమన్న నాటకాలలో వాచికాభినయానికి ఇతరాభినయ విశేషాల కంటే విశేష ప్రాముఖ్యముండటం గమనార్హం. దీనికి కారణం భీమన్న ప్రథమతః శబ్దార్థాలమీద అధికారం సాధించిన కవి కావడం. నాటక ప్రయోగంలో ఇంకెన్నో జాగరూకతలు అవసరం. అయినా భీమన్న నాటకాలలోని వాచికాభినయం ఆ పాత్రల సంభాషణ రీతి క్లుప్తమూ, అర్థవంతమూ అయిన వాక్యాలు సామాజికులను ఇట్టె ఆకట్టుకుంటాయి. పరిసరాలనూ వాటిని ప్రభావితం చేస్తున్న పరిస్థితులనూ అవగాహన చేసుకోగల లోకజ్ఞత భీమన్నకు పుష్కలంగా ఉందని ఆయన సాంఘిక నాటకాలు ప్రకటిస్తాయి.

సత్యము నసత్యముగ చూపజాలు నొకడు
లేని అపవాదు లెన్నొ కల్పించు నొకడు
మంచివానిని పడద్రోయనెంచు నొకడు
మానవత్వము నాశనమయ్యె నేడు.

స్వాతంత్ర్యభానూదయానికి పూర్వం భీమన్న వ్రాసిన 'అసూయ' అనే నాటికలోని పద్యమిది. నాటికి నేటికి ప్రజాజీవితాన్ని పట్టుకొని పీడిస్తున్న జాడ్యాలు ఈ నాటకంలో చక్కగా చిత్రింపబడినాయి. ఇది 'విద్యార్థి కాంగ్రేసోద్యమ నాటకము' అని ఆయనే పేర్కొన్నారు. రాజకీయరంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారితీస్తుందో ఈ నాటకం భంగ్యంతరంగా తెలుపగలుగుతున్నది. రాజకీయ నాయకులు తమ ప్రాబల్యం కోసం విద్యార్థులను పాచికలుగా ఉపయోగించుకునే తీరుతెన్నులు ఇందులో కనిపిస్తాయి. అయినా భీమన్న మేధావిత్వం విద్యార్థులలోని నిర్మాణాత్మక శక్తులను ఆనాడే గుర్తించగలిగింది. నీరసమైన రాజకీయేతివృత్తాన్ని భీమన్న మృదుమధుర గీతాలతోనూ చైతన్యపూరితమైన ప్రబోధగీతాలతోనూ మనోహరంగా తీర్చిదిద్దినారు.

"స్వేచ్ఛాజీవీ! విహరింపుము, మా
బానిస బ్రతుకులు తరియింప"

అని ప్రయాణానికి ప్రతీకగా కవులనుకున్న కోకిల నుద్దేశించి ఒక గీతంలో ప్రబోధాన్ని ధ్వనింపజేసినారు. వద్దాది సుబ్బరాయకవి 'భక్తచింతామణి' లోని ఒకటి రెండు పద్యాలను సముచితంగా నాటకంలో ఉటంకించి తన సాహిత్య నేతృత్వాన్ని సువ్యక్తపరచినారు భీమన్నగారు. "ప్రకృతిలాగా, ప్రపంచంలాగా రాజకీయాలు కూడా క్షణక్షణమూ మారుతూ వుంటాయి. నేడు మానవ సంఘానికి సోషలిజం మంచిదంటున్నాం. రేపు మరొక ఉత్తమమైన వ్యవస్థ ఏదో మనకు తట్టవచ్చు. మానవుని సౌఖ్యాన్వేషణలో ఇవన్నీ "చలివేంద్రలు, మజిలీలు" వంటి వాక్కుసుమాలను ఎన్నింటినైనా దూసి చూపవచ్చు ఈ నాటకంలోనుంచి. ఈ నాటకంలో సాహిత్యం ప్రయోగ సౌలభ్యం సమపాళ్ళల్లో సుందరంగా కుదురుకున్నాయి.

అజ్ఞానం నిరక్షరాస్యత చీకట్లలా సమాజంలో అల్లుకొనిపోతున్న రోజుల్లో వీరేశలింగం పంతులు బ్రహ్మసమాజాన్ని స్థాపించి కులమతాల అడ్డుగోడలనూ మూఢ విశ్వాసాల ఎండమావులనూ ఛేదించుకుంటూ కలాన్ని ఆయుధంగా పట్టి సంఘసంస్కరణోద్యమాన్ని సాగించినాడు. కాని నేటికి కూడా ఆయన ఆశయాలు సంపూర్ణంగా నెరవేరినట్లు కనబడదు. మనకు రాజకీయ స్వేచ్ఛ లేనప్పుడు ఆయన సాగించిన తపస్సు ఇప్పుడు మనకు అన్నివిధాలా స్వాతంత్ర్య మున్నా సాధించలేక పోతున్నాం. భీమన్న ఈ వైఫల్యంలో సతమతమై గ్రామీణ వాతావరణాన్ని 'పాలేరు' అనే నాటకంలో భూమికగా పెట్టుకొని సజీవ పాత్రలనూ వాస్తవికమైన పరిసరాలనూ సృష్టించి కొంత త్యాగం కొంత జ్ఞానం ఉంటే సర్వతోముఖ వికాసం సాధ్యమే అన్న ఆశావాదానికి సాధువాదం పలికినారు. ఈ నాటకంలోనూ భీమన్న తన కవితా కౌశలానికి పని కల్పించుకున్నారు. చక్కని ప్రబోధ గీతాలూ రసవంతాలైన సీసపద్యాలూ మాండలిక భాషా ప్రయోగం ఈ నాటకానికి ఎంతో రామణీయకతను ప్రసాదించినాయి.

"శ్రీమనోహ్యాష్టమీ గ్రామ జీవనమ్ము"

''కాళ్ళబడిపోయేటి గడ్డిపూలారా
సుందరాంగుల జటాశోభ మీకున్నదా
లోతుసంద్రాలలో పాతుకొన్న మణీ!
భరతమాతను గొల్చు భాగ్యమ్ము గల్గినా
దూరానగల పల్లెటూరి బాలకుడా
దేశభక్తులజాడ తెలిసి వర్తింతుహా
తడిలేని మడిలోన కడుబీదవడి యేడ్చు
ఓ తల్లి నీ కేక కొండైన పల్కునా''

''గుమ్మము దాటని మోడు జీవిలో
ఊహలున్న ఫలమేమి?''

''పగులగొట్టు నీ భిక్షాపాత్రము
తెగత్రెంపుము నీ శృంఖలము''

వంటి కవితాసౌరభాలను గుబాళించే పంక్తులీ నాటకంలో భీమన్న సంవేదనాత్మకమూ ప్రబోధాత్మకమూ అయిన హృదయాన్ని సాక్షాత్కరింప జేయగలుగుతున్నాయి. గ్రామీణ జీవనంలోని అజ్ఞానం అమాయికత అంతుపట్టని కట్టుబాట్లు ఈ నాటకంలో చక్కగా చిత్రింపబడినాయి. దాస్యశిశిరంలో మోడువడ్డ ఈ గ్రామాలకు మళ్ళీ స్వేచ్ఛావసంతం రానేవస్తుందని భీమన్న నమ్మకం. ఇదే సిసలైన అసలైన కవి నమ్మకం.

భీమన్నగారి 'కూలిరాజు' ప్రజాస్వామ్యవ్యవస్థపై ఆయనకున్న ప్రగాఢ విశ్వాసానికి ప్రతీక. హింసనూ ప్రతీకారాన్ని దౌర్జన్యాన్ని పో్ద్రోలి, సంఘటిత శక్తికి మరింత బలాన్ని చేకూర్చగలిగితే బడుగువర్గాల చేతిలోకి ప్రభుత్వం వచ్చి తీరుతుందని భీమన్న తీర్పు. అంతమాత్రం చేత భీమన్నకు విప్లవమంటే నమ్మకం లేదనికాదు అతని దృష్టిలో అది సహజమైన పరిణామం.

''జగత్తు పరిణామశీలం ఎల్లప్పుడూ పురోగమిస్తూనే ఉంటుంది. ఆ పురోగమనంలో ప్రాత శిథిలమైపోతూ క్రొత్త అవిర్భవిస్తూ వుంటుంది. అదే విప్లవం. విప్లవం ప్రకృతి సిద్ధం"

ఈ నాటకం పేరు చాలా చక్కగా కుదిరింది. 'కూలిరాజు' అంటే కూలీవాడు ప్రభువు కావడం. ఈ నాటకంలో సంభాషణలు ఎంతో ఉత్కంఠను కల్గిస్తూంటాయి. పాటలూ పద్యాలూ ఉన్నాయి. ప్రయోజనాత్మకమైన ఈ నాటకం గ్రామీణ జీవనంలో ఎంతో సంస్కారాన్ని కల్పించగలుగుతుంది. గాంధీని గూర్చి ఈ నాటకంలో కవి వ్రాసిన పాట శక్తిమంతంగా ఉన్నది.

''శక్తులు చచ్చిన ఖల్లని నెత్తురు
సలసల గాచిన మొనగాడా!''

అంటాడు గాంధీని. అత్యాశ్చర్యకరమైన విషయం ఈ నాటకంలో ఒకటుంది. అది ప్రణయకలాపం. అయితే ఇది చాలా సముచితంగా అభ్యుదయ మార్గాను వర్తిగా చిత్రింపబడింది. ఉండీ ఉండనట్టున్న ఈ శృంగారం విద్యుల్లతలా అందంగా సాగింది.

'పడిపోతున్న అడ్డుగోడలు' అనే నాటికకున్న విలువైన పీఠిక అందరూ చదువ దగినది. పీఠిక ఎంత విజ్ఞాన ప్రదంగా ఉన్నదో నాటిక అంత రసోదంచితంగా ఉన్నది. ఇందులోని ఇతివృత్తం వర్ణాంతర వివాహం. వర్ణాంతర వివాహ పద్ధతి భీమన్నకు చిన్ననాటినుంచి ఆసక్తిఉన్న సమస్య. పాలేరు, కూలిరాజువంటి నాటకాలలోనూ ఈ సమస్యకు చోటు కల్పించి భీమన్న తన అభిమాన సిద్ధాంతాన్ని ప్రతిపాదించినారు. ఈ చిన్న నాటికలో కూడా పాటా ఉంది, పద్యమూ ఉంది. ఇంత చిన్ననాటికలో కూడా హృదయ పరివర్తనకు భీమన్న ప్రాముఖ్యాన్ని ఇచ్చినారు.

పన్నెండు దృశ్యాల నాటకం రాగవాసిష్ఠం. హరిజనులు ఆర్యులేనని భీమన్న విశ్వాసం. ఈ విశ్వాసానికి అనుగుణంగా ఈ నాటకానికి పెద్ద పీఠికను వ్రాసినారు. ఉపనిషత్తుల్లోంచి, పురాణాల్లోంచి, ఇతిహాసాల్లోంచి ఆయన కొన్ని ఉపపత్తుల నెత్తిచూపి తన వాదాన్ని బలపరచుకున్నారు. పీఠికను ఆధారంగా చేసికొని ఈ నాటకాన్ని చదివితే రసోత్పత్తి కావడానికి అవకాశమున్నది. ప్రాచీన కాలంనుంచి నాటక కర్తలకు రసాదృతి కోసం కల్పనలు చేసే అవకాశం అధికారం ఉన్నాయి. వాటిని భీమన్న వాడుకున్నారు. మానవ సహజమైన ప్రవృత్తులకూ కాలానుగుణంగా మారే సామాజిక ప్రవృత్తులకూ ఏకీభావం కుదరడం అసాధ్యం. అయితే మానవతాశక్తుల విజృంభణమే సాంస్కృతిక

వికాసమనిపించుకుంటుంది. కులమతాల పేరుతో భారతీయ సమాజంలో ఏర్పడిన ఏర్పడుతున్న భేదభావాలు ఆనాటినుంచి ఒకటిగా ఉన్నాయని ఎవరూ నమ్మరు. ఆయా కాలాలలో ఆయా పరిస్థితులలో ఆయా స్వార్థ పూరిత వాతావరణాలలో కలిమిలేముల కల్లోలాలలో కలిగిన మార్పుల్ని ఇతిహాసాన్ని నిష్పాక్షికంగా మానవతా దృక్పథంతో అధ్యయనం చేస్తే మనకు తెలిసి వస్తాయి. భీమన్న రాగవాసిష్ఠ పీఠిక ఒక విజ్ఞానప్రదమైన వ్యాసం. ఈ విజ్ఞానాన్ని జీర్ణించుకొని భీమన్న రసవన్నాటకంగా ఈ రాగవాసిష్ఠాన్ని ఆవిష్కరించినారు. పీఠిక చదువుతుంటే ఇదేదో కొత్త మతాన్ని కవి ప్రతిపాదిస్తున్నాడే అని అనిపిస్తుంది. కాని నాటకం పేరులోని 'రాగం' రసాన్ని సూచిస్తున్నది.

ఈ నాటకంలో సంగీతం సాహిత్యం నృత్యం చెట్టపట్టాలు పట్టుకొని నడిచి నాయి. అరుంధతీ వసిష్ఠులు తప్ప అన్నీ కల్పిత పాత్రలే. పరమశివుని పాత్ర జ్ఞానానికి చిహ్నంగా నిలుస్తున్నది అక్కడక్కడ అద్భుతరసం కట్టలు తెంచు కుని పారుతుంది.

"ఒకరిలో ఒకరు మీ రొదిగిపోయిన మీద
ఏ సంధ్య కనిపించు? ఏ స్వరము వినిపించు?
మిమ్ము పెంచిన కనులు మీరు పెంచిన పనులు
మీ రాగ యోగమున మేలుకొని యుండునా?"
"ఆనందము గజ్జెకట్టి అందియమ్రోయించె చూడు"
"ఉప్పొంగిన ప్రణయోదధి నాపగ
వర్ణవిభేదం వశమా"
"ఆత్మ దైవతమె అరుదెంచినపుడు
మూఢా! తలుపులు మూసికొందువా?"
"కుల విభేదంపు కఠిన శృంఖలము ద్రెంచి
మోక్షముంబొందజాలని మూఢు నేను
సత్త్వహీనుని బ్రతుకు వర్జ్యమ్ము"
"ప్రణయ యజ్ఞమందు ప్రాణాలను యజించి
సోమపాన మగుదు సుదతిపెదవి"

"ప్రేమ! ప్రేమ అంటే? విశ్వమానవ కల్యాణాన్ని కోరేదే ప్రేమ! దాని సిద్ధికోసం చేసే నిష్కామకర్మే యజ్ఞం. వసిష్ఠా! నీది ప్రేమ కాదు, వట్టి కామం. దానికి ప్రేమ అని పేరుబెట్టి ప్రేమను అవమానించకు."

"విశ్వమానవ కల్యాణ భావం ఔదార్యం. వాంఛా విలుప్తమైన నిష్కామ కర్మ నీకు మోక్షాన్ని ఇవ్వవచ్చు. నేనిప్పుడు కోరేది వాంఛా మధురమైన రసానుభూతి."

"ప్రాచీన ధర్మం కంటె ఈ ఇసుక కొంత మెత్తనిది......... మాతంగకన్య తేజశ్శాలిని ఎందుకు కాకూడదు? మానవ కల్పిత కులానికి ఆధ్యాత్మిక మహాశక్తి ముడిపెడుతున్న ఈ ప్రాచీన మతం ఎంత సత్యదూరం!"

మొత్తానికి నాటకకర్త భీమన్న తాను నమ్మిన సిద్ధాంతాన్ని చాలా సుందరంగా ప్రతిపాదించగలిగినారు. నిజానికి కావ్యం-అది దృశ్యంకానీ శ్రవ్యం కానీ మధురంగా ఉండాలి. సరససమ్మతంగా ఉండాలి. సిద్ధాంతాలతో ఏకీభావం లేనివాడు కూడా చదివి చూసి ఆర్ద్రచిత్తుడు కావాలి. రాగవాసిష్ఠ నాటకంలో ఆ గుణమున్నది.

భీమన్న 'వాల్మీకి' ఆరంకాల నాటకం. ఈ నాటకంలోనూ కులతత్త్వ వాదులు సృష్టించిన కొన్ని అపవాదాలను ఖండించడం భీమన్న ఆశయంగా పెట్టుకొన్నారు. ఈ నాటకానికి పీఠిక భీమన్న మేధకూ, ఈ నాటకం భీమన్న కవితా హృదయానికి సూచికలు. ఆదికవి వాల్మీకి హృదయంలో కవితావిర్భూతి జరిగిన మహాద్భుత క్షణాలు ఈ కావ్యంలో అంకాలై అవతరించినాయి. ఇందులో వాల్మీకి బాల్యం కూడా వర్ణింపబడింది. ఇతివృత్తం సీతా వనవాసం, కుశలవుల జననం దాకా సాగింది.

"రాముడే పురుషుడు సీత ప్రకృతియౌను
ప్రణయ ధర్మాలమధ్య పోరాట మిద్ది"

"శోకమునకు ఇంత లోకమేలెడు శక్తి
ఎవరివలన కలిగె ఏలకలిగె?"

ఈ నాటకంలో పాటలూ పద్యాలూ రామాయణ శ్లోకాలూ ఎడనెడ విని పిస్తాయి. ఈ నాటకకర్త ప్రకారం వాల్మీకి శప్తుడై వ్యాధుడుగా పుట్టిన ఋషి. అంటే పూర్వజన్మ సంస్కార సంలబ్ధమైనది కవిత్వమని భీమన్న హృదయం. ఈ నాటకాన్ని చదువుతున్నప్పుడు మనకు ఇందులోని పద్యాలు పాటలు మాటల కంటె ఎక్కువ రసానుభూతికి కారణమవుతాయి. ఇది భీమన్న తెలిసి చేసినపని నేననుకుంటున్నాను. ఆది కవిని దర్శించుకోవడం అంతంత మాత్రాన సాధ్యం కాదు. కొంత కవితా వాసన అవసరం. అది మీకుంటేనే ఈ నాటకం చదవండి, చూడండి అని భీమన్న ఈ నాటకం రాస్తున్నట్టుగా నాకు తోస్తున్నది.

ప్రాచీనాలంకారికులకు కొన్ని విశ్వాసాలున్నాయి. కవి పుడుతాడేకాని ప్రయత్న పూర్వకంగా కాలేడని. భీమన్నకు కూడా ఈ నమ్మకం గట్టిగా ఉన్నది. వాల్మీకి నాటకంలో అదే చెప్పినారు. "కవి వలెనే యోగి పుడతాడు" అన్నారు. ముమ్మడివరం బాలయోగి జీవితాన్ని ఇతివృత్తంగా తీసికొని మలచిన ఏడంకాల నాటకం భీమన్నగారి "బాలయోగి." పద్యాలూ గేయాలు ఈ నాటకం లోనూ చిందులు తొక్కినాయి.

బాలయోగి ఈ కాలానికే ఒక భగవత్ ప్రతీక, ఒక శివసాక్షాత్కృతి. ఇలాంటి ఆధ్యాత్మిక చింతనతో ప్రేరితులై భీమన్న బాలయోగి జీవితానికి సంబం ధించిన కొన్ని ఘట్టాలను పాత్రల ద్వారా చెప్పించినారు. ఇందులోనూ వ్యాస వాల్మీకి ఋషులు నిమ్నజాతులకు సంబంధించిన వారనే సిద్ధాంతం ప్రతిపాదింప బడింది.

"ఎవ్వరు వెలుపల లోపల ఎవరు తలప
ఎవరు తనవారు పెరవార లెవరు ధరణి
తనకు రాధకు మధ్య బాంధవ్యమేమి?
ప్రాణ మొకటన్న జ్ఞానమే బ్రహ్మ తాను."

బాలయోగి పుట్టుక నుంచి శివరాత్రి దివ్యసందర్శనం దాకా బ్రహ్మ జ్ఞానాన్ని వ్యంజిస్తున్న సంఘటనల చయనిక ఈ బాలయోగి నాటకం అస్పృ శ్యతను నివారించడానికి వెలువడిన సాహిత్యంలో ఇంతవరకు తెలుగులో ఇంత సర్వజన సమాదరణీయమైన పుస్తకం రాలేదు. తాను ఫలానా కులం వాణ్ణని

చెప్పుకుని సంఘంలో ఉత్తముడిగానో నీచుడిగానో మన్నన పొందడమో నిరాకృతి పొందడమో కాదు బుద్ధిమంతుని లక్షణం. ఉత్తమమైన శీలం సత్ప్రవర్తనంవల్ల ఏ వ్యక్తి అయినా ఏ కులంవాడైనా సంఘంలో మర్యాదను పొందుతాడు.

"నా మాటలు విను. నా నడవడితో నీకేం పని" అని స్వేచ్ఛగా ప్రవర్తించే మానవునికి ఏకులం ఏకాలంలోనూ మన్ననను మర్యాదనూ ఇవ్వలేదు. ముమ్మడివరం బాలయోగి మాలవాడు - అంటే ఎవడు నమ్ముతాడు? మాలతనం మాదిగతనం బ్రాహ్మణత్వం వీటికి అతీతమైన వ్యక్తిత్వాన్ని ఆయన తన తపశ్చర్యవల్ల సంపాదించుకొని బ్రహ్మస్వరూపుడైన తర్వాత కూడా ఆయన మాలవాడని మా మాలవాడేనని అనడం అంత సబబైన విషయం కాదు. భీమన్న ఈ నాటకం వ్రాసి కులంకాదు గుణం ప్రధానమని నిరూపించినారు.

భీమన్న మరింకెన్నో నాటకాలు వ్రాసినారని విన్నాను. యథాతథ్యమైన నాటకాలను తీసికొని ఈ నాలుగు మాటలు వ్రాసినాను. సహజంగా కవీ, మేధావీ, సహృదయుడూ, స్నేహశీలీ అయిన భీమన్న సాహితీవ్యవసాయం ఇతోధికంగా కొనసాగాలనీ రసనిర్భరమైన సాహిత్యాన్ని ఆయన సమాజానికి అందిస్తూ ఉండాలనీ పరాత్పరుడు ఆయనకు చక్కని ఆరోగ్యాన్నీ చక్కని అవకాశాలనూ కల్పించాలనీ ఆకాంక్షిస్తున్నాను. *

---

* 'భీమన్న సాహితీ షష్ఠిపూర్తి సంచిక'లో ప్రచురితం. ముద్రణ 1988.

21. మహాకవి శ్రీ శ్రీ

ఒకసారి కాళిదాసు తరువాత అంతటివాడు ఎవడు? అనే ప్రశ్న వచ్చిందట. ఎంచడం ప్రారంభిస్తే ముందుగా చిటికెన వ్రేలుపై కాళిదాసు నిలిచినాడు. తరువాత వ్రేలుపై ఎవరిని నిలపాలె? అంతటివాడెవడున్నాడు? ఎవడూ లేడు. అనామకుడు. అందుకే ఆ వ్రేలుకు 'అనామిక' అనే పేరు సార్థకం అయిందని కాళిదాసు అభిమాని ఒకడు అలనాడు ఎన్నడో అన్నాడు.

ఈ కథనంలో ఉత్ప్రేక్ష ఉంది. చమత్కారమూ ఉంది. అంతకంటే మించిన పరమసత్యమూ ఉంది. ఒక మహాకవి వంటివాడు ఇంకొకడు పుట్టడు. ఉండడు. కాళిదాసునివలె, వాల్మీకివలె, రవీంద్రునివలె వ్రాయాలనుకుని ఆ పేరుతోనే బ్రతుకాలనీ, ఇటీవలి కాళిదాసనీ సరికొత్త వాల్మీకి అనీ, వ్యాసుని తరువాత వ్యాసునంతటి వాడనీ పొగడించుకుంటే కాళిదాస వాల్మీకి వ్యాసుల కీర్తి మరింత పెరుగుతుంది. వాళ్ళు ఇంకా కొంత కాలం బ్రతుకుతారు. 'పోలినవాణ్ణి' అని చెప్పుకునేవాడే ఇట్లా ఉంటే ఇక అసలువాడు ఎంత గొప్పవాడో అనే జిజ్ఞాస ఎక్కువౌతుంది. ఇప్పుడు జరుగుతున్నది కూడా సాహిత్యలోకంలో ఇంతే.

శ్రీశ్రీ మహాకవి. కనుకనే ఆయన బాటలో ఆయనే పయనించినాడు. 'అనితరసాధ్యం నా మార్గం' అన్నాడాయన. అంటే ఆయన్ను ఎవడూ అనుకరించలేడు. మహాకవిని అనుకరించి ఎవడూ మహాకవి కాలేడని ధ్వని. అందరూ నడిచిన బాటలో నడిచేది సామాన్యుడు. కొత్త పుంతలు తొక్కి, ముళ్ళనూ, కన్నీళ్ళనూ అనుభవించి ముందుకు సాగిపోయేవాడే కొత్త మాటలను చెప్పగలుగుతాడు, కొత్త పరిస్థితులను చూడగలుగుతాడు, కొత్త అనుభూతులకు శబ్దాకృతులు కల్పించగలుగుతాడు.

అయితే నడవడం రావాలె. పాతబాటల్లోని గుంటల సంగతి తెలిసి ఉండాలె. మలుపుల సంగతి తెలిసి వుండాలె. డొంకల్లో పొంచివున్న దొంగల సంగతి తెలిసి ఉండాలె. తాను సరిగ్గా చూసి నడువగలుగుతున్నాననే నమ్మకం కలిగి

ఉండాలె. శ్రీశ్రీ సృజించిన కొత్త కవిత వెనుక, కొత్తబాట వెనుక ఇంత వ్యవహారం ఉన్నది. ఇదే వ్యుత్పత్తి. ఆయన బాగా చదువుకున్నారు. పాత అంతా రోత అని చదువకుండా తోసెయ్యలేదు. 'మంచి గతమున కొంచెమేనోయి' అన్నాడు గురజాడ. ఆ గతంలో కొంచెంగానే వున్న మంచిని గ్రహించగలగడం వ్యుత్పత్తి అనిపించుకుంటుంది. వ్యుత్పన్నుడూ, ప్రతిభావంతుడూ అయిన మనీషికే శబ్దం పరిమితి, అర్థం విస్తృతి తెలుస్తుంది. అప్పుడు ఆ రెంటిపై అధికారం నెరపే అర్హత లభిస్తుంది. అలాంటి అధికారం ఉన్నవాడే కొత్త ప్రయోగం చెయ్యడానికి ఉద్యమించి కృతకృత్యుడౌతాడు. మనకు వచ్చే ఆలోచనలన్నీ మాటలుగా మారవు. మాటలన్నీ కవితలుగా మారవు. ప్రతిభావంతుని మాటలకే ఆ శక్తి వుంటుంది. మనలో చాలా మందికి వచ్చే తలపులకు పరిమితమైన అర్థమే ఉంటుంది. ఒక్క అర్థమే ఉంటుంది. వాటిని ఆధారం చేసుకొని పెద్దగా ఆలోచించలేము అందమైన అనుభూతిని పొందలేము. ఉత్సాహాన్ని పొందలేము. మళ్ళీ మళ్ళీ అవే మాటలను నలుగురితో చెప్పి వాళ్ళ మనస్సులను ఆకట్టుకోలేము. "యోగ్యతాపత్రం"లో చెలం—

"కవిత్వంలోనూ, జీవితంలోనూ Economy of words and thoughts లేకపోవడం దేశభక్తికన్న హీనమైన పాపం. ఆత్మలోకంలో దివాలా" అన్న మాటలను శ్రద్ధగా పరిశీలిస్తే మనకు ఒక యాథార్థ్యం తెలుస్తుంది. పదాల్లోనూ భావాల్లోనూ పొదుపు ఎలా సాధ్యం? సంపాదించందే పొదుపును గూర్చి ఎట్లా ఆలోచిస్తాం? బాగా చదువుకోవడంవల్ల ఆ చదువు వెలుతురులో లోకాన్ని చూడడంవల్ల భావాలు పుట్టుకొస్తాయి. పదాల సంగతీ, అర్థాల సంగతీ తెలిసి వస్తుంది. అప్పుడు పొదుపుతో వాటిని వాడుకోవడంలో కవి చూపే మెలకువల్లో విశిష్టత కనబడుతుంది. కేవలం పదాలూ, వాటికి అర్థాలూ తెలిస్తే కవిత్వం రాదు. కొన్ని పుస్తకాలు చదివితే కవిత్వం రాదు. లోకాన్ని అంటే తన చుట్టూ ఉండే పరిసరాలను చూడగలగాలె. తన నోటిదాకా అన్నంముద్ద ఎట్లా వస్తున్నదో తెలుసుకోగలగాలె. ఏది సత్యమో, ఏది వంచనో, ఏది వెలుగో, ఏది చీకట్లో చూడగలగాలె. తనకంటే పూర్వం ఉన్న కవులు ఏమి వ్రాసినారో? ఎట్లా వ్రాసినారో చదివి తెలుసుకోవాలె. తన సమకాలికులు ఎట్లా వ్రాస్తున్నారో అధ్యయనం చేయాలె. ఈ ప్రయత్నాన్నే మన సాహిత్య శాస్త్రజ్ఞులు 'లోకజ్ఞత'

అన్నారు. శ్రీశ్రీకి అలాంటి లోకజ్ఞత పుష్కలంగా ఉన్నది. మంచి వ్యుత్పత్తి ఉన్నది. జన్మతః ప్రతిభావంతుడు. కవితావేశం తనలో ఉన్నదని తనకు తెలిసినప్పటినుంచీ ఆవేశంలో వ్రాస్తూ వచ్చినాడు. ఇలా నిరంతరం వ్రాసే అలవాటును సాహిత్య శాస్త్రజ్ఞులు 'అభ్యాసం' అన్నారు.

ప్రతిభ, వుత్పత్తి, అభ్యాసం - ఈ మూడూ కవికి అవసరం అన్నారు పెద్దలు. శ్రీశ్రీ ఐదు దశాబ్దాలుగా సాహిత్యసృష్టి చేసినాడు. పద్యాలూ, గేయాలూ వ్యాసాలూ, నాటకాలూ, కథలూ, నవలలూ ఎన్నో వ్రాసినాడు. ఎన్నో సాహిత్యోపన్యాసాలూ చేసినాడు. శ్రీశ్రీ సాహిత్యం ఆయన తులలేని ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాలను భంగ్యంతరంగా సూచిస్తున్నది. ఇంత వ్రాసినా ఆయన తృప్తిపడి, సన్మానాల భారంతో, సంకీర్తనల సంరంభంలో ఆగిపోలేదు. 'ప్రపంచమొక పద్మవ్యూహమ'నీ 'కవిత్వమొక తీరని దాహమ'నీ తన కొత్త గొంతుకను ఎవరెవరు ఎన్నెన్ని విధాల తెగడినా వెనుకాడలేదు. తనది అభ్యుదయ కవితామార్గమని చాటుకున్నాడు. తాను ఎందరికో స్ఫూర్తిని అందించ గలిగినాననీ, 1935 తర్వాత తెలుగు కవితకు తానే నాయకత్వం వహిస్తున్నాననీ ఆత్మప్రత్యయంతో చెప్పుకోగలిగినాడు. దారిద్ర్యం, అజ్ఞానం, అసమత్వం, దాస్యం ఈ నాల్గింటిపై ధ్వజమెత్తడమే కవిత్వధ్యేయంగా ఉండాలని చాటినాడు. ఇప్పుడు సాహిత్యసృష్టి తెలుగులో ఈ ఆశయానికి అనుగుణంగా సాగుతున్నదంటే అది శ్రీశ్రీ ప్రభావమే. యువతరాన్ని ఒక ఊపు ఊపినాడు. 'కదిలేదీ - కదిలించేదీ' కవిత్వం అన్నాడు. అయితే అలాంటి కవిత్వం సృష్టించడానికి ఆయన చేసిన పరిశ్రమ, ఆయన సంపాదించిన పాండిత్యం ఆదర్శం కావాలె. ఆయన ప్రాచీన కవితను నిరసించినాడని ఇప్పటితరం నిన్నటి కవితను చదవడం మానివేయకూడదు. చదివిందే వ్రాయాలనికాదు. చదివి వ్రాయాలె. చదువు, కవితాసృష్టికి ముడిపదార్థం కావాలె. ఆహారం రక్తం అయినట్టు వ్యుత్పత్తి, అనుభూతి కవితగా మారాలె. శ్రీశ్రీ సాహిత్య వ్యక్తిత్వం ఈ యాథార్థ్యానికి నిదర్శనం. అందుకే ఒకచోట అన్నారు విశ్వనాథవారు- "తెలియక వ్రాసినవాడు కవి. తెలిసి వ్రాసినవాడు మహాకవి" అని.*

---

* శ్రీశ్రీ సంస్మరణ సంచిక 'రంజని'లో ప్రచురితం. ముద్రణ: 1988.

22. భావకవిత్వము – పరిశోధన

తెలుగులో నవ్యకవితా ధోరణులకు భావ కవిత్వోద్యమానికి అవినాభావ సంబంధ మున్నది. వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు తెలుగు భాషా సాహిత్యాలకు కొత్త రూపురేఖలను దిద్దిన యుగ పురుషులు. ప్రక్రియా వైవిధ్యానికీ, నూత్న భావప్రకటన విధానానికీ, యుగోచిత భావస్ఫూర్తికీ మార్గదర్శకులైనారు. పౌరాణిక ఐతిహాసికేతివృత్తాలను ప్రతిపాదించటంలోనూ, ఛందశ్చమత్కార ప్రదర్శనంలోనూ గతానుగతిక శబ్దార్థాలంకారాలతోనూ, కవి సమయ సంబంధాలతోనూ, అందరికీ అందుబాటులో లేని భాషా విన్యాసంలోనూ సాహిత్యం కేవలం సమాజంలోని ఒక పరిమిత వర్గానికి విలాస వస్తువుగా మారిపోయిన దినాలలో భావానికీ - వినూత్న భావానికీ, కల్పనామహితమైన భావానికీ, భాషా సారళ్యానికీ ప్రాముఖ్యాన్ని సమకూర్చవలసిన అగత్యాన్ని నాటి మనీషులు గుర్తించి కొత్తపుంతలను అన్వేషించి సాహిత్యానికి అనాదికాలం నుంచి ఉన్న ప్రయోజనాన్ని సాధించటానికి ఉద్యుక్తులైనారు.

కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'సరస్వతీ నారద సంవాదము' అనే రచన తెలుగు సాహిత్యాన్ని నవ్యపథంలో నడిపించాలనే మహత్వాకాంక్షను భంగ్యంతరంగా వెల్లడి చేసింది శ్లేషాలంకారాన్ని ఆధారం చేసుకొని పంతులు గారు గర్భబంధ చిత్రకవిత్వాలు, అనావశ్యకపదాడంబరం, రసవిహీన పద ప్రయోగం కవితకు శోభను చేకూర్చలేవని నిరూపించిరి. ఛందోబంధాలలో పదాలను ఇమిడ్చినంత మాత్రాన కవిత్వ మనిపించుకోదనీ, రసాత్మకమైన వాక్యవిశేషమే కవిత్వమనీ, రసం లేకుంటే ఛందోఽలంకారాది కావ్యశోభా హేతువులన్నీ సాహిత్యానికి సంకెళ్ళే కాని అలంకృతులు కావని పంతులుగారు తమ ప్రత్యయాన్ని ప్రకటించిరి. వీరేశలింగంగారి ఈ అభిప్రాయం వల్ల వస్తువు ఛందస్సు భాష గౌణములై భావానికే ప్రాముఖ్యం రావాలనే ఆదర్శం నవ్య కవితావిర్భావానికి దారితీసింది. కనుకనే స్థూలంగా నవ్యకవితకు 1920 తర్వాత

భావ కవిత్వమనే పేరు సార్థకమైనది. భావ కవిత్వం ఆవిర్భవిస్తున్న రోజుల లోనే అది అచ్చమైన కవితకు పర్యాయవాచిగా ప్రాశస్త్యాన్ని అందుకున్నది. భావ కవిత్వాన్ని గూర్చి శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు నిశితంగా పర్యాలోచన చేసినారు. భావకవిత్వ మంటే అయన దృష్టిలో ఉత్తమ కవిత. శ్రీ శాస్త్రిగారు ఒక వ్యాసంలో—

"భావ కవిత్వము (లిరిక్కు) వేదాంతమువలె కవిత్వాంతము. గ్రంథము కొలది, ఆనందము హెచ్చు. పిట్ట కొంచెము, కూత ఘనము. కవిత్వమునకిది శిరస్సు. తెలుగు భాషలో లోగడ నున్న లిరిక్కులను ఉద్ధరించుట ఆవశ్యకము. తెలుగు కవులును దీని ప్రాశస్త్యమును గుర్తించిరి"[1] అని భావ కవిత్వానికి ఎనలేని ప్రాముఖ్యాన్ని సంతరించి పెట్టడమే కాక అచ్చమైన కవితకూ భావ కవిత్వానికీ భేదం లేదని భంగ్యంతరంగా నిర్దేశించిరి. సాహిత్య పరిశోధకులకు శాస్త్రిగారి అభిప్రాయం కరదీపిక.

శ్రీ నోరి నరసింహ శాస్త్రిగారు 'భావ కవిత్వం' అనకుండ 'నవ కవిత్వం' అన్నారు. ఒక వ్యాసంలో ఆయన తొమ్మండగురు కవులను గూర్చి వివరిస్తూ ఇలా అన్నారు- "స్త్రీలలో లావణ్యము వలె, యోగులలో శాంతివలె, కావ్యములలో రసము వలె ఇతమిత్థము నవకవిత్వము రీతి యని స్పష్టముగా వర్ణించడానికి సాధ్యము కాక ఇటువంటిదని కొంత సూచించటానికి సాధ్యమై అనుభవైక వేద్యమైన ఒకానొక విశిష్ట ధర్మమున్నది నవకవిత్వములో."[2] సూత్రప్రాయంగా ఆలోచనాత్మకంగా సాగిన శాస్త్రిగారి భావ కవిత్వ వివేచనం పరిశోధకులకు సూచనగా ఉన్నది. నవ్య కవితలోని విశిష్టతను సహృదయతతో పరిశీలించే ప్రయత్నం చేయాలని శాస్త్రిగారు సాహిత్య పరిశోధకులకు సందేశ మిచ్చినట్లుగా ఉన్నది.

---

1. వ్యాసభారతి - పుట 65.
2. సారస్వత వ్యాసములు - ఐదవ సంపుటి- పుట 188. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

భావ కవితా ధోరణి తెలుగుదేశంలో ప్రహతంగా వస్తున్న పడికట్టు రాళ్ల కవితా పద్ధతికి భిన్నంగానూ ఆకర్షణీయంగానూ ఉండటం వల్ల కొత్త తరాన్ని ఉద్రూత లూగించగలిగింది. కొత్తను కోరేవాళ్ళకు చక్కని వాహిక అయినది. అయితే ఈ సరికొత్త ధోరణిని పాతవాసనలు నిరసించినవి. ఉమాకాంత విద్యాశేఖరుల్ల 'నేటి కాలపు కవిత్వము' అనే పుస్తకం నవ్యకవితా ధోరణుల పట్ల నిరసన భావమున్న వారి విమర్శలకు ప్రాతినిధ్యం వహించింది, ప్రతీకగా నిలిచింది. భావ కవిత్వ సంబంధమైన పరిశోధనలకు ఆ పుస్తకంలోని విసురులూ రంగాన్ని సిద్ధం చేసినవి. విశ్వవిద్యాలయాలలో నిర్బంధ పఠనీయ భాషగా ఇంగ్లీషు ప్రవేశించడంతో, ఆ భాష ద్వారా ప్రపంచంలోని భాషా సాహిత్యాల తీరు తెన్నులతోనూ, వైజ్ఞానిక సాంకేతి శాస్త్రాభివృద్ధివలన పాశ్చాత్య దేశాలలో వేళ్ళు తన్నుకుంటున్న అతి నవ్యభావాలతోనూ తెలుగువాళ్ళకు పరిచయం ఏర్పడింది. 17, 18 శతాబ్దాలలో ఇంగ్లండు, ఫ్రాన్స్ దేశాలలో రెక్కలిప్పిన కాల్పనిక కవితా వైఖరులపట్ల అభిమానం ఎక్కువైంది. దీనికి తోడుగా భారత దేశంలోనూ స్వాతంత్రోద్యమం నానాటికీ బలపడుతున్నది. ఈ పరిస్థితుల ప్రభావం సంఘంపైన, అది అభిమానిస్తున్న సాహిత్యంపైన పడకుండా ఎలా ఉంటుంది? కనుక 1914 నుంచి తెలుగునాట విస్తరిల్లిన తెలుగు కవిత భావకవితా ప్రభావంనుంచి తప్పించుకోలేకపోయింది. అప్పటినుంచి తెలుగుకవుల్లో చెప్పుకోదగిన పేరున్నవారుందరూ భావకవితాపథంలో పయనించినవారే. వేంకట పార్వతీశ్వర కవులు భావకవితా భానూదయానికి ముందు పూచిన ఉషఃకాంతులు. రాయప్రోలు, రోణంకి, కృష్ణశాస్త్రి. దువ్వూరి, అబ్బూరి, వేదుల, నాయని, కాటూరి-పింగళి, శివశంకరశాస్త్రి, మల్లవరపు, పిలకా, చామర్తి, కవికొండల, కొడాలి, ఇంద్రగంటి, విశ్వనాథ, కరుణశ్రీ, జాషువా మున్నగు కవులందరూ తమ విలక్షణ ప్రతిభతో భావకవితా కేదారాలలో పసిడి పంటలు పండించినవారే. అభ్యుదయ కవితా పథానికి మార్గదర్శకుడైన శ్రీరంగం శ్రీనివాసరావు తొలి దశలో వీరందరితోపాటు భావకవిత లల్లినవాడే.

భావ కవిత్వాన్ని వివిధ దృక్కోణాలతో పరిశీలించి, విశ్లేషించి పరిశోధనలు చేసిన సందర్భాలు అరుదనే చెప్పవలసి వస్తుంది.

ఆచార్య కురుగంటి సీతారామ భట్టాచార్యులూ, పిల్లలమర్రి వేంకట హనుమంతరావూ తమ "నవ్యాంధ్ర సాహిత్య వీథులు" అనే గ్రంథంలో కొందరు భావకవుల ప్రతిభా సామర్థ్యాలను వివరించినారు. భావ కవితా లక్షణాలను రేఖామాత్రంగా పరిచయం చేసినారు.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు 'లక్ష్మీరంజన వ్యాసావళి'లో భావ కవిత్వాన్ని గూర్చి వివేచనాత్మక పరిశీలనం జరిపినారు.

ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు తమ 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'లో భావకవిత్వాన్ని కాల్పనిక కవిత్వమని సంకేతించి నవ్యకవితా ధోరణులలో అంతర్భాగంగా గుర్తించి కొందరు భావకవుల కవితా పారమ్యాన్ని ఉగ్గడించినారు.

భావకవితా వైజయంతికలను ఎగురవేసిన మహాకవుల సాహిత్య వ్యవసాయాన్ని గూర్చిన పరిశోధనలు తెలుగుదేశంలో విశ్వవిద్యాలయాలలో కడచిన ఇరువై ఏళ్ళ కాలంలో జరుగుతునే ఉన్నవి. రాయప్రోలు, విశ్వనాథ, దేవులపల్లి, కరుణశ్రీ, నాయని, జాషువ, అబ్బూరిగారల గూర్చి విశ్వవిద్యాలయాలలో ఎం. ఫిల్., పిహెచ్.డి. పట్టాలకోసం పరిశోధనలు జరిగినవి, జరుగుతున్నవి. డిగ్రీల కోసం కాకుండా జిజ్ఞాసపరులైన విమర్శకులూ, విద్వాంసులూ పుస్తకాలనూ, పత్రికలలో వ్యాసాలనూ ప్రచురించినారు. రేడియోలో ప్రసంగాలు చేసినారు. ఈ రచనలు భావకవిత్వాన్ని గూర్చిన పరిశోధనకు యథోచితములైన సాధనాలుగా తోడ్పడదగిన వనడంలో సందేహం ఉండకూడదు.

ప్రక్రియపరంగా భావకవిత్వాన్ని గూర్చి ప్రప్రథమంగా పరిశోధన చేసినవారు డా. పాటిబండ మాధవశర్మగారు డా. శర్మగారు 1936లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎం.ఏ. ఆనర్సు పట్టాకోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం "అధునికాంధ్ర భావకవిత్వము." శర్మగారి వ్యాసాన్ని చదివే అవకాశం నాకు లభించలేదు.

1962 లో ఆచార్య సి. నారాయణరెడ్డిగారు "అధునికాంధ్ర కవిత్వము : సంప్రదాయములు - ప్రయోగములు" అన్న అంశం మీద సిద్ధాంత

వ్యాసాన్ని రచించి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించి, పి.హెచ్.డి. పట్టాన్ని సంపాదించినాడు. ప్రక్రియాపరంగా భావకవిత్వాన్ని గూర్చి శ్రీ రెడ్డి గారు ప్రధానంగా పరిశీలించే ఉద్దేశ్యంతో కాకపోయినా నవ్యకవిత్వపు పోకడలను విశ్లేషించే సందర్భంలో భావకవితావిర్భావ వికాస దశలను విపులంగా చర్చించి నారు. 1967లో ఈ సిద్ధాంత వ్యాసం ముద్రణ పొందింది. ఇటీవల రెండవ ముద్రణను కూడా అందుకున్నది.

ఈ గ్రంథంలో భావకవిత్వాన్ని శ్రీ నారాయణరెడ్డిగారు నిర్వచించి స్వరూప భావాలను పేర్కొన్నారు. భావకవులు సృజించిన కవితా సాగరాన్ని మథించి 'ప్రణయ కవిత్వము, దేశభక్తి కవిత్వము, ప్రకృతి కవిత్వము, సంఘ సంస్కరణ కవిత్వము, భక్తి కవిత్వము, స్మృతి కావ్యాలు' అని ఆరు శాఖలుగా వింగడించి, వాటిని సోదాహరణంగా వివరించి భావకవితా తత్త్వాన్ని సిద్ధాంతీకరించినారు. భావకవిత్వమంటే ఊహాప్రపంచంలో తేలిపోతుండడమని, పరిసరాల బాదరాబందీతో సంబంధంలేని ప్రణయనౌకావిహార మని సామాన్య జనంలో అధిక ప్రచారాన్ని అందుకుంటున్న భావకవిత్వ స్వరూపాన్ని పలు దృక్కోణాలతో సందర్శించి ఆధునిక కాలంలో వెలిసిన దేశాభిమాన - సంఘ సంస్కరణాది మహోన్నత భావ ప్రసరణానికి భావ కవిత్వం దోహదం చేసిందని ఈ సిద్ధాంత వ్యాసంలో శ్రీ రెడ్డిగారు నిరూపించగలిగినారు. ప్రాయికంగా ఈ గ్రంథంలో భావ కవిత్వాన్ని గూర్చి పరిశోధన సాగినా కవితా తత్త్వాన్ని గూర్చి సంప్రదాయానికీ ప్రయోగానికి తెలుగు సాహిత్యంలో జరిగిన సంఘర్షణ సమన్వయాలను గూర్చి చక్కని విశ్లేషణ లున్నవి. శ్రీ రెడ్డిగారు ఉత్తమ కవులు, శబ్దార్థ రహస్యవేత్తలు కావడం వల్ల ఈ గ్రంథం చక్కని వచన ప్రబంధంగా అందమైన పదబంధాలకు కాణాచిగా సుందర వాక్య విన్యాసానికి ఆలవాలంగా సాక్షాత్కరిస్తుంది. భావకవిత్వాన్ని గూర్చి ప్రచారంలో ఉన్న లెక్కలేని అపప్రథలను ఆయన తుడిచివేసి సహృదయదృష్టితో ఆధునిక కవితాధ్యయనానికి చక్కని భూమికను ఈ సిద్ధాంత వ్యాసరూపంలో నిర్మించి సహృదయ విమర్శకులకు కృతజ్ఞతాపాత్రులైనారు. విశ్వ విద్యాలయాలలో ఇప్పు డిది పాఠ్య గ్రంథంగా అధ్యేతల అభిమానాన్నీ, ఆసక్తినీ చూరగొనగలుగుతున్నది. సామాన్య పాఠకులకు కవిత్వం పట్ల చక్కని అవగాహననూ తెలుగు

సాహిత్యంలోని కొత్త పోకడల పట్ల పరిచయాన్ని ఈ సిద్ధాంత వ్యాసం కలిగిస్తుంది. భాషాభినివేశ మున్నవారికీ భాషాభిమాన మున్నవారికీ సమానంగా విజ్ఞానాన్నీ, ఆనందాన్నీ అందించగల సిద్ధాంత వ్యాసాలు ఒకటో రెండో. అందులో ఇది ఒకటి.

భావకవితా రచనలో సిద్ధహస్తు లనిపించుకున్న మహాకవుల కృషిని గూర్చి కొన్ని పరిశోధనలు జరిగినవి. అయితే వాటిలో చాలా మట్టుకు అచ్చు కాలేదు. ఆయా విశ్వవిద్యాలయాలకు వెళ్ళి ఆ సిద్ధాంత వ్యాసాల లిఖితప్రతులను అధ్యయనం చేసే అవకాశం ఇప్పట్లో లేని కారణాన యథాలభ్యమైన సిద్ధాంత వ్యాసాలను గూర్చి దిఙ్మాత్రంగా వివరిస్తాను.

భావ కవితా సృజనంలో సమున్నత శిఖరాలను అందుకొని, భావకవి అంటే కృష్ణశాస్త్రి అన్న సంకేతాన్ని సంపాదించుకున్న శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని గూర్చి పరిశోధన చేసినవారు డా॥ శ్రీమతి నిడమర్తి నిర్మలాదేవి గారు. వీరు 'కృష్ణశాస్త్రి కృతులు-పరిశీలన' అన్న సిద్ధాంత వ్యాసాన్ని 1978లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించి, పిహెచ్.డి. పట్టాన్ని అందుకున్నారు. డా॥ నిర్మలాదేవిగారు తమ గ్రంథంలో కృష్ణశాస్త్రిగారి జీవితవిశేషాలనూ, సమకాలిక పరిస్థితులనూ, శ్రీ శాస్త్రిగారిపై ఆనాటి సాంఘిక రాజకీయ ఉద్యమాల ప్రభావాలనూ వివరించినారు. కాళిదాసాది సంస్కృత కవులూ, నన్నయ శ్రీనాథాది ప్రాచీనాంధ్ర కవులూ, విశ్వకవి రవీంద్రుడూ, ఇంగ్లీషు కాల్పనిక కవితాస్రష్టలూ కీట్సు షెల్లీ మున్నగువారూ కృష్ణశాస్త్రి కవితా వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన వైనాన్ని నిర్మలాదేవిగారు సముచితంగా ఉల్లేఖించినారు. ఈ సిద్ధాంత వ్యాసంలో ఒక విశేష మున్నది. ఆధునిక హిందీ సాహిత్యస్రష్టలూ, ఉత్తమ కవులూ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలూ "ఛాయావాద" కవితా ప్రవక్తలూ శ్రీ సుమిత్రానందన్ పంత్ రచనలతో కృష్ణశాస్త్రి రచనలను పోల్చి ఆ ఇరువురు మహాకవులలో కనిపిస్తున్న పోలికలను ఎత్తి చూపడం. పంత్, కృష్ణశాస్త్రిగారలు పరస్పర ప్రభావానికి లోనుగాకపోయినా ఇద్దరి భావశబలతలో ఏకీభావాన్ని దర్శించి ప్రదర్శించడం ఈ సిద్ధాంత వ్యాసంలోని విశేషం. కృష్ణశాస్త్రి కవితా సంకలనాంలోని ప్రతి ఖండికనూ వీరు విశ్లేషించి అందులోని కవితా సారమ్యాన్ని వివరించినారు. కృష్ణశాస్త్రి శ్రవ్య, గేయ నాటికలు, సినీ

గీతాలు, వచన రచనలు, యక్షగానం, సాహిత్య విమర్శాత్మకవ్యాసాలు, రేడియో ప్రసంగాలు, పత్రికలలో వచ్చిన వ్యాసాలు, సభలలో చేసిన ఉపన్యాసాలు నిర్మలాదేవిగారి పరిశీలనా పరిధిలోకి వచ్చినవి. కృష్ణశాస్త్రి జీవిత సాహిత్య వ్యక్తిత్వాలను గూర్చిన చక్కని అనుశీలనం ఈ సిద్ధాంత వ్యాసంలో జరిగిందని చెప్పడం అత్యుక్తి కాదు. కృష్ణశాస్త్రిని భావ కవితా ద్రష్టగానూ. స్రష్టగానూ నిరూపించడానికి ఈ సిద్ధాంత వ్యాసంలో నిర్మలాదేవిగారు చేసిన ప్రయత్నం శ్లాఘాపాత్రం.

శ్రీ బొట్టు భాస్కర చౌదరిగారు 'జాషువ కృతులు-సమాలోచన' అన్న అంశంపై పరిశోధన చేసి, 1979 లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి పిహెచ్.డి. పట్టాను సంపాదించినారు. ఈ సిద్ధాంతవ్యాసం 1982లో గ్రంథంగా అవతరించింది. ఏడు ప్రకరణాలుగా పరుచుకున్న ఈ సిద్ధాంత వ్యాసంలో జాషువా పద్య కృతులు, కావ్య ఖండికలు, ఖండ కావ్యాలు, లఘు కావ్యాలు అనే అధ్యాయాలలో శ్రీ చౌదరిగారు జాషువ మహిత వ్యక్తిత్వాన్ని చక్కగా విశ్లేషించి వివరించడానికి సఫల ప్రయత్నం చేసినారు. అన్ని ప్రకరణాలలోనూ శ్రీ చౌదరిగారు తత్వాన్వేషణతత్పరులుగా, సాహిత్యవివేచనాదక్షులుగా, సత్యగవేషణాభిలాషులుగా దర్శనమిస్తారు. జాషువ కవి జీవిత విశేషాలను కూడా పొందుపరచి ఆ మహాకవి మహనీయ వ్యక్తిత్వాన్ని చిత్రించి జాషువా కవిత్వ తత్త్వావబోధకు చక్కన్ని అవతారికను నిర్మించినారు. ఈ సిద్ధాంతవ్యాసంలో శ్రీ చౌదరిగారు అవలంబించిన శైలి సరళం. పండితులకే కాకుండా భాషాభిమానుల కందరికీ జాషువ కవితా తపస్సు పట్ల ఆసక్తినీ అభిరుచినీ కలిగించగలుగుతుంది ఈ సిద్ధాంత గ్రంథం. సమకాలిక సాహితీ ప్రపంచాన్ని ఉర్రూత లూగించిన ఒక మహాకవి సాహిత్య వ్యక్తిత్వాలను ఆర్ద్రమనస్కతతో పరిశోధనా ప్రమాణాలకు క్షతి కలుగకుండా నిర్వహించి చరితార్థులైనారు శ్రీ చౌదరిగారు.

శ్రీ అనుమాండ్ల భూమయ్యగారు 1980లో కాకతీయ విశ్వవిద్యాలయంలో 'నాయని సుబ్బారావు కృతులు-పరిశీలన' అనే విషయాన్ని గూర్చి పరిశోధన చేసి సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించి పి హెచ్ డి. పట్టాను అందుకున్నారు. 1981లో ముద్రణ పొందింది ఈ వ్యాసం. డా॥ భూమయ్యగారు నాయని సుబ్బారావుగారిని ఉత్తమ భావకవిగానే దర్శించినారు. కనుకనే ఆ గ్రంథారంభంలో నాయనివారి జీవిత విశేషాలను వివరించిన తరువాత 'ప్రణయవాహిని'

అన్న శీర్షిక కింద భావకవితోద్యమ ప్రాదుర్భావ స్వరూప స్వభావ వికాసాలను గూర్చి రేఖామాత్రంగా వివరించినారు. ఏడు అధ్యాయాలుగా విస్తరిల్లిన ఈ సిద్ధాంత వ్యాసంలో నాయని వారి రచనలన్నిటిని పేర్కొని, వాటిలోని వైశిష్ట్యాన్ని, కవితాతత్త్వాన్ని విశదీకరించినారు డా॥ భూమయ్యగారు నాయని సుబ్బారావు గారితో ప్రత్యక్షంగా సంభాషించి, అనేకవిషయాలను సేకరించి వాటిని అనుబంధంలో చేర్చిచూపడం ఒక విశేషం సుబ్బారావుగారి కవితాత్మను మరింత సన్నిహితంగా సందర్శించాలనే ఆకాంక్షతో డా॥ భూమయ్యగారు నాయనివారి సన్నిహితులను ఎందరినో కలిసికొని వారు వెలిబుచ్చిన అభిప్రాయాలను కూడా ఈ సిద్ధాంత వ్యాసంలో అనుబంధాలుగా చేర్చడంవల్ల ఎంతో ప్రయోజనం సమకూరిందని చెప్పవచ్చు. ప్రణయ కవితాతత్త్వాన్ని అందులోనూ కులపాలికా ప్రణయతత్త్వాన్ని కవితాత్మకంగా ప్రదర్శించిన నాయని సుబ్బారావు సాహిత్య సందర్శనం చాలా ఆర్ద్రంగా డా॥ భూమయ్య గారు నిర్వహించినారనడంలో సందేహం ఉండవలసిన పనిలేదు. సిద్ధాంత వ్యాసం పండితులకే కాదు-అందరికీ పఠనీయమే అన్న అభిప్రాయం కలుగుతుంది ఈ గ్రంథం చదివిన తర్వాత. దీనికి కారణం ఇందులోని భాష, విషయ విన్యాసం.

భావకవితావిహాయసంలో ధ్రువతారలుగా వెలిగిన కవుల కృతులను గూర్చి పరిశోధన జరిగింది. అయితే ప్రక్రియాపరంగా కాకుండా ఆయా కవుల ఆయా కావ్యాల అధ్యయనం వరకే పరిమితమయి పోవడంచేత ఈ పరిశోధనా ఫలితాంశాలు కూడా పరిమితంగానే ఉన్నవి. 1979 నుంచి 1983 సంవత్సరాలలో భావకవులను గూర్చి, వారి గ్రంథాలను గూర్చి విశ్వవిద్యాలయాలలో పిహెచ్.డి., ఎం.ఫిల్. డిగ్రీల కోసం పరిశోధకులు చక్కని కృషి చేసినారు. నాకు వాటిని చూసే అవకాశం ఇప్పట్లో లేదు. కనుక దిఙ్మాత్రంగా సూచన చేస్తాను.

1978 లో శ్రీ గుడిమెళ్ళ భావనారాయణాచార్యులు గారు 'భావ కృతులు-సంప్రదాయం-నవ్యత' అనే అంశంమీద ఆంధ్ర విశ్వవిద్యాలయంలో

పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించగా, 1980 లో శ్రీ మైనేని శేషగిరిరావు గారు 'జాషువ ఫిరదౌసి-సమగ్ర పరిశీలన' అనే విషయంపైన పరిశోధనచేసి నాగార్జున విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి నారు.

1978 లో శ్రీ చిర్రా రఘుపతిరెడ్డి గారు 'తెలుగులో స్మృతికావ్యాలు' అన్న అంశాన్ని తీసికొని సిద్ధాంతవ్యాసాన్ని రచించి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించినారు.

1979 లో మిట్టపల్లి ప్రమీలగారు 'సందేశ కావ్యాలు విశ్వనాథ నవ్యత' అనే అంశాన్ని, శ్రీ భాగవతుల శ్రీనివాస సుబ్రహ్మణ్యసాయి 'విశ్వనాథ దేశ భక్తి కవిత్వం' అన్న అంశాన్ని పరిశోధించి సిద్ధాంత వ్యాసాలను రచించి అనంతపురం పి.జి. సెంటరుకు సమర్పించినారు. 1980 లో సి. హెచ్. సుశీలమ్మ గారు 'కిన్నెరసాని పాటలు - సమీక్ష' అనే అంశాన్ని ఉద్దేశించి నాగార్జున విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని అందజేసినారు.

1979లో శ్రీ జి. చెన్నకేశవులు నాయుడు గారు 'సౌందరనందము - ఒక పరిశీలన' అనే విషయంపై పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినారు. వి. ప్రభావతిగారు 'కాటూరివారి కవితాత్మ'ను గూర్చి పరిశోధించి సిద్ధాంత వ్యాసాన్ని నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించినారు. ఉస్మానియావిశ్వవిద్యాలయంలో పరిశోధనకు టి. వరలక్ష్మిగారు 1980లో 'సౌందరనందము - పింగళి, కాటూరి' అన్న అంశాన్ని ఎన్నుకున్నారు.

'జంధ్యాల పాపయ్యశాస్త్రి రచనలు - సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి 1980లో శ్రీ దీక్షితుల సత్య వేంకట సుబ్రహ్మణ్యం బనారసు హిందూ విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసాన్ని అందించినారు.

నండూరి వారి 'ఎంకి పాటలు' గూర్చి శ్రీ ఎస్. రాంబాబు నాగార్జున విశ్వవిద్యాలయంలో 1981లో పరిశోధన చేసినారు.

'రాయప్రోలు జీవితం - సాహిత్యం' అన్న అంశంపై 1981లో సీతాల రంగమణిగారు కృషి చేసి ఒక పరిశోధనా వ్యాసాన్ని కాకతీయ విశ్వవిద్యాలయానికి సమర్పించగా, శ్రీమతి ఎం. లావణ్య సరస్వతిగారు 1988లో 'రాయప్రోలువారి రచనల పరిశీలన - తత్త్వవివేచన' అన్న విషయంపై సిద్ధాంత వ్యాసాన్ని రచించి హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయానికి సమర్పించినారు.

1982 లో 'వేదులవారి దీపావళి - ఒక పరిశీలన' అనే అంశంపైన పి. వసుంధరాదేవిగారు హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని రచించినారు.

యథా లభ్యమైన సామగ్రిని ఆధారంగా చేసుకుని భావ కవిత్వంపై జరిగిన పరిశోధనల తీరు తెన్నులనూ భావ కవుల రచనలపై జరిగిన పరిశీలనాత్మక కృషినీ రేఖామాత్రంగా వివరించడానికి ఈ వ్యాసంలో నేను ప్రయత్నం చేసినాను.*

---

* ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి 'తెలుగులో పరిశోధన'లో ప్రచురితం, ముద్రణ - ఆగస్టు 1983.

23. లాక్షాగృహ దహనం

వ్యాసకృత మహాభారతం ఇతిహాసం. నన్నయ ఆ మహాభారతేతిహాసాన్ని కావ్యంగా మలచి తెలుగు ప్రజలకు అందించినాడు. భారతం బహు కథా కల్లోలిని. నన్నయ "కథా ప్రారంభ''మని భారతకథ శౌనకాది మహామునులకు విని పించిన రౌమ హర్షణి 'పుణ్యకథాకథనదక్షుడని' నమ్మి ఉండటంచేతనే నన్నయ మహాభారతాన్ని 'ప్రసన్న కథా' కావ్యంగా రూపొందించినాడు.

కథా కథనం కావ్యంలో కొన్ని విశిష్ట లక్షణాలను సంతరించుకొంటుంది. విన్నంత, చదివినంత మాత్రం చేతనే కథలోని వివిధాంశాలూ రమణీయార్థాలతో అవగతం కావలె. వింటున్నకొద్దీ ఉత్కంఠ పెరుగుతూ ఉండాలె. శ్రవణ పేయమైన శబ్దజాలం, అన్వయ కాఠిన్యంలేని వాక్యరచనా విన్యాసం కథాకథ నానికి అత్యంతావశ్యకములైన వాహికలు. ఏవైనా అవాంతర కథలో, ఉపకథలో తారసిల్లితే అవి ప్రధాన కథతో సంబంధాన్ని తెంచుకోకుండా, ప్రయోజనం లేని సందర్భాలలో విడిచిపుచ్చుతూ విన్నంతలోనే వాని తత్త్వం స్ఫురణకు రావడం ప్రసన్న కథాకథనం అనిపించుకుంటుంది. ఇలాంటి ప్రసన్న కథా కలితమైన కావ్యమే ఆంధ్ర మహాభారతం.

కథా ప్రసన్నత ఆత్మగతంగా ఉన్నప్పుడు రసానికీ, భావానికీ ఉపస్కారకంగా ఉండి అర్థయుక్తికి ప్రతీకగా నిలుస్తుంది. శరీర గతమైనప్పుడు శ్రవణ సుందరమైన శబ్దాలు సంకేతాలుగా నిలిచి అక్షరరమ్యతను గుబాళిస్తుంది. నన్నయ కథా కథనం 'లోనారసిన' వాళ్ళకు ఆయన ఎంత మెలకువతో కథా నిర్మాణాన్ని చేసినాడో తెలుస్తుంది.

ఏదైనా ఒక కావ్యం లోకానికి విజ్ఞానాన్నీ, ఆనందాన్నీ ప్రసాదించగలగా లంటే అందులో చక్కని కథ ఉండాలె మంచి పదజాలం ఉండాలె. కావ్యం చదువుకున్న తరువాత కొన్ని సూక్తులు సహృదయుల మనఃకుహరాల్లో ప్రతి

ధ్వనిస్తూ ఉండాలె. ఈ మూడు గుణాలు తన మహాభారత కావ్యంలో నిక్షిప్తమై ఉన్నాయని నన్నయ మహాకావ్య లక్షణాన్ని భంగ్యంతరంగా చెప్పినాడేమో! 'సారమతిం గవీంద్రులు' అన్న పద్యంలో 'ప్రసన్న కథా కలితార్థ యుక్తి', 'అక్షర రమ్యత', 'నానారుచిరార్థ సూక్తి నిధిత్వం' నన్నయ వ్రాసిన ఆంధ్ర మహాభారతంలోనే కాదు-అన్ని మంచి కావ్యాలలోనూ ఉండవలసినవే.

నన్నయ ఈ విధంగా ఆది కావ్య ప్రణేతగా కావ్యరచనా మార్గదర్శక సూత్రాలను అందించి నేటికినీ ఆదర్శ కవితామూర్తిగా నిలిచినాడు.

నన్నయ వ్రాసిన మహాభారతం అరణ్యపర్వంలో కొంత సాగి ఆగి పోయింది. కాని ఈ రెండున్నర పర్వాలలోనే నన్నయ బహుకథలను అందించి నాడు. వాటిలో కొన్ని ప్రధాన కథకు సంబంధించినది. మరికొన్ని అవాంత రంగా చెప్పినవి.

లాక్షాగృహదహన వృత్తాంతం ప్రధానకథకు సంబంధించినది. నన్నయ్య ఈ ఘట్టాన్ని తాను భారతకథా రచనకు పూర్వం వేసికొన్న పర్వానుక్రమణికలో కూడా చేర్చుకున్నాడు. శస్త్రాస్త్రవిద్యల్లో ఆరితేరిన పాండవులు తొలిసారి అడవులవాలై కులగోత్రగోపనం చేసుకుని భిక్షాటనం చేస్తూ బ్రతకవలసిన దుర్దశ ఈ లాక్షాగృహదహనంతోనే ప్రారంభమవుతుంది. పాండవులు తమ ఓర్మినీ, బలిమినీ పరీక్షించుకొనే అవకాశం కూడా ఈ ఘట్టంవల్లనే లభిస్తుంది. హిడింబీ భీముల వివాహం, ఘటోత్కచు జననం, ఏకచక్రపురంలో అజ్ఞాత వాసం, వ్యాస సందర్శనం, ద్రౌపదీ వివాహం ఇత్యాది విషయాలకిది తొలిమెట్టు.

లాక్షాగృహదహన వృత్తాంతం నన్నయభారతంలో ఉన్న తీరు ఇది :

యుధిష్ఠిరునికి యౌవరాజ్యాభిషేకంవల్ల దుర్యోధనుని మనస్సు ఈర్ష్యా పంకిలమైపోయింది. అసూయాదావానలం అతని ఆలోచనను చుట్టుముట్టింది. కర్ణ శకుని దుశ్శాసనులతో తన అసహన భావాన్ని వెడలగ్రక్కుకున్నాడు. అప్పుడు సౌబలుని ఆప్తమంత్రి కణికుడనేవాడు దుర్యోధనునికి కొంత రాజనీతిని గరపుతాడు. ప్రభువు తన అధికారాన్ని నిరాటంకంగా కొనసాగించుకోవడానికి శత్రువులపట్ల వ్యవహరించవలసిన పద్ధతులను గూర్చి చాలా పదిలమైన సూచనలు

చేస్తాడు కణికుడు. పాండవులు శక్తిమంతులు, బుద్ధిమంతులు, ప్రజారంజకులు కావడంచేత వాళ్ళు హస్తినాపురంలో ఉంటే ప్రజల్లో మరింత పలుకుబడిని సంపాదించుకొంటారు. దుర్యోధనునికి రాజ్యార్హత లేకుండాపోతుంది. తనకు అపకారం కలిగించేవారిని ఏ విధంగానైనా హతమారిస్తేనే తప్ప అధికారం నిలువదు. మాయోపాయంతో పాండవులను దూరంగా పంపి మట్టుపెట్టడంలోనే రాజనీతి కౌశలం ఉందని కణికుడు దుర్యోధనుని మనస్సులో తీవ్రమైన ఆందోళననూ, పాండవ వినాశపథకాన్నీ నాటుతాడు. దుర్యోధనుడు తన మనో వైకల్యాన్ని తండ్రికి తెలిపి, కుంతీ సహితంగా పాండవులను వారణావత నగరానికి పంపే ఏర్పాటు చేస్తాడు. వారణావత నగరం సకల సౌందర్యాలకూ నిఖిల సంపదలకూ నిత్యశుభాలకూ ఆలవాలమని, పాండవులు అక్కడ ఉండటం శ్రేయస్కరమని ధృతరాష్ట్రిన్ని నమ్మిస్తాడు. ధర్మరాజాదులు పశుపతి నివాసమయిన ఆ వారణావత నగరానికి బయలుదేరుతారు. తాను పన్నిన కుట్ర ఫలిస్తుందనే నమ్మకముతో దుర్యోధనుడు పురోచనుడనే అంతరంగికుణ్ణి పిలిచి రహస్యంగా వారణావత నగరంలో లక్కతో ఒక ప్రసాదాన్ని నిర్మించి పాండవులందులో ప్రవేశించిన కొన్నినాళ్ళకు దానికి నిప్పంటించి వాళ్ళను ఆ మోసపుటింటిలో సజీవదహనం చేయమని చెప్పినాడు. అయితే హస్తినాపురంలోని బ్రాహ్మణ క్షత్రియుల కనేకులకు ఉండిఉండి పాండవులు నగరం విడిచిపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వాళ్ళకు దుఃఖం కూడా కలుగుతుంది. ఇందులో ఏదో మోసం ఉందనే అనుమానం కూడా వాళ్ళకు కలుగుతుంది. పలువురు వాళ్ళను అనుసరించినారు. ధర్మరాజు "మేము తిరిగివత్తుమ"ని వాళ్ళకు నచ్చజెప్పినాడు. వీడ్కోలు చెప్పిన విదురుడు మాత్రం–

"ఎల్ల కార్యగతుల నెరుగుచురైనను
నెరుగ జెప్పవలయు నెరిగినంత
పనియు లేక మిమ్ము బాపిన కురుపతి
హితుడ వోలె మీద నెగ్గుసేయు."

"కావున మీరలేమరక విషాగ్నులవలన అప్రమాదులరై ఎఱుక గలిగియుండునది" అని తనతో చెప్పినట్లు ధర్మజుడు కుంతికి తెలియచేస్తాడు. వారణావతంలోని జనం పాండవుల ఆగమనానికి ఎంతో సంతోషిస్తారు. నిండు మనస్సుతో

స్వాగతం పల్కుతారు. కొంతకాలం ఆ నగరంలో గడిచిన తర్వాత పురోచనుడు తాను నిర్మించిన చతుశ్శాలలో నివసించవలసిందిగా పాండవులను కోరుతాడు. ధర్మరాజు ఆ భవనాన్ని చూసి చాలా సంతోషిస్తాడు. మంచి ముహూర్తంలో అందులోకి ప్రవేశిస్తాడు. అయితే "పరాభిప్రాయ మాయోపాయ ప్రయోగ విదుండైన ధర్మతనయుండు" ఈ ఇంటి గోడలు లక్కవని అది మాయా గృహమని గ్రహించి భీమునికి తెలియజేస్తాడు. ఈ ఇంట్లో అగ్నిభయం ఉందని నెమ్మదిగా ఉండవలసిన అవకాశం లేదని తెలియజేస్తాడు. భీముడు - "మోసపు కొంపలో ఉండడంకంటే ఈ కొంపను ఆ పురోచనున్ని కాల్చి వెళ్ళవచ్చు" నంటాడు. అప్పుడు ధర్మరాజు "మనకు ఈ సంగతి తెలిసినా తెలియనట్లుగా గూఢమతితో నుండి అవసరమైనప్పుడు తగిన చర్య తీసుకుందాం" అని సమాధానపరచి అప్రమత్తతలో ఉంటాడు.

హస్తినాపురంలో విదురుడు దుర్యోధనుని దుస్తంత్రాన్ని తెలుసుకుని అతి కుశలుడు విశ్వాసపాత్రుడు అయినటువంటి ఖనకుడనే సేవకున్ని పంపించి లక్క ఇంటిగుట్టు తెలియజేసి, నిప్పుపెట్టినప్పుడు ఆ ఇంటినుండి తప్పించుకుపోయేందుకు ఒక బిలం సిద్ధం చేయమన్నాడు. ధర్మజ భీములు ఆ బిలం సంగతి తెల్సుకుని కడుజాగ్రత్తతో ఉన్నారు. పురోచనుడు పాండవుల చర్యలను గమనించి తనకు చెప్పాలని ఒక నిషాద స్త్రీని లక్క ఇంటిప్రక్కనే యుంచినాడు. దానికి ఐదుగురు కొడుకులు. అది కుంతికి సేవ చేస్తున్నట్లు నటిస్తూ పురోచనునికి వార్తలు చేరవేసేది

పురోచనుడు ఆలక్క ఇంటికి కృష్ణపక్ష చతుర్దశినాడు నిప్పంటిస్తాడని ఖనకుని వలన తెల్సుకుని పాండవులు కూడా సంసిద్ధులుగా ఉన్నారు. కుంతి బ్రాహ్మణ సంతర్పణలు జరిపిస్తూ ఉన్నది. నిషాద స్త్రీ ఆనాడు తన అయిదుగురు కొడుకులతో తప్పతాగి నిద్రిస్తూ ఉన్నది. ఇంతలో పురోచనుడు అద్ధమరేయి లేచి లక్క ఇంటికి నిప్పుపెట్టేలోపల భీముడు లేచి పురోచనుడు నిద్రిస్తున్న గదికి నిప్పుపెట్టినాడు. తన అన్నదమ్ములనూ తల్లినీ బిలమార్గములో ప్రవేశపెట్టి లక్క ఇల్లు పూర్తిగా కాలిపోయేవరకు వేచియుండి, తాను కూడా అదే మార్గం గుండా వెళ్ళిపోయినాడు. పురోచనుడు బుగ్గి అయినాడు. నిషాద స్త్రీ తన ఐదుగురు కొడుకులతో కాలిపోయినది. తల్లితోనూ అన్నదమ్ములతోనూ క్షేమంగా బయట

పడిన భీముడు ఖనకునికి తన సమాచారాన్ని తెలియజేసినాడు. సత్యనిరతులూ ధర్మమూర్తులూ అయిన పాండవులకు ఎగ్గుచేసిన ధృతరాష్ట్రిజాధములు లక్క ఇంటి వలెనే దహనమై పోతారని లక్షాగృహ దహనం సూచిస్తున్నదని నన్నయ ఒక చక్కని మాట అన్నాడిక్కడ.

అయిదుగురు కొడుకులతో ఒక స్త్రీ అగ్గిలో బుగ్గి అయిన సంగతి ప్రొద్దున్నే పౌరులు తెలిసికొని కుంతీయుతులైన పాండవులే చనిపోయిరని దుర పిల్లిరి. విదురుడు పంపిన ఖనకుడు బూడిద తీసివేయువానివలె నటిస్తూ తాను చేసిన బిలద్వారాన్ని కప్పివేసి, ఒక నిషాద కాంత ఐదుగురు కొడుకులతో కాలి పోయిన సంగతి తె .్సకొని, పాండవుల కుశలగమనాన్ని విదురునికి తెల్పినాడు. వానికి, ఒక్క విదురునికి తప్ప హస్తినలోని వారందరికినీ పాండవులు పంచత్వము నొందినారని భ్రమ కల్గినవి. ఆల అరచినట్లు అరచినాడట ధృత రాష్ట్రిడు. గాంధారీ మున్నగు రాజకాంతల ఆక్రందనలు ఒక్క పెట్టున మిన్ను ముట్టినవి. ధృతరాష్ట్రిడూ, కొడుకులూ కుంతి పరలోక క్రియలు నిర్వర్తించి నారు. పాండవుల కుశల స్థితి విదురునికి తెలుసు. కాని తెలియనట్లుగా మిన్న కుండి అందరివలనే తానునూ శోకాన్ని ప్రకటించినాడు. దుర్యోధనునికి చాలా సంతోషం కలిగింది. కాని ఈ లాక్షాగృహ దహనకాండలో పురోచనుడు అంత రించడం దుర్యోధనునికి కొంత బాధ కల్గించినది.

నిజానికి ఈ లాక్షా గృహ దహనోదంతం ఒక కథ కాదు. ఒక పెద్ద కథలోని చిన్న ఘట్టం. నన్నయ ఈ ఘట్టాన్ని చిత్రీకరించడంలో తాను పేర్కొన్న కావ్యగుణాలు "ప్రసన్న కథా కలితార్థ యుక్తి", "అక్షర రమ్యత", "నానారుచిరార్థ సూక్తినిధిత్వం" ఈ ఘట్టమంతా పరచుకొని యున్నవి. దుర్యో ధనునికి పాండవుల పట్ల ఈర్ష్యా ద్వేషాలు కలగడం, వాళ్ళను హతమార్చడానికి సంకల్పించడం, ఆ సంకల్పానికి అనుగుణమైన ప్రయత్నం చేయడం, ఆ దుష్ప్ర యత్నం జాడలు తెల్సుకొని విదురుడు చేసిన ఉపాయం, పాండవుల అప్రమత్తత, లక్కఇల్లు కాలిపోవడం, పాండవులు కుశలముగా తప్పించుకుపోవడం, తమ దుశ్చర్య ఫలించిందని దుర్యోధనాదులు భ్రమసిపోవడం లాంటి సన్నివేశాల్లు ఉత్కంఠాసహితములై కథా కథనానికి చక్కని తీరుతెన్నులను తీర్చిదిద్దినవి. ఈ ఘట్టం ఒక నాటకంగా రూపుదిద్దుకొన్నది. నాటకంలోని ఆరంభాద్యవస్థలను అర్థ ప్రకృతులను కథాఘట్టాలలో సమన్వయించి వివరించుటకు వీలున్నది.

ఆరంభాద్యవస్థలు

1. పాండవులు తల్లితో కలిసి వారణావతానికి వెళ్ళిపోవడం- ఇది **కార్యారంభం.**

2. పురోచనుడు వారణావతంలోని లాక్షాగృహం నిర్మించి దానిలో నివసించడానికి ధర్మరాజాదులను ఆహ్వానించడం **యత్నం.**

3. పాండవులు లక్క ఇంటిలో ప్రవేశించడం వాళ్ళ సజీవ దహనానికి కారణమవుతుందని పాఠకుడు ఉత్కంఠ చెందుతాడు. కాని విదురుడు చేసిన ఉపాయంవల్ల పాండవులకు సంరక్ష కలుగవచ్చుననే ఆశ జనిస్తుంది. ఇదే **ప్రాప్త్యాశ.** "ఉపాయాపాయ శంకాభ్యాం ప్రాప్త్యాశాప్రాప్తి సంభవః."

4. ఖనకుడు లక్క ఇంటి నుండి తప్పించుకొని పోవడానికి బిలం త్రవ్వి పెట్టడం **నియతాప్తి.** లక్క ఇల్లు కాలిపోయినా పాండవులు ప్రాణాలతో తప్పించుకు పోగలరనే నిశ్చయం పాఠకునికి కలుగుతుంది.

5. ఇక **ఫలాగమం.** ఇది మనకు తెలుసు. పాండవులకు అనుకూలంగాను, దుర్యోధనునికి ప్రతికూలంగానూ సంభవించింది. సాధువైన పాఠకునికి ఎంతో సంతోషం కలుగుతుంది.

లాక్షాగృహ దహనం దుర్యోధనుని దుర్వృత్తికి ప్రతీక. ఇది ఒక దుష్టుడు పన్నిన కుట్ర. ఈ దుష్ట నాటకంలో అర్థ ప్రకృతులను ఇలా వివరించ డానికి వీలున్నది :

1. ఈ నాటకంలోని నాయకుడు దుర్యోధనుడు- ధీరోద్ధతుడు.

2. పాండవులు ప్రజారంజనాన్ని అనుభవించకుండా వాళ్ళను వారణావతానికి పంపించాలనే దుర్యోధనుని సంకల్పం దినికి **బీజము.**

3. ధృతరాష్ట్రుడు వారణావత నగర ప్రశస్తిని ఉగ్గడించి పాండవులను అక్కడ కొంతకాలం ఉండాలని కోరటం **బిందువు.**

4. లక్క ఇల్లు కట్టి దానిలో పాండవులను దింపి దానికి నిప్పుపెట్టడానికి దుర్యోధనునిచే నియమితుడైన పురోచనుడు **పతాక నాయకుడు.**

5. పురోచనుడు నియమించిన నిషాద స్త్రీ **ప్రకరి.** దీనికి ఐదుగురు కొడుకులు.

6. లక్క ఇంటికి పురోచనునికి మారుగా భీముడే అగ్నిని ఉసికొల్పడం **కార్యం**. ఇది దుర్యోధనుని పథకానికి విరుద్ధం. కార్యం బీజానుగుణంగా లేదు. ఇతిహాసమయిన మహాభారత విషయంలో ఇలాంటి నియమం చెల్లదు.

ఈ లక్షాగృహ దహన ఘట్టంలో కణికుని రాజనీతి సూక్తులు, రుచిరార్థ సూక్తులను, వారణావత నగర లక్షాగృహదర్శనం అక్షర రమ్యతకు, విదురుని ధ్వని ప్రధానములైన వాక్కులు ధర్మజ భీముల సంభాషణం కథాకథన కౌశలానికి నిదర్శనాలుగా పేర్కొనవచ్చును. పాండవులకూ దుర్యోధనునికీ విదురునికీ కురువృద్ధులకు నన్నయ ప్రయోగించిన విశేషణాలు వారి చిత్తవృత్తులను వ్యంజిస్తున్నవి.

ఈ చిన్న ఘట్టంలోనే పాండవుల ధర్మ ప్రవర్తన హస్తినాపుర ప్రజలకూ, వారణావత ప్రజలకు ఆదరణీయమైనదన్న భావం ద్యోతకమవుతున్నది. లక్క ఇల్లు కాలినట్లే దుర్యోధనాదులు బంధు సుహృజ్జన సమేతంగా నాశనమై పోతారనే ఆర్షవాక్కు ఈ ఘట్టంలో మనకు వినిపిస్తుంది.

లాక్షాగృహదహన వృత్తాంతం పరిమాణంలో ఒక కిటికీ లాంటిది. దీని ద్వారా మనం మహాభారత కథా విశేషాన్ని, మహాభారతం పాత్రలనూ దిఙ్మాత్రంగా దర్శించుకోవచ్చు. ఇంచుమించు మహాభారతంలోని మూల కథకు సంబంధించిన ఉపకథలూ, ఘట్టాలూ ఈ లక్షాగృహదహనోదంతం వల్లనే "లోనారసి" పరిశీలించిన వాళ్ళకు ఎన్నో లోతులు కన్పిస్తాయి. పూవును చూసి అది పూచిన మొక్కను మనము ఊహించుకోగలిగినట్లే నన్నయ మహాభారతంలోని కథాఘట్టాలు మూలస్వరూపాన్ని, రహస్యాన్ని వ్యంజిస్తూంటాయి.*

---

* 'నన్నయ ప్రసన్నకథ - లోతులు' అనే గ్రంథంలో ప్రచురితం. ముద్రణ 1984.

24. తెలుగులో కావ్యప్రబంధ ధోరణులు

నన్నయభట్టు మన తెలుగు భాషలో మొట్టమొదటి కవి. ఆయన పదకొండవ శతాబ్దంలో, తూర్పు చాళుక్యులు తెలుగు దేశాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో ఉండేవాడు. అంతకంటే పూర్వం తెలుగులో కావ్యరచనా పద్ధతులు లేనేలేవని కచ్చితంగా చెప్పడానికి వీలులేదు. ఛందోబద్ధమైన రచనలూ, గద్య రచనలూ మనకు నన్నయ్య కంటే పూర్వం ఐదారు వందల ఏండ్లనుంచే ప్రచారంలో ఉన్నాయని శాసనాలద్వారా తెలుస్తున్నది. అయితే కావ్యరూపంలో ఏ రచనా లభ్యం కాకపోవడం వల్ల నన్నయ వ్రాసిన రెండున్నర పర్వాల మహాభారతమే మొట్టమొదటి తెలుగు కావ్యమనీ ఆయనే ఆదికవి అనీ మనం నమ్మవలసి ఉన్నది. నన్నయ మహాభారత ఇతివృత్తాన్ని బట్టి ఇతిహాసం అని పించుకుంటుంది. ఆయన తరువాత రెండు వందల ఏండ్లకు తిక్కన సోమయాజి, ఎర్రాప్రెగడ భారతాన్ని పూర్తిచేసినారు. ఈ లోగా తెలుగులో రామాయణమనే ఇతిహాసం కూడా వెలుగులోకి వచ్చింది.

ఇలా సంస్కృతంలో ప్రసిద్ధమైన రెండు ఇతిహాసాలూ తెలుగులోకి వచ్చిన తరువాత పురాణాలను కూడా తెలుగు కవులు తెనిగించడానికి పూను కున్నారు.

పురాణేతిహాసాలు ఒక విధంగా కావ్యాలే. అయితే వీటి తరువాత తెలుగులో వెలసిన కావ్యాలకూ వీటికీ చెప్పుకోతగిన భేదముంది.

వెయ్యేండ్ల తెలుగుకవిత్వానికి తొలుదొల్త ఇతివృత్తాన్ని అందించింది సంస్కృత సాహిత్యమే. తొలినాటి తెలుగు కవులందరూ సంస్కృతంలోనూ తెలుగులోనూ పాండిత్యాన్ని సంపాదించి కవిత్వం చెప్పగలిగిన ప్రతిభావంతులు. సంస్కృత భాషలోని నుడికారం తీరునూ, తెలుగులోని నుడికారం తీరునూ చక్కగా తెలుసుకోగలిగిన పరిశీలనాదక్షులు.

ఇప్పుడు చాలామంది తెలుగులో పురాణేతిహాసాలు వచ్చిన కాలాన్ని అనువాదం యుగమని అంటున్నారు. నిజానికి అవి అనువాదాలు కావు. అను వాదం అనే శబ్దానికి "మళ్ళీ అనడం" అని అర్థం. అంటే చిలుకపలికినట్లుగా పలకడం కనుకనే ప్రాచీనాంధ్ర కవులు అనువాదం అనేమాట ఎక్కడా ఉపయో గించినట్లు కనపడదు. "తెనిగించుట, తెనుగుసేయుట, ఆంధ్రీకరించుట" వంటి మాటలనే వాడుకున్నారు. అంటే అవి భాషాంతరీకరణా లన్నమాట. భాషాంతరీ కరణం వేరు, అనువాదం వేరు. అయితే, ఇప్పుడు అనువాదం అనే మాటకు భాషాంతరీకరణం అనే అర్థం ప్రచారంలో ఉన్నమాట నిజమే అది వేరేవిషయం, ఈ సంగతిని తెలుసుకున్న ప్రాచీనాంధ్ర కవులు సంస్కృత గ్రంథాలను తెలుగు చేస్తున్నప్పుడు ఉన్నది ఉన్నట్టుగాకాక ఎన్నో మార్పులు చేసినారు. తాము అనవసరమనుకున్న వాటిని తీసివేసినారు. తమకు తోచిన భావాలను చేర్చినారు. ఈ విధంగా సంస్కృతంలోని పురాణేతిహాసాలు తెలుగులో చక్కగా కావ్యాలైనవి.

పురాణేతిహాసాలలో మనకు కనిపించే మొదటిలక్షణం పరస్పరసంబంధం లేని కథలు అనేకం ఉండటం. మూలకథ ఒకటి ఉన్నా దానికి సంబంధంలేని కథలూ, సంబంధం ఉన్న కథలూ ఉంటాయి. ఈ కథలు ముఖ్యంగా ధర్మాన్ని ఉపదేశించే ఉపాఖ్యానాలు.

పురాణేతిహాసాలకు సంబంధించిన రెండవ లక్షణం శబ్దంకంటే, శైలి కంటే అర్థం, ఉపదేశం ప్రధానమై ఉండటం. మూడవ లక్షణం అలంకారాల ప్రమేయం అంతగా లేకుండా రచన సాగడం. నాల్గవ లక్షణం శృంగార హాస్య రసాలకు చెప్పుకోదగిన ప్రాముఖ్యం లేకపోవడం. ఐదవ లక్షణం శాంత, వీర, బీభత్స, అద్భుత రసాల సన్నివేశాలు ఎక్కువగా ఉండటం. ఆరవ లక్షణం ఇతివృత్తంలోని పాత్రలు దేవతలకూ, మానవులకూ, పశుపక్ష్యాదులకూ సంబం ధించి ఉండటం. ఏడవ లక్షణం వర్ణనకంటే కథాకథనానికే ప్రాధాన్యం ఉండటం.

పురాణేతిహాసాలు తెలుగులో కావ్యాలుగానే అవతరించినా స్థూలదృష్టితో వాటిని కావ్య ప్రబంధాల వరుసలో మన విమర్శకులు చేర్చలేదు. ఈ పురాణేతి హాసాల తరువాత తెలుగులో వెలసిన కవిత్వంలో కొంచెం మార్పు కనిపిస్తుంది. పురాణేతిహాసాల ఇతివృత్తాల్లోంచి ఏదో ఒక కథను తీసుకుని ఒక కావ్యం రచించే

పద్ధతి తెలుగులో ప్రారంభమైంది. ఇంతకుముందు చెప్పిన పురాణేతిహాసాల లక్షణాల్లో కొన్ని మాత్రమే కొద్దిపాటి కత్తిరింపులతో తెలుగు కావ్యాల్లో ప్రవేశించినవి. ఈ కావ్యాలే కొంతకాలం తరువాత మరికొన్ని లక్షణాలను చేర్చుకొని ప్రబంధాలుగా రూపొందినవి. కావ్య ప్రబంధాల పుట్టుకకు కారణభూతమైన సాహిత్య సంపదలు పురాణేతిహాసాలే. అందుకే పురాణేతిహాసాల తీరుతెన్నుల గురించి ఇంతగా వివరించ్వలసివచ్చింది. కావ్యప్రబంధకవులు పురాణేతిహాసాలను చక్కగా చదువుకున్నవాళ్ళమనీ, అవి సకల ధర్మాలను బోధిస్తాయనీ, సకల విజ్ఞానభాండాగారాలనీ తమ కృతుల్లో వెల్లడించినారు. అయితే పురాణేతిహాసాలంతటి విపులమైన పద్ధతిలో కావ్యప్రబంధాల నిర్మాణం సాధ్యంకాదు. ఒకవేళ అయినా అది జనరంజకం కాదు. పురాణేతిహాసాలను తెలుగుచేసే పద్ధతికి జనాదరణం తగ్గిన రోజుల్లో అప్పటికే ఉబుసుపోకగా జనబాహుళ్యం చెప్పుకునే కథలన్నీ ఏకనాయక కావ్యాలుగా అవతరించినవి. ఏకనాయక కావ్యం అంటే కథ అంతా ఒక్క పాత్రచుట్టే అల్లుకొనిపోవడం. ఈ విధంగా పురాణేతిహాసాల్లోని రసవంతమైన ఘట్టాలను తీసుకుని కావ్యంగా, ప్రబంధంగా రూపొందించాలనే అభిలాషకు అంకురార్పణ జరిగింది. సంస్కృతంలో ఒక్కడే నాయకుడుగా ఉన్న హర్షనైషధాన్ని శ్రీనాథుడు తెనిగించినాడు. చక్కని మార్పులతో, కూర్పులతో హర్షుడు వ్రాసిన నైషధాన్ని శ్రీనాథుడు శృంగారనైషధమన్నాడు. ఏకనాయకంగా ఉన్న కావ్యాలు శృంగార ప్రధానంగా ఉండటం అప్పటినుంచే సంప్రదాయంగా ఏర్పడటం ఇక్కడ గమనించదగిన విశేషం. శ్రీనాథుని తరువాత ఆయనను అనుసరించి కావ్యరచనకు పూనుకున్న కవుల గ్రంథాలలో సామాన్యంగా కనిపించే లక్షణాలను వివరిస్తాను.

కావ్యంలో ఒకే కథ ఉంటుంది. ఒకవేళ రెండు మూడు ఉపకథలున్నా మూల కథకు పరిపోషకంగా ఉంటాయి. శృంగారమో వీరమో ఏదో ఒకటి ప్రధాన రసంగా ఉంటుంది. పురాణేతిహాసాల్లోవలె కాక కావ్యంలోని కథన పద్ధతి అలంకార ప్రధానంగా వర్ణనాత్మకంగా ఉంటుంది. పురాణేతిహాసాల్లో వస్తు వివరణ, ఉపదేశం సూటిగా ఉంటాయి. కావ్యం అలంకార ప్రధానం కాబట్టి వస్తువివరణ, ఉపదేశం వక్రోక్తిని ఆశ్రయించి అన్యాపదేశ పద్ధతిలో ఉంటాయి. అందుకే కావ్యాన్ని కాంతతో పోల్చినారు. వలచి వలపించుకున్న కాంత తన

మనోగత విషయాన్ని సూటిగా చెప్పకుండా మనోహరమైన పద్ధతిలో సూచి స్తుంది. కావ్యం చేసేదీ ఉపదేశమే అయినా ఆ ఉపదేశం వ్యంగ్యంగా, కాంత సూచించేట్టుగానే ఉంటుంది. కాబట్టే కావ్యాన్ని కాంతాసమ్మితం అన్నారు. పురాణేతిహాసాల్లో ధర్మోపదేశమే ప్రధానం అయ్యినా ధర్మబద్ధమైన శృంగారం అక్కడక్కడా చోటుచేసుకుంటుంది. కావ్యాల్లో శృంగారమే ప్రధానం అయినా అది ధర్మోపదేశానికి కూడా ఆలంబనంగా ఉంటుంది. స్థూలంగా ఇవి కావ్య లక్షణాలు.

పురాణేతిహాసాల రచనా విధానానికి కొంచెం పక్కకు తొలగి కావ్య రచనకు పూనుకున్న తెలుగు కవులు మనకు పదునాలుగవ శతాబ్దంలో పలువురు కనిపిస్తారు. వీళ్ళు వ్రాసిన కావ్యాలలో ఎంతో వైవిధ్యం ఉన్నది. కావ్యానికి ఏక నాయకత్వం ఉండాలనే లక్షణం ఒకటి ఉన్నా, ఆ లక్షణం ఒక్క శ్రీనాథుని శృంగార నైషధంలో తప్ప తక్కిన అన్ని కావ్యాల్లో తప్పనిసరిగా పాటించినట్లు కనపడదు. కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో 32 కథలున్నాయి. అయితే అన్ని కథల్లోనూ నాయకుడు కథల ఆరంభంలో విక్రమార్కుని దివ్య సింహాసనం అధిష్ఠించడానికి ప్రయత్నించడం ఉంటుంది. ఆ సింహాసనం మెట్లపై పొదగబడి ఉన్న సాలభంజికలు ఒక్కొక్కరోజు విక్రమార్కుని ఒక్కొక్క అద్భుతగాథను చెప్పడం, ఈ రాజు తనలో ఆయన లక్షణం లేదని తెలుసుకుని సింహాసనాన్ని అధిష్ఠించడం మానుకోవడం జరుగుతుంది. పాలవేకరి కదరీపతి వ్రాసిన శుకసప్తతి కావ్యం కూడా ఇలాంటిదే. శ్రీనాథుని హరవిలాసం లోని ఆరు కథలకూ పరస్పర సంబంధం ఏదీ లేకపోయినా అన్నింటిలోనూ శివపారమ్యం అంటే శివుడే నాయకుడుగా ఉండటం కనిపిస్తుంది. ఈ కాలంలోనే మరి కొన్ని కావ్యాలు కొత్త పద్ధతిలో వచ్చినవి. వీటిలో నాయకునికి ప్రాముఖ్యం లేకపోయినా ఒక పవిత్ర క్షేత్రానికీ, అక్కడి మాహాత్మ్యానికీ ప్రాముఖ్యం ఉండటం విశేషంగా కనిపిస్తుంది. కాశీఖండం, భీమఖండం, నరసింహపురాణం మొదలైన కావ్యాలు ఇలాంటివి. శివరాత్రి మాహాత్మ్యం కూడా ఈ కోవలోనిదే. అయితే ఇది శివరాత్రి మహాత్మ్యంతో పాటు సుకుమారుడనే ఒక భక్తుని చుట్టూ అల్లుకున్న కావ్యం. జక్కన విక్రమార్క చరిత్రం, అనంతామాత్యుని భోజ రాజీయం, గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం, పిల్లలమర్రి పినవీరభద్రుని శృంగార

శాకుంతలం, మొదలైనవి ఒక నాయకుని ఆధారంగా సాగిన కావ్యాలు. మణులను సూత్రంతో కూర్చే విధంగా అనేక కథలనూ, పలువురు భక్తుల గాథలనూ, రాజనీతి రహస్యాలనూ వర్ణించే కావ్యాలు కూడా కొన్ని ఆ కాలంలో వచ్చినవి. దశకుమార చరిత్రం, నవనాథ చరిత్రం, పంచతంత్రం మొదలైన కావ్యాలను వీటికి ఉదాహరణలుగా చెప్పవచ్చును.

ఈ విధంగా కావ్యాలను గూర్చి పర్యాలోచన చేస్తున్నప్పుడు తెలుగు సాహిత్యంలో మనకొక విచిత్రమైన అంశం కనిపిస్తుంది పురాణేతిహాసాలకంటే కావ్యాలు భిన్నంగా ఉంటాయి. అయితే ఈ కావ్యాలను చదువుకున్నప్పుడు కూడా మనకు పురాణేతిహాసాలు చదివినప్పటి సంస్కారం, ఆనందం, విజ్ఞానం కలుగుతాయి. ప్రాయికంగా తెలుగులో పురాణాలనూ, ఇతిహాసాలనూ, కావ్యాలనూ, ప్రబంధాలనూ వ్రాసిన కవులందరూ సంస్కృత సాహిత్య శాస్త్రం పట్ల ప్రమాణ బుద్ధి ఉన్నవారు. భారతీయ సాహిత్య సంప్రదాయం ప్రకారం రమణీయమైన భావాన్ని ప్రతిపాదించే ఒక్క శ్లోకమైనా కావ్యమే. అంతేకాదు, ఒక్క వాక్యమైనాసరే సుందరభావాన్ని చిమ్మగలిగితే అది కావ్యమే అవుతుంది. ఈ దృష్టిలో చూసినప్పుడు శతకం కావ్యమే, నాటకం కావ్యమే, పురాణం కావ్యమే, ఇతిహాసం కావ్యమే, గద్యం కూడా కావ్యమే! పురాణేతిహాసాలనూ, కావ్యప్రబంధాలనూ, సూక్ష్మదృష్టితో విడమరచి పరిశీలించినపుడు అవి వేరు వేరు కనిపించవు. కాని తెలుగు విమర్శకులు స్థూలంగా పురాణేతిహాసాలనుంచి కావ్యాలను విడదీసి ప్రత్యేక ప్రక్రియలుగా గుర్తించినారు. తిరిగి కావ్యాలను ప్రబంధాలను విడదేసినారు.

కావ్యాల్లో కథా స్వరూపాన్ని గూర్చి తెలుసుకున్నాం. ఇక కావ్యంలోని అలంకారాల స్వరూప స్వభావాలను గూర్చి తెలుసుకుందాం.

పురాణేతిహాసాల్లో అలంకారాలు వస్తువును వివరించి చెప్పడానికీ, ఉపదేశాన్ని శక్తిమంతంగా చెప్పడానికీ తప్పనిసరిగా చోటు చేసుకున్నవి. తీర్థ, క్షేత్ర మాహాత్మ్యాలను చెప్పవలసి వచ్చినప్పుడూ, మహితాత్ముల మహిమను వర్ణించవలసి వచ్చినప్పుడూ ఉపమ, రూపకం, ఉల్లేఖం, అర్థాంతరన్యాసం, ఉదాత్తం, స్వభావోక్తి, అతిశయోక్తి మొదలైనవి వాటిలో అలంకారాలుగా ఉపయోగించుకోవలసిన అవసరం అక్కడక్కడా ఏర్పడింది. కాని కావ్యాలలో

ఉపదేశమూ, కథా కొద్దిగా అప్రధానమైపోయి, వర్ణనకే ప్రాధాన్యం రావడంవల్ల అలంకారాలు కేవలం అందంకోసం, ఉక్తివైచిత్రికోసం, ధ్వనికోసం, పాత్ర పోషణకోసం, రసోద్దీపనంకోసం, ప్రవేశించినవి. ఒక్కమాటలో చెప్పాలంటే, పురాణేతిహాసాల్లోని అలంకారం అవసరానికి, కావ్యంలోని అలంకారం అందానికి అందుకే పురాణేతిహాసాల్లో అంతగాలేని శ్లేషయమకం, అనుప్రాస, ఇంకా అనేక అలంకారవిశేషాలూ, భేదాలూ కావ్యంలో ప్రవేశించి మనస్సును ఆకట్టుకుంటాయి భీమేశ్వర పురాణం తృతీయాశ్వాసంలోని 'ఆంధ్రదేశ వర్ణన'ను చూడండి :

సీ. స్వర్గం సహాదుఁ గాసె సమకట్టు పుట్టంబు
        గగనంబునకు నల్లగలవసెజ్జ
అవటంబు మేఘవాహను గంధకరటికి
        నభ్యవహారమౌర్వాగ్నిశిఖకు
వంటిల్లు యామినీశ్వరకళామౌళికి
        దరిచోటు నిఖిలబృందారకులకు
కూటకచ్ఛపనాయకునకు నిశాంతంబు
        మురుజనుకునకును మనికిపట్టు

ఘనతరోద్దండ పాఠీనకమరనక్ర
తిమితిమింగల చక్రవిక్రమవిహార
ఘుమఘుమారంభ గంభీర ఘోషఘటిత
రటదిశాప్రతి శబ్దోపలబ్ధియబ్ధి

ఈ పద్యంలో శ్రీనాథుడు సముద్రాన్ని వర్ణిస్తున్నాడు. నిజానికి పురాణంలో లేక ఇతిహాసంలో సముద్రాన్ని వర్ణించవలసివస్తే, అది అగాధంగానూ, విశాలంగానూ, ఎత్తైన తరంగాలతోనూ, నల్లనల్లగా ఉందనీ, ఘోషిస్తుందనీ ముగిస్తారు. కాని శ్రీనాథుడు అదే సముద్రాన్ని భూదేవికి 'కట్టుపుట్టం' అంటాడు. ఆకాశానికి 'నల్లకలువల పాన్పు' అంటాడు. ఇవి రెండూ అతిశయోక్తి అలంకారాన్ని పుక్కిలిస్తున్నవి. అలాగే ఇంద్రుని ఐరావతానికి 'ఆట్టాపట్టు', సముద్రంలోని అగ్నిశిఖలకు 'ఆహారం,' ఈశ్వరునికి 'వంటిల్లు', దేవతలు 'చిలికిన' ప్రదేశం, ఆదికూర్మానికి 'విశ్రాంతి మందిరం,' విష్ణువుకు 'ఆవాసం'

ఈ మొదలైన అందాల పదబంధాలు వ్యంగ్యాన్ని పొదుగుకుంటూనే పురాణ కథా రహస్యాలను విరజిమ్ముతున్నవి. సముద్రం ఇలా రకరకాలుగా మనకు కనిపించడం కావ్యంలోనే సాధ్యమవుతుంది. దీనికి కారణాలు కావ్యంలో వస్తువును గురించి చెప్పడంకన్నా, దాన్ని మనోహరంగా వర్ణించి చెప్పడమే, అలంకారాలను గుప్పించి చెప్పడమే కవుల కావ్యకళాదృష్టి కావడం. పురాణేతిహాసాల ధ్యేయం వేదనిర్దిష్టమైన ధర్మాలను వ్యాఖ్యానించడం. ఉదాహరణపూర్వకంగా వివరించడం, కావ్యానికి లక్ష్యం ఉపదేశమే అయినా ఆనందానుభూతిని ఎక్కువగా పఠితకు కలిగించడం ప్రధాన లక్షణం. ఉపదేశం, ఆనందం ఈ రెండూ కావ్యం ప్రతిపాదితాలనీ, అవే కావ్యానికి ప్రయోజనాలనీ అలంకార శాస్త్రజ్ఞులు నమ్మి ప్రచారం చేసిన సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని అక్షరాలా నిరూపించిన కవిత్వ ప్రక్రియ కావ్యం.

కావ్యం స్వరూప స్వభావాలను బట్టి చూస్తే తెలుగులో పదిహేనవ శతాబ్దం చివరిదాకా వచ్చిన కావ్యాలన్నీ పురాణేతిహాసాలకంటే కొంచెం భిన్నంగా ఉన్నాయే తప్ప ఇదమిద్ధంగా ఇదే కావ్యం అని చెప్పదగిన గ్రంథం శృంగార నైషధం తప్ప ఏదీ రానేలేదు. అదికూడా వస్తు విషయంలో వర్ణన విషయంలో, హర్షనైషధం అడుగుజాడల్లో పదిలంగా నడిచిందే.

పదహారవ శతాబ్దంలో శృంగార నైషధం ఎందరో తెలుగు కవులకు మార్గదర్శకమైనది. ఆంధ్రీకరణం మానుకుని పురాణేతిహాసాల్లోని సందేశాత్మకమైన, అద్భుతావహమైన, రసభరితమైన ఒక ఘట్టాన్ని తీసుకుని, అనువైన వర్ణనలను చేర్చి కావ్యంగా మలచే పద్ధతికి శ్రీకారంచుట్టినారు శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి కవులు. ఈ కొత్తరకం కావ్యాన్నే తెలుగు విమర్శకులు 'ప్రబంధం' అన్నారు. తెలుగు విమర్శకులని ఎందుకంటున్నానంటే, ప్రబంధ శబ్దానికి ఇప్పుడు చెలామణిలో ఉన్న అర్థం సంస్కృతంలో లేకపోయినా, ఈ శబ్దంతో పరిచయం తొలినాళ్ల నుంచి తెలుగుకవుల కున్నది. పాల్కురికి సోమనాథుడు, తిక్కనసోమయాజి, ఎర్రాప్రెగడ మొదలైనవారంతా ప్రబంధ శబ్దాన్ని తమ గ్రంథాల్లో వాడుకున్నవారే. అయితే వాళ్ళ దృష్టిలో 'ప్రబంధం' అంటే సంస్కృతంలోని 'ప్రబంధమే'. సంస్కృతంలో ప్రబంధం, కావ్యానికి పర్యాయ

శబ్దం అని ఇంతకుముందే నేను మీకు తెలియపరచినాను. ప్రబంధం అంటే వర్ణనాప్రధానమైన కావ్యమని వ్యవహారం. ఇంకా ప్రబంధంలో మరికొన్ని లక్షణాలను కూడా ఇప్పటి విమర్శకులు గుర్తించినారు. ఉదాత్త లక్షణాలు కలిగిన నాయకుని కథ, శృంగారమో, వీరమో ప్రధాన రసంగా ఉండటం కావ్యాల్లోనూ మనకు కనిపిస్తుంది. కాని ప్రబంధంలో శృంగార రసమే ప్రధానంగా ఉంటుంది. పనిగట్టుకుని పద్దెనిమిది లేదా ఇరువైయొకటి వర్ణనలు ప్రబంధంలో మనకు కొట్టవచ్చినట్లు కనిపించే మరో లక్షణం. సూర్యోదయాస్తమయాలు, చంద్రోదయం, చీకట్లు, ఋతువులు, చంద్రమదన మలయానిల ఉపాలంభం, విరహం, పుష్పాపచయం, జలక్రీడలు, ఉపవనగిరిగుహల వర్ణనలు, నగరవర్ణనం, వివాహం, శోభనవర్ణనం, పుత్రోదయం, వేట, దండయాత్ర మొదలైన వర్ణనలు ప్రబంధాల్లో 'తగుదుమమ్మా' అని చోటు చేసుకున్నవి. ఈ వర్ణనలకూ కథకూ అంతగా సంబంధం ఉండదు. ఇవి లేకపోయినా కథకు వచ్చే ప్రమాదం ఏమీలేదు. అయితే ప్రబంధకవి కథా సన్నివేశాలనుంచి, పాత్రల కార్యకలాపాలనుంచి బయటపడి, ప్రకృతిలోకి, ప్రజల్లోకి పోయే అవకాశాలను చేజిక్కించుకుంటాడు. ఈ వర్ణనలమాటున కవి మహనీయ కల్పనలతో పాటు తన సమకాలిక సామాజిక జీవితవృత్తంతో పొత్తు కలుపుకుంటాడు. పురాణేతిహాసాల్లోని, కావ్యాల్లోని రాజులూ, మునులూ, గంధర్వులూ, వీరులూ, స్త్రీలూ, సామాన్యులూ ప్రబంధాల్లో మనకు ప్రబంధకర్తల కాలంనాటి సమాజంలోని వేషాలతో హావభావాలతో ప్రత్యక్షమవుతారు.

ప్రబంధంలోని ఇతివృత్తం పూర్తిగా కల్పితమైంది కాకపోయినా కొంతవరకు కవి కల్పిత కావ్యంగా కనిపిస్తుంది. దీనికి కారణం ప్రధానంగా వర్ణనలే. అయితే ఒక పింగళి సూరన్న మాత్రం పూర్తిగా కల్పనాత్మకమైన 'కళాపూర్ణోదయము' అనే ప్రబంధాన్ని రచించినాడు. వర్ణన ప్రధానంగా ఉంటేనే మంచి కావ్యం అన్న అభిప్రాయానికి ఆ రోజుల్లో చెల్లుబాటు కలిగింది. ఈ చెల్లుబాటు ఎందాకా పోయిందంటే నాయికానాయకుల ప్రసక్తిలేని క్షేత్ర మాహాత్మ్యాలు కథావస్తువులుగా వెలసిన కాళహస్తి మాహాత్మ్యము, పాండురంగ మాహాత్మ్యము లాంటి గ్రంథాల్లోకూడా ప్రబంధాలలోని శ్రుతిమించిన వర్ణనం కనిపిస్తుంది.

బ్రాహ్మణులనూ, క్షత్రియులనూ ఇంకా ఇతర జాతులవాళ్ళను వర్ణిస్తున్నప్పుడు ప్రబంధకవి తనకాలం నాటివాళ్ళనే చూసి వర్ణించవలసి వస్తుంది.

కట్టూ బొట్టూ, ఇల్లూ వాకిలీ, ఆటాపాటా, మాటతీరూ, నడవడి, ఆయా ఋతువుల్లోని ప్రజల అనుభవాలూ, ఆచారాలూ, నమ్మకాలూ ఇవన్నీ వర్ణించడం ద్వారా కవి ప్రబంధంలోని కథను నడుపుతాడు. కేవలం కథకే ప్రాధాన్యం ఉంటే అది కావ్యమో పురాణమో అయి కూర్చుంటుంది. కాని ప్రబంధమనిపించుకోదు. దీనికి నిదర్శనంగా 'మనుచరిత్ర' అనే పాఠ్యంలోని ఈ పద్యాన్ని వినండి.

"తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవుబారికి నగ్గముసేసి క్రూరుడై
యరిగె మహీసురాధముడహంకృతితోనని రోషభీషణ
స్ఫురణ వహించెనోయన నభోమణి దాల్చెకషాయ దీధితిన్."

ఈ పద్యంలో కవి సూర్యాస్తమయాన్ని వర్ణించినాడు. వరూధినిని కాదని ప్రవరుడు వెళ్ళిపోయిన తర్వాత పెద్దన చెప్పిన పద్యం ఇది. దీనిలో ప్రవరుని తిరస్కారభావాన్ని సూర్యుడు కోపగించుకున్నాడో ఏమో అన్నట్లుగా ఎర్రబారి అస్తమించినాడని ఉన్నది. నిజానికి ఇక్కడ జరిగిన ఈ సంఘటనకూ సూర్యాస్తమయానికీ ఏమీ సంబంధం లేదు. సూర్యోదయ అస్తమయాలు ప్రకృతి ధర్మాలు. ఆ ప్రసక్తి ఇక్కడే తీసుకువచ్చి అతికించడం అనవసరం. అదే ప్రబంధంలోని విలక్షణత.

ఈ విధంగా ప్రబంధాలలో ఉపదేశం అడుగునపడిపోయి కేవలం ఆనందమే ప్రయోజనంగా మారుతున్న సందర్భాలను చూసిన పెద్దలలో "కావ్యాలాంపాంశ్చవర్జయేత్'' - అంటే కావ్యాలను ఆలపించడం వదిలిపెట్టాలె - అన్న మాట వ్యాప్తిలోకి వచ్చింది. అయితే ఈ మాట కావ్యాలకూ ప్రబంధాలకూ వర్తించేదికాదు.

కేవలం హద్దుమీరిన శృంగార వర్ణనం ఉన్న గ్రంథాలకు మాత్రమే పైసూక్తి అనువర్తిస్తుంది. మొత్తంగా చూస్తే కావ్య ప్రబంధాలు తెలుగు సాహిత్యంలో శబ్దానికీ, అర్థానికీ, అలంకారానికీ, ధ్వనికీ, కల్పనాచాతుర్యానికీ అందాలను సమకూర్చినవి. తెలుగు భాషను సుసంపన్నమూ, శక్తిమంతమూ చేసినవి.*

---

* ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కోసం రచింపబడింది. ఇదొక శ్రవ్యపాఠం. రచనాకాలం - 13-9-1985.

25. ప్రేమ్‌చంద్

మన ప్రాచీన సాహిత్యంలో పల్లె పట్టులకు, పల్లీయుల సమస్యలకూ వాళ్ల మనస్తత్వాలకూ అట్టే ప్రాముఖ్యం లేదనే చెప్పాలి. ఆశ్రమాలనో, ఆటవికుల మనికి పట్టులనో వర్ణించిన సందర్భాలు అక్కడక్కడా కనిపిస్తాయి. ఆశ్రమాలను వర్ణించినపుడు అద్భుతమూ, పవిత్రమూ ఐన వాతావరణాన్ని కల్పించడం పరిపాటి.అంటే దైనందినజీవితంలో అనుభవానికి రాని పరిస్థితులను వర్ణించటం. ఇక ఆటవికుల పల్లెపట్టులను వర్ణిస్తున్నపుడు వాటి బాహిరమైన స్వరూపాన్ని సహజంగా చిత్రించే ప్రయత్నం చేశారు. నగర వర్ణనం లేని కావ్యం కొంచెం అరుదే. ఆ నగర వర్ణనం కూడా లోకానుభవానికి సుదూరంగా ఉండి, మనో నేత్రాలకే కనపడుతూ ఉండేది. ఏ మాత్రం చలనం లేని జీవితాన్ని కర్మతో ముడిబెట్టుకొని, సరిపెట్టుకొని అన్ని రకాల దోపిడీలకూ గురైన పల్లీయులను తమ కలం కన్నుతో చూడగలిగే రచయితలు సాహిత్య రంగంలో లేని తరుణంలో ఒక మహావ్యక్తి అవతరించాడు. దేశానికి వెన్నెముకగా ఉన్న గ్రామ్య జీవనం పరోక్షంగా రాజకీయ దాస్యానికీ ప్రత్యక్షంగా కలిమిబలిములకూ గురైపోతూ ఉండడాన్నీ, నగరాల్లో నివసిస్తున్న జనం తమ అన్నదాతల బ్రతుకు బరువులను అర్థం చేసుకోలేని పరిస్థితినీ, అరుదైన తన కథల ద్వారా, నవలల ద్వారా ప్రస్ఫుటం చేయడానికి ఆ వ్యక్తి తన కలాన్నీ, తన జీవితాన్నీ, తన వ్యక్తిత్వాన్నీ మలచుకొన్నాడు. నిజంగా భారతీయ సాహిత్యంలో ఒక క్రొత్త దృక్కోణంతో ఆర్ద్రమనస్కతతో అడుగు పెట్టి, కథా రచనకు ఒక ప్రయోజనాన్నీ, నవలా రచనకు ఒక వైశిష్ట్యాన్నీ, సాహిత్య సృష్టికి ఒక సమున్నత ప్రమాణాన్నీ కల్పించి, అందరి హృదయాలనూ చూరగొని, స్వాతంత్ర్య సంగ్రామంలో దూకడాని కుద్యుక్తులౌతున్న యువతరం దృష్టిని పల్లీయుల సముద్ధరణ వైపు మరల్చడానికి ప్రయత్నించిన వారిలో ప్రథముడు. అతడే ప్రేమ్‌చంద్.

సాహిత్యలోకానికి తెలిసిన పేరు ప్రేమ్‌చంద్‌కాని, అయన అసలు పేరు ధన్‌పత్‌రాయ్.

జూలై 30, 1880లో లమ్హి గ్రామంలో జననం. వారణాసికి ఐదారు మైళ్ళ దూరంలో ఉంటుంది గ్రామం. తండ్రి అజాయబ్‌లాల్. తపాలాఫీసులో ఉద్యోగి. పసితనంనుంచీ తలిదండ్రుల ప్రేమకు అంతగా నోచుకోలేదు ప్రేమ్‌చంద్. తల్లికెప్పుడూ అనారోగ్యం. ఆమెకు మందూ మాకు లివ్వడంలో తండ్రి నిమగ్నుడై ఉండేవాడు. అతనికి ఏడేళ్ళు నిండినవో లేదో తల్లిని మృత్యువు కబళించింది. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. సవతి తల్లి నిష్ఠుర ప్రవర్తనకు ప్రేమ్‌చంద్ బాల్యం బలైపోయింది. తండ్రి సంపాదన సంసారానికి సరిపోయేది కాదు. ముద్దూ ముచ్చటా, ఆలనా పాలనా అంటే ఏమిటో ఆ బాలుడు ఎరుగడు. పిల్లవాని చదువునుగాని, ఆటపాటల్నిగాని- అంతగా పట్టించుకోలేదు తండ్రి. తల్లీ తండ్రీ అంటే ఆ పిల్లవానికి ఆదరంకూడా పోయింది. ఎప్పటికీ తనలో తాను ఏదో ఊహిస్తూ, ముభావంగా ఉంటూ, పరిసరాలనూ, తన స్నేహితుల తలిదండ్రుల ప్రేమలనూ చూస్తూ, తన తలిదండ్రులు తననుకూడా అంత మురిపెంతో చూస్తే ఎంత బాగుండేదో అని తలపోస్తూ ఉండేవాడు. ప్రేంచంద్ కథల్లో నవలల్లో తలిదండ్రుల ప్రేమకు నోచుకోని పిల్లలను చిత్రించడంలో ఆయన చూపిన సహజత్వానికి తన బాల్య జీవితమే కారణం. నిజానికి ప్రేంచంద్ రచనలు ఆత్మానుభూతికి ఆకృతులు. కనుకనే అర్ధ్రంగా రూపొందినవి. రచనల్లోని సహజత్వాన్నిగురించి నేను మళ్ళీ వివరిస్తాను.

ప్రేంచంద్ చిన్నతనంలో బడులు ఎక్కువగా ఉండేవికావు. మదర్‌సా అనే పాఠశాలల్లో చదువులు సాగుతూ ఉండేవి. అవి మొగల్‌రాజుల కాలంనుంచీ ఉన్నవి. మౌల్వీలు పాఠాలు చెప్పేవారు. సాధారణంగా ఉర్దూ, ఫార్సీ భాషల్లో చదువులు సాగుతూ ఉండేవి. ప్రేంచంద్‌కూడా మదర్‌సాకే వెళ్ళి ఉర్దూ పార్సీలు నేర్చుకున్నాడు. ఏదో విధంగా పడుతూ లేస్తూ, చిరిగిన గుడ్డలతో, రుచిలేని ఆహారంతో సతమతమౌతూ మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఎం.ఏ. దాకా చదివి వకీలు వృత్తిని చేపట్టాలని అతని సంకల్పం. కాని, ప్రతికూల పరిస్థితులు నెట్టుకొస్తూ ఆ లక్ష్యాన్ని చేరుకోవాలని అతడెంత ప్రయత్నం చేసినా సాఫల్యం పొందలేకపోయాడు. వకీలు కావాలనే ఆయన కోరిక అలాగే ఉండిపోయింది.

క్వీన్స్ కాలేజిలో ఎంతోకాలం ఉన్నత విద్యాభ్యాసం చేయలేకపోయాడు. స్కూల్లో టీచరయ్యాడు. ఉపాధ్యాయ శిక్షణ పొందడానికి ట్రైనింగ్ పూర్తైయిన తరువాత తాను పనిచేస్తున్న మాధ్యమిక పాఠశాలకు అతను హెడ్మాస్టరయ్యాడు. జీవితంతో క్రమక్రమంగా పరిచయం పెరిగింది. అధ్యాపకుడుగా ఉంటూనే జ్ఞాన తృష్ణను తీర్చుకోవచ్చనే లక్ష్యంతో అధ్యయనం కొనసాగించాడు. వ్యర్థంగా తానింతకాలం చదువు కోసం స్కూళ్ళనూ కాలేజీలనూ నమ్ముకున్నాడు. కాని వీటితో సంబంధం లేకుండానే మనిషి చాలా నేర్చుకోగలుగుతాడనే విశ్వాసం ఆయనలో బలపడుతూ వచ్చింది.

అలహాబాదు పాఠశాలనుండి 1905 లో అయనకు కాన్పూరు బదిలీఐంది. ఇక్కణ్ణుంచే అయన సాహిత్య జీవనం ప్రారంభమైంది. తన మనోభావాలను సువ్యక్తంగా తెలుపగలిగే యోగ్యతను సంపాదించడమే నిజానికి విద్య అనిపించు కుంటుంది. ప్రేంచంద్ ఈ నిజాన్ని జీవితంలో అనుష్ఠేయంగా పెట్టుకున్నాడు. ఎంతో ఉత్సాహంతో ఎన్నో పుస్తకాలు చదివాడు. మిత్రులతో వివాదాలకు దిగేవాడు. ఈ విధంగా తని మనస్సు అనుభవించగలిగినదాన్ని చక్కని భాషలోకి అనువదించే నైపుణ్యం ఆయనకు అలవోకగా, నిశ్శ్రమంగా, అనుభవ సిద్ధంగా అలవడింది. ఏ కొందరు రచయితలకో ఇది సాధ్యం. కథలంటే ఆయనకెంతో ఇష్టం. కల్పిత కథలన్నా, కల్పిత పాత్రలన్న, అద్భుత చిత్రణన్నా ఆయనకెంతో మక్కువ. కథాసాహిత్యాన్ని ఇతోధికంగా అధ్యయనం చేస్తున్న ప్రేమ్‌చంద్‌కు తన అనుభవాల ఆధారంగా కథ లల్లాలనీ, వ్రాయా లనీ కోరిక చెలరేగింది. తన భావాలను ప్రకటించగలిగే సామర్థ్యం కలగగానే కథలు వ్రాయటం ప్రారంభించాడు. 1907 లో రవీంద్రుని చిన్నకథలెన్నింటినో ఉర్దూలోకి అనువదించి పత్రికల్లో ప్రచురించాడు. కాని, నవలారచనకు ఆయన ఉపక్రమించింది 1901 లోనే! ఆయన మొదటి నవల 1902 లో, రెండవది 1904లో వచ్చింది. కాని, కథలు 1907 కంటే పూర్వం ఒక్కటికూడా రాలేదు. ఆయన మొదటి కథ "జమానా" అన్నే ఉర్దూ పత్రికలో 1907 లో "ప్రపంచంలో అన్నిటికంటే వెలలేని రత్నం (సన్‌సార్‌కా సబ్‌సే అన్‌మోల్ రత్న్)" ప్రచురితమైంది. ఆ తర్వాత జమానాలోనే నాలుగైదు కథలొచ్చాయి. "దునియాకా సబ్‌సే అన్‌మోల్ రతన్" కట్టుకథలాగా కనిపించినా అది నైతిక

సూత్రానికి కట్టుబడి ఉంది. ప్రపంచంలో అన్నిటికంటే విలువైంది మాతృదేశ స్వాతంత్ర్యాన్ని సముపార్జించటంకోసం ఓడ్చిన చివరినెత్తురు బొట్టనీ, ఉరిశిక్షకు గురైన కొడుకును కన్నతండ్రి కన్నీళ్లకంటే, భర్తతో ఆహుతై పోయిన పతివ్రత చితాభస్మంకంటే, ఆ రక్తబిందువు విలువైందనీ ఆ కథలో అన్నాడు. నిజానికి ఆయన రచనా వ్యాసంగానికి ఈ స్వాతంత్ర్యపిపాస పునాదిగా నిలిచింది. 1908లో 'సోజెవతన్' అనే పేరుతో సంపుటిగా దేశభక్తిని ప్రబోధించే (5) కథలను ప్రచురించాడు. అప్పుడాయన రాజకీయ అంశాలను గూర్చి బాహాటంగా చదివేవాడు, చర్చించేవాడు. ఇటలీ స్వాతంత్ర్యవీరులు మేజినీ, గెరీబాల్డీల జీవిత విశేషాలను గూర్చి, వివేకానందస్వామిని గూర్చి, వారి మహనీయ త్యాగనిరతిని గూర్చి వ్రాశాడు. 1909లో పాఠశాలల అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయనకు 'మహోబా'కు బదిలీ ఐంది. 'సోజెవతన్' మూలంగా ప్రభుత్వ ఆగ్రహానికి గురియైనాడు. ఐతే 'నవాబ్‌రాయ్' అనే పేరుతో వచ్చిన ఈ కథల సంపుటి ప్రేమ్‌చంద్‌దేనని ప్రభుత్వం కనిపెట్టింది. సత్యాన్ని సహించని ప్రభుత్వాన్ని ఎదిరించడంలోనే చరితార్థత ఉందని భావించాడు. ఇక ప్రేంచంద్ అనే పేరుతో ఆయన సాహిత్యలోకంలోకి ప్రవేశించాడు. అటు ప్రభుత్వోద్యోగంలో అదుపులనూ, ఇటు ఇంట్లో సంసారంలో ఆటుపోట్లనూ ఎదిరిస్తూనే తన సాహిత్య వ్యాసంగం కొనసాగిస్తూ వచ్చాడు.*

---

* రచనా ప్రచురణాదుల వివరాలు తెలియవు.

26. నిఘంటువులను ఎలా ఉపయోగించాలి?

"అడిగి యర్థంబు నంతయు సమకూర్చు
నడిగిన తక్షణంబమర నిచ్చు
నెవ్వారలడిగిన నేకరీతిగ నిచ్చు
నెప్పుడడిగిన నిప్పుడప్పుడనక

గాన నిఘంటువు కల్పవృక్షము గాదె
కాదెపో తప్పక కామధేను
వట్టి వస్తువు దీని యక్కఱ లేనట్టి
వారలుందురె యెట్టి వారికి నిది

లేక యుండుట గను జేయి లేకయుంట
యంధకారంబు నందు నల్లాడుటొప్పొ
కామధేనువో కల్పవృక్షంబొ మనకు
లభ్యములు గావకారాది లభ్యమిలను.

పత్ర పత్రంబునకు మంచి ఫలము గల్గి
కవుల దనుపును నర్థ సంగ్రహణ బుద్ధి
రోసి డస్సిన వారల గాసి దీర్చు
గల్పవృక్షంబుగాదె నిఘంటువరయ.

అకలుష వర్ణ వర్ణితపదాదిక శబ్ద విరాజితంబు చూ
డక తనివోనిదై బుధుల రావులతో దలకట్టు కొమ్ములం
దొక నెరసైన లేక సుఖముండుచు జూచిన యంతమాత్రనే
సకల పదార్థ సంచయ మొసంగు నిఘంటువు కామధేనువౌ"

ఇంగ్లీషు - తెలుగు నిఘంటు నిర్మాత కీ. శే. శంకర నారాయణగారి నిఘంటు సంపుటిలో తిలక ప్రాయంగా కనిపించే పద్యాలివి. నిజంగా నిఘంటువు కల్పవృక్షమే కామధేనువే. పరిమిత శబ్దాలు మాత్రమే తెలిసినవాడు పేదవాడే. సంస్కృతములో ఒక అభియుక్తోక్తి ఉన్నది: "కోశావాన్ ఆచార్యః" అని. కోశం అంటే నిఘంటువు. ఆచార్యుడు లేక నిఘంటువు ఉన్నవాడు ఆచార్య సన్నిధిలో ఉన్నట్టే. నిఘంటువు అంటే కోశం. కోషం అని కూడా అనవచ్చు. కోశం అంటే ఖజానా. అధ్యాపకులు సరే. సామాన్య పౌరులు కూడా మాటల విస్తృతిని తెలిసికొని ఉండాలి. ఏ మాటకు ఎన్ని రకాల అర్థాలున్నాయో, ఏ సందర్భంలో ఏ అర్థం వస్తుందో, ఒక మాట అంటే పదం వెనుక ఎంత సంస్కృతి ఉందో, ఎంత కథ ఉందో తెలుసుకుంటేనే తప్ప సమాజంలో వ్యక్తి తన మనుగడకు సార్థకత సంపాదించుకోలేడు.

భాషకు బహిర్వేషం ఉచ్చారణ. అది సరిగా లేకపోతే పరిస్థితి అనర్థానికి దారి తీస్తుంది. హాస్యాస్పదమవుతుంది. నిఘంటువులు ఉచ్చారణారీతులను తెలియజేస్తాయి.

నిఘంటువులు శబ్దాల రూపాంతరాలను తెలియజేస్తాయి. అర్థం ఒకటే అయినా రూపం మారుతుంది. అప్పుడది మరో శబ్దం అనుకునే ప్రమాదం ఉంది. కోశాలు ఆ ప్రమాదం నుంచి తప్పిస్తాయి. హాలహలం - హాలాహలం - హాలాహలం. వతంసం, అవతంసం.

కొన్ని మాటలు ఒక భాషలో నుంచి మన భాషలోకి వచ్చి కలిసిపోతాయి. తమ మూలార్థాలను కోల్పోతాయి. అప్పుడు మూల భాష తెలుసుననే అహంకారం వల్ల అనర్థం ఏర్పడవచ్చు. సంస్కృతంలో 'ఆగ్రహం' అంటే పట్టుదల. తెలుగులో కోపం. సంస్కృతంలో 'నిజం' అంటే తన...తెలుగులో సత్యం.

అలాగే కొన్ని పదాలు అచ్చం తెలుగు పదాల్లాగే ఉంటాయి. అనుచిత విభాగం వల్ల, మాట్లాడేవాళ్ళు పొరపాట్లు చేస్తూంటారు.

భాషామతల్లి - అంటే శ్రేష్ఠమైన భాష. తెలుగులో చాలా మంది తెలుగు భాష అనే తల్లి అని అర్థం వచ్చేటట్టు ప్రయోగిస్తుంటారు.

ఇదే సుశబ్దాపశబ్ద విచారం. నిఘంటువే దీనికి మార్గ దర్శకం. నిఘంటువుల వల్ల మనకు రకరకాల అర్థాలు తెలుస్తాయి. మాండలిక పదాల అర్థాలు, కావ్యాలలో ప్రయుక్తములైన పదాలకు అర్థాలు, పర్యాయ వాచకాలు, నానార్థాలు, ఏకాక్షర శబ్దార్థాలూ ఇంకా మరెన్నో. అధ్యాపకులు తమ పాఠ్యాంశాలలోని పదాలకున్న వివిధార్థాలను తెలుసుకొని వాటిని విద్యార్థులకు అనువైన పద్ధతిలో పాఠం చెబుతున్నప్పుడు బోధిస్తుంటే విద్యార్థులకు అభిరుచి పెరుగుతుంది. నిఘంటువులు చూడాలన్న ఆసక్తి పెరుగుతుంది. వీటన్నిటితో పాటు శబ్దాలకు వ్యుత్పత్తి అర్థాలను వివరించే నిఘంటువులు కూడా లభ్యమవుతాయి. వ్యుత్పత్తి అర్థం తెలిస్తే శబ్దం ఎంత విస్తృతమైన అర్థంలో ప్రయుక్తమైందో ఎంత సముచితంగా ప్రయుక్తమైందో తెలుస్తుంది.

అకారాద్యక్షర క్రమంలో నిఘంటు రచనా పద్ధతి భారతీయులకు పాశ్చాత్యుల వల్ల సంక్రమించింది. పాశ్చాత్యులు గాకపూర్వం నానా విధనిఘంటు రచనలో భారతీయులు చూపిన ప్రతిభ, శ్రద్ధ అనన్య సామాన్యం. అయితే అవి శ్లోక బద్ధంగా ఉండటం విశేషం. కంఠస్థం చేసుకోవడానికి వీలుంటుంది ఛందస్సుల్లో పొదిగినప్పుడు. శబ్దార్థాలను తెలిపే నిఘంటువులే కాక శాస్త్రాలకూ శాస్త్రీయ శబ్దాలకూ క్రియా ప్రత్యయాది ప్రత్యేక పదాలకూ, సామెతలకూ, పారిభాషిక శబ్దాలకూ సంబంధించిన నిఘంటువులు ఉంటాయి. పుస్తకాల నిఘంటువులు, వ్యాసాల నిఘంటువులూ, బహు భాషా నిఘంటువులూ, అక్షర పరిమితి ఉన్న నిఘంటువులూ ఉంటాయి.

ఒక్కొక్క విషయాన్ని తీసుకుని అకారాదిగా విపులంగా వివరించే విజ్ఞాన కోశాలు కూడా ఒక విధంగా నిఘంటువులే. అధ్యాపకులు ఆయా విషయాలకు సంబంధించిన సమగ్ర పరిజ్ఞానాన్ని ఈ విజ్ఞాన కోశాల వల్ల సంపాదించుకోవచ్చు. ఇంగ్లీషులో రెఫరెన్సు పుస్తకములు అన్న పదానికి తెలుగులో పరామర్శ గ్రంథాలు అన్న మాట ప్రచారంలో ఉన్నది. పరామర్శ గ్రంథాల్లో పాఠ్యాంశానికి సంబంధించిన అంశాల సమాచారం విపులంగా ఉంటుంది. విద్యార్థు

లకు ఆయా విషయాలను గూర్చి విపులంగా చెప్పి, విశదీకరించడానికి ప్రయత్నిస్తే, బోధకుని పట్ల ఆదరాభిమానాలు ఇనుమడించే అవకాశాలు ఎక్కువౌతాయి. కేవలం పాఠ్యాంశాలకే తరగతి పాఠాన్ని పరిమితం చేస్తే విద్యార్థులకు బోధకుని వల్ల తెలిసేదేమీ ఉండదు. పరామర్శ గ్రంథాలు చదివి బోధిస్తే రకరకాల విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకొని మననశీలతనూ,అధ్యయన శీలతనూ పెంపొందించుకుంటాడు. పాశ్చాత్య దేశాలలో అధ్యాపకులు ఈ పద్ధతిని అవలంబించడం వల్ల విద్యార్థులలో పఠనాసక్తిని పెంచగలుగుతున్నారు. బుద్ధిమంతులను తయారు చేయగలుగుతున్నారు.

నిఘంటు పరిశీలనానికి ఓపిక అవసరం లేదు. అప్పటి కప్పుడే ఫలితం కనిపిస్తుంది. పదాలను వాక్యాలను దిద్దేటప్పుడు నిఘంటువుల ప్రయోగాన్ని విద్యార్థులకు బోధించాలె. పొరపాట్లు తగ్గుతాయి. స్వయంగా తెలుసుకునే అలవాటు పెరుగుతుంది. తనకు తెలియని క్రొత్త పదం విన్నప్పుడు, చదివినప్పుడు విస్తుపోక అతడు వెంటనే కోశాన్ని ఆశ్రయిస్తాడు.

విద్యార్థులు ఏ ప్రశ్న అడిగినా దానికి సమాధానం విజ్ఞాన కోశాల్లో ఉంటుంది. వాటిని తరుచుగా తిరగవేస్తుంటే బోధకుని పట్ల వాళ్ళకు గురుత్వం ఏర్పడుతుంది. భౌగోళిక పరిస్థితులూ, సంస్కృతీ, పండుగలూ, పర్వాలూ, మహా పురుషుల జీవితాలూ ఇత్యాది విషయాలు తెలుస్తాయి.

గోడపై కేలండర్ ఎంత అవసరమో బల్లపైన నిఘంటువు అంత అవసరం. అధ్యాపకులకు తోడు నీడ నిఘంటువు. విద్యార్థుల అధ్యయనానికి చేయూత నిఘంటువు.

కొన్ని సూచనలు : నిఘంటువులకు సంబంధించినవి.

1. వ్యుత్పత్తి అర్థాలకోసం - గురుబాల ప్రబోధిక
2. వివిధ విషయాల కోసం - సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం

తెలుగు నిఘంటువులు:

బహుజనపల్లివారి
శబ్దరత్నాకరం.

కొట్ర శ్యామల కామశాస్త్రిగారి
ఆంధ్ర వాచస్పత్యం 1, 2, 3 వాల్యూంలు.

శేలమచర్ల రంగాచార్యులు గారి
ఆంధ్ర శబ్ద రత్నాకరం.

ముసునూరి వేంకట శాస్త్రిగారి
విద్యార్థి కల్పతరువు.

పురాణ సంబంధమైన సమాచారంకోసం	:	వేమూరి శ్రీనివాసరావు గారి పూర్వగాథాలహరి.
సామెతల కోసం	:	ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి తెలుగు సామెతలు.*

---

* జూనియర్ కళాశాలల అధ్యాపకుల ఉపయోగార్థం వారి పునశ్చరణ తరగతుల సందర్భంగా రచింపబడింది రచనాకాలం 20-1-1986.

27. భాష-చరిత్ర-సంస్కృతి

భాష, చరిత్ర, సంస్కృతి మానవ జీవిత స్వరూప స్వభావాలనూ, మానవ వికాస దశలనూ, మానవుడే సృజించి పెంపొందించిన ప్రపంచాన్ని విశ్లేషించి వివరించే జ్ఞానానికి మూడు రూపాలు.

భాష మానవుడు కల్పించుకున్నదే. చరిత్ర అతని అనుభవాల చయనిక. పాశవిక దశనుంచి తాను ఎదిగిన తీరు తెన్నులే సంస్కృతి.

శ్వాసకోసం ముక్కు, ఆహారంకోసం నోరు సహజంగా మానవునికి వచ్చినవి. వాటిని మానవుడు భాషా సృజనం కోసం వినియోగించుకున్నాడు. మానవుని జీవితంతో పాటు భాష మారుతూ వచ్చింది. మనిషి మారుతూనే ఉన్నాడు. భాష మారుతూనే ఉన్నది. భాష సహజంగా కృత్రిమమే. మానవ కల్పితమే.

చెట్లనీడల్లో, గుహాగర్భాల్లో ఎదిగి ఉన్నంత కాలం ప్రకృతి. ఇల్లు కట్టుకోవడం సంస్కృతి. ఈది నదిని దాటడం ప్రకృతి. దుంగనో, పడవనో ఆధారం చేసుకోడం సంస్కృతి. చెట్లకున్న ఫలాలను, దొరికిన పశుపక్ష్యాదులను పట్టుకుని తినడం ప్రకృతి. పండించుకొనియో, కాల్చుకొనియో తినడం సంస్కృతి. ప్రకృతి సంపదను తన ఇచ్ఛానుసారం ఉపయోగించుకునే శక్తి సమస్త జీవకోటిలో మానవునికే ఉంది. ఇతర జీవుల్లో, ఈ శక్తి ఉన్నా అది సహజం. పరిమితం. పరిణామ రహితం. పశుపక్ష్యాదుల చేష్టల్లో, అరుపుల్లో అలనాటి నుంచీ ఏ మార్పూ లేదు. ఏ పరిణామమూ లేదు. అయితే ఈ పాశవికపు పొలిమేరల నుంచి ఎన్నడో విడిపడ్డ మానవుడు క్రమ క్రమంగా వికాసాన్ని పొందుతూనే ఉన్నాడు ప్రకృతి రహస్యాలను ఛేదిస్తూనే ఉన్నాడు. అంతరిక్షంలోనికి పోగలుగుతున్నాడు. సాగరతలాన్ని అందుకుంటున్నాడు. శబ్దాన్ని కొన్ని లక్షల మైళ్ళవరకు పంపి, తిరిగి సమాధానాన్ని పొందగలుగుతున్నాడు. వెలుగు కిరణాలను ప్రసారం చేస్తున్నాడు. లక్షల మైళ్ళ దూరం నుంచి ప్రతిమలను దర్శించగలుగుతున్నాడు. కంటికి కగపడని సూక్ష్మ జీవుల స్థితిగతులను పరిశీలిస్తున్నాడు. సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్నాడు. భౌతికంగా చాలా ఎదిగిపోతున్నాడు.

కొందరు పెద్దలు మానవుడు ఈ విధంగా భౌతికంగా ఎదిగిపోవడాన్ని నాగరికత అని, మానసికంగా ఎదిగిపోవడాన్ని అంటే పాశవిక లక్షణాలను దులిపి వేయడాన్ని సంస్కృతి అంటున్నారు. తన ఆకలిని మాత్రం తీర్చుకోవడం పశుత్వం, తనతో పాటు ఇతరుల ఆకలిని తీర్చడం మానవత్వం. తన ఆకలిని లెక్క చేయకుండా ఇతరుల ఆకలిని తీర్చే ప్రయత్నం చేయడం దేవతాత్వం అన్నారు ఆర్యులు మానవుడు దేవతాత్వం వైపు పయనించడమే సంస్కృతి అని నిర్వచించినారు.

ప్రతి దేశ చరిత్రలో ఇలాంటి సంస్కృతి ప్రజ్వరిల్లిన నాడే ఆ దేశం ఒక అడుగు ముందుకు నడిచింది. ప్రకృతి శక్తుల స్వాధీనం చేసుకుని సర్వ మానవాళికి సౌఖ్యం చేకూర్చాలన్న మహత్వాకాంక్షతో శాస్త్రజ్ఞులు వైజ్ఞానికాన్వేషణకూ, సాంకేతిక శాస్త్రాభివృద్ధికి మానవుడు పూనుకున్నప్పుడు మానవుని జీవితం సుఖంకరమైనది. రసవంతమైంది. దారిద్ర్యాన్ని, దుఃఖాన్ని రూపుమాపాలని, వాటి మూలాన్ని తెలుసుకోవాలని మేధావులు తపశ్చర్యకు పూనుకున్నప్పుడు, నూత్న ఆర్థిక రాజకీయ సిద్ధాంతాలు మానవాళికి మార్గదర్శక సూత్రాలై పరిఢవిల్లినవి. మానవుని సౌందర్య దర్శనాకాంక్ష అతన్ని గుహలనుంచి మహలులోనికి లాగి తెచ్చినట్లే, అతనిలోని స్వరం సంగీతమైంది. అతని అనుకరణ సామర్థ్యం నృత్యమైంది అభినయమైంది. చిత్రలేఖనమైంది. సృష్టినే తన ప్రమాణాలకు అనుగుణంగా సంస్కరించాలనుకున్నాడు మానవుడు. తపశ్చర్యకు పూనుకున్నాడు. ప్రయత్నాలు చేసినాడు తన్నుతాను మరచి పునస్సృష్టికి పూనుకున్నాడు. ఆ పునస్సృష్టి సంస్కృతి.

ఆ సంస్కృతిలో ఒక అంగం భాష. తన మనస్సులో ఉబుకుతున్న భావాలకు ముందు రూపకల్పన చేసుకున్నాడు. తరువాత సైగలను సృష్టించుకున్నాడు. తరువాత తన అరుపులకు అర్థం సృష్టించుకున్నాడు. తనకు సహజంగా లభించిన జ్ఞాపకశక్తిని అనుకరణ శక్తిని ఊతగా తీసుకున్నాడు భాషను సృజించినాడు. భాష ద్వారా తన అనుభవాలను భద్రపరచి ఇతరులకూ, తరతరాలకు అందించే సామర్థ్యం సంపాదించుకున్నాడు. భాష ద్వారా మానవుని ఉనికిని, అలవాట్లనూ, మనస్సునూ అర్థం చేసుకోవచ్చు. భాష మానవసంస్కృతికి వచోరూపం. భాష ద్వారానే మానవు డధిరోహించిన మహోన్నత నాగరకతా శిఖరాలను సందర్శించవచ్చు. భాష మనిషి చరిత్ర చెప్పుతుంది. భాష మనిషి

వ్యక్తిత్వాన్ని వ్యంజిస్తుంది. భాష దేశానికి హృదయం. బహుభాషలున్న దేశంలోని మనిషి హృదయం విశాలంగా ఉంటుంది. బహు భాషలున్న దేశంలో-అంటే మన భారతదేశంలో ఆత్మ ఒకటే. ఒకే ఒక్క పద్మం; రేకులెన్నో...ఒకే పూల దండకు ఎన్ని రకాల పూలో లిపులే వేరు! బాహిరవేషమే వేరు. అంతర్యం అంతా ఒక్కటే. ఏ ప్రాంతీయ భాషాకవి యావద్భారత కవి కాలేడు వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు అంతటివాళ్ళు సర్వభారతీయులకు కవులు. సంస్కృతం రానివాళ్ళకు కూడా కవులే. ఎందుకంటే రామాయణం అందరికీ ఆది కావ్యం. భారతం అందరికీ పంచమవేదం. కాళిదాసు అందరి హృదయాల్లో ఉన్నాడు-ఆకాశంలో మేఘంలా, భారతీయ భాషల శబ్దజాలం ఇంచుమించు అంతా సంస్కృతం నుంచి పుట్టుకొచ్చిందే. భారతీయ భాషలకన్నింటికీ వస్తు సంపదను పంచి యిచ్చింది. సంస్కృతమే భారతీయుల సంస్కృతి అంతా సంస్కృత భాషా సాహిత్యాల్లో నిక్షిప్తమై ఉన్నది.

భారతదేశ చరిత్రను పరిశీలిస్తే ఇప్పుడున్న రాజకీయ సమైక్యం మరెన్నడూ లేదనిపిస్తున్నది. ఎన్నో స్వతంత్ర దేశాలుండేవి పరస్పర స్పర్థలూ కలహాలుండేవి. కాని ఒకే సంస్కృతి సర్వభారతీయులను ఒకటిగా ఉంచింది. సాంస్కృతికంగా భారతీయులు తమది భరత వర్షమని నమ్మినారు. మతం వేరైనా, సంప్రదాయం వేరైనా, భాష వేరైనా, ఆసేతుశీతనగం తన దేశం. ఒక్కటేననీ, తన జాతి ఒక్కటేననీ అని ప్రతి భారతీయుడు నమ్మినాడు. కనుకనే నిన్న మొన్నటి రోజుల్లో, స్వాతంత్ర్య సమరం మహోద్ధృతంగా సాగిన రోజుల్లో భారతీయులకు సముత్సాహాన్ని కలిగించిన అంశాల్లో పురావైభవ సంస్మరణం ఒక్కటి. రామ రాజ్య స్పృహ, అశోకుని ధర్మపరిపాలనాస్ఫూర్తి, బౌద్ధుల త్యాగనిరతి, శంకర భగవత్పాదుల అద్వైత సిద్ధాంత ప్రాచుర్యం. దయానందుల వేద సంస్కృతి ప్రసరణం, ఆంధ్ర, మహారాష్ట్ర, వంగ, తమిళ, కన్నడ, హిందీ, గుజరాతీ, సంస్కృతాది భాషలలో వందల, వేల సంవత్సరాల తరబడి సర్వ లక్షణ లక్షితంగా వెలువడిన సాహిత్య సంపద ఇత్యాదంశాలెన్నో భారతీయులను సముద్దీప్తుల చేసినవి. స్వాతంత్ర్య సముపార్జనానంతరం కూడా తమ సాహిత్య, సంగీత, నృత్యాది కళా సంప్రదాయాల పరిరక్షణలోనే కాకుండా, ప్రపంచానికి ఒకనాడు తాము ఉద్బోధించిన శాంత్యహింసా సామరస్య సిద్ధాంతాలను తమ

రాజ్యాంగంలో పొందుపరచి, తమ వైదేశిక నీతికి మార్గదర్శక సూత్రాలుగా మలుచుకున్నారు.

భాషకూ సంస్కృతికీ అవినాభావ సంబంధం ఉంది. భాషా నిర్మాణానికి అంటే వాగర్థప్రతిపత్తికీ, పద బంధాల ఏర్పాటుకూ, సామెతలకూ, జాతీయాలకూ, ఇతివృత్తాలకూ, అలంకారాలకూ, జాతీయ జీవన సరళి-అంటే సంస్కృతి ఆధారభూతమవుతుంది. తెలుగు భాష ద్రవిడ భాషా కుటుంబానికి చెందినప్పటికీ, సంస్కృత ప్రభావాన్ని అతిమాత్రంగా స్వీకరించిన భాష. సంస్కృత వర్ణమాలలో లేని కొన్ని వర్ణాలు తెలుగులో ఉన్నవి. సంస్కృతంలో లేని ఛందస్సులు తెలుగులో ఉన్నవి. ఐనా తెలుగుకు విలక్షణమైన ఒక నుడికారం ఉన్నది. తెలుగుల జీవితాలలోనే వైలక్షణ్యం ఉన్నది.

తెలుగు కళలనూ, సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే తెలుగువాళ్ళ చరిత్ర త్రివేణి సంగమంలో సరస్వతీ నదిలాగా గుప్త వాహినిగా మనకు సాక్షాత్కరిస్తుంది. భాషా సంస్కృతుల వికాసాన్ని నమోదు చేసేదే చరిత్ర. చరిత్ర కేవలం గతం కాదు. వ్యక్తిలో, సమాజంలో జీర్ణించుకునిపోయిన ఆలోచనా సరళి, సంస్కృతి. వర్తమానాన్ని అవగతం చేసుకోవడానికీ, భవిష్యత్తును ఊహించుకోవడానికీ గత చరిత్ర అవసరం. భూత భవిషద్వర్తమానాల మధ్య మానవుడు పొందే అనుభూతులే చరిత్రకు సామగ్రిని సమకూరుస్తాయి. విద్యార్థులకు చరిత్ర చెప్పుతున్నప్పుడు ఈ అంశాన్ని జ్ఞప్తిలో ఉంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. చరిత్రను గతంగా కాక అనుభవంగా చెప్పడం మంచిది. చరిత్ర పఠనీయం. చరిత్ర దేశభక్తి ప్రేరకం. చరిత్ర వ్యక్తిత్వ నిర్మాణ సాధనం *

---

* జూనియర్ కళాశాలల అధ్యాపకుల ఉపయోగార్థం వారి పునశ్చరణ తరగతుల సందర్భంగా రచింపబడింది. రచనాకాలం 20-1-1986.

28. "Evaluation of a Poetic Work- A New Method Suggested by Kavi Samrat Vishwanatha"

One cannot claim himself a scholar and welversed in modern Telugu literature if he has not read, studied and enjoyed the works of Kavi Samrat Vishwanath Satyanarayana, the great Telugu poet of our times. His magnam opus "Srimad Ramayana Kalpa vriksamu" enabled him to acheive the coveted 'Gyan-Peeth' Award. His erudition in Telugu, Sanskrit and English, his devotion towards the Indian culture, his comprehensive understanding of the contemporary world problems and versatile genius as a poet, a dramatist, a critic, a short story writer, a novelist, a commentator, a teacher, an orator and as an embodiment of welaccomplished culture made him the most popular, venerable writer and distinguished literary Personality.

At present I venture to throw light upon a novel method of Vishwanatha's literary criticism. He has deeply studied along with the authentic commentories almost all the great works on Indian easthetics right from Bharatha to Jagannatha Panditharaya. He has shown a special interest in the theories of RASA

and DHWANI propounded by the Indian easthcticians of the past. He has the clear view of the different opinions on western literary criticism. I may add here that his knowledge in English literary criticism and literature is efficient to understand and explain the western outlook pertaining to poetic evaluation with this backgraund Vishwantha has contributed many works on literary criticism.

Being a great poet of genius Vishwanatha attaches great importance to the individuality of the poet in the process of evaluation. Strict confirmity with the estabished principles of literary criticsm. Oriental or Occidental is not acceptable to Vishwanatha. He believes that the poet has his own image, unique personality, perception, creativity and mode of expression.

The first and foremost Telugu poet Nannaya Bhattu of 11th century brought out the first possible Telgu poetic work Mahabharatham. Eventhough he followed Vyasa, he has employed the idiom and adoned it with suitable poetic values and made Mahabharatha almost on original Kavya. Ofcourse the story is Vyasa's, but the treatment, and exposition are of his own. Nannaya Bhattu has written AVTARIKA (Preface) to the Mahabharatham in which his views on poetry, its purpose and the characteristics of his poetic work are reflected. Up to this day almost all the Telugu poets of great stature have been writing

the prefaces to their poetical works, following Nannaya Bhattu. Inevitably in their prefaces the poets spelt their opinions on poetry and the characteristics of their poetical works. These prefaces prepare more or less the background for telugu literary criticism.

Lovers of poetry of a studious nature may find poet's impressions on poetic art not only in the prefaces directly, but indirectly in his work else where. His characters speak of the poetry sometimes. Personifications, descriptions suggest the artistic values of the poetry. This aspect cannot be ignored. The AVATARIKA or preface writing may not be a universal practice. But the poet's own feelings regarding the poetic art can be traced in all the poetic works of the world. It would not be a fultile effort of we make an attempt to bringforth a comman idiology out of these opinions. Such effort may lead to emotional integration. It may even estinguish the linguistic chawishism. The truth which needs no logic to explain that the poet's faith is universal and unifying. Strict confirmity with the fixed rules may harm the interests of the individual liberty of the poet in particular and the democratic way of life in general. Following the artist's thoughts desirable? because the poet is a genius. Genius seeks truth. Truth seeks beauty. Beauty seeks well being. Thus "SATYAM, SIVAM, SUNDARAM" the essense of Indian culture which is acceptale to all the great poets

and artists who aspire for the human values. This is the basis of Viswanatha's thinking. But his deep-rooted devotion and love for indian way of thinking has limits to the liberty to be enjoyed and propagated by the artists. He says that the Bird flys to heights in the blue but it should return to its nest. Indian culture allows immense liberty with an ultimate goal the purposeful life, freedom from suffering and rebirth.

Vishwanatha gives much importance to the prefaces where in the poets thoughts on poetry are expressed. Instead of following the tranditional and established of principles of literary criticism, the critic must understand the poet,s outlook itself, because the poet's individuality should not be over shadowed by the prejudiced principles, otherwise the novelty will be vanished the new experiment made by the poet will be rediculed and the poets individuality will be submerged into the ocean of oblivian.

Being a propound philospher and ardent custodian of Indian culture, Vishwanatha think's that the poetry like other fine arts cannot be measured by the fixed concepts. Imagination and easthetic experience have no limits. This infinity symbolises the poetic thought, that bestows bliss and pleasure to the connoisseurs. The heart feels the poetic experience and this heat cannot be known.

APRAPYA MANASA SAHA (Even the mind (heart) cannot have him) Bhagavadgitha says...

INDRIYANAM HI MANASCHASMI (among the Indices I am the heart (mind).

Poetry is one of the creative activities of the mind. we are helpless in finding out sources of the artistic creativity according to Vishwanatha, the best way of appreciating a poem or evaluating poetry is to study the poet's mind through understanding

The unique contribution of the poet to the human thought and social wellbeing can be visualised only when the eveluation is made according to the poet's outlook which is the intrensic sourse of expression of the own work.

Though Vishwanatha has not propounded this particular evaluation theory directly anywhere in his works, I dare to say that he has suggested this idea on many occassions. I do not claim that all his criticism is based on this idea alone, but this much can be safely maintained that such a mode of valuation was very much alive in his mind.

Neither the critics own individual fomey and his descretion nor the rigidity of the fixed principles but the poet's thoughts on his own poetic art must be taken into consideration while evaluating.

Avatarika or the preface to the poetic work should be the guideline to the critics. The easthetic values and the principles of literary criticism of east and west. One only helpful to keepup the poetic art alive and to make the world worth-living. They help to create a sympathetic attitude towards the fine arts, particularly the poetry.

After carefully going though the following critical works by Vishwanatha, I made this humble attempt. I understand this by inference, that Vishwanatha's unique personality and distinct way of thinking regarding the criticism of poetical works.

Some of the Books on criticism by Vishwanatha :

1. Nannayya Gari Prasanna Katha Kalitartha Yukti
2. Allasani vari Allika Jigi Bigi
3. Kavya Pareemalamu
4. Kavya Surabhi
5. Rasanandamu
6. Sakunthalam Abhignatha
7. Kalidasa Bhava Bhuthulu

Many other essays.*

---

* This essay was published in 34th All India Oriental Conference Journal, Calcutta - in the year 1986.

29. ప్రయోగశీలి—శ్రీనాథమహాకవి

శ్రీనాథమహాకవి సంస్కృతి ఉత్తమ సంస్కృతి. ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాలు మూర్తీభవించిన శ్రీనాథుని వంటి సత్కవి ఆంధ్ర సాహితీ జగత్తులోనే అరుదు.

శ్రీనాథుని సాహిత్యాన్ని పరిశీలించడం ప్రాచీనాంధ్ర సాహితీరీతులతో పరిచయం కలిగించుకోవడమే. శ్రీనాథుడు సంస్కృతాంధ్ర భాషల్లో అశేష వైదుష్యాన్ని సంపాదించుకున్నవాడే కాక ప్రాకృత కన్నడ శౌరసేన్యాది భాషల్లో చక్కని అభినివేశాన్ని సముపార్జించుకున్న మనీషి. వ్యాకరణ, న్యాయ, తర్కాది శాస్త్రాలలో అతడు నిష్ణాతుడు. స్మృతులు, శ్రుతులు, ఆగమాలు మున్నగు ఆర్ష విద్యలు ఆయనకు కరతలామలకములు. తనకంటె పూర్వులైన సంస్కృతాంధ్ర మహాకవుల రచనలను తలస్పర్శిగా అధ్యయనం చేసి, వాటిలోని రసమాధుర్యాలను ఆస్వాదించి ఆనందించిన సహృదయ శేఖరుడు. గీర్వాణ భాషలో ప్రౌఢ రచనలు చేయగల సామర్థ్యం ఉండికూడా తెలుగులో రచనలు చేయడం ఆంధ్రుల భాగధేయమే. శ్రీనాథునికంటె పూర్వం రాజాస్థానాల్లో ప్రాయికంగా సంస్కృత పండితులకే గౌరవాదరాలు ఉండేవి. శ్రీనాథుడు ఆంధ్రేతర రాజాస్థానానికి వెళ్ళి అక్కడ విజయదుందుభిని మ్రోగించి, తెలుగు ప్రతిభా వైజయంతికను రెపరెపలాడించినాడు.

శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు. అనువాద గ్రంథమైన నైషధంలో తప్ప ఆయన ప్రధాన రచనలన్నింటిలో భక్తిరసం పొంగులు వారుతుంది. ఆయన కవిత్వమంతా శివమహిమాభివర్ణనంతో, శివభక్తుల తపోదీక్షాభివర్ణనంతో ప్రకాశిస్తూ ఉంటుంది. తన కావ్యాలలో, చాటువుల్లో తెలుగుదేశం అందాలనూ, ఔన్నత్యాన్నీ, తెలుగు ప్రజల ఆచార వ్యవహారాలనూ, వేషభాషలనూ తనివితీర వర్ణించిన కవి మరొకడు ఈ నాటికీ మనకు వెదికినా దొరకడం కొంచెం కష్టమే! అనేక శాస్త్రాల్లో శ్రీనాథునికున్న పాండిత్యం, రాజకీయ, సారస్వత, సాంఘిక

జీవితంలో అతనికున్న ప్రమేయం, అనుభవం అతని కావ్యాల్లో సూటిగానో, చాటుగానో కనిపిస్తూనే ఉంటుంది. మహారాజుల సరసన కూర్చుండి, మహామాత్యులతో, దండనాథులతో, వణిజులతో గౌరవ సత్కారాలను పొంది, మహానగరాల్లో ధనికులతోనూ, పల్లె పట్టులలో నిరుపేదలతోనూ, ధర్మశాలల్లో, గుళ్ళలో భక్తులతోనూ, విద్వత్సభల్లో విద్వాంసులతోనూ కాలంగడిపి శ్రీనాథుడు రసనిర్భర జీవితానికి అధినాథుడు అనిపించుకున్నాడు. కనుకనే శ్రీనాథుని జీవితమే ఒక మహాకావ్యం.

ఆయన ఆంధ్రవాఙ్మయ క్షేత్రంలో అంతకు ముందు లేని కొత్త పోకడలకు ఎన్నింటికో ఆద్యుడై, ప్రయోగశీలిగా, మార్గదర్శకుడుగా, ప్రతిభామూర్తిగా వెలసినాడు. సాహిత్యకేదారంలో ఆయన నాటిన కొన్ని కొత్త మొక్కలను గురించి పరిచయం చేయడమే ఈ వ్యాసంలో నేను చేస్తున్న ప్రయత్నం.

పలువురు నడిచే దారిలో పదిలంగా పయనించవచ్చు. కొత్త పుంతలను వెదకి ఎగుళ్ళనూ దిగుళ్ళనూ తట్టుకుంటూ ముళ్ళనూ పొదలనూ పుట్టలనూ తొలగించుకుంటూ నడిచి గమ్యం చేరుకోవడం ప్రతిభ అనిపించుకుంటుంది. జగత్తులో ఏ రంగంలో అయినా సరే ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహితాత్ములందరూ కొత్తగా దారుల కోసం ఉద్యమించినవారే.

'బ్రాహ్మీదత్తవరప్రసాదు'డైన శ్రీనాథుని కంటె పూర్వం కవిత్రయం వారు, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, భాస్కర రామాయణ కవులు, గోన బుద్ధారెడ్డి, నాచన సోమనాథుడు,మారన మనకు ప్రచురంగా కనిపించే కవులు. పురాణేతిహాసాలను తెలుగు చేయడం, దేశి ఛందస్సుల్లో రచనలు సాగించడం, కొత్త ప్రక్రియలకు నారుపోయడం వంటి లక్షణాలు మనకు కనిపిస్తాయి. పురాణేతిహాసాల జోలికి పోని దేశికవులు,విశేషించి శివకవులు స్వతంత్రేతివృత్తాలను నిర్వహించి కొత్త బాటలు వేసి ప్రజా బాహుళ్యానికి కొత్త రుచులతో పరిచయం కలిగించినారు. పురాణేతిహాసాలు బహుకథా కల్లోలినులు. ఏకనాయకమైన కావ్యం అప్పటికి తెలుగులో లేదు. రామాయణం వంటి కావ్యం ఉన్నా అది ఇతిహాసం. అదొక విశిష్ట ప్రక్రియ. దాని లక్ష్యం వేరు దాని వస్తు నిర్వహణా విధానం వేరు. 16, 17 శతాబ్దాల్లో తెలుగులో మను చరిత్ర, వసు చరిత్ర, కళాపూర్ణో

దయాది కావ్యాలు ఏకనాయకమైన కథలు అనేకాశ్వాసాల్లో విభాజితములై, అష్టాదశవర్ణనలతో అలంకృతములై శృంగార వీర రసప్రధానములై ప్రబంధాలనే సరిక్రొత్త ప్రక్రియాభిధానాలై వెలువడినవి. ఈ ప్రబంధ సదృశమైన కావ్యం శ్రీనాథుని కాలం నాటికి లేదు. శ్రీహర్షుడు సంస్కృతంలో వ్రాసిన నైషధ కావ్యాన్ని శ్రీనాథుడు తెనిగించి తెలుగు రసికులకు అందించినాడు. అది సంస్కృతంలో ఎంత ప్రౌఢకావ్యమో తెలుగులో అంతే ప్రౌఢకావ్యంగా రూపుదిద్దుకున్నది. శ్రీనాథుని కంటే పూర్వం అనువాద విధానం ఎలా ఉండాలనే విషయాన్ని ఎవ్వరూ సూటిగా చెప్పినవారు లేరు. నైషధంలో శ్రీనాథుడు "అశేష మనీషి హృదయంగమంబుగా శబ్దం బనుసరించియు, నభిప్రాయంబు గుర్తించియు, భావం బుపలంక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యం బాదరించియు, ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసరణంబున(జెప్పంబడె"నని అనువాద విధానాన్ని సూచించి మార్గదర్శకుడైనాడు. అంతకు పూర్వం అనువాదాలు అసలే కాలేదని, బాగా కాలేదనీ అభిప్రాయం కాదు. అనువాదానికి ప్రమాణాలను ఏర్పరచినవాడు శ్రీనాథుడని చెప్పడం ఈ వ్యాసకర్త ఉద్దేశ్యం. నైషధాంధ్రీకరణం శ్రీనాథుడు చేసిన కొత్త ప్రయోగం తరువాతి ప్రబంధ కవుల కిది పాథేయమైనది. ఏకనాయక కావ్య రచనకు తెలుగులో శ్రీకారం చుట్టినవాడు శ్రీనాథుడే. అనువాద విధానానికీ, కవులకూ, రచయితలకూ, తొలిసారిగా తెలుగులో దారి చూపిన వాడు శ్రీనాథుడే. అయితే శ్రీనాథుడు సూచించిన ఈ అనువాద విధానాన్ని పాటించడానికి పుష్కలమైన పాండిత్యం, నిండైన హృదయం అత్యావశ్యకాలని శ్రీనాథుడు ధ్వనిగర్భితంగా కూడా ఈ పట్టులో చెప్పగలిగినాడు. యధాతథమైన అనువాదం వల్ల సాహిత్యానికి గాని పఠితలకు గాని ఒరిగే లాభం ఏమీలేదు. దేశకాలాదులను అర్థం చేసుకున్న వాడికే. సంస్కృతిని జీర్ణం చేసుకున్న వాడికే ఔచిత్యం సంగతి తెలిసి వస్తుంది. రస భావాలంకార రహస్యాలు తెలియవస్తాయి. అనువాదం అన్నంత మాత్రాన తూష్ణీంభావం వహించనక్కర లేదని శ్రీనాథుని హృదయం. మనీషిత్వమే వాంఛనీయమని ఆయన అభిమతం. సంస్కృతంలో ఉన్న భావాన్ని సమగ్రంగా అవగతం చేసుకుని తెలుగు వాక్య సరళిలో దాన్ని ప్రకటించడం అనువాద మనిపించుకుంటుంది. కొన్ని సందర్భాలలో శ్రీనాథుడు తనకున్న సంస్కృత భాషా వైదుష్యాన్ని ప్రదర్శించి శ్రీహర్షుని సమాసాలకూ,

క్రియా పదాలకూ తెలుగు ప్రత్యయాలు చేర్చి చమత్కరించిన సందర్భాలు లేకపోలేదు. అయితే ఇది కేవలం చమత్కృతి కోసమే క్వాచిత్కంగా చేసినాడు. రసపుష్టి వస్తునిర్వహణ సందర్భాలలో శ్రీనాథుడే చమత్కారాల జోలికి పోలేదు.

"పురాణభిన్నమైన కావ్యానువాద పద్ధతికి శ్రీనాథుడే గురువు" అన్న ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి అభియుక్తోక్తి ఈ పట్టున సంస్మరణీయం.

శ్రీనాథుడు స్వతంత్ర ప్రవృత్తిని అవలంబించిన ప్రతిభామూర్తి. సంస్కృత భాషలో వెలసిన పురాణేతిహాసకావ్యాల్లోని ఐదు కథలనూ, దేశీ సాహిత్యంలో ఒక కథనూ తీసుకుని శివమహిమా సూత్రంతో మాలగా కూర్చి 'హరవిలాసమ'నే కథాప్రసూన మాలికగా మలచి తెలుగు సహృదయకోటికి అందించినాడు శ్రీ నాథుడు. ఈ విధంగా పాల్కురికి సోమనాథుని బసవపురాణం, వ్యాసుని శివపురాణం, మహాభారత భాగవతాలు. కాళిదాసుని కుమార సంభవం నుంచి కథలను ఏరుకున్నాడు. తాను ఎన్నుకున్న అనువాద సూత్రాల ప్రసక్తి కూడా లేకుండా స్వతంత్రంగా గద్య పద్యాల్లో ఆ కథలను చెప్పి స్వతంత్ర కావ్యంగా 'హరవిలాసా'న్ని సృజియించినాడు. సమకాలిక సామాజిక జీవితాన్ని ఆ కథల్లోనికి జొనిపినాడు. అనుకరణ దోషం లేకుండా ఆ కథలను తానుగానే చెప్పినాడు. చక్కని తెలుగు నుడికారానికి ఈ 'హరవిలాస' కావ్యం ఒక మనోజ్ఞమైన ఆదర్శం. ఇష్టదైవ మహిమలను మూలసూత్రంగా పెట్టుకుని ఎక్కడెక్కడి కథలనో ఏరికూర్చి ఒక కథా సంకలనంగా అనందించడం ఇంతకు పూర్వం తెలుగులో లేదు. దీనికి ఆద్యుడు శ్రీనాథుడే కేవలం ప్రసిద్ధ కథలను తాను చెప్పడమే కాదు, తనకు తోచిన కల్పనలతో ఈ కథలను కైసేసి శివలీలా విలాసాన్ని మరింత శక్తిమంతంగా భక్తిభావ బంధురంగా, ధ్వనిమంతంగా నిర్వహించి చరితార్థుడైనాడు. ఈ కావ్యాన్ని తన బాల్యసఖుడైన అవచి తిప్పయకు అంకితంచేసి తన చెలిమి విలువను కాపాడుకున్నాడు శ్రీనాథుని కృతులను అంకితం పొందినవాళ్ళల్లో ప్రభువులున్నారు. మంత్రులున్నారు. మిత్రులున్నారు. భక్తులున్నారు శ్రీనాథుని వ్యక్తిత్వం అలాంటిది.

'క్రీడాభిరామం' శ్రీనాథుని రచన కాదని కొందరి అభిప్రాయం. ఆ కావ్య కర్తృత్వం మాట ఎలా ఉన్న దానిలోని కవితా పారమ్యం శ్రీనాథమహిత

కవితా ప్రభావితం అని చెప్పడానికి సందేహం ఉండనక్కరలేదు. సయుక్తికంగా శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'క్రీడాభిరామం' శ్రీనాథకృతమే అని నిరూపించి నారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు కూడా 'క్రీడాభిరామం' శ్రీనాథుని కృతిగానే నమ్మినారు. ఇది తెలుగులో వెలువడిన మొట్టమొదటి హేళనకావ్యం అనగానే అందులో కవిత ఉండదనీ, వెకిలితనం ఉంటుందనీ అనుకోవలసిన అవసరం లేదు. క్రీడాభిరామం సుందరమైన కావ్యం; కాకతీయ సామ్రాజ్య రాజధాని ఓరుగల్లు నాగరికతను పొదుగుకున్న కావ్యం. అప్పటి వేషాలు, విన్యాసాలు, ఆటలు, పాటలు, స్త్రీలు, పురుషులు, ఇళ్ళు, గుళ్ళు, గోపురాలు అన్నీ మనముందు వచ్చి నిలుస్తాయి. క్రీడాభిరామం 'వీధి' అనే రూపక విశేషం. తెలుగులో వచ్చిన మొట్టమొదటి రూపకం ఇది. అన్ని లక్షణాలూ ఉన్న తెలుగు తొలిరూపకం క్రీడాభిరామం. శ్రీనాథుడే తెలుగులో రూపక రచనకు ఆద్యుడు.

ఈ కావ్యానికి అశ్లీలతా దోషాన్ని అంటగట్టి శ్రీనాథుని వ్యక్తిత్వాన్నే ప్రశ్నించే ప్రయత్నం జరిగింది. తెరమరుగున నున్న రసిక జీవితాన్ని ఈ కావ్యం చూపుతున్నది. అప్పటి సంఘాన్ని పొట్టువొలిచి చూపుతున్నది. సాంఘిక చరిత్రకు అత్యంతోపయుక్తమైన గ్రంథంగా దీనిని సురవరం ప్రతాపరెడ్డిగారు ప్రస్తుతించినారు. మొన్నటి తెలుగు నాగరిక జీవనం ఎలా ఉండేది? అన్న ప్రశ్నకు, ఏ తెలుగు కావ్యం బదులు బలుకగలుగుతుంది ఒక్క క్రీడాభిరామం తప్ప! ప్రజా జీవితంతో చెట్టపట్టాలు పట్టుకుని బ్రతికిన కవి మాత్రమే ఇలాంటి కావ్యసృష్టికి పూనుకోగలుగుతాడు. శ్రీనాథు డీ సృష్టికి ఆద్యుడై ప్రజల కవి అనిపించుకున్నాడు.

ఇక్కడొక్క విషయం అప్రస్తుతమైనా ప్రస్తావించక ఉండలేక పోతున్నాను.

"దేశభాషలందు తెలుగు లెస్స"

అన్న అతిప్రసిద్ధమైన నినాదం వంటి సూక్తి ఈ క్రీడాభిరామంలోనిదే. శ్రీనాథునిదే.

శ్రీనాథుడు రెడ్డిరాజుల ఆస్థానాల్లో సన్మానాలను అందుకున్న సత్కవి. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా ఉండి ఎందరో కవిపండితులను ఆదుకున్న సహృదయుడు.

"సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబు
పన్నగపతి సార్వభౌమభాషిత మహా
భాష్య. విద్యా సమభ్యాసబలము
నక్షపాదకణాద పక్షిలో దీరిత
న్యాయకళాకౌశలాతిశయము
శ్రుతిపురాణాగమస్మృతి సాంఖ్యసిద్ధాంత
కలశనవ్యుత్పత్తి గౌరవంబు
పూర్వకవి ముఖ్యవిరచితా పూర్వకావ్య
భావరస సుధాచర్వణ ప్రౌఢిమ"

శ్రీనాథుడు శేముషిని చాటుతున్నవి. అంతేకాదు. అయన 'అఖిల పురాణ విద్యా ప్రవీణు'డు, అధ్వర్యుడు, 'వేదాశాఖాధీతినిష్ణాతుడు'. ఆంధ్రభాషా నైషాధాబ్జభవుడు, ఉభయభాషాకవిత్వ ప్రయోగకుశలుడు.

"బ్రహ్మదత్త వరప్రసాదుడ పురుప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుడ విశ్వేరార్చన కళాశీలండ వభ్యర్థిత
బ్రహ్మాండాది మహాపురాణ చయతాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళానిధానమవు........."

అని ఆయన కావ్యావతారికలు ఉద్ఘోషిస్తున్నవి వేదాది విద్యల్లో పాండితీ ప్రకర్షను సంపాదించిన పండితులు మార్గ కవితా పద్ధతికి బాసటగా నిలుస్తారే కాని దేశి కవితా పద్ధతిని అంతగా ఆదరించరు. అందులోనూ ఆంధ్రదేశంలో శివకవులు వస్తువిషయంలో ఛందోవిషయంలో, భాషావిషయంలో, సంప్రదాయ సిద్ధంగా వస్తున్న పద్ధతులకు ఎదురుతిరిగినవారు. వాళ్ళు ప్రారంభించిన దేశి కవితోద్యమం, వాళ్ళుచేసే వ్యవహారిక ప్రయోగాలూ, వాళ్ళ దేశీయమైన వస్తు సంవరణం శ్రీనాథుని ఆదరణకు ఎలా పాత్రం కాగలిగినవి? శ్రీనాథుడు శివ భక్తుడేకాని శివమెత్తిన వీరశైవుడు కాదు. అతనికి శివకేశవభేదం లేదు. వేద ప్రమాణాన్ని, యజ్ఞయాగాది ఆర్షక్రియాకలాపాలను నమ్మిన భూసురుడు. అయితే శ్రీనాథుడు సామాన్య ప్రజల అభిరుచులకు విరోధికాడు తన దేశంలో జరిగిన వీర

గాథను జనం పాడుకుంటుంటే విని, రసప్లావితులౌతుంటే చూచి తనకేమీ పట్ట నట్లుండే అరసికుడుకాడు. తన కాలంనాటికి జనబాహుళ్యంలో విశేషప్రాచుర్యాన్ని అందుకున్న వీరగాథను తేలికగా పాడుకునే పద్ధతిలో, మాత్రాచ్ఛందస్సుల్లో విశేషించి మంజరీద్విపదలో వ్రాయాలని తలచినాడు. దానిని రచించి పామరుల ఆదరానికి కూడా పాత్రుడు కాగలిగినాడు. క్రీడాభిరామంలో కూడా ఈ ద్విపద ప్రబంధ ప్రసక్తిని శ్రీనాథుడు ఉట్టంకించినాడు. మంజరీ ద్విపదలో తెలుగులో వెలసిన మొట్టమొదటి కావ్యం శ్రీనాథుని పలనాటి వీరచరిత్రయే. ఇందులోని కవిత్వం పండితులకూ ఇందులోని సంగీతం రసస్ఫూర్తి అభినయం వస్తుగౌరవం పామరులకూ ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. మహోన్నత శేముషీ శిఖరాన్ని అధిరోహించిన ఒక మహాకవి పామరజనానికి ఇంత సన్నిహితంగా వచ్చి ఒక చక్కని కావ్యాన్ని రచించి కవిత్వం సర్వజనాదరణీయంగా ఉండదగినదన్న సత్యాన్ని అక్షరాలా తొలిసారిగా తెలుగు వాఙ్మయంలో చాటిన రసరాణ్మూర్తి శ్రీనాథుడు.

కాశీఖండం భీమఖండం శ్రీనాథుడు రచించిన క్షేత్రమాహాత్మ్యాలకు సంబంధించిన కావ్యాలు. భీమఖండంలోని కథాభాగం స్కాందపురాణంలో ఉన్నదని, దానిని శ్రీనాథుడు తెనుగు చేసినాడని కొంతకాలంక్రింత ఒక అభిప్రాయముండేది. కాని, కొంత పరిశీలన తరువాత విచిత్రమైన విషయం బయలుపడింది. సంస్కృతంలో స్కాంద పురాణంలోని భీమఖండం శ్రీనాథుని తెలుగు భీమఖండానికి సంస్కృతానుకరణమని. శ్రీనాథుని తరువాతికాలంలో అది స్కాందపురాణానికి ఎక్కిందని విమర్శకుల తలపోత. దాక్షారామ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా చూసి ఆ క్షేత్రానికి వచ్చిన భక్తుల వేషభాషా విన్యాసాలను చూసి శ్రీనాథుడు యథాతథంగా వర్ణించిన తీరుతెన్నులే సంస్కృతంలో ఇప్పుడు లభిస్తున్న స్కాందపురాణంలో కనబడుతున్నవట. స్కాంద పురాణంలోని భీమఖండభాగం ప్రక్షిప్తం అన్నమాట ఎలాఉన్నా ఒక విషయం మాత్రం ఈ పరిశీలనంవల్ల తెలియవస్తున్నది. ఆంధ్రదేశాంతర్గతమైన దాక్షారామాన్ని, గోదావరీనదినీ శ్రీనాథుడు సహజంగా వర్ణించినాడన్న విషయం మాత్రం స్పష్టం. క్షేత్రసందర్శనం సర్వపాపఘ్నం అన్న నమ్మకంతోనేకాక ఆ ప్రాంతం భౌగోళిక, ప్రాకృతిక పరిస్థితులను, సౌందర్యాలను తనివితీరా అభివర్ణించే పద్ధతికి శ్రీనాథుడే ఆద్యుడు. వ్యాసప్రోక్తమైన

పురాణాల్లోని వర్ణనలను ఉన్నవి ఉన్నట్లు తెలుగులోనికి దించడం మనకు క్షేత్ర మాహాత్మ్యాల్లో కనిపించే లక్షణం. భీమఖండంలో శ్రీనాథుడు చేసిన క్షేత్రస్థలాభి వర్ణనం ఎందరికో మార్గదర్శకమైనది. దాక్షారామ పరిసర ప్రాంతాలలో శ్రీనాథుడు వర్ణించిన విశేషాలు ఇప్పటికీ ఉండటం విశేషం.

16వ శతాబ్దంలో అవతరించిన అతి విచిత్రమైన అలంకారికమైన ప్రబంధ పద్ధతికి శ్రీనాథుడే దారి చూపినాడు. ఎర్రనవల్ల ప్రబంధకవులు నేర్చుకున్నది వర్ణనాత్మకమైన శైలి. అయితే శబ్దార్థాలంకారాలను జొనిపి శ్రీనాథుడే అలంకారిక రీతిని అంటే ప్రబంధరీతిని ప్రవేశపెట్టి తన ప్రయోగదక్షతను నిరూపించుకున్నాడు.

మార్గదేశిక కవితా పద్ధతుల నడుమ ఉన్న వ్యత్యాసాలతో సంబంధం పెట్టుకోక శ్రీనాథుడు తనదైన ఒక శైలిని ఏర్పరచుకుని తన కావ్యాల్లో ప్రయోగించుకున్నాడు. మార్గదేశీ భేదాలు సంగీతానికీ, నాట్యానికీ సంబంధించినవి. భాషాపరంగానూ, ఛందఃపరంగానూ, వస్తుపరంగానూ అతిమాత్రంగా సంస్కృత ప్రభావానికి లోబడిన కవితా పద్ధతి మార్గ పద్ధతి. భాషలో, ఛందస్సులో, వస్తువులో జానుతనాన్ని, జాతీయతా ముద్రను వేసుకున్నది దేశిమార్గం. ఈ రెండు మార్గాలు కొన్ని సందర్భాల్లో సమానాంతరంగానూ, కొన్ని సందర్భాల్లో కలగాపులగంగానూ, మరికొన్ని సందర్భాల్లో ఒకదానితో ఒకటి ఒరుసుకుంటూ పోయి ఒక ప్రత్యేక శైలి ఆవిర్భావానికి అవకాశాలు ఏర్పడినవి. సాంస్కృతికమైన మార్గపద్ధతినిగాని, దేశీయమైన దేశి పద్ధతినిగాని ప్రత్యేకించి, అభిమానించక ఆ రెంటిలోని చేవను హస్తగతం చేసుకుని శ్రవణసులభంగానూ, మనోజ్ఞంగానూ సహృదయుల అనుభవానికి వచ్చే ఒక శైలిని శ్రీనాథుడు తెలుగులో ప్రవేశపెట్టినాడు. ఆ శైలికే అతడు కర్ణాట భాష అనే సంకేతాన్ని ప్రసాదించినాడు. 'కర్ణాటకభాష' అంటే కన్నడ భాష కాదు. చెవులకు ఇంపైన తెలుగు భాష అని కూడా కాదు. సంగీత శాస్త్రంలో, నాట్యశాస్త్రంలో పరిభాషా పరంగా ఉన్న కర్ణాటక పదమది. కర్ణాటక సంగీతం అంటే కన్నడ సంగీతం అని అర్థం చేసుకోవడం నిర్హేతుకమే అవుతుంది.

"ప్రౌఢి పరికింప సంస్కృత భాష యండ్రు
పలుకు నుడికారమున ఆంధ్రభాష యండ్రు
ఎవ్వ రేమండ్రుగాక నాకేల కొఱత
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"

అని కవితా శైలికి 'కర్ణాట భాష' అని నామకరణం చేసి తనదైన అరుదైన ప్రజ్ఞను ప్రదర్శించినాడు.

మనకు తెలుగులో స్వతంత్రమైన సాహిత్య శాస్త్రం నేటి వరకూ పుట్టక పోవడం వల్ల ఇలా మన తెలుగు కవులు ప్రతిపాదించిన వినూత్న కవితా పద్ధతులు మరుగున పడిపోయినవి.

సరికొత్త గద్యశైలిని తెలుగులో ప్రవేశపెట్టిన ఘనతకూడా శ్రీనాథునికే దక్కుతుంది. సంస్కృత సాహిత్య స్రష్టలలో కాళిదాసు, శ్రీహర్షుడు, మురారి, బాణుడు, మయూరుడు శ్రీనాథునికి ఆదరణీయులు. నన్నయ, తిక్కన, ఎర్రన పట్ల కూడా ఈ ఆదర భావాన్నే అతడు ప్రదర్శించినాడు. తనకు అభిమాన పాత్రులైన సంస్కృత కవుల కావ్యాల్లోని శ్లోకాల నెన్నింటికో శ్రీనాథుడు తన కావ్యాలలో తెలుగు వేషం వేసి నాట్యం ఆడించినాడు. వారి అడుగుజాడలలోనే తన భావాలను తెలుగునుడికారపు మూసలో పోసి స్వకపోల కల్పనలు చేర్చి అందంగా తీర్చిదిద్దినాడు. కాశీఖండంలో మయూరుని సూర్యశతకంలోని శ్లోకాలకు తెలుగు సేత శ్రీనాథుని సంస్కృత భాషా పాండిత్యానికి తెలుగు భాషపై నెరపిన అధికారానికీ అపూర్వమైన కవితా శక్తికీ నిదర్శనాలుగా నిల్చినవి. కాళిదాస కుమార సంభవంలోని శ్లోకాలు హరవిలాసంలో వృత్తాలైనవి, ఆటవెలదులైనవి, తేటగీతులైనవి. కొన్ని తావులలో శ్లోకాలలోని భావాలకు కొత్త ఇంపు సొంపులను సమకూర్చ కలిగినవి. శ్రీహర్షుని నైషధాన్ని తెలుగులోనికి శ్రీనాథుడు తెచ్చిన తీరు ఎందరికో ఆదర్శమైనది. శ్లోకాలు పద్యాలుగా మారడం సరే కాని, పలనాటి వీర చరిత్రం తప్ప శ్రీనాథుని కావ్యాలన్నీ చంపూ కావ్యాలే. వాటిలో పద్యాల్లోనూ గద్యాల్లోనూ ఆయన తన కవితాశక్తిని నిక్షిప్తం చేసినాడు. విశేషించి గద్యశైలిని కాదంబరీకర్త బాణుని వల్ల అతడు నేర్చుకున్నట్లు కనబడుతున్నది. బాణుని కాదంబరిలోని సమాసరచనా రీతులు, శబ్దార్థాలంకార ప్రయోగ కౌశలం, సావయవరూపక, పరిపూర్ణోపమ, ఉల్లేఖ, దృష్టాంతాద్యర్థాలంకారాలతో శ్రీనాథుని గద్యం సాగింది. అలంకారికమైన గద్య రచనా శైలికి శ్రీనాథుడే ఆద్యుడు.

పదిహేనవ శతాబ్ది చివరివరకు తెలుగులో విలసిల్లిన ఏ కవికూడా చెప్పని చాటు పద్యాలు శ్రీనాథుడు చెప్పినాడు. ఇప్పటికీ మనకు తెలిసినంతవరకు ఏ ప్రాచీనాంధ్ర కవి కూడా ఇంత దేశ సంచారము చేసి ఎరగడు. ఏ నగరానికి వెళ్ళినా, ఏ పల్లెకు పోయినా, ఏ గుట్టయెక్కినా, ఏ తీర్థమాడినా, ఏ క్షేత్రం దర్శించినా, ఏ మనిషిని చూచినా, ఏ కోవెలలో పూజలు చేసినా, ఎక్కడ సన్మానం పొందినా, కష్టాలు కట్టెదుట నిల్చినా, భోగాలలో మైమరచినా శ్రీనాథుడు తాను కవినన్న సంస్కారాన్ని విడువలేకపోయినాడు. కోపమో, తాపమో, ఆనందమో, ఉద్వేగమో, దుఃఖమో, ఆశ్చర్యమో భక్తిభవమో ముంచెత్తినపుడు చక్కని చాటు పద్య మొక్కటి చిమ్ముకొచ్చింది. ఎన్నెన్ని చాటుపద్యాలో! కొన్నే మనకిప్పుడు మిగిలినవి. అవి ఆనాటి ప్రజల కథలను చెబుతున్నవి. వేషభాషలను చెబుతున్నవి. తీరుతియ్యాలను చెబుతున్నవి. రుచులనూ అభిరుచులనూ చెబుతున్నవి. కొలిచే దేవుళ్ళను చూపుతున్నవి. పడిన కష్టాలను చెబుతున్నవి.

చాటు పద్య రచనకు శ్రీనాథుడు ఆద్యుడు కాకపోవచ్చు. కాని, అనేక, అనేక చాటువుల ద్వారా నాటి సాంఘిక చరిత్ర చెప్పిన కవులలో మున్నెన్నదగినవాడు శ్రీనాథుడేమో!

సుగృహీత నామధేయులు శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు శ్రీనాథుని కావ్యాలు లేకుంటే రెడ్డి వెలమ ప్రభువుల చరిత్ర అసమగ్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. శ్రీనాథుని కావ్యావతారికలు పదునాల్గవ శతాబ్దినాటి ఇతిహాసానికి ప్రధాన సాధనాలు.

ప్రబంధ సాహిత్య సరస్వతికి అమూల్యాభరణమైన వసుచరిత్రంలోని పద్యంలో రామరాజభూషణుడు శ్రీనాథుణ్ణి ప్రపంచాన్ని కాపాడే విష్ణుమూర్తితో పోల్చి తెలుగు సాహిత్యాన్ని కాపాడినవాడు శ్రీనాథుడని శ్లేషించి కవితాబద్ధంగా చెప్పినాడు. నిజమే. శ్రీనాథుడు సాధించిన సిద్ధులు, ఆంధ్రసాహితికి అందించిన ఉపలబ్ధులు చిరస్మరణీయాలు!

శ్రీనాథ సాహిత్యాధ్యయనం సహృదయ ప్రపంచానికి శ్రీరామరక్ష.*

---

* 'శ్రీనాథకవితావైజయంతి' గ్రంథంలో ప్రచురితం. ముద్రణ 2-10-1986.

30. అకాడమీలు – 'సకలగమ్య సుతీర్థములు'

"పరమవివేక సౌరభ విభాసిత సద్గుణ పుంజ వారిజో
త్కర రుచిరంబులై సకలగమ్య సుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావన పయఃపరిపూర్ణములైన సత్సభాం
తర సరసీ వనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్".

అని ఆదికవి నన్నయ విద్వత్సభలను భారతావతారికలో కొనియాడి, అవి సంస్కృతి నిర్మాణానికి ఎలా తోడ్పడ గలుగుతాయో, సకలజనులకు ఎలా అనుభవయోగ్యములౌతాయో సుందరంగా వ్యంజించి వివరించినాడు. కవులు, రచయితలు, పండితులు కలుసుకున్న వేదిక విద్వన్మండలిగా రూపొందుతుంది. అలనాడు గ్రీసుదేశంలో మహామనీషి ప్లేటో తన శిష్యులకు హితబోధచేసిన తోట 'అకాడమీ'. ఆ అకాడమీయే ఇప్పుడు విద్వత్పరిషత్తుకు నామాంతరంగా ప్రయుక్తమవుతున్నది. ప్రభువుల ఉత్తర్వుల ప్రకారం జరిగే పరిపాలనా వ్యవస్థ కాదు విద్వత్సభ అంటే. భగవద్దత్తమైన ప్రతిభా పరీమళాలు ఎక్కడ సముద్దీప్తిని పొందుతాయో అవే అకాడెమీలు, విద్వత్సభలు. మౌనంగా ఉండే అకాడెమీలే గ్రంథాలయాలు.

నిన్నటి మొన్నటి కాలంలో సాహిత్యం బహుముఖీనంగా వికాసం పొంద డానికి రాచరికాలే కారణం అని కొందరి తలపోత. రాజులు కవులను ప్రోత్స హించిన వారే! కాని కవితలను ప్రజా హృదయాల్లోకి తీసుకుపోయినవారు కారు. ప్రజల నాలుకలపైన కావ్యాలను లాస్యం చేయించినవారు కారు. కవితల్లోని నిగ్గు దేల్చి, కవి పరిశ్రమను సానుభూతితో, పరిశీలించినవారు ప్రజలే! ప్రజల్లో ఏర్ప డిన విద్వత్సభలే ఎలా ఆలోచించాలో, ఎలా చిత్రించాలో, ఎలా నాట్యంచేయాలో, ఎలా గానం చెయ్యాలో, ఎలా అభినయించాలో, సాహిత్య ప్రక్రియలకు రూపు

రేఖలు ఎలా దిద్దాలో విద్వత్సభలే సూచనలు చేస్తాయి. నిన్నటి కాలంలో కవులు, కళాకారులు సభల్లో తమకు సన్మానం జరిగితేనే హర్షాన్ని అనుభవించారు. రాజ సన్మానం కుటుంబ రక్షణకు తోడ్పడ గలిగిందే కాని సృజనాత్మక కృషికి దోహదం చేయలేకపోయింది. ఇది యథార్థం. కళాతత్త్వం తెలిసినవారికి ఈ యథార్థ్యంలో ఆంతర్యం అవగతమవుతుంది.

అలనాడు శ్రీనాథుడు విజయనగర విద్వత్సభలోనే తన ప్రతిభా వైజయింతికను రెపరెపలాడించినాడు. నిన్న కావ్యకంఠ గణపతిశాస్త్రి నవద్వీప పండిత సభలో తన ప్రతిభా కాంతులను విరజిమ్మినాడు. అవధానాలు తమ ప్రతిభను సభల్లోనే కురిసినవి.

విద్వత్సభల్లో జరిగే పరీక్షలు, చర్చలు పాండిత్య ప్రదర్శనలు, కవితా కళాశారద సాక్షాత్కారాలు సాహిత్య శాస్త్ర సిద్ధాంతాలకూ, సూత్రాలకూ, వాఖ్యానాలుకూ పురుడు బోసినవి.

అలనాటి రాజరాజనరేంద్రుని కొలువు, రెడ్డి వెలమ ప్రభువుల సాహిత్యోత్సవాల, పల్నాటి వీరగాథాశ్రవణం, కృష్ణరాయల భువన విజయం, రఘునాథరాయల ఇందిరా మందిరం, నిన్నటి కాకినాడ సాహిత్య పరిషత్తు, నవ్య సాహిత్య పరిషత్తు, వ్యవహారిక భాషోద్యమ సభలు, తెలుగుభాషా సమితి, కవితా సమితి, ఆంధ్రేతిహాస పరిశోధక మండలి, అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలుగు భాషా సమితి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్ర నాటక కళాపరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, ఇంకా ఎన్నెన్నో సాహిత్య, సాంస్కృతిక పరిషత్తులూ, సంఘాలూ ఏర్పడి, రచయితలను, కళాకారులను వేదికలపైకి ఆహ్వానించి ప్రజా బాహుళ్యానికి పరిచయం చేసి, సంస్కృతిని పరిరక్షించడంలో తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చినవి. దాస్యం పెత్తనం చెలాయిస్తున్న మరుభూమిలో ఈ సంస్కృతి సమితులు ఒయాసిస్సులై కలకలలాడి జాతీయ జీవనానికి స్ఫూర్తిని ప్రసాదించగలిగినవి. మార్గదర్శనం చేయగలిగినవి. దేశ ప్రజల కళలకూ, భాషలకూ మారాకులు హత్తు కలిగినవి.

రచయిత వ్యక్తి. అతని సృష్టి సమష్టికోసం. రచయిత సంఘంలోకి ఎలా పోగలుగుతాడు? అతనిలోని విలక్షతనూ, చదివించే గుణాన్నీ సాహిత్య సంఘాలే సంఘానికి పరిచయం చేస్తాయి. అతణ్ణి ప్రోత్సహిస్తాయి. రచయిత ప్రతిభ వ్యక్తిగతమైనదే కాని పాఠకులు, సహృదయులు. ఆ ప్రతిభా, పరిమళాలను ఆస్వాదించాలంటే సమీక్షావేదికలు ప్రసరించవలసిందే.

సంస్కారమున్న సమాజంలో సహృదయులకు నేతృత్వం వహించి, వారిని సమీకరించి, వారి సహకారానికి రూపకల్పన చేసి, రచయితలకు చేదోడు వాదోడై నిలిచి, ప్రజా సమూహంలో కొందరి హృదయాల్లో నిక్షిప్తమై ఉన్న అనంత శక్తులను మేల్కొలిపి, తాము రచయితలై ఉండికూడా సహరచయిత లకు అండగా ప్రభవిల్లిన మనుషులు ఒక్కొక్కరొక సంస్థగా రూపొంది కళా విస్తృతికి గణనీయమైన తోడ్పాటు నందించారు. కొన్ని పత్రికలు కూడా సంస్థలుగా రూపొంది రచయితలను సంఘానికి పరిచయం చేసినవి. అయితే ఆయా పత్రికాధిపతులు కేవలం స్వకీయ సామర్థ్యాలను దేశానికి ప్రదర్శించాలనే తపనను విడనాడి తమ పత్రికా తరుచ్ఛాయలో ఎందరో రచయితలకు ఆశ్రయ మిచ్చి సాహితీ వికాసానికి చేయూతనిచ్చి ధన్యులైనారు. గతించిన ఆరు దశాబ్దాల సాహిత్య సాంస్కృతిక చరిత్ర అంతా ఈ మహనీయులు నిర్మించినదే. తెలుగులో వెలువడిన కొన్ని స్వీయచరిత్రలు చదివితే ఈ సత్యం కన్నులముందు కద లాడుతుంది. కాశీనాథుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాప రెడ్డి, కొమర్రాజు, వేంకట లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, పూండ్ల రామకృష్ణయ్య, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రివంటి సుకృతాత్ములు కేవలం వ్యక్తులు కారు- రూపుదాల్చిన సంస్థలు.

ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశంలో అన్ని ప్రాంతాలలోనూ గత ఆరేడు దశాబ్దాలలో మహోన్నతమైన కృషి జరిగింది- సాహిత్య సాంస్కృతిక రంగాలలో. స్వాతంత్ర్యోద్యమంలో దూకిన రచయితలెందరో ఉన్నారు. కొంత తోడ్పాటు ఉంటే ఇతోధికమైన అభివృద్ధిని సాధించవచ్చుననే ఆశ ప్రతిపద చంద్రరేఖా సదృశంగా వారి మనోవిషయాల్లో తళుక్కుమంటూ ఉండేది.

త్యాగమహితమైన సమరం సలిపి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న భార తీయులు, స్వేచ్ఛాకేతనం ఎగురవేసిన మరునాటినుంచే కళావికసనానికి పథకాలు

సిద్ధం చేసుకున్నారు. ఆలోచనా, భావప్రకటనా, ఆరాధనా స్వేచ్ఛలను తమ రాజ్యాంగంలో పొందుపరచుకున్నారు. రచయితలకు, కళాకారులకు సృజనాత్మక కృషి సాగించుకునేందు కనువైన అవకాశాలను కల్పించడానికి అకాడమీలను నెలకొల్పినారు. ప్రభుత్వాధినేతలుగా ఉంటూనే ప్రభుత్వాధికారులుగా ప్రజా ప్రతినిధుల సభల్లో సభ్యులు పండిత నెహూౄ, డా. జాకీర్‌హుసేన్, డా. రాధాకృష్ణన్, డా. బెజవాడ గోపాలరెడ్డి, భోకాల వేంకట రాజమన్నారువంటి సహృదయులు అకాడమీలలో బాధ్యతాయుతములైన పదవులను చేపట్టినారు. అయినా తమ అధికారాన్ని ఎక్కడ రచయితలమీద రుద్దలేదు. అకాడమీల్లో వాళ్ళు సహృదయులు గానే వ్యవహరించినారు. సాహిత్యంపట్ల, కళలపట్ల మహోన్నతాదర గౌరవాలున్న ఆ మహానుభావులు, ప్రభుత్వపుటదుపులో కళారంగం ఉండాలనీ, ప్రభుత్వమే కళావికసనానికి మార్గదర్శనం చేయాలని ఎన్నడూ ప్రకటించలేదు. ఆయా రంగాలలో నిష్ణాతులైనవాళ్ళను ప్రజాస్వామ్య పద్ధతిలో సమీకరించి, సాధ్యమైనంత మేరకు అందరికీ ప్రాతినిధ్యం ఉండేతీరున నియమావళిని రూపొందించి సువ్యవస్థితమైన అకాడమీలను ఢిల్లీలో స్థాపించినారు అన్ని రాష్ట్రాల భాషా, కళా సాహిత్యాలతో సంబంధం ఉండేటట్టుగా దీన్ని తీర్చిదిద్ది సృజనాత్మక కళకు ఎంతో ప్రోత్సాహాన్ని కల్పించి ఎందరో రచయితలకు యావద్భారత స్థాయి కల్పించినారు. భారతీయ సాహిత్యాలన్నింటికీ వేదిక ఏర్పరచినారు.

అదేపద్ధతిలో రాష్ట్రాలలో కూడా అకాడమీలు ఏర్పడ్డవి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో ప్రభుత్వాధినేతల అకాడమీల స్థాపనకు తొలిదశలో చొరవ తీసుకున్నా రానురాను వాటిని స్వేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగించుకొనే ప్రతిపత్తిని కల్పించి. ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఆదుకున్నారు. రాష్ట్రాలలో ఆ అకాడమీలు ప్రజాబాహుళ్యానికి చేరువగా పోవడానికి ఎంతో ప్రయత్నం చేసినవి. ఎందరో రచయితలను, ఎందరో కళాకారులను ఎన్నివిధాలుగానో ఆదుకున్నవి. ఉత్తమ సాహితీ ప్రక్రియలకు బహుమతు లందజేసినవి. పుస్తక వ్యాపారులు చేపట్టలేని ప్రచురణలను చేపట్టినవి. లాభార్జనతో నిమిత్తం లేకుండా పఠితృలోకానికి పుస్తకాలను అందజేసినవి. ఉత్తమ పరిశోధనకు తోడ్పడినవి. అలభ్యమైన గ్రంథ ప్రచురణకు పూనుకున్నవి. అయితే బహుమతుల విషయంలో అకాడమీల నిర్వహణను దోషజుష్టంగా వ్యవహరిస్తున్నవని విమర్శించినారు. బహుమతి లభించినవారు తమ ప్రతిభకు గుర్తింపు దొరికిందని

సంతోషిస్తున్నారు. బహుమతి లభించనివారు నిర్వహణలో లోపముందనో, పక్షపాత ముందనో భావిస్తున్నారు. అందరికీ బహుమతి రాదుమరి! బహుమతుల విషయంలో ఏకవాక్యత నిన్నలేదు, మొన్నలేదు. రేపుకూడా ఉండదు. ఆశలూ, ఆకాంక్షలు తర్కాతీతాలు. పద్ధతులు తర్కబద్ధం. ఈ రెంటికీ ఘర్షణ సహజం. హేతుబద్ధంగా ఆలోచించే వాళ్ళకూ, సంస్థను సామాజిక వికాసంకోసం నడిపే వాళ్ళకూ ఈసంగతి తెలుసు. ఈ సంగతి తెలిసినవాళ్ళే సంస్థలను నిర్వహింపగలుగుతారు. కళారంగంలో విభిన్నాభిప్రాయాలు, పలుదృక్పథాలు సహజమైనవి. వాటిని సమన్వయపరచుకొని, నలుగురినీ కూడగట్టుకుని సంస్థలను నిర్వహించవలసి ఉంటుంది. సాహిత్యవేదికలు నిరంతరంగా కొనసాగితే ఒక సంస్కారం ఏర్పడుతుంది. ఒక వ్యవస్థ అంటూ ఏర్పడిన తరువాత, కొన్ని కట్టుబాట్లుకు లోబడి ఆ వ్యవస్థ కార్యకాలాపాలు సాగిస్తుంటే కళాకారులకు నీడ ఏర్పడుతుంది.

ప్రభుత్వం జోక్యం లేకుండానే ఆకాడమి వంటి సంస్థలు కళారంగానికి, భాషా సాహిత్య రంగాలకు ఎనలేని సేవచేస్తూ వచ్చినవి. నిజానికి చాలా సందర్భాల్లో ప్రభుత్వం చేయలేనిపని ఈ సంస్థలు చేపట్టి తక్కువ వ్యయంతో తక్కువ వ్యవధిలో రచయితల పట్ల ఆత్మీయత ప్రవర్తిస్తూ సాధించగలిగినవి.

సాహిత్యం ప్రజల ఉద్యమం, ప్రజాభిప్రాయానికీ ప్రజాభిరుచులకూ ప్రతిబింబం. సాహిత్య కళారంగాలకు సంబంధించిన ఉత్తేజం ప్రజల్లోంచే పుట్టుకరావాలి. ప్రజల మనోభిరుచులకు అనుగుణంగా వికసించే కళాసాహిత్యాల పోషణకు మాత్రమే ప్రభుత్వం పూనుకోవాలె. ఆయా కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి అవసరం, ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనం, ప్రభుత్వాధికారం, సాధ్యమైనంత తక్కువగా జోక్యం కలిగించుకోవడం క్షేమకరం శివంకరం. స్వతంత్ర దేశాల్లోని ప్రభుత్వాలు కళారంగాల స్వేచ్ఛను కాపాడాలె. సాయం అందించాలే కాని అదుపుకుదుపుల పట్ల నమ్మకం పెట్టుకోగూడదు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వంటి సంస్థలు తెలంగాణంలో తెలుగును సంరక్షించవలసిన బాధ్యతను స్వీకరించి ఆంధ్రోద్యమాన్ని సాత్త్వికంగా నడుపగలిగినవి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కొంత ప్రభుత్వ సహాయం అందినా ఆంధ్ర సారస్వత పరిషత్తు తన స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకుంటూ ఆంధ్రుల రాజధానిలో మల్లెపందిరిగా నిలిచింది. నిత్యకళ్యాణం పచ్చతోరణంగా సారస్వత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. దానికి నాయకత్వం వహించిన

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు మూర్తీభవించిన ఉత్తమ సాహిత్య సంస్కారం. రెండున్నర దశాబ్దాలపాటు సాహిత్య అకాడెమీ నావను నడిపిన కర్ణధారులు. పరస్పర విరుద్ధ స్వభావాలున్న రచయితలతో ఇంతకాలం ఒక సాహిత్య సంఘాన్ని నిర్దుష్టంగా, ప్రయోజనాత్మకంగా, సమన్వయ గుణ సంపన్నంగా నడిపిన గౌరవం ఆయనకే దక్కుతుంది. ఇది భారతదేశ చరిత్రలోనే ఒక అపురూపమైన విషయం. ఆయన స్వయంగా రచయిత. అయినా తన ప్రాభవం కోసం సంస్థను ఉపయోగించని ధీరోదాత్తులు. అకాడెమీ ఇప్పుడు లేదు. కాని ఆయన, ఆయన సహచరులు నిర్మించిన చరిత్ర ఉంది. అందించిన సాహిత్య సంపద ఉంది. సాహితీమూర్తులకు పట్టిన నీరాజనాల నిగనిగలింకా ఉన్నవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ భారత దేశంలో అన్ని రాష్ట్రాలలో సాహిత్య అకాడెమీలకంటె మిన్నగా తన ఉనికిని సార్థక పరచుకుందని నిష్పాక్షికులైన విజ్ఞులెందరో తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు.

భావ స్వాతంత్ర్యం విలువ తెలిసిన మహానాయకులు ప్రారంభించిన సాహిత్యోద్యమానికి అండగా నిలువడం సహృదయుల కర్తవ్యం. సహజంగా కళావికాసం పట్ల ప్రత్యయం ఉన్న ప్రభుత్వం ఇతోధికమైన సహాయసహకారాలను, సాహిత్య సంస్థలకందిస్తూ రచయితలకూ కళాకారులకూ సర్వదా, సర్వధా ఆధారంగా నిలిచి ఉంటుందని విశ్వసించడంలో అనౌచిత్యం ఏమీలేదు. దేశం పట్ల, సంస్కృతిపట్ల అభిమానాదరాలున్న కళాకారులు ప్రభుత్వం ప్రారంభించే ప్రతి అభ్యుదయకరమైన ఉద్యమానికి స్వాగతం పలుకుతారు. నిజమైన రచయిత, దేశాన్ని ప్రేమించే రచయిత అరాచకాన్ని ప్రేరేచే రచనలు చేయడు; చేసినా జనం సహించరు. జనం వైదుష్యానికే గౌరవం చూపుతుంది, ప్రతిభకే పట్టం గట్టుతుంది. సంస్కరణాభిలాషకే ఆహ్వానం పలుకుతుంది. రచయిత స్వేచ్ఛ దేశానికి శ్రీరామరక్ష. సాహిత్య సదస్సులు ఈ స్వేచ్ఛకు దివ్యమందిరాలు. ఈ దివ్య మందిరాలు అధిక సంఖ్యలో ఉన్న దేశమే సంస్కృతికి నిలయమై శాంతికి నిలయమై సౌభాగ్యాలకు తావలమై విరాజిల్లుతుంది. కవులకు ఇంతకంటే కావలసిందేమీ లేదు. ఉండదు.

"సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్"*

---

* శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి అభినందన సంచిక 'అక్షరదీపం'లో ప్రచురితం. ముద్రణ మార్చి 1986.

31. ప్రాచీన సాహిత్యాధ్యయనము— ఆవశ్యకత

ఆసేతుశీతాచలం వ్యాపించి ఉన్న భారతదేశం అతిప్రాచీనమైనది. ఈ సువిశాలమైన దేశంలో అనేక భాషలు, అనేక ఆచార వ్యవహారాలు, అనేక జాతులు తమ తమ విశిష్టలక్షణాలతో విలసిల్లుతూ ఉన్నవి. ఇంత అనంతమైన వైవిధ్యం ప్రపంచంలో మరేదేశంలోనూ లేదనడానికి సందేహించవలసిన అవసరంలేదు. అయితే ఈ వైవిధ్యాన్ని ఒక అంతస్సూత్రం బంధిస్తున్నది. అదే భారతీయ సంస్కృతి. అలనాడెప్పుడో ఈ దేశంలో చెప్పన్న (56) రాజ్యాలుండేవట. అన్నీ స్వతంత్రరాజ్యాలే. సర్వసత్తాకమైన అధికారము కలిగినట్టివే కాని, సాంస్కృతికంగా భారతీయ ప్రజలను ఈ 56 ప్రభుత్వాలు విడగొట్టలేక పోయినవి. ఈనాడు కూడా ఏబుద్ధిమంతుడైన భారతీయుడు కూడా తనది ఫలానా రాష్ట్రమని గర్వపడడు. తన ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా కలశస్థాపన చేసి, తన ఊరిలో దొరికిన నీళ్ళనే ఆ కలశంలో పోసి సర్వభారత పవిత్ర నదులన్నీ తన సన్నిధిలో ఉన్నాయని భావించి భక్తితో సమస్కరిస్తాడు. జంబూద్వీపంలో, భరతఖండంలో, మేరువుకు దక్షిణంలో శ్రీశైలానికీ లేక హిమాలయాలకు ఏ దిక్కున ఉన్నాడో ఏ పవిత్ర నదీమతల్లుల నడుమ తాను ఉన్నాడో చెప్పుకొని పూజకు ఉపక్రమిస్తాడు. అంతేకాని, తనది కాశ్మీరమనీ, కేరళమనీ, ఓఢ్రమనీ, తెలుగునాడనీ, తమిళనాడనీ చెప్పుకోడు. ఇలా చెప్పుకోవడం రాజకీయ వేదికల వరకే సరిపెట్టుకుంటాడు. తన సాంస్కృతిక జీవితంలో రాజకీయ విభజనలకు అతడు తావిచ్చుకోలేదు.

సాంస్కృతికంగా భారతీయులనందరినీ ఒకటి చేసింది పురాభారత సాహితి. వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసాది మహాకవులు ఈ దేశప్రజలకు ఆలోచనా ఫణితినీ, జీవిత విధానాన్ని, జీవిత లక్ష్యాన్నీ ప్రసాదించిన మనీషివతంసులు. ఈ మహితాత్ములు సంస్కృతంలో రచించిన గ్రంథాలన్నీ భారతీయ భాషల్లోకి

కావ్యాలుగా, నాటకాలుగా, కథలుగా, సామెతలుగా, పదబంధాలుగా, జానపద కళారీతులుగా రూపుదిద్దుకున్నవి. ఈ కావ్యాల పాత్రల పేర్లతో నగరాలూ, గ్రామాలు వెలిసినవి. బిరుదులు వెలసినవి. ఆర్షసంప్రదాయానికి ఎత్తిన వైజయంతికలీ మహాకావ్యాలు. భారతదేశ భౌగోళిక సౌందర్యం, భారతీయుల జీవితవృత్తం, వారి ధర్మాభిరతి, లౌకిక పారలౌకిక, జీవితా దర్శాలు, మానవ జీవిత సాఫల్యానికి దోహదం చేసే అపార శాస్త్రపరిజ్ఞానం, రాజనీతి, అర్థనీతి- ఒక టేమిటి అన్నీ వాల్మీకి వ్యాసకృత రామాయణ భారతాది ఇతిహాస పురాణాలలో నిక్షిప్తములై ఉన్నవి. ఇప్పటికీ యావత్ప్రపంచ ప్రజలకూ అతిప్రీత పాత్రమైన మానవత్వపు విలువలను ఈ మహాగ్రంథాలు అందిస్తూ ఉన్నవి, పేదలూ, ధనికులూ, అబలలూ, సబలలూ, పశుపక్ష్యాదులు, తరులతాగుల్మాదులు. యక్షరాక్షర గంధర్వ విద్యాధరులు, ఆటవికులూ, నాగరికులు, ఉత్తమకులజులూ చండాలురు, నదులూ కొండలూ లోయలు, మునులు మాయావులు, దయాళులు, పదునాల్గులోకాలూ, పదునాల్గు విద్యలూ, అరువైనాలుగు కళలూ అన్నీ తమ తమ జాడలను చూసుకుంటాయి ఈ పురాణ వాఙ్మయ దర్పణంలో.

రామాయణం, మహాభారతం, పదునెన్మిది పురాణాలూ, కథాసరిత్సాగరం అనే పుస్తకాలను సాధ్యమైనంత విపులంగా చదువుకో వలసిన ఆగత్యం ఎంతైనా ఉన్నది. ఏ శాస్త్రాన్ని అభ్యసించినాసరే ఏ వృత్తితో పొట్టపోసుకున్నా సరే, ఏ పదవిని చేపట్టినాసరే - ఈ పుస్తకాలను తప్పకుండా చదువాలి. "ఇవి సంస్కృతంలో ఉన్నవి కదా! నాకు సంస్కృతం రాదుకదా!" అని తూష్ణీంభావాన్ని చూప నక్కరలేదు. తెలుగులో ఈ పుస్తకాలన్నీ దొరుకుతాయి. తెలుగులోనే చదివి సంస్కృతంలో చదివినంత రసానుభూతినీ, విజ్ఞానాన్నీ, పుణ్యాన్ని పొందవచ్చు. భారతీయులలో పలువురికి సంస్కృతం రానే రాదు. సంస్కృతంలో వ్యాస కాళిదాసాదులు వ్రాసిన పుస్తకాలు చదువనేలేరు. చదివినవారు అరుదే! అయినా సర్వ భారతీయులకు ఏ ప్రాంతీయ భాషాకవి కాలేకపోయినాడు. సంస్కృతభాషతో పరిచయం లేకపోయినా భారతీయులకందరికీ వ్యాసుడు కవి, కాళిదాసు కవి, భవభూతి కవి. ఇది ఒక అమోఘమైన, అనిర్వచనీయమైన భారతీయ సంస్కృతి రహస్యం.

స్వాతంత్ర్య సమరయోధుడూ, దేశభక్తుడూ, మహామనిషీ చక్రవర్తుల రాజగోపాలాచార్యులుగారు భారతాత్మను అర్థంచేసుకోవాలంటే రామాయణ భారతాలను చదివి తీరవలసిందేనని సందేశమిచ్చినారు,

నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ తన "డిస్కవరీ అఫ్ ఇండియా"లో మహాభారత రామాయణాలనుగూర్చి వ్రాస్తూ, అవి భారతీయ సంప్రదాయ విజ్ఞాన సర్వస్వాలనీ, భారతీయులను ఏకసూత్రంలో కలిపే సందేశకావ్యాలనీ, భారతీయుల తత్త్వచింతనకూ, భారతీయుల బహుముఖ భావ విజ్ఞానానికీ ప్రతీకలనీ ఉగ్గడించినాడు. పండిత నెహ్రూయేకాదు, భారతీయ స్వాతంత్ర్య సమరంలో మహోత్సాహ ఆవేశాలతో పాల్గొని తమ త్యాగనిరతితో, వినిర్మల జీవిత వృత్తంతో భారత ప్రజాహృదయాలను పునీతం చేసిన మహానుభావులందరూ రామాయణభారతాది ప్రాచీన భారతీయ సాహిత్యంతో ఉద్దీప్తులైనవారే. గాంధీ మహాత్ముడు "గీత నా తల్లి" అని భగవద్గీతపట్ల తన శ్రద్ధాభిమానాలను ప్రకటించినాడు.

మన భారతీయ ప్రాచీన సాహిత్యంతో పరిచయం లేకపోతే భారతీయ భాషలలో దాదాపు రెండువేల ఏండ్లనుంచి వెలువడిన సాహిత్యాన్ని తల స్పర్శిగా అవగాహన చేసుకోలేము. మన దివ్యక్షేత్రాల సంగతి తెలియరాదు. మన పుణ్య తీర్థాల మాహాత్మ్యం అవగతం కాదు. కొన్ని పదబంధాలకు, కొన్ని జాతీయాలకు, కొన్ని ఉపమాద్రవ్యాలకు, కొన్ని కథలకు, కొన్ని పొడుపు కథలకు వెనుక ఉన్న అంతర్యం స్పష్టంగా ప్రత్యక్షంగాదు. మన తెలుగులో ఇప్పటి దిన పత్రికలలో అత్యాధునిక కవితల్లో, నవలల్లో, కథల్లో, నాటికల్లో, కార్టూనుల్లో, జనవ్యవహారంలో 'కబంధహస్తాలు', "పరశురామ ప్రీతి", "చుప్పనాతి", "హనుమంతుని తోక", "రామబాణం", "విశ్వామిత్రసృష్టి", "భగీరథ ప్రయత్నం", "బలి", "నైవేద్యం", "యజ్ఞం", ''సర్పయాగం'', "మారణహోమం", "స్వర్గం-నరకం", ''రంభ'', 'రావణాసురుని కాష్ఠం', 'చిదంబర రహస్యం', ''లక్ష్మణరేఖ'', ''హిరణ్యాక్షవరాలు'', ''నల భీమపాకం''. ''భీష్మ ప్రతిజ్ఞ'', ''కుబేర సంపత్తి'', ''ఇంద్రభవనం'', ''లక్ష్మీపుత్రుడు'', ''దేవేంద్ర పదవి'', ''పుష్పక విమానం'', ''ఘోషయాత్ర'', ''ధర్మరాజు''వంటి మాటలు చిమ్మే అర్థాన్ని పురాణాలు తెలియకపోతే పట్టుకునేది ఎలా సాధ్యం? నిన్నటి తరంలో

నిరక్షరాస్యులు అధికంగానే ఉన్నా, హరికథా పురాణ కాలక్షేపాలవల్ల అందరికీ వీటి సంగతి తెలియవచ్చేది. ఇప్పుడీ వ్యాసంగాలు సకృత్తుగానే జరుగుతున్నవి. పండుగలూ పబ్బాలూ జరిగే సందర్భంగా ఏవోకొన్ని ధర్మాలు తెలిసొచ్చేవి. ఇప్పటి యాంత్రిక కేవల రాజకీయ జీవితంలో అవీ కరువై పోయినవి. రసానుభూతికీ, ధర్మనిరతికీ, సమైక్య జీవితానికి మార్గదర్శకమైన సంప్రదాయం క్రమంగా నశించిపోతున్నది. భారతీయులకు ప్రపంచంలో నిన్న ఉన్న విశిష్ట స్థానం ఈ వేళ లేకుండాపోతున్నది. మానవుడు పశువుగా పుట్టి క్రమంగా పరిణామం చెందుతూ మానవుడైనాడని పాశ్చాత్యుల్లో పలువురు నమ్మితే మానవుడు దైవాంశ సంభూతుడని భారతీయులు నమ్ముతున్నారు. ఈ విశిష్టమైన ఆలోచనా ఫణితిని మనం కాపాడుకోవలసి ఉన్నది. ప్రాచీన సాహిత్యాధ్యయనం అంటే తిరోగమనం కాదు. ప్రాచీనులు ఏ విలువకోసం బ్రతుకును మలచుకున్నారో ఆ విలువలు నేటికాలంలో ఎంతవరకు సమంజసమైనవి? అని పరిశీలిస్తే, వారు సార్వకాలీనమూ, సార్వజనీనమూ అయిన విలువలకోసం తపస్సు చేసినారని నమ్మవలసి వస్తుంది.

వాల్మీకి, వ్యాసుడు తమ రచనల్లో భారతదేశంపట్ల అనంతమైన ప్రేమను పెంచుకొమ్మని దేశాన్ని పూజించమని దేశం పుణ్యభూమి అనీ కర్మభూమి అని దేశంకోసం త్యాగం చెయ్యాలనీ ఉద్బోధించారు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' అన్న అభియుక్తోక్తిని ప్రసాదిస్తున్న పురాణ వాఙ్మయం పాతదా? కొత్తదా? నిత్య నూతనమైనదా, యుగోచితాగ్రగామిత్వానికి ప్రేరేపిస్తున్నదా? ఈ ప్రశ్నలకు సమాధానం లోతైన అధ్యయనం వల్లనే లభిస్తుంది. ఉత్తమ సాహిత్యానికి పాతకొత్తల వింగడంపులు పులమకపోతే కనిపిస్తుంది. వ్యాసుడు భాగవతంలో—

"కల్పాయుషాం స్థానజయాత్ పునర్భవాత్ క్షణాయుషాం
భారతభూజయోవరం
క్షణేన మర్త్యేన కృతం మనస్వినః సంపస్య సంయాన్త్యభయం
పదంహరేః

అన్న శ్లోకంలో ఒక కల్పకాలం స్వర్గంలోఉండి సౌఖ్యం అనుభవించిన దాని కంటే కొంతకాలమైనాసరే భారతదేశంలో బ్రతుకగలిగితే చాలునని హితబోధ

చేసినాడు. దేశప్రేమ గొప్ప ఆదర్శం. దేశాన్ని ప్రేమించేవాడు అవినీతిపరుడు కాజాలడు. దురహంకారి కాజాలడు. నిన్నటితరంలోని దేశభక్తులందరికీ పురాణ వాఙ్మయంమీద భక్తివిశ్వాసాలు ఎక్కువేనని మనకు తెలుసు. దేశాన్ని ప్రేమించే వాడికి అధికారం లభిస్తే దేశం వెలుగుబాటల్లో పయనిస్తుంది. తాను, తన కులం, తన కుటుంబం, తన కీర్తి, తన లాభం అని అహర్దహం ఆరాటపడుతూ ఉండే వాడు దేశానికి ఏమీ చెయ్యలేడు. పురాణేతిహాస పఠనంవల్ల కలిగే సంస్కారం మనిషిలో దైవగుణాలను సృజిస్తుంది. స్వార్థచింతనను నశింపచేస్తుంది.

కాశీ విశ్వనాథుని దర్శించి అక్కడనుంచి తెచ్చిన గంగతో సేతు రామేశ్వరునికి అభిషేకంచేస్తే యాత్రాఫలం దక్కుతుందని ధర్మజ్ఞుల ఉపదేశం. యాత్రానెపంతో దేశాన్ని సందర్శించే అవకాశం కల్పించినారు పురాణకర్తలు. తీర్థాభిగమనానికి క్షేత్ర సందర్శనానికి ఏ విధమైన ఆంక్షలులేవు. అన్ని ఆశ్ర మాలవారు అన్ని వర్ణాలవారు యాత్రలు చెయ్యవలసినవారే యాత్రలవల్ల తన దేశాన్ని చూడవచ్చు. తరించవచ్చు. విజ్ఞానాన్ని సంపాదించవచ్చు.

పురాణేతిహాసాలలో మన గతచరిత్ర దాగివుంది. మన నిన్నటి అనుభవా లున్నవి. నిన్నటి కన్నీరు ఉంది. పన్నీరు ఉంది. మానవుడు తన జీవితాన్ని రసాత్మకంగా ప్రవర్తింప జేసుకోవడంలో చూపిన చొరవ వున్నది. పాశవిక ప్రవృత్తులపై అతడు సాధించిన విజయ పరంపరలున్నవి. అతడు మానవుడై పుట్టినా దేవతత్త్వాన్ని సాధించాలనే తపన ఉన్నది. కనుకనే పురాణేతిహాసాలలోని కథలూ, ధర్మాలు సుందర శిల్పసృష్టికి రస నిర్భరకావ్య నిర్మాణానికి ప్రేరకములైనవి.

ఆర్షధర్మాన్ని ప్రబోధించే గ్రంథాలే వేదాలు. కాని ఆ వాటిలో ఆ ధర్మాలు నిగూఢంగా, ప్రతీకాత్మకంగా, బీజాక్షరశక్తిప్రయుక్తంగా, లౌకికేతర సంస్కృతభాషా విరచితంగా ఉండడంచేత ప్రాజ్ఞులకే కొందరికో అర్థం అవు తాయి. సర్వ జనులకు వేదచోదితములైన ధర్మాలు తెలియడానికి ఈ పురాణేతి హాసాలు పుట్టుకొచ్చినవి. సోదాహరణంగా, రమ్యంగా, అద్భుతంగా ఈ ధర్మాలకు వ్యాఖ్యానం ఉంటుంది పురాణేతిహాసాల్లో.

పురాణాలలో కొన్ని విష్ణుపారమ్యానికీ, కొన్ని శివపారమ్యానికీ అంకితమై నట్టివి. అయితే ఆయా పురాణాల్లో ఆయా అదిదైవతముల ప్రశస్తి నిరాకరణా దులు మనకు కనిపించినా, మొత్తానికి దైవభక్తికీ, ధర్మానురక్తికీ, ధర్మానుచర ణానికీ ఇవి ప్రమాణగ్రంథాలుగా రూపొందుతూ వచ్చినవి.

పురాణేతిహాసాలను చదువనివాడు ఏమీ చదువనివాడే.

పురాణేతిహాసాలతోపాటు, వీటి నీడల్లో నడిచిన మరికొన్ని పుస్తకాలున్నవి. పురాణాలు పద్దెనిమిది. ఉపపురాణాలు పద్దెనిమిది. ఇతిహాసాలు రెండు. ఇవికాక తమ కథలకు పురాణప్రశస్తి కలగాలనే ఆశయంతో వ్రాయబడిన పురాణసంకాశములైన కొన్ని పుస్తకాలున్నవి. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి రెండు.

ఒకటి, క్రీ. శ. ఒకటవశతాబ్దిలో వచ్చిన బృహత్కథ (కథాసరిత్సాగరము).

రెండు, ఈ శతాబ్దంలో మనకు సమకాలికులైన మధిర సుబ్బన్నదీక్షితులు వ్రాసిన "కాశీమజిలీ కథలు."

మన ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో జైనమత ప్రభావంతో బసవపురాణం అన్నది కూడా ఒకటి వచ్చింది. ఇందులో వీరశైవమతాన్ని స్థాపించిన బసవేశ్వరుని జీవితగాథ మరికొందరి శివభక్తుల జీవితకథలున్నవి. -

ఈ రోజుల్లో పురాణం అనే మాట చమత్కారానికీ, పెద్ద గ్రంథానికీ, అభూతకల్పనకూ, అపఖ్యాతిపాలైన వ్యక్తి కథకూ పర్యాయవాచిగా ప్రజలూ, రచయితలూ వాడుకుంటున్నారు. అది వేరే విషయం - కాని "పురాణం" అనే మాటకు వుత్పత్త్యర్థం ఎంతో రహస్యమయంగా ఉంది. ఎంతో విజ్ఞానప్రదంగా ఉంది. పురాణాల శాశ్వతత్వాన్ని ధ్వనిస్తున్నట్టుగా ఉంది. పాతదైనా కొత్తగా కనిపించేదీ అని వ్యుత్పత్త్యర్థం. అంటే పురాణాల్లో పాతకథలే ఉంటాయి కాని కొత్తగా తోస్తాయి. కుచేలుడూ శ్రీకృష్ణుడూ చెలిమిచేసిన కథ, తన స్త్రీపట్ల అవమానకరంగా ప్రవర్తించినవాడి డొక్కచించి, తన పౌరుషాన్ని నిరూపించుకున్న రాముని కథ, దేవుణ్ణి ప్రకటించు తండ్రికి బుద్ధి చెప్పిన ప్రహ్లాదుని కథ జ్ఞానానికీ, కులానికీ సంబంధం లేదని చెప్పే ధర్మవ్యాధుని కథ, ఇంకా ఎన్నో కథలు ఇలాంటివి నేటికీ మనకు ఆదర్శంగా ఉన్నవి.

పురాణవాఙ్మయంతో పరిచయం భారతీయతా లక్షణం, జాతీయతాలక్షణం, విశిష్టవ్యక్తిత్వ లక్షణం, ఉత్తమ అద్వైత లక్షణం. *

---

* 'పీయూష లహరి' సంచికలో ప్రచురితం, ప్రచురణ: జనవరి, 1987

32. నాటిక (ఏకాంకిక)

ప్రపంచంలో పలుప్రాంతాలలో నాగరకతా గంధమే లేని కాలంలో సమాహార కళ అయిన రూపకాన్నే రూపొందించి, లక్షణశాస్త్రాన్ని నిర్మించి, సర్వసృష్టి కర్త అయిన భగవంతుణ్ణే జగన్నాటక సూత్రధారిగా భావించిన కళామనస్వులు భారతీయులకు అభివందనాలు.

అప్పుడెప్పుడో క్రీస్తుకు పూర్వం భరతముని నాట్యశాస్త్ర రచన చేసినాడు. అందులో ఆయనచేసిన సూత్రకల్పన నేటికి నాటకకళాసంప్రదాయానికీ, అభినయానికీ సంబంధించినదే అయిన రానురాను అది సర్వతోముఖంగా వికసించిన సాహిత్యశాస్త్రానికి ప్రాతిపదికకాగలిగింది. చతుర్విధాభినయాలు నాట్యస్వరూపానికి అనివార్యాంశాలు. భరతుని మతం ప్రకారం నాట్యం విస్తృతమైన అర్థాన్ని పొదుగుకున్న సంకేత పదం. భరతుడే వస్తు, నాయక, రస, అంక సంఖ్యల ఆధారంగా పది విధాలుగా రూపకాలను వింగడించినాడు.[1] రూపకం అంటే ఒక విధమైన నాట్యమే. రూపకం అంటే రామాదుల రూపాన్ని ధరించి సాభినయంగా ఇతివృత్తాన్ని ప్రదర్శించడం. అంత ప్రాచీన కాలంలో కూడా వింగడింపులో నిత్యనూతన వికాసానికి అవకాశం కల్పించడం భరతుని హృదయ వైశాల్యాన్నీ, కళావైదగ్ధ్యాన్నీ సాంఘిక ప్రయోజనాన్ని, సుసంస్కృత హృదయాన్నీ సువ్యక్తం చేస్తున్నది. అప్పటికే ప్రఖ్యాత పురాణేతిహాసాల ఇతివృత్తాలకే కాక కల్పిత ఇతివృత్తాలకూ, బహుళ ప్రచారం ఉన్న ఇతివృత్తాలలో కొన్ని కల్పనలు చేసి మిశ్ర పద్ధతికి అతడు వీలు కల్పించినాడు. అతడు వింగడించిన పది రకాలైన రూపకాలలో నాటకం కూడా ఒకటి. వస్తునాయక రసాది అంశాలలో వైశిష్ట్యం ఉన్న కారణాన ఆ పది రూపకాలలో నాటకానికే ప్రాముఖ్యం హెచ్చుతూ వచ్చింది. రానురాను రూపకానికే నాటకం అన్న ప్రత్యామ్నాయం ఏర్పడింది.

---

1. నాటకము, ప్రకరణము, సమవాకారము. ఈహామృగము, డిమము, వ్యాయోగము, అంకము, ప్రహసనము, భాణము, వీధి.

సమానార్థకమైంది. నాటక రచనలో సిద్ధహస్తులైన కథకులు ఆ ప్రక్రియకు ఎనలేని ప్రాముఖ్యాన్ని సంతరించి పెట్టినారు. రామాయణ భారతాలు రచించిన వాల్మీకి వ్యాసుల తరువాత నాటక కర్తలైన కవులకే సహృదయ సమాజంలో ఆదరం లభించింది సాహిత్యంలో నిష్ణాతుల కావాలనుకున్న వారంతా దృశ్యకావ్యం అంటే నాటకాన్ని అవలోడించ వలసిందే. పరిశీలించవలసిందే, అధ్యయనం చేయవలసిందే. అందుకే "నాటకాంతంహి సాహిత్యం" అన్న అభియుక్తికి సాహిత్య లోకంలో చెల్లుబాటు కలుగుతూ వచ్చింది.

అతి ప్రాచీనకాలం నుంచి భారతదేశంలో నాటకరచన జరుగుతూ ఉన్నా నాటకప్రయోగం జరుగుతున్నా, ఏ కారణం చేతనో మరి, రానురాను అంటే పన్నెండవ శతాబ్దం తరువాత దాని వికసనం ఆగిపోయింది సంస్కృత భాషా ప్రయోగం సమాజంలో కొన్ని వర్గాల వారికే పరిమితం అయ్యింది. జన సామాన్యంలో అనేక ప్రాకృత భాషలు అనాది నుంచే ప్రచారంలో ఉండేవి ఈ యాథార్థ్యాన్ని సంస్కృత నాటకకర్తలు గుర్తించి తమ నాటకాలలో స్త్రీలకూ, సామాన్యులకూ ప్రాకృత భాషలనే ప్రయోగించుకున్నారు. ప్రాకృతులు అంటే ప్రజలు. కనుక ప్రాకృత భాషలని తాత్పర్యం. సంస్కృత నాటకాలలో కొన్ని పాత్రలకే పరిమితమైన ప్రాకృత భాషలు ప్రజా బాహుళ్యానికి మాత్రం చాలా సన్నిహితమైనవి. ప్రాకృత భాషలు అపభ్రంశాలుగానూ నేటి దేశభాషలుగానూ రూపుదిద్దుకున్నవి. అయితే ఈ దేశభాషల్లో సంస్కృతంలో వలె నాటకాలేవీ వెలువడలేదు. అభిరుచి ఉన్నవాళ్ళు విశేషించి సంస్కృత భాషా పరిజ్ఞానం కలవాళ్ళు సంస్కృత నాటక ప్రయోగాలనే చూసి ఆనందించే వారు. ఆ ప్రయోగాలు కూడా చాలా సకృత్తుగానే జరుగుతూ ఉండేవి. విద్యత్సభలలో, రాజాస్థానాలలో, కలవారి లోగిళ్ళలో జరుగుతూ ఉండేవి. జనసామాన్యంలో అభినయ, సంగీత ప్రధానమైన కళా రూపాలు కొన్ని ప్రాచుర్యాన్ని అందుకున్నవి.

నాటిక లేక ఏకాంకికను గూర్చి వివరించవలసి ఉన్నది. అయితే తెలుగు నాట నాటకావిర్భావాన్ని ఈ పట్టున తెలుపడం అప్రస్తుతం కాదనుకుంటాను.

ఆదికవి నన్నయ్య, ఆదిగాగల ప్రాచీనాంధ్ర మహాకవులందరూ సంస్కృత భాషా సాహిత్యాలను తలస్పర్శిగా మథించిన మనీషులు. సంస్కృతం

లోని సాహిత్య ప్రక్రియలతో చక్కనిపరిచయం ఉన్నవారు. ఇంచుమించు సంస్కృత సాహిత్యంలోని ప్రక్రియలన్నింటినీ తెలుగులోకి తెచ్చినవారు. కాని నాటకం యథాతథంగా తెలుగులోకి రాలేదు. సంస్కృత నాటకాలు తెలుగులో ప్రబంధాలుగా రూపుదిద్దుకున్నవి, శృంగార శాకుంతలం ప్రబోధచంద్రోదయం వంటివి. ప్రాయికంగా సంస్కృత నాటకాలన్నింటిలోనూ ప్రాకృతభాషాప్రయోగం అనివార్యంగా ఉంటూ ఉన్నది. సంస్కృతానికి తెలుగు వేషం వేస్తే, మరి ప్రాకృతానికి ఏ వేషం వెయ్యాలె?' అన్న విచికిత్స వారికి ఎదురై ఉంటుందనీ, అప్పట్లో ప్రాకృతానికి బదులుగా ఏ భాష వాడాలో నిర్ణయించలేక తెలుగుకవులు నాటకాలను శ్రవ్య కావ్యాలుగా తెలుగు చేసి ఉంటారని వాఙ్మయ దివాకరులు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు[1] తమ గ్రంథములలో అభిప్రాయపడినారు. అయితే తెలుగులో అభినయ ప్రధానమైన యక్షగానం వంటి రూపక విశేషాలను సామాన్య ప్రజలు సృష్టించుకుని సంబరపడ్డారు. ఆయక్షగానాలే జన బాహుళ్యంలో ఆశేష ప్రాచుర్యాన్ని అందుకున్న తరువాత పండితులు కూడా తమ పాండిత్యంతో యక్షగానాలను అలంకరించి ప్రామాణిక సాహిత్యప్రక్రియగా రూపొందించినారు. పదహారవ శతాబ్దానికి చెందిన బొడ్డుచర్ల తిమ్మయకవి రాఘవ నాట్య ప్రబంధము[2] అనే అపురూపకావ్యాన్ని రచించినాడు. ఇది శ్రవ్య కావ్యమే అయినా దృశ్య కావ్యప్రయోగాల లక్షణాలు కనిపిస్తాయి. దృశ్య శ్రవ్యకావ్యాలకు ఈ కావ్యం వంతెన వంటి దనటంలో తప్పులేదు. తిమ్మయకవి ప్రవేశపెట్టిన ఈ సరికొత్త పద్ధతికి ఏ కారణంచేతనో ప్రాచుర్యం కలుగలేదు. ఆ తరువాత ప్రజా బాహుళ్యం యక్షగానాల పట్లనే ఎక్కువ మక్కువ చూపుతూ వచ్చింది. యక్షగానంలో చతుర్విధాభినయాలూ పురాణగాథలూ సంస్కృత నాటకాల్లో అరుదుగా కనిపించే హాస్యరసం ఈ జన ప్రియత్వానికి కారణాలని చెప్పవచ్చు.

---

1. I ఆంధ్ర నాటక పితామహుడు. రచన - 1937 ముద్రణ - 1974
   II ఆంధ్ర వాఙ్మయ చరిత్రము.
2. ప్రచురణ ఆంధ్ర రచయితల సంఘం. సంపాదకుడు ఆచార్య బి. రాఘురాజు. 1962.

ఇన్ని వేల యేండ్ల చరిత్ర ఉన్నా ఇంత నాటక సాహిత్య సంపద ఉన్నా నాటక కళ మన భారతదేశంలో మరుగున పడిపోయింది. ఇంచు మించు యావ ద్భారతాన్ని కలవరపరచిన ఇస్లాం అధికార ప్రాబల్యం, భారతేతరమైన సంస్కృతిని ప్రచారం చెయ్యాలనే ముస్లిం పరిపాలకుల దురాగ్రహంవల్ల ఒక్క నాటకమ్మే కాదు పురాభారతీయ సాహిత్యమంతా అస్తంగమితమైనది. గత శతాబ్దం ఉత్తరార్ధంలో ఆంగ్లేయుల పరిపాలన భారతదేశంలో బాగా పాతుకొని పోయిన తరువాత భారతీయుల జీవితంలో క్రొంగొత్తతీరులు అనేకం బొటమరించినవి ఇంగ్లీషు భాషా బోధనం, అభ్యసనం భారతీయులకు నిఖిల ప్రపంచాన్ని చూసే గవాక్షాలైనవి. ఐరోపా ఖండంలోని సాహిత్య మర్యాదలతో పరిచయం కలిగిన తరువాత భారతీయులలో కొత్త కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చినవి. అంతకు పూర్వంలో లేని సాహిత్య ప్రక్రియలకు అంకురార్పణ జరిగింది. ఆంగ్లేయ పండితులు కొందరు దేశ భాషలను నేర్చుకొని, చెదలపాలవుతున్న గ్రంథాలను వెలికితీసి, అచ్చువేసి ఆకారాది నిఘంటువులను సృజించి, వచన వాఙ్మయానికి విస్తృతి కలిగించి, సాహిత్యేతరమైన అంశాలను వివరించడానికి యోగ్యమైన భాషలను రూపొందించి ఎనలేని కృషి చేసినారు. దాదాపు 250 సంవత్సరాల నుంచి ఇంగ్లీషు భాషా సంస్కృతులతో తెలుగువారికి సంబంధం ఏర్పడింది. రాజకీయ ప్రాబల్యం దీనికి ప్రధాన కారణమే అయినా సాంఘికంగా, భాషా పరంగా సాహిత్యాత్మకంగా ఇంగ్లీషు ప్రభావం వల్ల తెలుగు భాషా సాహిత్యాలు కొత్త మెరుగులు చిమ్మినవి. ఇంగ్లీషు ద్వారా విశ్వాన్నీ, విశ్వసాహిత్యాన్నీ విశేషించి పాశ్చాత్య భావ ప్రపంచాన్ని తెలుగు ప్రజ్ఞా చక్షువు సందర్శించ గలిగింది. పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థంలో పాశ్చాత్య నాటక పద్ధతులను కొంతవరకు అనుకరించే నాటక సమాజాలు కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చి అనేక ప్రదర్శనలతో వివిధ నగరాల్లో తెలుగు రసికులను అలరించి తెలుగు సాహిత్యకులలో కొత్త ఆలోచనలకు నారు పోసినవి. అప్పుడెప్పుడో భారతదేశంలో ప్రాచుర్యాన్ని అందుకున్న నాటక సాహిత్యం తెలుగులోకి మళ్ళీ వచ్చింది సంస్కృత నాటకాలకు అనువాదాలు వచ్చినవి. ఇంగ్లీషు నాటకాలకు అనువాదాలు వచ్చినవి. భారతీయ నాటక సాహిత్యంలో సకృతంగా ఉన్న విషాదాంత నాటకాలూ, కాల్పనికేతివృత్త నాటకాలూ, పాత్రోచిత భాషా ప్రయోగాలు అనేకం వెలువడినవి.

ఇరవయ్యో శతాబ్దం తొలి మూడు దశకాలలో నాటక సాహిత్యం మంచి వికాసాన్ని పొందింది. గంధర్వాంశ సంభూతులైన నటీనటులెందరో ప్రజా హృదయాలను చూరగొన్నారు. వేల సంఖ్యలో నాటకాలు వచ్చినవి. పౌరాణిక, సాంఘిక, చారిత్రాత్మక ఇతివృత్తాలు ఉన్న నాటకాలు, సమకాలీన సమస్యలను వాచ్యంగానో, సూచ్యంగానో స్పృశించి యుగోచితమర్యాదలను సంతరించు కొన్నవి. పద్యానికి పాటకూ ఈ నాటకాల్లో ఎంతో విలువ ఉండేది. సంగీతాత్మకంగా వెలువడిన నాటకాలలోని పద్యాలూ, గీతాలు ప్రజా హృదయాల్లోనేకాదు-జిహ్వాగ్రాలపై నాట్యమాడినవి.

కడచిన నలుబది సంవత్సరాల నుంచి నాటక రచనలోనూ, ప్రయోగం లోనూ కొత్త మలుపులు వచ్చినవి. సుదీర్ఘమైన కావ్యాలకంటె, ఖండ కావ్యాలు ప్రజాదరణకు పాత్రమైనట్టే అయిదారు గంటెల పాటు ప్రయోగించే నాటకం కంటే అరగంట లేక ముప్పావు గంటలో ప్రయోగించే దృశ్య కావ్యాలపట్ల ప్రజలు మొగ్గు చూపడంవల్ల రచయితలు కొద్ది సమయంలోనే ప్రయోగించడానికి వీలైన నాటికలను రచించటం ప్రారంభించినారు. చిన్నదిగా ఉండడంవల్ల తొలి రోజుల్లో నాటిక అన్న పేరు ఈ చిన్న నాటకాలకు ఉండేది. ఇప్పటికీ ఉంది. ఈ రోజులలో నాటిక అనే మాట అంతగా ఉపయోగించబడక పోవడానికి కారణం నాటికకున్న చరిత్ర. సంస్కృత సాహిత్యంలో నాటిక అనే ఒక రూపక విశేషం ఉంది. ఇందులో నాలుగంకాలు ఉంటాయి. నాయకుడు ధీరలలితుడు అంటే నృత్యగాన వినోదాల్లో కాలం గడిపేవాడు. శృంగారం ప్రధాన రసంగా ఉంటుంది. స్త్రీ పాత్రలకు ప్రమేయం ఎక్కువ. నాటకం కంటే విస్తృతిలో చిన్నది. కాని ఇప్పుడు మనకున్న నాటికలకు ఈ లక్షణం సరిపోదు. ఇప్పుడున్న నాటకాలకుకూడా అనాటి లక్షణాలు సరిపోవు. ఇప్పుడు రచనలోనూ, ప్రయోగంలోనూ పాశ్చాత్య ప్రభావం సమధికంగా కనబడుతున్నది. ప్రాచీన సంస్కృత నాటకాల్లో రూపకేతివృత్తం అనేక అంకాల్లో ఉండేది. ఎక్కువగా 5, 7,12 అంకాలు నాటకంలో ఉండేవి. దశవిధరూపకాలలో వ్యాయోగం, అంకము, ప్రహసనం, భాణం, వీధి అనేవి ఏకాంక పరిమితాలు. ఇవిగాక సంగీత నృత్య ప్రధానములైన దోంబి, దుర్మల్లిక, పుష్పగండిక, నాటిక, తోటకం, గోష్ఠి,

సట్టకం, నాట్యరాసకం, ప్రస్థానకం, ఉల్లాప్యం, కావ్యం, ప్రేంఖణం, రాసకం, సంతాపకము, శ్రీగదితం, శిల్పకం, విలాసిక, ప్రకరణికం, హల్లీసకం, భాణి అనే ఉపరూపకాలు కూడా ఏకాంకికలే. అయితే అలనాడు ఒక అంకంలో ఒక రోజు జరిగిన కథను మాత్రమే ప్రయోగించాలనే నియమం ఉండేది. ఆ దృష్టితో మలచ బడ్డవే ఆనాటి ఏకాంకికలు. అయితే వాటిని ఆ రోజుల్లో ఏకాంకిలని ఏకారణం చేతనో అనలేదు. భరతముని వివరించిన నాటికకూ, ఈనాడు నాటికగా వ్యవహరింపబడుతున్న దానికీ ఏమీ సంబంధం లేదు. నాటి నాటికా లక్షణాలు నేటి నాటికా లక్షణాలతో సమన్వయించవు. అందుకే ఈనాటి ఏకాంకికలు, నాటికలు పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వచ్చినవని నిష్కర్షగా చెప్పవచ్చు. అయితే ఇక్కడ ఒక విషయం స్పష్టంగా తెలుసుకోవాలె. ఏకాంకికలు లేక నాటికలు భారతీయులకు కొత్తవేమీ కావు. కొన్ని చారిత్రక కారణాలవల్ల అవి మరుగున పడినవేకాని కేవలం పాశ్చాత్య ప్రభావం వల్ల ఈ ప్రక్రియ పుట్టు కొచ్చిందని మనం స్థూలంగా నమ్మడానికి వీలులేదు. ఇంగ్లీషుతో సంపర్కం కలిగిన తరువాత ఎప్పుడో మృగ్యమైపోయిన ఏకాంకికలు మళ్ళీ అలనాటి నాటికా బీజం నుంచి పుట్టుకొచ్చి వినూత్న పాశ్చాత్య దోహద ప్రక్రియలతో కొత్తపూలు పూచే సరికొత్త తీగగా నవనవలాడుతూ మనలను ఇప్పుడు అలరిస్తున్నవి. అయితే నేటి కాలంలో తెలుగులో వెలువడుతున్న ఏకాంకికల రచయితలు ప్రాచీన కాలంనాటి సంస్కారంతోనే వ్రాసినారని కూడా చెప్పలేము. ఇప్పటి ఏకాంకికల పైన పాశ్చాత్య ప్రభావం ఉన్నదన్నమాట వాస్తవమే. కాని ఈ ప్రక్రియ భారత దేశంలో ఎన్నడూ లేదని, పాశ్చాత్యులే ఈ నాటికా బీజాలను ఇక్కడ నాటి నారన్న మాట పూర్తిగా యథార్థం కాదని చెప్పవచ్చు.

నాటిక, ఏకాంకిక పర్యాయ వాచకాలుగానే ఇప్పుడు మనం ఉపయోగిస్తు న్నాము. ONE ACT PLAY అన్న ఇంగ్లీషు పదానికి ఏకాంకిక అన్న తెలుగు మాట పూర్తిగా సరిపోవడంవల్ల ఏకాంకిక అన్న పేరుకే చెల్లుబాటు ఎక్కువైంది.

నాటకాన్ని సక్షిప్తం చేసినంత మాత్రాన నాటిక అనిపించుకోదు. నాటకం ఎంత ప్రత్యేకమైందో నాటిక అంతే ప్రత్యేకమైనది. నిజానికి ఏకాంకికా రచన నాటికా రచన కంటే కష్టతరమని అనడానికి ఎక్కువగా సందేహించ వలసిన అవసరం లేదు. మంచి నాటకం వ్రాయగలిగిన వాడు మంచి నాటికను కూడా వ్రాయగలుగుతాడనుకోవడం పొరపాటు. కాకపోతే తొందరపాటు.

పురా భారతీయులు రూపకాలలోని అంకానికి సమకూర్చిన లక్షణాలు ఈ నాటి ఏకాంకికకు సరిపోవడం ఆశ్చర్యకరమైన విషయం. కనుకనే ఏకాంకికలు మొన్న మనదేశంలో ఉన్నవి, నిన్న లేవు, నేడు మళ్ళీ వచ్చినవని అనుకోవలసి వస్తుంది. భారతీయులు రూపకంలోని భాగమైన అంకంలో ఒకనాటి కథే ఉండాలనీ, ఉపకథ లుండకూడదనీ, స్థలంలో మార్పు ఉండకూడదనీ, పెక్కు పాత్ర లుండకూడదనీ, నాయకుడుండి తీరాలని లక్షణాలు ఏర్పరచినారు. తెలుగులో వీరేశలింగంపంతులుగారికాలంలో వచ్చిన ప్రహసనాలన్నీ నాటికలనే చెప్పవచ్చు.

కొన్ని సందర్భాలలో నాటిక లేక ఏకాంకికలో రెండు మూడు రంగాలు (scenes) ఉంటాయి. ఇలా ఉంటే ఏకాంకిక అవుతుందా? పాశ్చాత్యులు మన ప్రాచీన నాటక లక్షణ కర్తలవలె కాక అంకంలో రంగ వైవిధ్యాన్ని ఒప్పుకుంటారు. కనుక వారి దృష్టిలో రంగాలు అనేకం ఉన్నా అది ఏకాంకికగానే గుర్తింపబడుతుంది. అయితే వాళ్ళ ఏకాంకికలన్నిటిలో రంగ వైవిధ్యం ఉంటుందని అనుకోవడానికి వీలులేదు.

అద్యతన కాలంలో విశేషప్రాచుర్యాన్ని అందుకున్న సాహిత్యప్రక్రియల్లో ఏకాంకిక ఒక్కటి.

దశవిధ రూపకాలలో వ్యాయోగం, భాణం, అంకం, వీధి అనే నాలుగు రూపకాలు ఏకాంక సీమితాలు. సాహిత్యదర్పణంలో—

"ఖ్యాతేతి వృత్తో వ్యాయోగః
ఖ్యాతోద్ధత నరాశ్రయః"

అస్త్రీ నిమిత్త సంగ్రమో జామదగ్న్య జయేయథా ఏకాహ చరితైకాంకః అంటే వ్యాయోగం అనే రూపక విశేషంలో ఒకే ఒక అంకం ఉంటుంది.

"భాణస్తు ధూర్త చరితం
స్వానుభూతి పరేణవా
యత్రోప వర్ణయదేకో సంబోధనోక్తి
ప్రత్యుక్తీ కుర్యాదా కాశ భాషితైః"

ధూర్త చరితం ఇతివృత్తం కలిగిన ఏకాంక పరిమితం కల రూపకం భాణం.

"ఉత్పన్నష్టి కాంకే వృత్తం ప్రఖ్యాతం
వృత్తంబుద్ధ్యా ప్రపంచమేత్
............నేతారం ప్రాహ్నతానరాః"

అంకం అనే రూపక విశేషం కూడా ఏకాంక పరిమితమే. సామాన్యుడు ఇందులో నాయకుడుగా ఉంటాడు.

"ఏవం వీథీ విధాత వ్యాద్వ్యేక పాత్ర ప్రయోజితా"

ఒకటి రెండు పాత్రల చేత ప్రయోగించబడే రూపకం వీథి.

ఈ విధంగా రసం, పాత్రల సంఖ్య, పాత్రల స్థాయి, స్త్రీ పాత్రలు లేక పోవడంలాంటి వివరాలు ఈ ఏకాంక పరిమిత రూపకాలకు లక్షణాలు. అయితే ఈనాడు ప్రచారంలో ఉన్న ఏకాంకికలకు ఆ లక్షణాలేవి సరిపోవడం లేదు. స్వల్పావధిక ప్రక్రియలు పాశ్చాత్యుల్లో ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందుతూ ఉండటం చేత పెద్ద నాటకాలకు బదులుగా చిన్న నాటకాలు అంటే మిక్కిలి తక్కువ కాలంలో ప్రయోగింపబడే నాటికలు నాటికలు అనిపించుకున్నవి. ఏకాంకికలు అనిపించుకున్నది. ఏకాంకిక కళాత్మకమైన సాహిత్య ప్రక్రియ. ఏకాంకిక నాటకమే. అయితే చిన్న నాటకం అన్నంత మాత్రాన అది ఏకాంకిక అనిపించుకోదు. ఏకాంకిక ఒక విలక్షణమైన సాహిత్య ప్రక్రియగా రూపుదిద్దు కున్నది. ఒక పెద్ద నాటకం కలిగించే ఆనందం, స్ఫూర్తి, ఏకాంకిక కలిగించ గలుగుతుంది. సామాజికులకు జీవితానికి సంబంధించిన ఒక ప్రధానాంశాన్ని, లేక ఒక చిన్న అంశాన్ని తెలియజేస్తుంది. ఆ అంశం ఆధారంగా ప్రేక్షకులు మానవ జీవితానికి సంబంధించిన ఒక మహావిషయాన్ని అవగతం చేసుకోగలుగు తారు. ఇప్పటి ఖండ కావ్యాలు మహాకావ్య స్ఫూర్తిని కలిగించినట్లే ఏకాంకికలు కూడా మంచి సంస్కారం ఉన్న ప్రేక్షకులకు ఆనందాన్ని, ఉత్తేజాన్ని, విజ్ఞా నాన్ని ప్రసాదిస్తాయి.

ఏకాంకికా లక్షణాలను స్థూలంగా ఇలా వింగడించి చెప్పవచ్చు:

వస్తు ప్రాధాన్యం అంతగా ఉండదు.

ఒకటో లేక రెండు సంఘటనలో ప్రాయికంగా ఏకాంకికలో ఇమిడిపోతాయి.

కథకంటే కథను తెలిపే తీరుకు ప్రాముఖ్యం ఎక్కువగా ఉంటుంది.

ఉపకథలకు ఏకాంకికలో ఆస్కారమే ఉండదు.

రసవైవిధ్యానికీ ఏకాంకికలో చుక్కెదురు. ఏదో ఒక్క రసానికే ఏకాంకిక పరిమితమై ఉంటుంది

కథలో చమత్కారానికి ప్రాముఖ్యం అంటే పాత్రల సంభాషణల్లో చమత్కారం ముఖ్యం.

రంగాలంకరణకు ప్రాముఖ్యం ఉండదు.

ఒక గంటకు తక్కువైన వ్యవధిలో అంటే నలుబదియైదు నిముషాలలో రచయిత తాను కోరుకున్న అంశాన్ని ప్రేక్షకులకు అందజేయగలగడం ఏకాంకికలోని ప్రత్యేకత. అందుకే ఏకాంకిక రచన కష్టతరమని విమర్శకుల అభిప్రాయం. రచయిత ఒక్క క్షణం కానీ, ఒక వాక్యంగానీ వృధా చేయడానికి వీలు లేదు. అయితే ఏదో ఒక చిన్న సంఘటనో, స్వల్పమైన సందేశమో ఎన్నుకుని సరిపెట్టుకో గూడదు. ఎంతో తీవ్రమైన సన్నివేశాన్ని ప్రదర్శించడం ఏకాంకిక ముఖ్యోద్దేశం కావచ్చు. కాని రచయిత ఆ తీవ్రమైన అంశాన్ని, మహనీయమైన విషయాన్ని అదుపులో పెట్టుకుంటాడు. ఒక చిన్న సంఘటనతో ఇమిడ్చివేస్తాడు. ఒక సమగ్ర జీవితాన్ని ఏకాంకికలో కుదించడం అసాధ్యమే. నిజానికి ఆ సన్నివేశం ఒక గంటకాలంలో జరిగితే దాదాపు అంతేకాలంలో దైనందిన వాస్తవిక జీవితంలోనూ జరగాలె.

ఏకాంకికలో పాత్రలు ఎక్కువగా ఉండవు. ఎందుకంటే, పాత్రల సంఖ్య ఎక్కువైతే కథా నిర్వహణంలో ఉత్కంఠను కలుగజేయడంలో ఆటంకం ఏర్పడుతుంది.

స్త్రీ పాత్రలు లేకుండానే రక్తి కట్టించవచ్చు.

ఏకాంకికలో ఒకే ఘటన, ఒకే అనుభవం,

ఒకే సందర్భం ఒకటో రెండో పాత్రలు దర్శనమిస్తాయి.

అన్నిటికంటే ముఖ్యమైన అంశం ఏకాంకికలో గతివేగం. కథాంశం వడివడిగా సాగిపోతూ ఉండాలె.

స్థూలంగా ఈ కొన్ని లక్షణాలను ఊతగా తీసుకుని ప్రయోక్తలు పాత్ర ప్రవేశంలో రంగాలంకరణంతో సంభాషణారీతుల్లో పలు పోకడలు పోయినారు.

ఏకాంకికలు పిల్లల కోసం కూడా ప్రత్యేకంగా వెలువడినవి. నృత్యగేయ ప్రధానంగా వెలువడి, నృత్య నాటికాలుగా, గేయ నాటికలుగా ప్రసిద్ధిపొందినవి.

1935 నుంచి 'శ్రవ్య నాటిక' అనే ఒక కొత్త ప్రక్రియ పుట్టుకొచ్చింది. ఒక్క వాచికాభినయంలోనే మిగిలిన అభినయాల స్ఫూర్తిని పొదువుకొన్న ప్రక్రియ ఇది. సాధారణంగా రేడియోలో కాలపరిమితి తక్కువగా ఉంటుంది. కనుక పరిమిత కాలంలో ప్రయోగించటానికి ఏకాంకికకు మాత్రమే వీలుంటుంది. అయితే గంట కంటె ఎక్కువ కాలంలో ప్రయోగింపబడిన నాటకాలు కూడా రేడియోలో రాకపోలేదు. అయినా ఏకాంకికా రచనకు రేడియో అనువైన వాతావరణాన్ని కలిగించగలిగింది. ఏకాంకికల్లో దాదాపు తొంభై శాతం రేడియో కలిగించిన స్ఫూర్తి వల్లనే అవతరించినాయని చెప్పడంలో సాహసం ఏమీ లేదు.

కడచిన నాలుగు దశాబ్దాల్లో ఏకాంకికలు లేక నాటకాలు వ్రాయని రూపక రచయితలే అరుదు. విశ్వనాథ, శివశంకరస్వామి, నోరి నరసింహశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, నారాయణరెడ్డి, దాశరథి, రజని, భమిడిపాటి కామేశ్వరావు, అనిశెట్టి, గొల్లపూడి మారుతీరావు, పినిశెట్టి, భమిడిపాటి రాధాకృష్ణ, సోమంచి యజ్ఞన్నశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, బుచ్చిబాబు, పద్మరాజు, వేటూరి ఆనందమూర్తి, బాపురెడ్డి, కొర్రపాటి గంగాధరరావు, ముదిగొండ లింగమూర్తి, రావి కొండలరావు, వేలూరి శివరామశాస్త్రి, ఎన్.ఆర్. నంది, జి.వి. కృష్ణరావు, కృష్ణశాస్త్రి,గోరాశాస్త్రి,రాజమన్నారు ప్రభృతులు అనేక గేయ, పద్య, వచనాలలో అనేక ఏకాంకికలను రచించి, ప్రయోగింపజేసి ఈ ప్రక్రియకు ఒక విశేషస్థానాన్ని కల్పించగలిగినారు. సోమంచి యజ్ఞన్నశాస్త్రి లోకులు కాకులు, పెద్దమనుషులు, ఆత్రేయ ఎవరుదొంగ, రాజమన్నారు మనోరమ,నార్లవారి అర్ధాంగి, దొంగ దొర, గోపీచంద్ అభాగిని, ముదిగొండ లింగమూర్తి వెంకన్నకాపురం, పినిశెట్టి అద[illegible] రిక్షావాడు, బుచ్చిబాబు తెరపడని నాటకం, భమిడిపాటి రాధాకృష్ణ కీర్తిశేషులు, దంతవేదాంతం, మనస్తత్వం, గొల్లపూడి మారుతీరావు విలువలు, కళ్ళు, రావి కొండలరావు కుక్కపిల్ల దొరికింది, రాపూరి భరద్వాజ భానుమతి, వేణు దిష్టి

బొమ్మలు, మొక్కపాటి నరసింహశాస్త్రి ముక్కుబడి, విశ్వనాథవారి పాముపాట, కుందుర్తి ఆశ, నారాయణరెడ్డి ఊర్మిళ, సినీకవి కృష్ణశాస్త్రి ఊర్వశి, విద్యాపతి, రజని చండీదాసు, జోయిభీమన్న కూలిరాజు, పాలేరు, కొర్రపాటి గంగాధరరావు బంగారు సంకెళ్ళు, వేటూరి శివరామశాస్త్రి సుల్తానీ, ఎన్. ఆర్. నంది పుణ్యస్థలి, శ్రీశ్రీ 2001, ఆరుద్ర న్యాయాధికారి, కాటూరివారి మువ్వగోపాల, కరుణశ్రీ కరుణామయి, దాశరథిగారి వెన్నెల మడుగులు, రాధప్రేమ, గోరాశాస్త్రి నైట్ డ్యూటీ, చదువులరాణి, ముద్దుకృష్ణ టీ కప్పులోని తుఫాను, చింతాదీక్షితుల వారి శబరి, మల్లవరపు విశ్వేశ్వరరావు వరూధిని, నోరి నరసింహశాస్త్రి గజ్జెల మొల త్రాడు, డి.వి. నరసరాజు ఆత్మహత్య, వాపస్, అంతరాత్మ, కొండముది శ్రీరామ చంద్రమూర్తి తెర మరుగునీడలు, శ్రీమతి కళ్యాణి పెండ్లికొడుకు వంటి ఉత్తమ వచన గేయ నాటికలను ఎన్నింటినైనా ఎత్తి చూపవచ్చును. ఏడిద కామేశ్వర రావు, న్యాపతి రాఘవరావు, న్యాపతి కామేశ్వరి, నార్ల చిరంజీవి, చెరుకుమిల్లి భాస్కరరావు ప్రభృతులు అసంఖ్యాకమైన బాలనాటికలను రచించి, దాదాపు అన్నింటిని ప్రసారం చేయగలిగినారు. శివశంకరస్వామిగారు గేయ నాటికలకు శ్రీకారం చుట్టిన ప్రయోగశీలి. శ్రీ స్వామివారు పెక్కు పద్యనాటికలను కూడా వెలయించి, నాటికా ప్రక్రియను పాండిత్యంతో కళావిలసనలతో సమలంకరించ గలిగిన మనీషివతంసులు.

నాటికా ప్రక్రియా ప్రసరణానికి ఇతోధికమైన వాతావరణాన్ని కల్గించిన ఆంధ్రనాటక కళాపరిషత్తు కృషి అభినందనీయం.

ఏకాంకికా సంకలనాలు, శతాధికంగా ప్రచురింపబడనివి. నాటికా రచయిత లెందరికో పత్రికలూ, సాహిత్య సంఘాలు, సాహిత్య అకాడమీ సమాదరించినవి. ఏకాంకికల పోటీలు ఎందరో ఔత్సాహిక నటులను ఆకర్షించినవి. ఎందరోరచ యితలను పురికొల్పినవి. ఏకాంకిలపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరుగు తున్నవి.[1] హిందీ, ఉర్దూ, తమిళం, కన్నడం, బెంగాలీ, మరాఠి, మళయాళ

---

1. తెలుగులో గేయ నాటిలు : డా. తిరుమల శ్రీనివాసాచార్యులు
పి. హెచ్.డి.

2. డా. జి. వి. కృష్ణారావు : సత్యరాణి మంగళగిరి ప్రమీలాదేవి
నాటికా సాహిత్య పరిశీలనం ఎం.ఫిల్.

భాషల్లోని రసాత్మకములైన ఏకాంకికలెన్నో తెలుగువేషం వేసుకున్నవి. జాతీయ సమైక్యానికి నాటికలు చెప్పకోదగిన మేలు చేసినవి. ఏమీ చదువుకోని వాళ్లు కూడా ఇతర భాషల్లోని ఏకాంకికలను తెలుగులో చదివి, చూసి ఆయాభాషల రచయితల ప్రతిభా సామర్థ్యాలను తెలుసుకోగలిగినారు. ఏ సాహిత్య ప్రక్రియ కూడా సమైక్య శక్తులకు ఇంతగా తోడ్పడలేదు.

నేటి యాంత్రిక సమాజంలో ప్రజలకు విరామమే తక్కువ. అనుక్షణం ప్రతి వ్యక్తి పరిగెత్తుతున్నట్టు కనిపిస్తాడు. తెలియని గమ్యం వైపు మైమరచి పరుగులు తీస్తున్నాడు. ఒక రాత్రి అంతా కూర్చుని పెద్ద నాటకాన్ని చూసే స్థితిలో లేడు. కొన్ని గంటల తరబడి కూర్చుని ఒక మహా కావ్యాన్ని లేక ఒక పెద్ద పుస్తకాన్ని చదవలేడు. జీవితావసరాలను తీర్చుకోవడానికి నిరంతరం కష్టపడుతున్న మనిషికి ఆహ్లాదాన్ని అనుభవించడానికి రాను రాను అవకాశాలే తక్కువ అవుతున్నవి. కేవలం ఒక కళను నమ్ముకొని దాని ద్వారా బ్రతుకు బరువులీడ్చుకోవడం ప్రపంచంలోని బహు దేశాల్లో ఈనాడు సాధ్యమయ్యే పని కాదు. ప్రత్యేకించి భారత దేశంలో కవిత్వం, చిత్రలేఖనం, నృత్యం, అభినయం వంటి కళలు సుఖ జీవనానికి తోడ్పాటు కలిగించలేక పోతున్నవి. వృత్తి కళాకారుల కంటె ఔత్సాహిక కళాకారుల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నది. పొట్ట కోసం శ్రమించే వ్యక్తి కళకోసం పరిశ్రమించడానికి అవకాశాలు తక్కువగానే ఉన్నవి. ఔత్సాహిక కళాకారులు సుదీర్ఘమైన రూపక ప్రక్రియలను అవలంబించి నిశ్చింతగా జీవితం గడుపుకోలేరు. అనుక్షణం భయంతో బ్రతుకు లీడుస్తున్న ప్రజలకు ఆనందాన్ని అనుభవించే అవకాశమే అరుదు. కనుకనే సూక్ష్మంలో మోక్షం అన్న పద్ధతిలో కళ అనుభవంలోకి రావాలని ఇప్పటి ప్రజల తహ తహ. అందుకే దీర్ఘకాల ప్రయోగంవల్ల సాధించే ప్రయోజనాలను అల్పకాల ప్రక్రియలు సాధించిపెట్టాలె. ఏకాంకికలకు నేటి సమాజంలో ఎక్కువ ప్రాచుర్యం

---

3. కందుకూరి వీరేశలింగం గారి ప్రహసనాలలో సాంఘిక దృక్పథం : పి. లోకాచారి ఎం.ఫిల్.
4. తెలుగు ఏకాంకిక ఒక పరిశీలన : వనం మధుసూదన్ ఎం.ఫిల్.
5. గోరాశాస్త్రి నాటికలు : ఎం. గిరిజాదేవి ఎం.ఫిల్.

కల్గడానికి ఇదే కారణం. ఒకేసారి కూర్చుని నవలలను చదివేవాళ్ళ సంఖ్య కూడా నానాటికి తగ్గిపోతున్నది. రోజూ కాసేపు, వారానికి కాసేపు చదువుకోడానికి వీలుగా నవలలు ధారావాహికంగా పత్రికల్లో రావడానికి ఇదే కారణం. కాలపరిమితి నియమం ఉన్న రేడియో,దూరదర్శన్‌కూడా ధారావాహికమైన పద్ధతినే అవలంబిస్తున్నవి. ప్రచురితమవుతున్న, ప్రసారితమవుతున్న ఒక్కొక్క భాగంలో చాలా పనితనం, సమగ్ర కథను అవగాహన చేసుకుంటున్నామన్న చిత్తసంస్కారాన్ని కలిగించగలుగుతున్నవి.

మొన్న మొన్నటిదాకా సాహిత్యాధ్యయనం తెలుగులో సంస్కృత నాటకానువాదాలతోనూ, స్వతంత్ర నాటకాలతోనూ ప్రారంభమయ్యేది. కాని అయిదు అంకాలున్న నాటకం, ఎన్ని కళా ప్రమాణాలకు ఆకరంగా ఉంటుందో, ఏకాంకిక కూడా అన్ని కళా ప్రమాణాలకు ఆకరమై ఉంటుంది. అయితే ఇది పరిమాణంలో చిన్నది కావచ్చు. నాటకానికి విలువ కట్టే యోగ్యత వస్తుంది ఏకాంకికను చూస్తే. అన్ని మెలకువలను పాటించి ఒక్క ఏకాంకికను ప్రదర్శించడం మేలు పెద్ద నాటకాన్ని రచించడం, ప్రయోగించడం చాలా కష్టసాధ్యమైనపని. రచన సాధ్యమేమోకాని ప్రయోగం మాత్రం కష్టం. పెద్ద నాటకం సాధించే ప్రయోజనాలు ఏకాంకిక సాధిస్తున్నది.

ప్రజాస్వామ్య సమాజంలో కళా విలసనం ప్రజాధీనంగానే ఉంటుంది. నాటక రంగం సర్వ మానవుల్లోని కష్ట సుఖాలకు ప్రతిబింబం. తరతమ భేదాలకు ఇది అతీతం. కవిత్వం వలెనే, సంగీతం వలెనే నాటక కళ ప్రత్యేకించి ఏమి బోధించదు. ఏ శాస్త్రీయమైన అంశాన్ని నిరూపించదు. అయితే ఏది ఉత్తమమో ఏది సత్యమో తెలుసుకోగలిగే చిత్త సంస్కారాన్ని నాటక కళ మనిషిలో సృష్టించ గలుగుతుంది.

నాటకం కష్టపడిన మనిషికి కొంత ఊరట కలిగించడానికీ, కొంచెం ఆనందాన్ని కలిగించడానికి పుట్టిన కళ. అందుకే ఇది అందరికీ అంటే షండితులకూ, పామరులకూ, కలవారికీ, లేనివారికీ అర్థమయ్యే పద్ధతిలో ఉంటుంది. పాండితీ ప్రకర్షకూ, శాస్త్రీయ విశ్లేషణానికీ, ప్రత్యేకమైన ధర్మప్రచారానికీ, రాజకీయ పక్షాల ప్రచారానికి నాటకం ఆలంబనం కాకూడదు. అందే నాటకంలో

ఇవన్నీ ఉండకూడదని కాదు. ఇవన్నీ నాటక రచయితకు ఉండాలె. ఆ సంస్కారంతో అతడు సమాజాన్ని చూడాలె. పాత్రలను కల్పించాలె. కథను అల్లాలె. కళాత్మకంగా మానవ జీవిత సమస్యలను చూడగలగాలె. ప్రేక్షకునికి తెలియకుండానే ఆలోచనలను హృదయంలో వెదజల్లాలె. ఆలోచించడాన్ని అలవరచాలె. కాని రచయిత తన ఆలోచనలను కొట్టవచ్చినట్లు ప్రేక్షకులపై గుమ్మరించగూడదు. ఒక్క నాటికకే కాదు, సాహితీసృష్టికంతటికీ ఇది వర్తిస్తుంది. కళాత్మక దృష్టికి ఇది అవసరం.

చిన్న కథ, లఘు కావ్యం వంటి సాహిత్య ప్రక్రియల్లోని అంతరార్థాన్ని, రచయిత చిత్త సంస్కారాన్ని అర్థం చేసుకోవడానికి కొంత పాండిత్యం అవసరం. వ్యంగ్య మర్యాదలతో పరిచయం అవసరం. కాని నాటకం పామరులను కూడా తన ప్రాంగణంలోకి ఆహ్వానించి ఆనందాల ఆమెతలను ఇస్తుంది.

'కన్యాశుల్కం' వంటి నాటకాలు, ఐమిడిపాటి కామేశ్వరరావు నాటికలు, చిలకమర్తి, వీరేశలింగం ప్రహసనాలు ఎంత పని చేసినాయో తెలుగు దేశంలో వివేకవంతులందరికీ తెలుసు. కనుక తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ ప్రయోజనాలను సాధించిపెట్టే ఏకాంకిక ఈనాడు నాటకాన్నే మరిపించింది. ఇప్పుడు నాటకం అంటే నాటికే, ఏకాంకికే. ఒకప్పుడు నాటకం ఒక విధమైన రూపకం అనుకున్నవాళ్ళకు నాటకమే రూపకం. అదే విధంగా ఇప్పుడు రూపకం అంటే ఏకాంకిక. దీన్ని ప్రయోగించడానికి ఎక్కువ వ్యయప్రయాసలు అంతగా అక్కరలేదు. వస్తువు సాంఘికమైనదిగా ఉంటేనే ఎక్కువ ప్రయోజనాన్ని సాధించి పెట్టుతుంది. కనుక రంగాలంకరణం, ఆహార్యం వంటి సమస్యలవల్ల కలిగే బాధలు అంతగా ఉండవు. స్వల్పకాలికమైంది కాబట్టి రచయితకూ, ప్రయోక్తకూ, నటులకూ, ప్రేక్షకులకూ ఆయాసం ఉండదు.

పాశ్చాత్య సాహిత్య ప్రక్రియలు, ముఖ్యంగా ఏకాంకికా ప్రయోగ పద్ధతులు మన భారతీయ రచయితలను ఉత్తేజపరచినవి. ఫలితంగా ఎన్నడో మనలో ఉండి కనిపించకుండా పోయిన ఏకాంకిక మళ్ళీ హరివిల్లై కనిపిస్తున్నది. బహువర్ణరంజిత విద్యుత్కాంతులతో జిగేలుమంటున్నది.

నేనీ ప్రసంగంలో ఏకాంకికను విహంగ దృష్టితో మాత్రమే పరిశీలించినాను. ఈ ప్రక్రియ తెలుగులో ఏ విధంగా క్రమవికాసాన్ని పొందిందో, ఈ ప్రక్రియకున్న సాంకేతిక లక్షణాలను ఏ విధంగా విశ్లేషించారో నేనిక్కడ అంతగా తడుమలేదు. ప్రాజ్ఞులూ, భరతుని నాట్యశాస్త్రాన్ని సుగమమైన పద్ధతిలో తెలుగు వారికి అందించిన మనీషులూ, ఉత్తమ పరిశోధకులు, డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావుగారు వెలయించిన "తెలుగు నాటక వికాసం" అన్న సిద్ధాంత గ్రంథాన్నీ, ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు వ్రాసిన "సాహిత్య దర్శనము" చదివితే సవివరంగా ఏకాంకిక స్వరూప స్వభావాలు ఉద్గమ వికాసాల వివరాలు తెలిసివస్తాయి.

"నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనం".*

---

* యువభారతి ప్రచురణ 'నవ్య సాహితీ లహరి'లో ప్రచురితం. ముద్రణ: అక్టోబరు 1987.

33. సంప్రదాయోద్యమం—విమర్శ

సాహిత్య ప్రసరణంలో విమర్శకుని పాత్ర అత్యంత ప్రధానమైనది. కవి అందరి హృదయాల్లోకి చొగలుగుతాడు. నిజానికి కవి కూడా విమర్శకుడే. అయితే కవి తన విమర్శ పరిజ్ఞానాన్ని కవితా సృష్టికి ప్రేరకంగా, సాధనంగా ఉపయోగించుకుంటాడు. కవి, పండితుడు కావడం అభిలషణీయమే. పాండిత్యం లేని కవిత్వానికి ప్రామాణికత రాదు. అపండితుడైన కవి రచనల్లో పై మెరుగులే కనిపిస్తాయి ఆలోచిస్తున్న కొద్దీ, పరిశీలిస్తున్న కొద్దీ ఆ రచనల్లో మౌలికతగానీ, గాంభీర్యంకానీ; తాత్త్వికతగానీ కనిపించదు. ఈ గుణాల్లేని కవి వైతాళికుడు కాజాలడు. భావాన్ని కుదురుగా చెప్పే శక్తి, ఆత్మ ప్రత్యయంతో చెప్పేశక్తి, కల్పనను రమణీయంగా శ్రవణ సుభంగా చెప్పేశక్తి, ధ్వనిమంతంగా చెప్పే శక్తి పండితుడైన కవికే ఉంటుంది. విమర్శకుడు సత్కవులకు ఉండే శక్తులతో పరిచయం సంపాదించుకోవలసి ఉంటుంది. ఉత్తమ కవిత్వం పుట్టినప్పుడే ఉత్తమ విమర్శ పుట్టుకొస్తుంది. అయితే మన భారత దేశంలో అలనాటి నుంచి వస్తున్న కవిత్వమే లభ్యమైనది కాని దానికి తోడుగా పుట్టిన విమర్శ లభ్యం కాలేదు- కాలేదంటే ఈనాడున్న ప్రక్రియరూపంలో లభ్యం కాలేదన్న మాట. ఆధునిక కాలంలో, ఇతిహాసంలాగా, పురాణంలాగా, ఉదాహరణంలాగా, శతకం లాగా, నాటకంలాగా, నవలలాగా, కథలాగా విమర్శ ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా రూపుదిద్దుకొన్నది. అయితే కవితకు తోబుట్టువైన విమర్శ ఏ రూపంలో ఉండేది అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

ఏది కవిత్వం? కవిత్వానికి ప్రయోజనమేమి? కవి లక్షణాలేవి? కవిత్వాన్ని వింగడిస్తే శబ్దం, అలంకారం, ఛందస్సు, వ్యాకరణం వంటి ఎన్నో అంశాలను స్పృశించవలసి వస్తుంది. ఈ వింగడింపే సాహిత్య శాస్త్ర స్వరూపం. భారతదేశంలో అనాది కాలంనుంచి అంటే క్రీ॥ పూ॥ ఎనిమిదవ శతాబ్దంలో వెలువడిన భరతుని నాట్యశాస్త్రం నిన్న మొన్నటిదాకా మహోజ్జ్వలంగా వికసించిన సాహిత్య శాస్త్రానికి ప్రాతిపదిక. అయితే భరతుడు నాట్యశాస్త్ర రచన

చేసింది నాట్యాన్నీ, రూపకాలనూ ఉద్దేశించి. క్రమక్రమంగా నాట్యానికి సంబంధించిన రీతులూ, అలంకారాలూ, రసాలు సాహిత్యానికి అనువర్తింపబడినవి. అగ్ని పురాణంలో వామనుడు, దండి, భామహుడు, రాజశేఖరుడు, ఆనందవర్ధనుడు, రుద్రటుడు, అభినవగుప్తుడు, అప్పయ్య దీక్షితులు, జగన్నాథపండితరాయలు మున్నగువారి సాహిత్య శాస్త్ర రచనల్లో కావ్య స్వరూపాన్ని గూర్చి, కావ్యప్రయోజనాన్నిగూర్చి, కావ్యాత్మనుగూర్చి, అలంకారాలనుగూర్చి, రసమును గూర్చి, శబ్దార్థతత్త్వాలను గూర్చి, శబ్దార్థదోషాలను గూర్చి విశేషంగా చర్చలు కనిపిస్తాయి. కావ్యరచనకు సంబంధించిన అనేక అంశాలపై మనీషుల అభిప్రాయాలు ఆ సాహిత్య శాస్త్ర గ్రంథాల్లో శాస్త్రీయ దృక్పథంలో సాగినవి. తర్కక్షమంగా సాగినవి. ఒకరినిమించి ఒకరు కావ్యగత శతాంశాలను విశ్లేషించి సాహిత్య తత్త్వాన్ని లోకానికి అందజేసినారు. లక్షణాలను ఏర్పరచుకున్నారు. లక్ష్యాలుగా వాల్మీకి, వ్యాస, కాళిదాసాదుల కావ్యాలలోని శ్లోకాలను ఉదాహరించినారు. నూత్నాంశ గవేషణ, కవిత్వానికి సమున్నత ప్రమాణాలను ఏర్పరచాలనే మహత్వాకంక్ష ప్రతిభకూ, పాండిత్యానికీ మహనీయ ప్రయోజనాలను సమకూర్చాలనే ఉదాత్తాశయం ఆ సాహిత్యశాస్త్ర గ్రంథాల్లో భంగ్యంతరంగానూ, సూటిగాను ప్రకటించబడినవి.

సాహిత్యశాస్త్ర పరిధిలో ఆలోచించినప్పుడు మనకు ఈనాడు కనిపించే విమర్శ విచిత్రంగా కనిపిస్తుంది. భిన్నంగా కనిపిస్తుంది. మనం ఇంతవరకు ఏర్పరచుకున్న కొలతలకు అందనట్టుగా కనిపిస్తుంది.

సంప్రదాయ సిద్ధమైన విమర్శలో కావ్యానికే ప్రాధాన్యం, కవికి కాదు. కావ్యం దోషరహితంగా ఉందా లేదా? అన్నదే ముఖ్యాంశం. ఇప్పుడు మనం విమర్శను పరిశీలిస్తే వాటి విలువల సంగతిని చూడవలసివస్తుంది. ఆ దినాలలో వ్యాఖ్యానాలుండేవి. అవి నేటి విమర్శలో కొంత భాగాన్ని స్పృశించగలుగుతున్నవి. కవి ప్రయోగించిన శబ్దానికి అర్థమేమి? అది ఎంతవరకు సమంజసము? ఏదైనా ధర్మ రహస్యం దాగి ఉంటే ప్రమాణ పూర్వకంగా దాన్ని నిరూపించి వివరించడం శ్లోకమే అర్థంకానప్పుడు, కవి శబ్దపు ప్రయోగమే అర్థంకానప్పుడు కావ్య విమర్శకు పూనుకోవడం హాస్యాస్పదం. కనుక సంప్రదాయ సిద్ధమైన వ్యాఖ్యానాల్లో కావ్యాన్ని అవగాహన చేసుకోవడానికి అనివార్య

మైద పద్ధతులుండేవి అప్పటి కాలంలో రసచర్చకూ అలంకార చర్చకూ, గుణ దోష వివక్షతలకూ సాహిత్య శాస్త్రజ్ఞులు తమ పాండిత్యాన్ని వినియోగించుకునే వారు. సంప్రదాయ పరిరక్షణకూ, నిర్దుష్టమైన భాషా పద్ధతికీ, ఎంత కల్పనా సౌందర్యం ఉన్నా, ధర్మ పరిధులనుదాటి పోగూడదనే ధర్మాగ్రహానికి అ విమర్శ ఫునికి వచ్చింది. అలాంటి విమర్శ దేశాన్ని నిలబెట్టింది. సంప్రదాయాన్ని నిలబెట్టింది. కావ్య పరిమళాలకు శాశ్వతత్వం కల్పించగలిగింది కాళిదాసు, భారవి, మయూరుడు, చోరుడు, జగన్నాధుడు, మురారి, భవభూతి, దిఙ్నాగుడు, భాసుడు, మాఘుడు, ఆది శంకరులు మున్నగు మహాకవులు సంస్కృత భాషలో వెలయించిన కవితలన్నీ సంప్రదాయ సిద్ధమైన సాహిత్య విమర్శ ముమ్మరంగా జరుగుతున్న దినాలలోనివే. సాహిత్య వికాసానికి విమర్శ అవసరం అన్న అభియుక్తోక్తిలోని యథార్థ్యానికి నాటి సాహిత్య శాస్త్ర గ్రంథాలు చిరంజీవ ప్రమాణాలుగా నిలుస్తున్నవి.

కాళిదాసును కవిగా గుర్తించడానికి, అతని కవిత్వాన్ని విశ్లేషించడానికి నాటి ప్రమాణాలు సరిపోవు అనడం సమంజసం కాదు. సంస్కృతంలో వెలు వడిన సాహిత్య శాస్త్రాలను తలస్పర్శిగా అధ్యయనం చేసి వాటిపట్ల ప్రమాణ బుద్ధిని పెంచుకుని, అవి చూపిన వెలుగు దారుల్లో పయనించి ఉత్తమ కావ్య రచనలు చేసి నేటికిని మన తెలుగుకవిత ఉనికికి కారణభూతులౌతున్న నన్నయ్య, తిక్కన, పెద్దన, అన్నమయ్య, పోతన్న, రామరాజభూషణుడు, విశ్వనాథ మహా కవి ప్రభృతుల సాహిత్య వ్యక్తిత్వాలు వన్నెకెక్కినవే. వాసికెక్కినవే.

కావ్యం అర్థమయితే, కవి వ్యక్తిత్వాన్నీ, కవి విలక్షణతనూ, సమకాలిక ప్రజా జీవిత వృత్తంపై చేసిన ప్రభావాన్నీ అంచనా కట్టవచ్చు. నిన్నటి మొన్నటి తెలుగు కవులలో కొందరు సాహిత్య శాస్త్రాలను వెలయించిన వారు విన్నకోట పెద్దన, రామరాజభూషణుడు, అనంతామాత్యుడు, అప్పకవి మున్నగు తెలుగు ఆలంకారికులు తమ సాహిత్యశాస్త్ర పరిశీలనాన్ని సంస్కృతాలంకారికులు చిమ్మిన వెలుగుల్లోనే సాగించినారు. ప్రాయికంగా సంస్కృత సాహిత్య శాస్త్రాల్లోని సూత్రాలకూ, నిర్వచనాలకూ అనువాదాలుగానూ వ్యాఖ్యానాలుగానూ వెలసినవి.

ప్రాచీనాంధ్ర మహాకవులు కావ్య విమర్శకు సంబంధించిన తమ ఆలోచనలను పలువిధములుగా వ్యక్తం చేసినారు. తమ తమ కావ్యావతారికల్లో వ్యాస వాల్మీక్యాది సంస్కృత కవులను ప్రస్తుతిస్తున్నప్పుడూ, తెలుగు కవులను సంస్మరిస్తున్నప్పుడూ, కృతిభర్తల కృతికర్తలను ప్రశంసిస్తున్నప్పుడూ, కుకవినింద చేస్తున్నప్పుడూ, కావ్యప్రశస్తిని ఉగ్గడిస్తున్నప్పుడూ, ఇష్టదేవతాస్తుతి సందర్భంలో వాగ్దేవత సరస్వతిని సంశ్లోకిస్తున్నప్పుడూ కావ్య స్వరూపాన్నిగూర్చి, కావ్య ప్రయోజనాన్నిగూర్చి తమకున్న విశ్వాసాలనూ, తమకు ప్రీతిపాత్రమైన విలువలనూ, కావ్య సృష్టిపట్ల తమకున్న దృక్కోణాలనూ చమత్కార పేశలంగా ధ్వనిమంతగా, శ్లేషానుప్రాణితంగా హాస్యజల్పితంగా, శ్రవణసుభగంగా ప్రకటించుకున్నారు. కొందరు ప్రబంధకవులు కథాగతమైన పాత్రలతో ప్రసక్తానుప్రసక్తంగా కావ్యవిమర్శను పరిమళించే భావాలను విరజిమ్మినారు. పింగళి సూరన, చేమకూర వేంకటకవి వంటి ప్రబంధకర్తల కావ్యాల్లో మనకిలాంటి సందర్భాలు తటస్థిస్తాయి.

'లేఖక పాఠకోత్తములు' లేనిదే ఉత్తమ కావ్యరచన సాధ్యంకాదన్న పెద్దన తలపోత ఎంత అర్థగాంభీర్యాన్ని మూటగట్టుకొన్నదో! నాటి విద్వత్సభలు కావ్య విమర్శకు తావలములన్న రహస్యాన్ని నన్నయ్య చెప్పిన తీరును గమనించండి.

> పరమ వివేక సౌరభవిభాసిత సద్గుణ పుంజవారిజో
> త్కర రుచిరంబులై సకలగమ్య సుతీర్థములై మహామనో
> హరసుచరిత్ర పావన పయఃపూర్ణములైన సత్సభాం
> తర సరసీ వనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్.

"సూరి చేతోరుచిరాబ్జ బోధన రతుడ" ని వ్యాస మహర్షిని పొగడిన విధానంలోనే నన్నయ్య కవి వైతాళికుడనీ, పండితుల హృదయాలకు ఆహ్లాదాన్నీ, విజ్ఞానాన్ని కలిగించేవాడనీ ప్రబోధించి, కావ్య ప్రయోజనాన్ని ధ్వనింపజేసినాడు. నేటికీ ఇదే కావ్యప్రయోజనం. దీన్ని కాదన్నవాడు అభివృద్ధి నిరోధకుడే. భావ్యతారహితుడే. "కావ్యం యశసే అర్థకృతే, వ్యవహారవిదే శివేతరక్షతయే" అన్న మమ్మటుని సూక్తి కావ్య ప్రయోజనాన్ని ఎంతో పదిలంగా బోధిస్తున్నది.

మమ్మటుని సూక్తిలోని "అర్థకృతే, వ్యవహారవిదే, శివేతరక్షతయే" అన్న మాటలను జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది.

అర్థం అంటే కేవలం ధనం కాదు. ఐహిక జీవితానికి సంబంధించిన పరిజ్ఞానం. 'వ్యవహారవిదే' అంటే సంఘాన్ని పరిశీలించే శక్తి - సంఘాన్ని అర్థం చేసుకునే శక్తి - సంఘం పతనాభ్యున్నతులకు దారితీసే అనేకానేక కారణాలను అమూలాగ్రంగా అవగాహన చేసుకునే శక్తి-కావ్యపఠనంవల్ల చేకూరుతుంది. ఈ శబ్దానికి మమ్మటుని హృదయంలోని విస్తృతమైన, గంభీరమైన అర్థాన్ని అవగతం చేసుకోలేని పలువురు విమర్శక బ్రువులు 'సామాజికస్పృహ' అన్న సమాసాన్ని సృష్టించినారు. కవి లోకజ్ఞుడు కావాలన్న ఆశయంలోని అంతరార్థం మనస్సుకు తట్టితే 'సామాజిక స్పృహ' అన్న కొత్తమాట ఎంత పాతమాటో, ఇది అలనాటి కవులకు ఎంత ఉపాదేయంగా ఉండినదో తెలిసిపోతుంది. ప్రాచీనాలంకారికులందరూ లోకజ్ఞతకు అంటే సమకాలీన జీవితావగాహనకు ఎంతో ప్రాముఖ్యాన్ని ఇచ్చి పాటించినారు. 'శివేతరం' అంటే మంగళం కానిది, శుభం కానిది, సుందరం కానిది, సత్యం కానిది. ఏది సత్యం కాదో, ఏది ధర్మంకాదో అది అసుందరమైనది. నీతిబాహ్యమైనదన్నా, అమంగళకరమైనదన్నా ఒక్కటేనన్న ప్రత్యయం అలనాటి కవులకూ, ప్రజలకూ ఉంది. ఇప్పుడూ నిజమైన కవులకు ఉంటుంది. ఉత్తమమైన విలువలను దృష్టిలో పెట్టుకుని చేసే సాహిత్య పరిశీలనం సాహిత్యాశయాలకు అనుగుణంగా, ఉపబలకంగా పయనిస్తుంది.

సంఘానికి మార్గదర్శనం చేస్తాననీ, సంఘానికి మంచి ప్రపంచాన్నీ, మరో ప్రపంచాన్నీ ఎలుగెత్తి చాటేకవి, సంఘం పోకడలనూ సంఘం పూర్వాపరాలనూ, సంఘం అభిరుచులనూ, సంఘం ప్రయోగించే భాషా విన్యాసాలనూ సంఘానికి ప్రీతిపాత్రమైన తీరుతెన్నులనూ, సంఘంలో గూడు కట్టుకున్న మూఢ విశ్వాసాలనూ నిర్దుష్టంగా అర్థం చేసుకుని చక్కని భాషలో, శ్రవణపేయమైన భాషలో, చెప్పగలిగే పాండిత్యాన్ని సంపాదించుకోగలుగాలె. చక్కని అధ్యయనం, పరిశీలనం కవికి అవసరం. ఇదే వ్యుత్పత్తి. సంప్రదాయ సిద్ధమైన సాహిత్య విమర్శలో జన్మతః కవికి లభించే ప్రతిభతోపాటు ఈ వ్యుత్పత్తి అత్యంతావశ్యకం అన్న నమ్మకానికి గట్టి పునాది ఉంది.

పరమాత్మకూ, ఋషికీ ఉన్నస్థానం ప్రాచీనాలంకారికులు కవికి కల్పించి కవికి ఎనలేని బాధ్యతను అప్పగించినారు. తాత్కాలికమైన ఉద్రేకానికి లోబడి చెప్పిన భావాలను వాళ్ళు కావ్యపరిధిలోనికి తీసికొనిరాలేదు. కవిత్వం ఆవేశం వల్లనే పుట్టుకొస్తుందనే నేటి అభిప్రాయం వాళ్ళకు లేకపోలేదు. ఐతే ఆవేశంలో అన్నమాట నిలకడగా విచారిస్తే, శాంతచిత్తతతో విచారిస్తే యథార్థం కావాలె. మంగళకరం కావాలె. అప్పుడే దానికి కవితా సంకేతం. వ్యాసుడు 'విద్వత్సంస్తవనీయభవ్య కవితావేశు'డట. కవితావేశం విద్వాంసుల మెప్పును పొందగలుగాలె. భవ్యమైన ఆవేశానికి ఫలితం కావలె. Poetry is the Spontanious overflow of Powerful feelings; recollected in tranquility అన్న ఆంగ్లమహాకవి, తాత్త్వికుడూ అయిన వర్డ్స్‌వర్త్ అభిప్రాయంలో ఈ సత్యమే ధ్వనిస్తున్నది.*

* రంజని రజతోత్సవ సంచిక 'రజతరంజని' లో ప్రచురితం. ముద్రణ 1988.

34. దాశరథి రచనలు :
ఉర్దూ కవితారీతులు

ప్రాచీనార్వాచీన కవితారీతులకు సంగమ స్థలం దాశరథి కవితా వ్యక్తిత్వం. ప్రాచీన కవులకున్న ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాలు పుష్కలంగా సంపాదించుకున్న వ్యక్తి దాశరథి. పురాభారతీయ సాహిత్య శాస్త్ర సిద్ధాంతాలను అధునాతన కవితాలక్షణాలను అవగతం చేసుకున్న కవి దాశరథి. తెలుగు సంస్కృతంతో పాటు ఆయన ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషా సాహిత్యాలతో అతిమాత్రంగా అభినివేశం పెంచుకున్న మనీషి. ఇప్పటి కవులలో పలువురివలె ఆయనకు తెలుగు మాత్రమే వస్తుందనుకొనవలసిన అగత్యంలేదు. సంప్రదాయ సిద్ధంగా సంస్కృతాంధ్రాలను అధ్యయనం చేసిన కవిపండితుల కంటె అధునాతన భారతీయ భాషలతో ఇంగ్లీషుతో పరిచయమున్న కవిపండితుల దృక్పథం విశాలంగా ఉండటానికి అవకాశం ఉంది. ఈ వైశాల్యం సమైక్య శక్తులకు దోహదం కలిగించటానికి ఉపయోగపడుతుంది. తన మాతృభాష మాత్రమే తెలిసినవాని చూపులూ తలపులూ ఏర్పరచుకునే ఎల్లలు కవిత్వానికే అవరోధాలవుతాయి. కనుకనే మన ప్రాచీన భారతీయులు చతుష్షష్టి కళలను పేర్కొంటూ, తన మాతృభాష కాక నాలుగైదు ఇతర భాషలు నేర్చుకోవడం కూడా ఒక కళ అనీ, రాజులూ పండితులూ మంత్రులూ కవులూ దండనాథులూ బహుభాషా పరిచయం సంపాదించుకోవాలనీ నిర్దేశించినారు.

నన్నయ్య నుంచి నేటివరకున్న వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో ప్రయోగశీలురు - అంటే నూత్నమార్గ ప్రవర్తకులు కొందరే ఉన్నారు. నన్నయ్య, పాలకురికి సోమనాథుడు, శ్రీనాథుడు, పెద్దన, సూరన, కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, దాశరథి, నారాయణరెడ్డి వంటి మనీషులు కొత్తకొత్త సాహిత్య ప్రక్రియలకు, విశేషించి కావ్య ప్రక్రియలకు నారువోసి ప్రోదిచేసి సిరువోసి పెంచి మించు పంటళ్లపైకి ఎక్కించినారు. తామరతంపరగా అనుయాయులను సంపాదించుకున్నారు. తనకంటే పూర్వమున్న సాహితీ ఫణితులను అనేక దృక్కోణాలతో

అధ్యయనం చేసి పరిశీలించ గలిగినవాడే ప్రయోక్త కాగలుగుతాడు. ప్రయోక్త ప్రతిపాదించి ప్రదర్శించిన కొత్తరీతి విమర్శకుల అవహేళనకు పాలుకాకుండా ఉండాలంటే, అది అన్నివిధాలా ప్రాచీన మర్యాదలకంటే భిన్నంగా ఉండడమే కాదు, అస్వాదనీయంగా ఉండాలి. లేకపోతే పాతది రోత అనీ కొత్తది వింత అనీ కొత్తరీతికి చెల్లుబాటు కలుగకుండాపోయే ప్రమాదముంది.

ఇంగ్లీషు భాషా సాహిత్యాలతో పరిచయం సంపాదించిన కందుకూరి కొత్త ప్రక్రియలను చేపట్టినట్టే ఉర్దూ భాషా సాహిత్యాలలో కూలంకషమైన వైదుష్యాన్ని సంపాదించుకున్న దాశరథి ఉర్దూలోని కథా పరిమళాలనూ నవలల అంద చందాలనూ కావ్యాలలో నిక్షిప్తమై ఉన్న ధ్వని మర్యాదలనూ తాత్త్విక రహస్యాలనూ తెలుగువారికి తెలుగు ఛందస్సుల్లో అందించి తృప్తిపడలేదు. ప్రయోగశీలి కాకపోతే దాశరథి ప్రతిభ ఈ అనువాదాలతోనే ఆగిపోయి ఉండేది. ఉర్దూ తెలుగు భాషలతో చక్కని పరిచయమున్న ఎవరైనా ఈ అనువాదాలను చేసి ఉండేవారు. అయితే దాశరథి అనువాదాలలోని వైశిష్ట్యాన్ని నేను ఈ వ్యాసంలో తరువాత వివరిస్తాను.

గద్య ప్రక్రియల అనువాదం మాట ఎలా ఉన్నా ఛందోబద్ధంగా ఉన్న ప్రక్రియలను అనువదించటానికి కేవలం భాషా పాండిత్యమే పనికిరాదు. ఆ రెండు భాషలకు సహజంగా ఉన్న సంగీతాత్మకమైన భాషా ఫణితులను తెలుసుకోవలసి ఉంటుంది. తన భాషలో ఛందోబద్ధంగా పద్యరచన చేయజాలని వాడు మరో భాషలోని ఛందస్సులను లేదా మరో భాషలోని ఛందోబద్ధమైన భావాలను తన భాషలోనికి అవతరింపజేయలేడు. రవీంద్రుని గీతాంజలిని ఎందరో తెలుగు కవులు గద్యంలో అందించినారు. పాఠకులకు రవీంద్రుని గీతాంజలి కనపడీ కనపడనట్లుగా తెలిసీ తెలియనట్లుగా అందీ అందనట్లుగా ఉండిపోయింది. కాని ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు రవీంద్రుని గీతాంజలిని సంస్కృతంలో మందాక్రాంత వృత్తాల్లో నడిపించి రసరాణ్మండలి కతజ్ఞతలకు పాత్రులు కాగలిగి నారు. కారణం? —శ్రీరామచంద్రుడు గారు తమ మాతృభాష తెలుగులోను తాము అత్యంతాభినివేశం సంపాదించుకున్న సంస్కృతంలోను శక్తిమంతమైన కవిత్వం వ్రాయగలిగిన ప్రతిభామూర్తులు. రవీంద్రుడు గానం చేసిన గీతాలు

మన భాషలో రాగహీనంగా లయ తాళ రహితంగా రావడం నా కెందుకో, హర్షదాయకంగా లేదు. భావానికి సంగీతం అల్లుకుపోయినపుడు దానికి రెక్కలు మొలిచి ఉడ్డీనానికి సమర్థమవుతుంది. సంగీతాత్మకత లేని భావంలో కవిత్వాంశం ఉంటుందనడానికి సందేహించవలసిన అవసరం లేదు కాని, సంగీతహీనమైన భావం మాత్రం సమగ్రకవిత్వం కాదు. తెలుగులో కవిత్రయాన్నీ, భాగవతాన్నీ, శతక సాహితినీ పదసాహిత్యాన్నీ దిఙ్మాత్రంగానైనా అధ్యయనం చేయనివానికి ఈ ఛందోరహస్యం బోధపడదు. దాశరథికి ఏభావాన్నైనా తెలుగు ఛందస్సుల్లో అందించగలిగి సామర్థ్యం చిరతరాభ్యస్తం. తనకు గలిగిన భావాలను అభివ్యక్తం చేయడానికి పూనుకున్నప్పుడు - అందులోనూ ఛందోబద్ధంగా చెప్పడానికి పూనుకున్నప్పుడు ఛందోబంధాలెన్నడూ అడ్డు తగులలేదు. ఈ విషయంలోనే ఇతర అభ్యుదయకవుల కంటె దాశరథికి వైశిష్ట్యం ఉన్నది. అభ్యుదయభావాన్ని అభివ్యక్తం చేయడానికి ఛందస్సును నిరసించవలసిన అగత్యంకానీ, నిరాకరించవలసిన అవసరం కానీ లేదని దాశరథి కవిత్వం నిరూపించగలిగింది. అనువాదంలో కూడా స్వీయప్రతిభను ప్రకటించగలిగిన శక్తి అలనాటి తెలుగుకవుల తరువాత తెలుగు సాహితిలో దాశరథిలోనే పుష్కలంగా కనిపిస్తున్నదనడంలో అత్యుక్తి గానీ, సాహసం గానీ లేదని అభిప్రాయపడుతున్నాను. ఉర్దూ కవితలకు దాశరథి చేసిన తెలుగు అనువాదాలను పరిశీలించడానికి పూనుకున్నవారు ఉర్దూ భాషలో కూడా అభినివేశాన్ని సంపాదించవలసి ఉంటుంది. సంస్కృత భాషా సాహిత్యాలతో చక్కని పరిచయం లేనివారు ప్రాచీనాంధ్రకవుల తెలుగుసేతలను సమగ్రంగా విశ్లేషించలేరన్న యాథార్థ్యాన్ని ఏ బుద్ధిమంతుడూ కాదనలేడు. దాశరథి కేవలం అనువాదకుడు కాడు. చక్కని అనువాదంలో భాష మాత్రమే మార్పుకు లోనుకాదు; భావం కూడా జాతీయతను పులుముకుని ప్రత్యక్షమవుతుంది. ఇక ఛందోబద్ధంగా అనువాదం సాగితే జాతీయమైన ఛందోవపనాలు కట్టుకుని కట్టెదుట నిలుస్తుంది.

ఇతర భాషలలోని ఛందస్సులను తెలుగులోకి తీసికొని వచ్చిన ప్రయోక్తలు దాశరథి కంటె పూర్వమున్న మాట నిజమే. కడచిన శతాబ్దంలో కొట్టే కృష్ణమూర్తి శాస్త్రిగారు హిందీలోని తులసీ రామాయణానికి తెలుగు వేషం వేసినారు. తులసీదాసు హిందీ ఛందస్సులు - చౌపాయీలు, దోహాలు తెలుగులోకి వచ్చినవి. హిందీలోని మాత్రాచ్ఛందస్సులివి. అయితే హిందీలో లేక తెలుగులోని

యతిప్రాసలు గూడ పలుతావుల్లో ఈ హిందీ ఛందస్సులతో చేరి కొత్త అందాలను సంతరించుకున్నవి. ఇలాంటి ప్రయోగాన్ని చేసి కృతకృత్యులైన తెలుగు కవులు అరుదే.

దాశరథి ఉర్దూ కావ్యప్రక్రియలను తెలుగులోకి ప్రవేశపెట్టవలసి వచ్చినప్పుడు, సంప్రదాయసిద్ధమైన తెలుగు ఛందస్సులనే - అంటే - ఆటవెలది, తేటగీతి, ద్విపదలను ఊతగా తీసుకున్నారు. కాని తెలుగులో మౌలికంగా తాను రుబాయీలను, గజళ్ళను వెలయించినప్పుడు మాత్రం ఉర్దూ ఛందఃప్రక్రియలనే ప్రయోగించినాడు. ఒక భాషలోని కవితలను అవి ఉన్న ఛందస్సులలోనే తెలుగులో ప్రకటించాలనుకున్నప్పుడు కొంత కృత్రిమత, అనావశ్యకమైన పదజాలం చోటు చేసుకోవడానికి అవకాశముంటుంది. అప్పుడు మూలంలోని భావం సుసంగతంగా వ్యక్తమయ్యే అవకాశాలు తక్కువ. కనుకనే గాలిబ్, మీర్, సౌదా, ఇన్షా వంటి ఉర్దూ మహాకవుల మహోన్నతములయిన, సుందరములయిన, ధ్వనిమంతములయిన, ఉక్తివైచిత్రీసముపేతములయిన, అచుంబితములయిన భావాలను తెలుగు సహృదయులకు యథాతథంగా అందించాలన్న తపనతో దాశరథి ఉర్దూమూలంలోని ఛందస్సుల జోలికిపోక తెలుగు ఛందస్సులను ఆశ్రయించినాడు.

ఉర్దూ కవితాపరిమళాలను తెలుగు రసికలోకానికి అందించాలన్న దాశరథి ఆకాంక్ష మూడు దశల్లో ప్రజ్వలించింది. మొదటి దశలో అతడు కేవలం ఉర్దూ కవితలను తెలుగు ఛందస్సులలో పొదిగి అందించినాడు. రెండవ దశలో ఉర్దూలోని కొన్ని ప్రసిద్ధ ముక్తకాలను తెలుగులోనికి దింపినాడు. మూడవ దశలో ఉర్దూ ఛందస్సులను ఆలంబనంగా తీసుకుని సొంత రచనలు చేసినాడు. ఈ దశలో సహృదయులకు అతడు మరింత దగ్గరకు రాగలిగినాడు. ఉర్దూలో ఏముందో దాశరథి ఎంతవరకు న్యాయం చేసినాడో అన్న విచికిత్సకు సహృదయులు గురికావలసిన అగత్యం లేకపోయింది. సభల్లో, వేదికల్లో దాశరథి గళమెత్తి గజళ్ళను గానం చేసినప్పుడు, రుబాయీలను వినిపించినప్పుడు శ్రోతృకదంబం ఆనందంతో శిరఃకంపనం చేసింది. ఉర్దూలో ముషాయిరాలను (కవిసమ్మేళనాలను) సందర్శిస్తే తెలుస్తుంది - ఈ ఉర్దూ కావ్యప్రక్రియల సుందర విన్యాసం. తెలుగులో సుదీర్ఘమైన సీసపద్యం లేదా శార్దూల మత్తేభాలు మొత్తం

విన్నతరువాతగాని అంతు తెలియదు. అయితే ఆటవెలదులూ, తేటగీతులూ, ద్విపదలూ, ముత్యాలశరాలూ వంటి చిట్టిఛందస్సులు వెంటనే భావాన్ని వ్యక్తం చేయలేవా? ఉర్దూ పద్యాలకే సంక్షిప్తత పరిమితమా? అన్న ప్రశ్న ఉదయించ వచ్చు. కానీ వేమన్నవలె ఆటవెలదిని ఆడించగలిగినవారు తెలుగులో ఎందరు? మూడు పాదాలలో ముచ్చటగా సమగ్రభావాన్ని అందించగలవారెందరు? నాలుగు పాదాలను కలిపి ఒక్క సమాసంలో బిగించి అన్వయకాఠిన్యాన్ని కలిగించే కవులే ఎక్కువ. వెంటనే సూటిగా భావాన్ని సంక్షిప్తంగా అందించే గుణం స్వతస్సిద్ధంగా ఉర్దూ ఛందస్సులకు ఉంది. ఉర్దూ పద్యం అంటే- షేర్‌కు రెండు పాదాలు అంటే - మిశ్రాలు ఉంటాయి. ఒక మిశ్రాలో సగం భావం అయిపోతుంది. రెండవ మిశ్రాలో చివరగా నిలిచే ప్రాస ఎంత అందంగా అతుకుతుందో ఎంత కుదింపును కుదిరించుకుంటుందో శ్రోతలు ఉత్కంఠతో ప్రతీక్షిస్తారు. ఆ ఒక్క మాట-అంటే-ప్రాస కవినోటినుండి వెలువడగానే సాధువాదనాదాలు చెలరేగు తాయి. ఉర్దూతో చక్కని చిక్కని అభినివేశం సంపాదించుకున్న దాశరథికి ఈ రహస్యం తెలసింది. కనుకనే అతని ప్రయోగం ఫలించింది. "Brevity is the soul of wit" అన్న అభియుక్తోక్తికి ఉర్దూ ఛందస్సులు బాస టగా నిలుస్తాయి.

ఉర్దూ కావ్యప్రక్రియ లన్నింటిలో గజల్ రుబాయీలు ఇంచుమించు ముక్తక జాతికి చెందినవి. గజల్ అనే మాట అరబ్బీ భాషలోనిది. అరబ్బీ ఛందస్సు కూడా. గజల్ అనే మాటకు అర్థం కాంతతో సల్లాపం. అంటే గజల్‌లో ప్రణయకవితకే ప్రాధాన్యం. కానీ క్రమంగా గజల్‌లో వ్యక్తం కాని అభిప్రాయమే లోకంలో లేదన్న భావం బలపడిపోయింది. గజల్‌లో ఐదు షేర్లు ఉంటాయి లేక ఏడుంటాయి. లేక పదమూడుంటాయి వీటి సంఖ్య 31 దాకా పెరిగిన సందర్భాలు లేకపోలేదు. గజల్‌లోని ప్రతి షేర్‌లో ఒక భావం నిక్షిప్తమయి ఉంటుంది. ఈ విధంగా గజల్ భావవైవిధ్యానికి మనికి పట్టయి వెలుగు తుంది. షేర్‌లోని చివరిపదం అంటే - అంత్యప్రాస అన్ని పంక్తుల్లోనూ ఒకటి గానే ఉంటుంది. గజల్ మొదటి షేర్‌ను మత్లా అనీ, చివరి షేర్‌ను మక్తా అనీ అంటారు. ప్రాయికంగా మక్తాలోనే కవినామం అంటే - తఖల్లుస్ పొందుపరచ బడుతుంది. షేర్లసంఖ్యా ప్రాసనియతీ తప్ప ఏ బంధాలూలేని గజల్‌లో ఎన్ని

భావాలనైనా చెప్పవచ్చు. ఒక షేర్‌లోని భావానికీ మరో షేర్‌లోని భావానికీ సంబంధం ఉండాలన్న నిర్బంధం ఏమీ లేకపోవడం అటుంచి, ఎంత స్వతంత్రంగా ఉంటే అంత ప్రాచుర్యాన్ని అందుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఈ స్వేచ్ఛ కవులకెంతో ఉపకరిస్తుంది. ఇప్పుడు ఉర్దూ కవులు గజళ్ళలోనే కవితలు విశేషంగా వెలయిస్తున్నారు. అసలు కవితకు పర్యాయ పదమే గజల్ అన్న అభిప్రాయం నానాటికీ బలపడుపోతున్నది. ఉర్దూ సాహితీలోకంలో ఇప్పుడు ఉర్దూ గజల్‌లో ప్రణయం, ప్రణయంతో పాటు సమకాలిక సాంఘిక సమస్యలు, అధిక్షేపం, దేశభక్తి, ఆత్మాశ్రయ భావశబలత, హాస్యం - ఇంకా ఇంకా ఎన్నో మరెన్నో అంశాలు కవితాత్మకంగా వెలువడుతున్నవి. ఉర్దూ కవులు గజల్‌ను ఆశ్రయించి కృతకృత్యులైనట్లే దాశరథి సమకాలిక సమస్యలను అధిక్షేపయుక్తంగా చమత్కారపేశలంగా గంభీరభావ సముపేతంగా వ్రాయడం ప్రారంభించి తెలుగులో ఒక కొత్త ప్రక్రియకు అంకురార్పణ చేసి దోహదం కల్పించగలిగినాడు.

ఇక రుబాయీ సంగతి తీసుకుంటే దాశరథి ప్రయోగశీలత మరింత ప్రస్ఫుటమవుతుంది. రుబాయీ అరబ్బీ పారసీ ఉర్దూ భాషలలో అతి ప్రచురమైన ఛందం. శక్తిమంతమైన ముక్తకం. ఇందులో నాలుగే పాదాలు. ఒక్క మూడవ పాదం తప్ప మిగిలిన మూడు పాదాలలో ప్రాస నియమం ఉంటుంది. మూడవ పాదంలోనో నాలుగవ పాదంలోనో కవినామం ఉన్న రుబాయీల సంఖ్య ఎక్కువే. ఉమర్‌ఖయ్యాం రుబాయీలను ఫిట్స్ జెరాల్డ్ ఇంగ్లీషులోనికి అనువదించి రుబాయీ ప్రక్రియకున్న ప్రాముఖ్యానికి విశ్వవ్యాప్తిని కలిగించగలిగినాడు. అయితే భారతీయభాషలలో ఉర్దూ తప్ప మరేభాషలోనూ రుబాయీలు ఒదిగిన సందర్భాలు అంతగా లేవు - ఒక్క తెలుగులో తప్ప. ఫారసీభాషలో అత్యంతాభినివేశం సంపాదించుకున్న దువ్వూరి రామిరెడ్డి ఖయ్యాం రుబాయీలను తెలుగు వృత్తాల్లో అనితర సాధ్యంగా అతి సుందరంగా అందించినారే గాని. రుబాయీ ఛందస్సుతో పొత్తుపెట్టుకోలేదు. అమ్జద్ హైదరాబాదీ రుబాయీలను శ్రీ సదాశివగారు తెలుగుచేసిన సందర్భం ఒకటి ఉన్నది. కాని ఆయన అంత్య ప్రాస నియమాన్ని పాటిస్తూ తేటగీతాలుగానో ఆటవెలదులుగానో రుబాయీలకు తెలుగు అనువాదం వెలయించినారే గాని, ఉర్దూలోని బిగువునూ సంక్షిప్త

తనూ ఊపునూ తేలేకపోయినారు. అయితే భావానికి మాత్రం మంచి అనువాదం వచ్చిందనే చెప్పవలసివస్తుంది. తన భాషలో సహజకవి అయిన దాశరథి ఉర్దూ రుబాయీ ఊపును తెలుగులోకి తెచ్చి చరితార్థుడైనాడు.

కొన్ని గజల్ పంక్తులను, కొన్ని రుబాయీలను దాశరధి కవితాలత నుంచి దూసి చూపిస్తాను. పరిమళాలను అనుభవించండి.

"దానవుని దీనబాంధవుడనుకున్నావు
దగాపడితిమని నేడు తపనపడనేల?
... ...
కనరాని దైవము కనులలో ఉండగా
కనిపించలేదని మధనపడనేల?"

"రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడిచిరానా
నీ చిన్ని నవ్వుకోసం స్వర్గాలు గడిచిరానా
ఏడేడు సాగరాలు ఎన్నెన్నో పర్వతాలు
ఎంతెంత దూరమైనా బ్రతుకంత నడచిరానా"

"వేగుచుక్కను నిద్రలేపీ విద్యనేర్పే కోర్కెతో
వీణ తీగను మీటబోయే చెలినఖాగ్రము నా పతా
... ...
విప్లవము వర్ధిల్లువేళల వీరవర్యుల కనులలో
ధగధగాయిత నవదవానల కీలికాగ్రము నా పతా"

"కలహాలతో విడిపోవుట విరహాలతో వసివాడుట
మరునాడు చెంతకు చేరుట అవి నీ కుజ్ఞాపకమున్నవా
... ...
ఒకనాడు హృదయము మారుట పగబూని 'శరధి'ని దూరుట
పగవాని ఇంటికి చేరుట అవి నీకు జ్ఞాపకమున్నవా"

గాలిబ్ కవిత్వంలోని భారతీయేతర వాతావరణాన్ని భారతీయ వాతావరణానికి అనుగుణంగా మలచడంలో దాశరథి తన ప్రత్యేకతను ప్రదర్శించిన ఒక సందర్భాన్ని తిలకించండి.

"ఏడి మాంధాత పురుకుత్సుదేడినేడు?" ఈ పంక్తిలో-బహ్‌రాం, జంషీద్ అనే సుప్రసిద్ధులైన పర్షియా ప్రభువులు మాంధాత పురుకుత్సులైనారు. బహు భాషావేత్తలూ సారస్వతోద్యమాగ్రేసరులూ శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు దాశరథి అనువాద సరణిని గూర్చి ప్రస్తుతిస్తూ అన్న మాటలు దాశరథి ప్రతిభ కెత్తిన వైజయంతికలు. 'గాలిబ్ గీతాలు' అన్న దాశరథి కావ్యానికి అవతారికా తిలకం దిద్దుతూ శ్రీ రామానుజారావుగారు—

"పూర్వజన్మలో దాశరథియే గాలిబేమో! లేక ఈ జన్మలో గాలిబే దాశరథియై అవతరించెనేమో!!" అని అన్నారు.

గాలిబ్ గజళ్ళను యథాతథంగా దాశరథి అనువదించలేదు. గాలిబ్ గజళ్ళలోని కొన్ని పంక్తులను తీసుకుని తెలుగుచేశాడు.

ఇక రుబాయీలను దాశరథి శతాధికంగా వెలయించినాడు. ఉదాహరణకు కొన్ని—

"గుసగుసలే సరిగమలై వినిపిస్తాయి
అమవసలే పున్నమలై కనిపిస్తాయి
తొలిరాతిరి చెలిచెంతకు చేరిందంటే
చీకటిలో స్వర్గాలే కనిపిస్తాయి."

"వయసులాగ కాంతికూడ వెళిపోతుంది
కమ్మనైన కథ కంచికి వెళిపోతుంది
ఎంత దారుణం దాశరథీ! ఈ లోకంలో
నరరుధిరమె నరునికి మధువైపోతుంది"

"ఆరబోని దివ్వె నీవు వెలిగించాలి
వాడబోని తోట నీవు మొలిపించాలి
జాతికొరకు నీ తనువును అర్పించేసి
చావును నీ బ్రతుకునుండి తొలగించాలి"

"ప్రతి వారికి కావాలి రూపాయీలు
మరి యెవ్వరు మెచ్చుతారు రుబాయీలు?
రసలుబ్ధులు లేకపోరు ఈ లోకంలో
వారి మన్ననలు నాకు కోటి తురాయీలు"

"పువ్వుతోటి వజ్రమైన తెగిపోతుంది
పాటతోటి శిలయైన కరిగిపోతుంది
'శరధి' వ్రాయు నవ్య కవిత కత్తి కాదుగా?
మరి ఎందుకొరకు గుండెలోకి దిగిపోతుంది?"

సూక్తులను చెప్పడానికీ, ఊపుతో చెప్పడానికీ, సంక్షిప్తంగా చెప్పడానికీ ఒకే ఒక్క భావాన్ని సమగ్రంగా చెప్పడానికీ రుబాయీ చక్కగా ఉపయోగ పడుతుంది. కవి సమ్మేళనాలలో అప్పటకప్పుడే శ్రోతలను ఆకట్టుకుంటుంది రుబాయీ. ఛందస్సు అందాలతో పరిచయం కలిగించడానికి రుబాయీ చక్కని సాధనం. కేవలం నాలుగు పంక్తులూ అంత్య ప్రాసలూ రుబాయీ కాదు. అభి వ్యక్తీకరణంలో ఇంపు సొంపులు, ఝటితి స్ఫూర్తిగా కల్పనాతటిల్లతను సంద ర్శింపజేయగలిగే శబ్దశక్తి అవసరం. బహు భాషలు నేర్చిన దాశరథికి, స్వభావతః కవియైన దాశరథికి, చమత్కార సంభాషియైన దాశరథికి రుబాయీ కవితాప్రాచుర్యానికి బాగా తోడ్పడింది. ప్రయోగశీలి దాశరథి ఉర్దూ నేర్చు కున్నందుకు తన కవితాలవాలంలో తెలుగు కావ్య మల్లికావల్లికలతో పాటు గజల్, రుబాయీల గులాబీలను పూయించి కొత్త అందాలను సవదరించి పరో క్షంగా జాతీయ సమైక్య భావానికి మారాకు హత్తి చరితార్థుడైనాడు.

---

* ఈ వ్యాసం ప్రత్యేక సంచిక కోసం 15.8.1988 నాడు రచింపబడింది. ముద్రణ కాలేదు.

35. తెలుగు అభివృద్ధికి భాషా సాహిత్య సంస్థల కృషి

పుష్ప పరిమళం వ్యాప్తిచెందనిదే సార్థకత లేదు. ఆశయం ఉదాత్తమైనా ప్రజాబాహుళ్యానికి అది అవగతమై-దానివల్ల శ్రేయస్సు, వికాసం కలుగుతాయనే నమ్మకం ఏర్పడినప్పుడే అన్ని వైపులనుంచి సహకార వీచికలు వీచి, ఆశయానికి సాఫల్యాన్ని చేకూరుస్తాయి.

ప్రతిభాసముపేతుడైన వ్యక్తి తన సామర్థ్యాన్ని తన కోసమే వినియోగించుకోవాలనుకుంటే అతని ప్రతిభ పరిమితంగానే వికసిస్తుంది. కాని తన ప్రతిభాజన్యమైన సాహితికిగాని, ప్రజ్ఞకుగాని సామాజికాభ్యుదయమే లక్ష్యమని భావించినప్పుడు ఆ వ్యక్తి కృషితీరే మారుతుంది. తనవంటి భావాలు కలిగిన వాళ్ళను ఏకత్రితం చేసి సంఘోన్నతికే పాటుపడి చరితార్థుడౌతాడు. తన భావాలకు ఇతోధికమైన ప్రాచుర్యం సాఫల్యం కలగాలన్న తపన ఉద్యమరూపాన్ని తాలుస్తుంది. దేశంలో అన్ని రంగాలలోను నేతృత్వాలు వహించి, నలుగురిని కూడగట్టుకొని చరిత్రగతినే మార్చివేసిన మనీషులూ, మేధావులు ఉన్నారు. నిజానికి ఈ మనీషుల జీవితచరిత్ర దేశచరిత్రగా రూపుదిద్దుకున్నది.

భాషా వికసనం కోసం సాహిత్యాభ్యుదయం కోసం పాటుపడిన, పాటుబడుతున్న కొన్ని ప్రముఖమైన సంస్థలను గూర్చి ఈ దేశ విబుధజనుల వలన విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేటపరిచే ప్రయత్నం చేస్తాను.

గత శతాబ్దంలో ఆంధ్ర ప్రజావళిని పరిపాలించిన వాళ్ళు స్థూలంగా ఇద్దరే. ఒకరు ఆంగ్లేయులు; రెండవవారు నిజాం సంస్థానం. 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం వల్ల ఆశించిన ఫలితాలు భారతీయులకు లభించలేదు. ఈస్టిండియా కంపెనీ పరిపాలన అంతమొంది భారతదేశం బ్రిటిష్ సార్వభౌమాధికారం కిందికి వచ్చింది. భారతదేశంలోని చాలా భాగాలు నేరుగా బ్రిటిష్ వాళ్ళు పరిపాలనకిందికి,

కొన్ని స్వదేశీ సంస్థానాలు పరోక్షంగా బ్రిటిషువాళ్ళ పాలనకిందికి వచ్చినవి. స్వదేశీ సంస్థానమైన హైద్రాబాదులో తెలంగాణా ప్రాంతంలో కొందరు తెలుగువాళ్ళు, బ్రిటిష్ ప్రాంతంలో మిగిలిన తెలుగువాళ్ళందరూ ఉండిపోయినారు. ఇంగ్లీషు నిర్బంధ భాషగ పాఠశాలల్లో ప్రవేశపెట్టబడింది. దేశభాషలకూ సంస్కృతానికీ నిజాం ప్రభువుగానీ, బ్రిటిష్ పాలకులుగానీ దోహాదం కలిగించాలన్న విధానాన్ని అవలంబించినారు కాదు. తమ భాషనూ తమ సంస్కృతినీ కాదన్న ప్రభుత్వాలకు ఎదురు తిరగడంతో స్వాతంత్ర్యోద్యమం విజృంభించింది. స్వాతంత్ర్యోద్యమానికి పునాది స్వేచ్ఛ - విశేషించి రాజకీయస్వేచ్ఛ, ఆర్థికస్వేచ్ఛ కనుక రాజకీయోద్యమం ప్రభుత్వ దమననీతిని ఎదిరిస్తూ నానాటికి బలపడింది. స్వాతంత్ర్యోద్యమానికి అంతర్వాహినిగా ప్రవహించిందొక నిర్మాణాత్మక భావస్రవంతి. ప్రభుత్వంతో కలహప్రసక్తి లేకుండా, రాజకీయాలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా ప్రజల్లో జాతీయతను భాషాప్రియత్వాన్నీ సంస్కృతి పరిరక్షణాసక్తినీ పెంపొందించాలన్న మహదాకాంక్షలతో కొందరు మహాపురుషులు భాషా సాహిత్య - ఐతిహాసిక సంఘసంస్కరణలు వంటి ఉదారాశయాలను ప్రజాబాహుళ్యంలో వ్యాపింపజేయాలని సమకట్టి తమ వైయక్తిక ప్రతిభాసామర్థ్యాలను వినియోగించి అనుయాయులను సంపాదించుకొని ఎనలేని సేవలను దేశప్రజలకు అందించగలిగినారు. సంస్థలు స్థాపించి పురావైభవాన్ని వెలికితీసి ఉత్తమ సాహిత్యాన్ని ప్రచురించి, మనీషివతంసులను సమ్మానించి, మహాజన సభలను ఏర్పాటు చేసి, భాషకూ సంస్కృతికీ నష్టం కలిగిస్తున్న ధోరణులను అరికట్టాలని ప్రభుత్వానికి మహజర్లను సమర్పించి ఒక అపూర్వ చైతన్య స్రవంతిని దేశీయుల హృదయ క్షేత్రాలలో ప్రవహింపజేయ గలిగినారు. నేను ఈ ప్రసంగంలో కేవలం భాషా సాహిత్య వికాసానికి తోడ్పడిన సంస్థల గూర్చి పరామర్శిస్తాను.

ఈ సందర్భంలో ఒక అంశాన్ని స్పష్టపరచవలసిన అగత్యమున్నది. యావదాంధ్రదేశాన్ని కార్యక్షేత్రంగా గ్రహించి ఉద్యమించిన సంస్థలను మాత్రమే ఈ ప్రసంగపరిధిలోకి తీసుకొనివస్తాను.

భాషాసాహిత్యాలకు సంబంధించిన కొన్ని ఉద్యమాలు, సంస్థలు తాత్కాలికంగా విజృంభించి చరిత్రగతమైపోయినవి. సాహిత్య సంస్థల కృషిని విపులంగా చర్చించవలసి వచ్చినప్పుడు వాటి నన్నింటిని పరిగణించవలసివస్తుంది. కాని స్థలాభావం, సమయాభావం వల్ల నేను వాటిని స్పృశించటం లేదు.

1897 లో గ్రాంథిక భాషా లక్షణం కోసం ఏర్పడిన "కవిపండిత సంఘం", 1914 లో ఏర్పడిన "ఆంధ్ర భాషా సంరక్షక సంఘం", ఆ తరువాత "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" వంటివి తాత్కాలికమైన ప్రయోజనాలతో ఏర్పడిన సంస్థలు. అయినా వాటిని నిర్వహించిన పెద్దలు ఆంధ్ర సాహిత్య నిర్మాతలలో అగ్రేసరులు.

1911 లో "ఆంధ్ర సాహిత్య పరిషత్తు"ను జయంతి రామయ్య పంతులు గారు మద్రాసులో స్థాపించినారు. తరువాత దాని కార్యస్థానం కాకినాడకు తరలింది. కందుకూరి వీరేశలింగం, వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, మొక్కపాటి సుబ్బారాయుడు, చెన్నాప్రగడ భానుమూర్తి వంటి ప్రముఖులు ఈ సంస్థ స్థాపనలో జయంతివారికి తోడ్పడినారు. ఈ పరిషత్తు ఆశయాలను పరిశీలిస్తే నేటికీ ఏ సాహిత్య సంస్థకైనా ఈ ఆశయాలు అనివార్యమనిపిస్తుంది. తెలుగు భాషకు ఒక సమగ్ర నిఘంటువును నిర్మించాలని, ఇతర భాషలతో గల పోలికలను నిరూపిస్తూ ఒక వ్యాకరణం వ్రాయాలని, పారిభాషిక పదకోశాన్ని తెలుగులో నిర్మించాలనీ, ఆంధ్ర దేశం - ఆంధ్ర ప్రజల చరిత్రను రచించాలనీ, ఆంధ్రభాషా సాహిత్యాలకు సంబంధించిన అనేక విషయాలను చర్చించడానికి ఒక పత్రికను వెలువరించాలనీ, ముద్రితాముద్రిత గ్రంథాలతో ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పాలనీ, తెలుగు సాహిత్యంలో పరీక్షలు పెట్టి పారితోషికాలు ఇవ్వాలనీ, తెలుగు భాషా సాహిత్యాలను అభివృద్ధి పరచడానికి నిర్వహించవలసిన కార్యక్రమాలన్నీ నిర్వహించాలనీ అనేవి ఈ ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆశయాలు.

"ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక" అనే ద్వైమాసిక పత్రికను వెలువరించింది. ఈ పరిషత్తుకు ఒక గొప్ప గ్రంథాలయం ఉన్నది. దీనిలో తాళపత్ర గ్రంథాలూ, కాగితం ప్రతులూ వేలసంఖ్యలో ఉన్నాయి. వాఙ్మయపరిశోధకులకు ఈ గ్రంథాలయం అత్యంతోపయుక్తమై ప్రతిష్ఠతను గడించుకున్నది. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక మూలాన 70 కి మించిన అపూర్వ గ్రంథాలు వెలుగు చూసినవి. ప్రాచీన రాగి, శిలా శాసనాలు ఎన్నో విమర్శనపూర్వకంగా ఈ పత్రికలో ప్రచురించబడినవి. ఈ సంస్థను స్థాపించిన తపోమూర్తుల కృషికి చిహ్నంగా నేటికీ ఈ సంస్థ నిలిచి ఉన్నది. అయితే పూర్వ స్థితిలో లేదు, కొన

ఊపిరితో ఉన్నది. పండితులకూ పరిశోధకులకూ రక్షించుకునే ఓపిక లేదు. ఏలిన వారి చల్లని చూపులు ఈ సంస్థపై ప్రసరించడం లేదు.

ఇక ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరం హైదరాబాదులో 1943లో నెలకొన్న "ఆంధ్ర సారస్వత పరిషత్తు"ను గూర్చి క్లుప్తంగా తెలియజేస్తాను. 1948 లో జరిగిన పోలీసు చర్యకు ఫలితంగా నిజాం రాష్ట్రం భారతదేశంలో విలీనం కాక పూర్వం హైదరాబాదు సంస్థానంలోని తెలంగాణా ప్రాంతంలో నిజాం పరిపాలన తెలుగు భాషకూ తెలుగు సంస్కృతికి తీరని నష్టం కలిగించింది. ఉర్దూను నిర్బంధ భాషగా, ప్రభుత్వ భాషగా ప్రవేశపెట్టి, తెలుగు అధ్యయనానికి తెలుగు భాషా వికాసానికి ఏ విధమైన చేయూత నివ్వకుండా, తెలుగులో మాట్లాడడమే ఒక అసహ్యకరమైన పరిస్థితి అనే భావాన్ని కల్పించింది. 1943 లో లోకనంది శంకరనారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి, బిదురు వెంకటశేషయ్య, మాడపాటి హనుమంతరావు వంటి ప్రముఖులు పూనుకొని పరిషత్తును స్థాపించినారు. సభలూ సమ్మేళనాలూ ఏర్పాటు చేయడం, దేశంలోని సారస్వత విశేషాలను సేకరించి ప్రకటించడం, పారిభాషిక మాండలిక పదకోశాలను సిద్ధం చేయడం, తెలుగులో పరీక్షలు నిర్వహించి పఠనాభిలాషను పెంపొందించడం, రచయితలను ప్రోత్సహించడం, జిల్లాలలో శాఖలను స్థాపించి సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడం, పండితులకూ బాలురకూ సామాన్య ప్రజలకూ ఉపయుక్తంగా ఉండే గ్రంథాలను ప్రచురించడం వంటి ఉదాత్తాశయాలతో ఈ సంస్థకు అంకురార్పణ జరిగింది. తెలుగు పేరుతో ఏ పని జరిగినా అది అప్పటి నిజాం ప్రభుత్వానికి కన్నెర్రగానే ఉండేది. తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రులు మౌనంగా సాగించిన ఉద్యమం సారస్వత పరిషత్తు. పరీక్షలద్వారా కొన్ని వేల మందికి తెలుగుపట్ల ఆసక్తిని పెంచగలిగింది. దేశాంతరాలలోకూడా పరీక్షలు నిర్వహించింది. హైదరాబాదు వరంగల్లు, నల్లగొండ, మహబూబ్‌నగర్, తూప్రాన్, ఆలంపూరు, మంచిర్యాల వంటి పట్టణాలలో పెద్ద ఎత్తున యావదాంధ్ర స్థాయిలో వార్షిక సభలను నిర్వహించింది. ఆలంపూరు వార్షికోత్సవాలకు నాటి భారత ఉపాధ్యక్షులు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ప్రారంభోత్సవం చేసినారు. విద్వత్ప్రసంగాల నెన్నింటినో ఏర్పాటు చేసి, ఆ ప్రసంగపాఠాలను పుస్తకాలుగా మలిచి, పరిశోధకులకూ పంకి

తులకూ అందించింది. పోలీస్ చర్య తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుకు తగిన ప్రాధాన్యాన్ని సంపాదించి పెట్టడానికి ఎనలేని కృషి చేసింది. "సారస్వత వేదిక" కార్యక్రమం ప్రారంభించి పండితులతో ప్రసంగాలు చేయించి చర్చలు జరిపి పుస్తకాలు ప్రచురించింది. తెలంగాణంలోని ప్రముఖ కవులూ పండితులూ పరిషత్తుకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ తోడ్పడినవారే. పరిషత్తు ఎందరో కవి పణ్డితులకు చేయూతనిచ్చి సాహిత్యోద్యమాన్ని బలపరచి, ప్రజా బాహుళ్యంలో తమ భాషా సంస్కృతులపట్ల అభిమానాన్ని పెంచగలిగింది. ఇప్పుడు రాజధానీనగరంలో పరిషత్తుకు ఒక పెద్ద సభామండపం ఉన్నది. పరిషత్తులో పరిశోధకులకు ఉపాధేయమైన గ్రంథాలయం ఉన్నది. అది ప్రాచ్య భాషాకళాశాలను కూడా నిర్వహిస్తున్నది.

పోలీసు చర్య తరువాత ఆంధ్ర సారస్వత పరిషత్తును మించు పందిళ్ళ పైకి పాకించి సజీవ సంస్థగా రచయితలకు శక్తిమంతమైన సాధనంగా తీర్చి దిద్దిన సాహిత్యోద్యమ నిర్మాతలు యావదాంధ్ర సాహిత్యకుల సమాదరాన్ని పొందగలిగినారు. శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు, శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు, శ్రీ పురిజాల హనుమంతరావుగారు, దాశరథి, ఆచార్య సి. నారాయణరెడ్డి, ఆచార్య బి. రామరాజు, నూకల నరోత్తమరెడ్డి, కె. కె. రంగనాథాచార్యులు ప్రభృతులు ఈ సంస్థకు పట్టుగొమ్మలై ప్రవర్తిల్లినారు.

నిన్న మొన్నటిదాకా ప్రభుత్వ సహాయం ఈ సంస్థకు కొంతవరకుండేది. కడచిన 44 ఏళ్ళనుంచి ఏ ప్రజా సహకారంతో సంస్థ ఉద్యమిస్తూ వచ్చిందో ఇప్పుడు ఆ ప్రజా సహకారమే దిక్కయింది. ప్రభుత్వ సహాయం ఇప్పుడే మాత్రం లేకపోయినా ఈ సంస్థ తన కార్యక్రమాలను- అంటే పరీక్షలను నిర్వహించడం, సాహిత్య ప్రసంగాలను ఏర్పాటుచేయడం, పుస్తకాలను ప్రచురించడం వంటి వాటిని-కొనసాగిస్తూనే ఉన్నది.

ప్రజాబాహుళ్యంలో అనేక దృక్కోణాలతో భాషావికసనానికి తోడ్పడే సంస్థలేకాక కవులూ రచయితలూ యువకులూ సంఘాలను ఏర్పాటు చేసుకొని కవిత్వోద్యమాన్ని నిర్వహించినారు. తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రిగారి "సాహితీ సమితి, అభ్యుదయ రచయితల సంఘం, నవ్యసాహిత్య పరిషత్తు, విప్లవ రచ

యితల సంఘం" వంటి సంస్థలు గొప్పవే అయినా పరిమిత పరిధిలో పనిచేసినవి. కొన్ని నగరాలలో కొందరు యువకులు ముందుకు వచ్చి సాహిత్య కార్యక్రమాలను అంటే ఉపన్యాసాలను, సాహిత్యపు పోటీలను, పుస్తక ప్రచురణలను చేపట్టి సాహిత్య వ్యాప్తికి కొంత తోడ్పడినారు. "రామరాజ భూషణ పరిషత్తు (భీమవరం), యువభారతి (సికింద్రాబాదు), సురభారతి (హైదరాబాదు), స్పందన సాహితి (మచిలీపట్టణం), సాహితీ బంధుబృందం (వరంగల్లు)" వంటి సంస్థల కార్యకలాపాలను ఈ పట్టున విస్తరించి చెప్పడం సందర్భోచితమే కాని సమయాభావంవల్ల ఎక్కువగా చెప్పలేకపోతున్నాను.

మదరాసు నగరంలో మోటూరి సత్యనారాయణవంటి ప్రముఖులు స్థాపించి పెంపొందించిన "తెలుగు భాషా సమితి"ని ప్రత్యేకంగా పేర్కొనవలసి ఉన్నది. కొమర్రాజువారు ప్రారంభించిన విజ్ఞాన సర్వస్వ నిర్మాణానికి సమకట్టి, సముజ్జ్వలంగా 14 సంపుటాలు వెలయించి ఎన్నో బహుమతులను రచయితలకు అందించి ఇటీవలనే తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం అయింది.

స్వాతంత్ర్యోపలబ్ధి తర్వాత 1957లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు తానుగా పూనుకొని "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ"ని ప్రారంభించింది. అయితే ప్రజాస్వామ్యం పట్ల నమ్మకమున్న ప్రభుత్వం కనుక రచయితల, సాహిత్య సంస్థల ప్రాతినిధ్యానికి ఇందులో అవకాశం కల్పించింది. అన్ని స్థాయిలలో ప్రజాస్వామ్య పద్ధతులను ప్రవేశపెట్టి అకాడమీని ఒక స్వచ్ఛంద సంస్థగా రూపొందించి, ఆర్థికమైన వనరులను తానే సమకూర్చి, స్వచ్ఛంద సంస్థగా రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 2 1/2 దశాబ్దాల వరకు అంటే 1986 దాకా యావదాంధ్ర దేశంలో పండితుల, కవుల, రచయితల, పరిశోధకుల సహకారంతో శతాధిక గ్రంథాలను ప్రచురించింది. ఇంత వరకు వెలుగుచూడని తెలుగు కావ్యాలను అందించింది. సమగ్ర నిఘంటు నిర్మాణానికి ఉపస్కారకాలు కాగలిగిన పదప్రయోగకోశాలను, మాండలిక వృత్తి పదకోశాలను ప్రచురించింది. నిఘంటువుకెక్కని 37 వేల పదాలను సేకరించగలిగింది. పోటీలను నిర్వహించి ఉత్తమ రచనలకు బహుమతులను అందించింది. తెలుగులోనే కాక సంస్కృతం, ఉర్దూ భాషలలో కూడా పుస్తకాలను ప్రచురించింది. ఎందరో ప్రతిభామూర్తులను విశిష్ట సభ్యులుగా గుర్తించి

మన్నించింది. ప్రాచీనార్వాచీన సాహిత్య ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు బహుమతులిచ్చి రచయితలకు గుర్తింపు కలిగించింది. ఎందరో రచయిత్రులకు ప్రోత్సాహాన్ని కలిగించింది. ఎందరో సంస్కృత విద్వాంసులను సన్మానించింది. పఠనాసక్తినీ, పుస్తకాలను కొనుక్కునే శక్తినీ పెంపొందించడానికి సాహిత్య అకాడమీ లాభనష్టాలతో సంబంధం లేకుండా చౌకధరలకే పుస్తకాలను అందించింది. ఎప్పుడో ముద్రితమై ఇప్పుడు అలభ్యంగా ఉన్న తెలుగు సంస్కృత గ్రంథాలను ఎన్నింటినో విద్వత్పీఠికలతో సమలంకరించి ప్రచురించి అందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఇంత మహోద్యమాన్ని నిర్వహించిన అకాడమీని ప్రభుత్వం ప్రారంభించిన మాట నిజమే కాని దాని కార్యకలాపాలలో ప్రభుత్వం ఎన్నడూ జోక్యం కల్పించుకోలేదు. రచయితల స్వేచ్ఛను మన్నించింది. కళావిలసనానికి ప్రభుత్వం చేయూత ఉండవలసిందేకాని నేతృత్వం ఉండకూడదన్న యథార్థాన్ని పండిత నెహ్రూ, రాధాకృష్ణన్, జాకిర్ హుసేన్ వంటి ప్రభుత్వాధినేతలయిన పండితులు కూడా గుర్తించి కేంద్ర సాహిత్య అకాడమీని ఢిల్లీలో రూపొందించిన పద్ధతిలోనే అప్పటి ముఖ్యమంత్రి శ్రీ సంజీవ రెడ్డిగారు, విద్యామంత్రి పట్టాభి రామారావుగారు ఈ అకాడమీకి రూపకల్పన చేశారు. ఈ 2½ దశాబ్దాల కాలంలో అకాడమీకి నేతృత్వం వహించి, భారత దేశంలోని ఏ రాష్ట్రంలోని అకాడమీ కూడా సాధించని సిద్ధులను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సాధించేట్టు చేసిన మహితాత్ములు డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారు, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు, విశ్వనాథవారు, శ్రీ శివశంకర స్వామి, నోరి నరసింహశాస్త్రి, గడియారం వెంకటశేషశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య టి. దొణప్ప, ఆచార్య జి. ఎన్. రెడ్డి, ఆచార్య బి. రామరాజు, పుట్టపర్తి నారాయణాచార్యులు, ఆచార్య దివాకర్ల వేంకటావధాని, ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం, బూదరాజు రాధాకృష్ణ, వానమామలై వంటి ప్రముఖులు అకాడమీ కార్యకలాపాలను విజయవంతం చేయడంలో తమ తపస్సును ధారపోసినవారు.

తెలుగు దేశంలో ఈ శతాబ్దంలో పేరుమోసిన ప్రతిభామూర్తులలో పలువురు అకాడమీని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సుసంపన్నం చేసినవారేనని

చెపితే అత్యుక్తి కాదని అనుకుంటాను. మూడేళ్ళ క్రితం సాహిత్య అకాడమీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దుచేసి తాను కొత్తగా ప్రారంభించిన తెలుగు విశ్వ. విద్యాలయంలో విలీనం చేసింది.

తెలుగులో విద్యాబోధన జరగాలన్న స్వప్నానికి, తెలుగులో పరిపాలన సాగాలన్న ఆకాంక్షకు ఆకృతి కల్పించిన తెలుగు అకాడమీని పేర్కొనందే ఈ ప్రసంగం సమగ్రం కాదని నా ఉద్దేశం. తెలుగు అకాడమీ స్నాతకోత్తర తరగతులవరకు పనికివచ్చే పుస్తకాలను తెలుగులో శతాధికంగా ప్రకటించడమే కాకుండా పరామర్శ గ్రంథాలనెన్నిటినో ప్రచురిస్తూ భాషాసాహిత్యాలకు సంబంధించిన సదస్సులను నిర్వహిస్తూ, పారిభాషిక శబ్దజాలాన్ని నిర్మిస్తూ తెలుగురాని అధికారులకు, ఉద్యోగులకు తెలుగును కొత్త పద్ధతుల్లో నేర్పుతూ ఒక అనివార్యమైన సంస్థగా రూపొందింది. ఇది ప్రభుత్వ సంస్థ. దీనికి వనరులన్నీ ప్రభుత్వానివే. అయినా తనకున్న పరిమిత పరిధిలో ఇది పనిచేసే తీరుతెన్నులు భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నవి.

ప్రజల సంస్థలైనా, ప్రభుత్వ సంస్థలైనా నిర్దిష్టమైన ప్రణాళికలతో ముందుకు పోగలగాలి. యుగోచితమైన అవసరాలకు అనుగుణంగా రూపొందాలి.

భాషైనా, సాహిత్యమైనా ప్రజలసొత్తు. ప్రభుత్వాలు, రాజకీయపక్షాలు స్వభావసిద్ధంగానే పరివర్తనశీలాలు. భావప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ. కళావిలసనం, కళావికసనం ప్రజాయుత్తమైన దేశంలోనే స్వేచ్ఛ పెంపొందుతుంది. సంస్కృతి వికసిస్తుంది. మానవతామర్యాదలు మహోన్నత శిఖరాలను అందుకుంటూనే ఉంటవి.*

---

* తెలుగు అకాడమీ ఇరవై ఏళ్ళ శుభసందర్భ సంచిక 'తెలుగు'లో ప్రచురితం. ముద్రణ సెప్టెంబరు 1988.

36. ఆదర్శరచయితలు ప్రభాకరులు

చెప్పిందే చేయడం, చేసిందే చెప్పడం ప్రజాహిత కార్యకలాపాల్లో పాల్గొనే వాళ్లు మాత్రమే అనుసరించదగిన విధానం కాదు అది ఉత్తమపురుష లక్షణం. ఆదర్శ మానవుల లక్షణం.

'సహితస్య భావః సాహిత్యం'. 'విశ్వశ్రేయః కావ్యం', 'కవి వైతాళికుడు' రచయితలు-సంఘసంస్కర్తలు', 'రచయితలు మానవునిలో దేవుణ్ని మేల్కొలిపేవారు', 'రచయితలు సృష్టికర్తకు మారురూపాలు'. 'రచయితలు సంఘంలోని చైతన్యశక్తికి ప్రతీకలు', 'రచయితలే విప్లవాలకు నారుపోసేవారు, నీరుపోసేవారు', 'రచయితలు శారదాప్రసాదలబ్ధ మహిమోపేతులు', 'రచయితలు శపించగలరు', 'రచయితలు అభిశంసింపగలరు', రచయితలు వెలివేయగలరు', 'రచయితలు శాశ్వతమైన కీర్తినిగాని అపకీర్తినిగాని సంపాదించిపెట్టగలరు'. 'రచయితలు కల్పవృక్షాలు', రచయితలు ప్రభంజనాలు', 'రచయితలు భాస్కరులు', 'రచయితలు చంద్రులు', 'రచయితలు సమ్రాట్టులు.'

ఇలా రచయితలను గూర్చి, రచయితలు తమనుగూర్చి, తమ రచనలను గూర్చి చెప్పిన, చెప్పించుకున్న సందర్భాలు అన్ని భాషల్లో అన్ని సాహిత్యాల్లో అవి పుట్టినప్పటినుంచీ ఉండనే ఉన్నవి. కాదన్నవాళ్ళు లేరు. కాదన్న సందర్భాలూ లేవు. అయితే రచయితలందరికీ ఈ లక్షణాలుంటాయని అనుకోవడం పదిలమైన ఊహకాదు.

సాహిత్యాన్ని సృజియించే సామర్థ్యం, కవితాన్ని అల్లగలిగిన కౌశలం అందరికీ ఉండదు. అది పుట్టుకతో వచ్చేదేకాని సాధనవల్ల వచ్చేదికాదు. బీజంగానైనా ఉన్నప్పుడే అనువైన వాతావరణ ప్రభావంవల్ల అది మొలకెత్తుతుంది. అందరికీ అన్నివస్తే ఈ ప్రత్యేకత ఎందుకు? ఈ విశిష్టతలు ఎందుకు? అనుకరణ తొలి దశల్లో అనివార్యం. క్రమః ఉపజ్ఞ మేలుకుంటుంది. ఆ మేలుకుంటున్న తరుణంలో కొంత సాధన, కొంత అభిరుచి తోడౌతాయి. ఈ విధంగా కళాశ్రీకి

వికసిస్తున్నప్పుడు, కళాస్రష్ట త్రికరణశుద్ధిగా నమ్ముతున్న సిద్ధాంతం తోడైనప్పుడు, ఆ కళకు ఉత్కృష్టత ఏర్పడి కళకు సామాన్యంగా ఉండే చిత్తాకర్షక శక్తికంటే ఉన్నతమైన శక్తిని సంతరించుకుంటుంది. అప్పుడు ఆ కళ తపస్సు అవుతుంది. ఆ కళాస్రష్ట ద్రష్ట అవుతాడు: అతడు సాహిత్యకుడౌతే అతని కృషి వాఙ్మయతపస్సు అవుతుంది.

అట్టి వాఙ్మయ తపోమూర్తులే ప్రభాకరులు.

సాహితీ సృజన వ్యవహారంలోనే కాదు, దైనందిన జీవితంలోకూడా తాను నమ్మిందే అనగలగడం, తనకు నచ్చని ఆచారాన్నీ, ఆలోచననూ ముందు తనకు తానుగా విడిచిపెట్టడం చాలా అరుదైన సందర్భం.

సంస్కరణ తనతోనే ప్రారంభంకావాలనుకున్న మహాత్ముడు గాంధీజీ. లోకం ఏమనుకుంటుందోనన్న భావాన్ని వదిలి, అగర్భ శ్రీమంతుని కొడుకు, విద్యాధికుడు, ఆఫ్రికా ఖండంలో ప్రజాసేవకుడుగా అఖండకీర్తి నార్జించిన వాడు తన సోదర దేశీయులకులేని నిండైనవస్త్రాలు తనకెందుకని కొల్లాయిగట్టి తృప్తి పడినాడు. అంతేకాదు బ్రిటిష సమ్రాట్టు ఆస్థాన సంప్రదాయాలను కూడా లెక్క చేయలేదు. నిరాడంబరత నిర్మలహృదయానికి ప్రతీక అని నమ్మి తదనుగుణంగానే జీవితాంతం పరిశ్రమించినాడు. తనకు నమ్మకంలేని అంశాలను ఎన్నడూ ఆయన అనలేదు. వ్రాయలేదు. ఇతరుల మనస్సులు కలతపడినా, ఇతరులు పరిహసించినా తాను నమ్మిన అంశాన్నే ప్రకటించినాడు. నిజానికి ఇలా ప్రవర్తించడానికి ఎంతో ధైర్యం కావాలె. సత్యంపట్ల ఉండే నమ్మకమే ఆయనకు ఆధైర్యాన్ని సమకూర్చింది. ఆయన జాతికే ఆదర్శపురుషుడుగా రూపొందినాడు. ఆయన ఆ తపస్సుతో, తన వ్యక్తిత్వాన్ని మలచుకుని సమకాలికులైన ఎందరో మేధావులకు, పండితులకు, ప్రతిభావంతులకు ఆరాధ్యుడైనాడు. ఆయనకంటె గొప్పగా చదువుకున్న వారు బహుముఖ ప్రజ్ఞాసముపేతులు ఆయనకు మోకరిల్లినారు. ఇది ప్రపంచేతిహాసంలో అరుదైన ప్రసక్తి. రాజకీయాలు వ్రాసినా, మతవిషయాలు వ్రాసినా నిర్మలమైన హృదయం, విశ్వమానవ సోదరభావం, అచంచలమైన ఆత్మవిశ్వాసం, అకుంఠితమైన దైవభక్తి భంగ్యంతరంగా ప్రస్ఫుటమవుతూనే ఉండేవి. రాజకీయాల్లో కశ్మలం ఉండేతీరుతుందనే భావాన్ని ఆయన

ఖండించినారు. వ్యాపారం అంటే మోసం కాదని ఉద్ఘోషించినాడు. ప్రజోద్యమం అంటే వర్గఘర్షణ కాదని ప్రకటించినాడు. ప్రేమలేని ప్రజాజీవితం, సౌశీల్యంలేని వ్యక్తిత్వం గర్హనీయములని ఆచరణరూపేణా నిరూపించిన మనీషి అతడు.

1924 లో గాంధీజీ మద్రాసు వచ్చినప్పుడు ఆయనను ప్రభాకరులు సందర్శించి-

"వినయ కుటీరరంబునన నొల్పితివిగదా
గర్వపర్వతముపై గ్రాలువారి
పౌరతాలగించి కన్దెరపించితివిగదా
యైశ్వర్య భోదాంధులైనవారి
తినిపించితివిగదా తనయింట తియగూరఁ
బొరిగింటి పులగూర యరయువారి
స్వాతంత్ర్యవీధిలోఁ జనజేసితివిగదా
పారతంత్ర్యపుగొంది బడలువారి

అరసితివిగా జగంబెల్ల నాత్మగృహము
మాడ్కి నీవంటి యుత్తమ మర్త్యుడేడి?
జయము నీకెందు నీ కార్యచయమునందు
సత్కృపాకంధి! మోహనచంద్ర గాంధి!"

అన్న చాటుపద్యం చెప్పి చరితార్థులైనారు. గాంధీజీ భవ్యమైన జీవిత విధానం యోగవిష్ణులైన ప్రభాకరులను సహజంగానే ఆకర్షించింది. అంతవరకు ప్రభాకరుల కవితల్లో, సాహిత్యవిమర్శల్లో సత్యనిరూపణాశక్తి అక్షరశః గోచరిస్తుంది.

సాహిత్య జీవితంలో సత్యంకోసం ఆయన పోరాడవలసి వచ్చింది. అబద్ధాలాడటం, కల్లబొల్లి వ్రాతలతో పాఠకులను మభ్యపెట్టడం, అతియశోలిప్సతో, ఈర్ష్యాసూయాల విలయతాండవాలు ఆయన తన సమకాలిక రచయిత లెందరిలోనో చూడగలిగినారు. ప్రభాకరుని కిరణం తమస్సులను సహిస్తుందా? సహేతుకంగా ప్రత్యర్థులను ఒప్పించడానికి, యాథార్థ్యాన్ని తెలుసుకోవడానికి ఎన్నో

ప్రయత్నాలు చేసినారు. సమాధానాలు సంయుక్తికగా, పొందికగా, పొంకంగా, రుచిరంగా, మృదువుగా వ్రాసినారేకాని కటువుగా, తాపట్టిన కుందేటికి మూడే కాళ్ళన్నట్లుగా, తమకే తప్ప ఇతరులకు ఏమీ తెలియనట్లుగా, నిరాధారంగా వ్రాయలేదు. పరిశోధనలో, అందులోనూ సాహిత్య పరిశోధనలో సమున్నత ప్రమాణాలను నెలకొల్పి నేటికీ అనుసరణీయాలుగా ఉన్న పద్ధతులను ప్రవేశ పెట్టి ప్రభాకరులు పరిశోధకుడు సత్యగవేషణా దృక్పథంతో వ్యవహరించవలసిన వాడనీ, సత్యంపట్ల సమ్మకంలేనివాడు పరిశోధనా రంగంలోనికి వస్తే సత్యం బయల్పడదనీ, పరిశోధకునికి సౌశీల్యం అత్యంతావశ్యకం అనీ నిరూపించ గలిగినారు.

వైయాకరణి, తార్కికుడు, పండితుడు దొరుకుట సులభము. కాని యోగ్యుడు దొరుకుట కష్టమన్నారు వీరేశలింగం పంతులుగారు. మంచి మనిషి కానప్పుడు రచయిత అయితేనేమి కాకపోతేనేమి? మనిషిగా విఫలుడైనవాడు, గర్హనీయుడైనవాడు, కుసంస్కారి రచయిత అయితే అతని రచనవల్ల ప్రయోజనం ఉండదు. రచన ఏపాటిదో చూడరు జనులు, రచయిత ఏపాటివాడో చూస్తారు రచయిత తానంటున్న మాటకు విరుద్ధంగా ప్రవర్తిస్తే అతని రచనకు విలువ ఉండదు.

చదువు కంటే సంస్కారం గొప్పది అన్న సూక్తి ఎంత విలువైననదో! ప్రభాకరుల జీవన సరళికీ ఆయన రచనల్లో భావాలకూ ఎంతో సామ్యం ఉండేది. తాను నమ్మనిది, తాను చేయనిది ఎన్నడూ చెప్పేవారు కారు; వ్రాసేవారుకారు.

వరశుల్కం దురాచారమని రచనలు చేసేవాడు కట్నం తీసుకుంటే, కట్నం ఇస్తే అతని రచన వినోదంగానే మిగిలిపోతుంది. రచనల ద్వారా సమాజాన్ని మారుస్తామన్న కళాకారులందరికీ ఇది వర్తిస్తుంది. సంఘ దురాచారాలను దుయ్యబట్టిన రచయితల్లో వీరేశలింగంగారికి ఇంత గౌరవం ఎందుకు దక్కింది? తెలుగువారికి ప్రాతఃస్మరణీయు డెందుకైనాడు? ఈ ప్రశ్నకు సమాధానం ఆయన ఆత్మకథ చదివిన వారికే తెలుస్తుంది.

ప్రభాకరుల సాహిత్యవిమర్శ వ్యాసాల్లో - భాషాసౌందర్యంతో పాటు, విషయ యాథార్థ్యం అంతటా పరచుకొని ఉండటం అందరికీ తెలిసిన విషయం. ఏది సత్యమో అదే సుందరం. అసత్యం సుందరంగా ఉండదు. ఒకవేళ ఉంటే అది శివప్రదం కాదు.

ప్రభాకరులు సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాల్లో అంచులు ముట్టిన పాండితీ గరిమను సంతరించుకున్న మనీషి కాబట్టి తత్త్వాన్ని తరచి చూపి నిష్కర్షగా చెప్పగలిగే అవకాశం ఆయనకు లభించింది. పాండితీ ప్రతిభలు అత్యంతంగా ఉన్న మహామహులు లేకపోలేదు. కాని ప్రామాణికులు కాలేక పోయినారు. ప్రభాకరులకు తపస్సు తోడైనది. వాఙ్మయ సేవ ఆయనకు వృత్తి కాదు. ప్రవృత్తి.

వాఙ్మయం ప్రజలసొత్తు అని ఆయన నమ్మినారు. కనుక గిడుగువారి వ్యావహారిక భాషా ఉద్యమానికి బాసటగా నిల్చి రచనలు చేసినారు.

కాలానుగుణంగా తెలుగు లిపి మారితేనేగాని వ్రాతలో సౌలభ్యం ఏర్పడదని భావించి లిపి సంస్కరణకు పూనుకుని, అనువైన సూచనలు చేసి, మార్పులతో ఒక నమూనా లిపిని సిద్ధంచేసినారు. ఆ లిపిలోనే కొందరు పెద్దలు వీరికి లేఖలు వ్రాసినారు కూడ. ఆచరణ యోగ్యం కాని ఊహ ఆయనకు తట్టనే తట్టదు. పూర్ణ పురుషుని లక్షణ మది.

తొలి తెల్గు పదం 'నాగబు'అని శాసనాలను పరిశోధించి నిర్ణయించి, తెలుగుభాష ఎంత ప్రాచీనమైనదో నిరూపించి, తెలుగు సంస్కృతి చరిత్రకు శ్రీకారం చుట్టినారు.

మాండలిక భేదాలకూ, లేఖనదోషాలకూ, కాలపురుషుని దాడులకూ గురియై తికమక పెట్టుతున్న శాసనాల నెన్నింటికో సరియైన పాఠాలను కుదిర్చి, భాషా చరిత్రల నిర్మాణానికి దోహదం చేసినారు.

మరుగుపడిన చాటుపద్యాలను గుర్తించి, పాఠ్య భేదాలను పరిష్కరించి, ఆ వాఙ్మయ శాఖకు పునరుజ్జీవితాన్ని ప్రసాదించిన సహృదయ పరిశోధకులు శ్రీ ప్రభాకరులు.

అంత పండితులైనా జానపదులు సాహితీలతను పందిళ్లపైకి ప్రాకించినారు. ప్రజాసూక్తములనదగిన సామెతలనూ, పొడుపుకథలనూ, జాతీయాలనూ సేకరించి, భావితరాలకు పరిశోధన సామగ్రిని అందించినారు.

సంస్కృత నాటకాలను కొన్నింటిని తెనిగించి, నాటకానువాద విధానానికి కొత్త మెరుగులు దిద్దినారు.

'కామందకము' వంటి సాహిత్యేతర గ్రంథాలకు ప్రామాణికమైన విద్వత్ప్రతికను సమకూర్చి తమ బహుముఖీన ప్రజ్ఞా పాటవాలనూ, సూక్ష్మాంశ గవేషణాసక్తిని ప్రదర్శించినారు.

తాళపత్ర గ్రంథాలను పరిశోధనా వ్యాసంగానికి అనుకూలంగా తీర్చిన ఖ్యాతి ప్రభాకరులకే దక్కుతుంది. మద్రాసులోని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోని వ్రాతప్రతులనూ తాళపత్రాలనూ పరిశీలిస్తున్న సందర్భంగా ఎందరో పండితులకు, పరిశోధకులకూ వివరాలను అందజేసి సారస్వత వ్యాప్తికి ఇతోధికమైన కృషిచేసిన సహృదయులు ప్రభాకరులు.

వచన రచనలోనూ ఒక ప్రత్యేక శైలికి మార్గదర్శకులైనారు. వివిధ గ్రంథాలకు వ్రాసిన పీఠికల్లో, వ్యాసాల్లో నాతిదీర్ఘమైన సుస్పష్టమైన వాక్యరచనా విన్యాసాలు పఠితల ఆసక్తిని ఇనుమడింపజేస్తూ ఉంటాయి. అర్థవైన, అందమైన, అచ్చ తెనుగు పదాల సంయోజనం, నాతిదీర్ఘ సంస్కృత సమాస ప్రయోగం తెలుగు వచనసాహితిలో అరుదే. వాక్యాల్లో ఒక తూగునూ పద్యమేమో అన్నంత అందంగా లయాత్మకంగా సాధించినారు ప్రభాకరులు.

కథల్లో ఆయన చూపిన మెలకువ చెప్పుకోదగ్గది. కథ వ్రాయడం కాదు, చెప్పడం అనుకున్నారేమో ఆయన! కథ చదువుతున్నా వింటున్నట్లు ఉంటుంది. అసలు కథ అనే పదం చెప్పడం అనే అర్థం వచ్చే ధాతువునుంచి రూపొందింది.

లేఖల్లోనూ అంతే! మాటాడినట్టే ఉంటుంది వాక్య విన్యాసం. ఆర్ద్రత, ఆత్మీయత, హితచింతన అక్షరబద్ధమైనట్లు ఉంటాయి.

ఆయన జీవితంలో చరమదశ ఆర్త రక్షణకే అంకితమైపోయింది. యోగ దీపికల వెలుగుల్లోనే గడచిపోయింది. అందుకేనేమో మహాకావ్యరచనకు పూనుకో లేదు. కాని లఘుకావ్యాల్లో ఆయన కవిత్వాశయం, పదప్రయోగ కౌశలం, భాషా చమత్కారం, ఛందఃపరిణతి దర్శనమిస్తాయి.

"పరుషము, నిష్ప్రయోజన, మబద్ధ, మనార్యము చేరరాదు నా
విరచనలందు; డెందము పవిత్రముగా విలసిల్లి సత్యసుం
దరము పరార్థయుక్తమగు తత్త్వమునే వెలయింపఁగావలెన్
గురుచరణారవిందములకున్ ప్రణమిల్లెద నట్టి నేర్మికై."

"పరుసపు వ్రాఁత, కక్రమపు వ్రాఁత, కసత్యపు వ్రాఁత కెందు నా
కరమునకుం బ్రసర్పణము కల్గకయుండుత; సత్యమైనదే
సరసమునై నదే రచన సల్పెదగాక; యటే ఘటింపఁగా
గురుచరణారవిందములకుం బ్రణమిల్లితి బాసచేసితిన్."

"కవితాపట్టముఁ గట్టుకోఁ దొలుత వేడ్కల్ రేగ నాకుం గృతుల్
చిప్పరొత్తెన్, వెస మోము మొత్తె, నిఁక నాచేఁ జెల్లవీ కల్లబొ
ల్లి వినోదంబు లివే జరామరణముల్ చీడల్ హతంబార్చి పు
ట్టువు చెట్టున్ సఫలీకరించుకొని యంటుల్ గట్టెగాన్ మాలినై."

"ధనసంపాదన తత్పరత్వమున వంతల్ సెంద, నుద్యోగపుం
బెనుపుల్ వొందఁగ వందఁబన్, సుకవితా విద్యావిశేషమ్ములన్
ఘనతన్గోరి తపింప, నీపయి జగత్కల్యాణమై పొల్చు నీ
యనవద్యస్థిర సత్కృపాగరిమమే యర్థింతు నాత్మేశ్వరా!"

"వర్తింతున్ మత దేశ జాతి కృతముల్ వైవిధ్యముల్ వీడి, ని
ర్వర్తింతున్ బరిచర్య నార్తులకు యావత్ర్పజ నర్పించి, యా
వర్తింతున్ గురుదేవసూక్తములు భావస్ఫూర్తి నట్లయ్యు నే
ధూర్తుండౌదు నొకొక్కచో నడ(పుమీ తుందుడుక్క నాత్మేశ్వరా!"

"త్రికరణశుద్ధిగా భవదధీనుఁడనై యితర ప్రవృత్తి వీ
డికొని పరార్థలాభ మొకటే గమనించెద నింక మా
యికము ధనాదికమ్ము గణియింపను సత్యదయోపకార సా
ర్థకమగు నాత్మ చింతన పథమ్మును దప్పి చరింప నీశ్వరా!"

ఈ పద్యాలు ప్రభాకరులవి. వీటిలో ఆయన మహనీయ వ్యక్తిత్వం, సాహిత్య తత్త్వం సాక్షాత్కరిస్తున్నవి. ఈ పద్యాలకు వ్యాఖ్యానం చేస్తే ఋషి కాని వాడు కావ్యం వ్రాయలేడన్న ఆర్ష సందేశం సుబోధకమవుతుంది. రచయితలు ఎలా ప్రవర్తించాలో ప్రభాకరులు చెప్పిన తీరు తెన్నులు తెలిసి వస్తాయి. విశ్వ మానవ సౌభ్రాత్రం కవికి ఉంటేనే తప్ప అతని రచన సఫలం కాదనే ధ్వని ఈ పద్యాల్లో ఉంది.

గాంధీజీ ఆలోచనా విధానానికి సమాంతరంగా సాగింది ప్రభాకరుల లేఖిని.

మీకు సన్మానం చేస్తామంటే 'సన్మానం అక్కరలేదు, ఊళ్ళో మంచినీళ్ళ బావి త్రవ్వించండి' అన్న రచయిత వ్యక్తిత్వం ఎంత విలువైనదో! పలువురు మహాకవులుగా ఊరేగుతున్నవాళ్ళతో పోలిస్తే ప్రభాకరులను ఎక్కడ నిలపాలో? తాము దైవాంశ సంభూతులమని నిరంకుశంగా, కర్కశంగా బీభత్సంగా ప్రజా పాలన చేస్తున్న ప్రభువులకు సమకాలికుడైన బమ్మెర పోతన ఆ రాజులను 'మనుజేశ్వరాధములు' అనగలిగినాడు. 'ధన మదాంధుల కొలువేల తాపసులకు' అని నిరసించినాడు. బాధలను అనుభవించినాడేకాని నమ్మిన మాటను అన కుండా ఉండలేకపోయినాడు. కనుకనే పోతన ఆదర్శ రచయిత. తాను నమ్మినదే వ్రాయగలిగిన రచయిత, మనగలిగిన రచయిత నిజమైన రచయిత. భారతీయుల చరిత్రలో అలాంటి రచయితలు నిర్వహించిన పాత్ర అమేయ మైనది.

అనేక సాహితీ ప్రక్రియలను చేపట్టి సుసంపన్నం చేసిన ప్రభాకరులు సాహితీ స్రష్టలకే పాథేయాన్ని అందించి రచయితలుగానే జీవించలేదు. ఆయన రచనా వ్యాసంగం ఒక యెత్తు. ఆయన యోగజీవితం ఒక యెత్తు. సచ్ఛీలత, దేశాభిమానం, సర్వధర్మ సమభావం, సత్యనిష్ఠ, ప్రేమార్ద్ర హృదయం, ఆయన వ్యక్తిత్వానికే ఆమ్రేడితాలైనవి. ఆయన ఆదర్శ మానవులైనారు.

సాహితీ సృజనంలోనూ, పరిశోధనలోనూ, దైనందిన జీవితంలోనూ ఏక సూత్రతను, అంటే సత్యానికి కట్టుబడి ఉండే పద్ధతిని ఆయన అనువర్తించినారు. కనుకనే ఆయన ఒక ప్రాచీనాంధ్ర గ్రంథాన్నే పరిష్కరించినా, ఒక పదానికి అర్థాన్ని నిర్ణయించినా, ఒక కవి హృదయాన్ని ఆవిష్కరించినా, సాహిత్య చరిత్రలో ఒక అంశాన్ని విశిష్ట దృక్కోణంతో పరిశీలించి చెప్పినా తత్త్వాన్ని, సత్యాన్ని ఊతగా తీసుకున్నారు. జల్పనతో రాణించే కవిత్వంలో కూడా అననుభూతమైన అంశాన్ని, శాబ్దిక చమత్కారాన్ని, గతానుగతంగా వస్తున్న వర్ణన విధానాన్ని విడనాడి కవిత్వం కూడా సత్య స్పర్శను వీడకూడదని భంగ్యంతరంగా తమ సందేశాన్ని అందించినారు. ఆయన సాహిత్యాన్ని చక్కగా పరిశీలిస్తే సాహిత్యాన్ని ఒక యోగంగా ఉపాసించినా రనిపిస్తుంది. 'యోగఃకర్మసుకౌశలం' అన్నట్లు ఆయన యోగజీవితం, ఆయన సాహిత్యాన్ని మహిమాఢ్యం చేసిందని నమ్మవచ్చు. "సత్య దయోపకార సార్థకమగు నాత్మ చింతన పథము" శ్రీ ప్రభాకరుల సాహిత్యమూ జీవితమూ. ఆదర్శ రచయితలు ప్రభాకరులు అన్న అంశం మరింత చక్కగా అవగాహన గావాలంటే ఆయన ఆత్మకథ 'ప్రజ్ఞా ప్రభాకరము' చదువ వలసిందే. 'ప్రజ్ఞా ప్రభాకరం' 'దివ్య దర్శనము' చదివి ప్రభాకరుల ప్రజ్ఞా ప్రభావాలనూ, అవంధ్య జీవన సరళినీ అవగతం చేసుకోవచ్చు. వివిధ గ్రంథాలకు వ్రాసిన పీఠికల్లో యధార్థ్యాన్ని ఎలా ఆశ్రయించవలెనో పరిశోధకులకూ, పాఠకులకూ మార్గాలను సూచించినారు. అన్నిటా ఆయన ఆదర్శాలనే నిలిపినారు. భావి తరాలకు పథనిర్దేశకులైనారు

ఆయన దివ్య సంస్కరణం ఉత్తమ సంస్కృతి పరిరక్షణం, ఉత్తమ సాహిత్య సంవర్ధనం, ఉత్తమ పరిశోధన పరివర్ధనం. ఆయన సాహిత్యాధ్యయన ప్రసారాలు ఉన్నత ప్రమాణాలందుకోవాలనే జాతికి ధ్రువతారలు.

ప్రభాకరులు సృజించిన సాహిత్యాన్నంతా అధ్యయనం చేస్తే తెలుగు సాహిత్యానికి సంబంధించిన అనేకాంశాల లోతు పాతులు తెలిసివస్తాయి. మానవ జీవితానికి సంబంధించిన అనేకాంశాలతో పరిచయం ఏర్పడుతుంది. పూర్వపురుషుల సాహిత్యాధ్యయం జీవితానికి సత్పథాన్ని ప్రసాదిస్తుంది. ప్రభాకరశాస్త్రి మెమారియల్ ట్రస్టువారు ఆయన రచనలన్నింటినీ అందించే ప్రయత్నాలు ప్రారంభించి కొంతవరకు కృతకృత్యులైనారు. అనతికాలంలో ప్రభాకరుల సమగ్ర సాహిత్యాన్ని అందించి చరితార్థులు కావాలని ఆకాంక్షిస్తున్నాను.*

---

* 'ప్రభాకరస్మారిక(2)'లో ప్రచురితం. ముద్రణ, ఫిబ్రవరి 1989.

పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్, 1-1-517/B/1, న్యూ బాకారం, గాంధీనగర్,
హైదరాబాదు - 500 380. ఫోన్ : 68413